# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక డిసెంబర్, 2012 ₹ 20



వనదేవత – చీకటి దేవుడు

# మిసిమి

మాసపత్రిక


**"All that we are is the product of what we have thought"**

*- Dammapada.*


**సంపుటి 23 డిసెంబరు 2012 సంచిక 12**



*ప్రధాన సంపాదకుడు*

చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*

వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకుడు*

కాంద్రేగుల నాగేశ్వరరావు

*సమాలోచక మండలి*

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి

డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి

కుర్రా జితేంద్రబాబు

నందిగం కృష్ణారావు

*సంస్థాపక సంపాదకులు*

**రవీంద్రనాథ్ ఆలపాటి**



*Printed & Published by*

**Bapanna Alapati**

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads,

Musheerabad, Hyderabad - 500 020.

Ph. 040-27645536

E-mail : misimi_monthly@yahoo.in

e-magazine : www.kinige.com/misimi

ప్రతి : ₹20 సంవత్సరానికి : ₹240

విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

(Library of Congress Control Number)

LCCN 91-903060


## ఈ నెల...


కమ్మతెమ్మెరలు

రామానుజాచార్యులు .................................... 5

– *ఆచార్య సముద్రాల వేంకటకృష్ణ*

భారతీయ కావ్య మీమాంస : నన్నయ్య నవ్యత ..... 12

– *ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ*

వా...మనుడు ........................................... 25

– *జస్టిస్ ఆవుల సాంబశివరావు*

శతపత్ర బాణి శ్రీపాద పినాకపాణి..................... 30

– *గొల్లపూడి మారుతీరావు*

కూచిపూడి భాగవతులు ................................ 33

– *సేతురాం*

తెలుగు వారి హరికథ.................................. 37

– *డాక్టరు దామెర వేంకట సూర్యారావు*

రుక్మిణి అరుండేల్ ...................................... 40

– *కాంద్రేగుల నాగేశ్వరరావు*

సవర లిపి–గిడుగు ..................................... 49

– *డాక్టరు అల్లంసెట్టి చంద్రశేఖర రావు*

సంస్కార ................................................. 52

– *ముక్తేవి రవీంద్రనాథ్*

తూర్పుగాలి: వియత్నాం విలయం ................... 61

– *ముకుంద రామారావు*

ఔరంగ జేబు జవాబు .................................. 74

– **మిసిమి**

నీటి బుడగలో సూర్యుడు ............................... 75

– *కృష్ణాబాయి*

చదవండి (పుస్తక పరిచయం).......................... 76

లింకన్ లేఖ ............................................. 78


*ముఖచిత్రం* : అపోలో–డాఫ్నీ ... *చిత్రకారుడు:* వాటర్ హౌస్.

*రెండవ అట్ట* : వనదేవత–చీకటి దేవుడు | ... *శిల్పి:* బెర్నినీ.

*మూడవ అట్ట* : సెయింట్ థెరిస్సా

*నాల్గవ అట్ట* : సెయింట్ పీటర్ ... *చిత్రకారుడు:* కార వేగియో


(*వివరాలు : 39వ పుటలో...*)

ఎందుకు మొదలయినా ఇది మంచిదే. తెలుగు పదానికి జవసత్వాలు ఇవ్వాలని, చిన్నారి పాపలకు తెలుగులోనే చదువు చెప్పాలని, తల్లి బాసకు కుదురు చేసి పైపైకి పాకించి పెంచాలని, అన్ని మూలల నుంచి ఎంతో నిజాయితీతో నడుం బిగించి కృషి చేస్తున్న భాషా ప్రియులను ప్రోత్సాహపరచాల్సిన బాధ్యత మన అందరిదీ. ఈ సందర్భంలో త్వరలో జరగబోతున్న 'ప్రపంచ తెలుగు మహాసభలు' పెద్ద వేదిక కాబోతున్నది కూడా. ఇందుకు ఎవరికి వారు తమ వంతు బాసటగా నిలిచి – అంతరాలను అవతలబెట్టి నడవ వలసిందిగా మా మనవి.

భాష, కాలాన్ని బట్టి, అవసరాలను బట్టి మారుతుంటుంది. ఎప్పటిదో 'ఔరంగ జేబు జవాబు' పాఠకులకు అందించాలని అనుకున్నప్పుడు వంద సంవత్సరాల నాటి తెలుగును ఇప్పుడు పాఠకులు ఏవిధంగా చదువుతారు– ఎంతగానో మార్పు చేర్పులకు గురికాబడిన తెలుగు వాచకం అంతరాన్ని అందించటం ఎలాగా అని – తిరగ రాసి విషయాన్ని చెప్పటానికి ప్రయత్నించాం.

నాట్యానికి ఒక విస్తృతి కల్పించి, విశాల వేదికపై ఒక 'గౌరవం' కలిగించిన 'రుక్మిణి అరుండేల్' జీవన కథనం, థియోసాఫికల్ సొసైటీ ప్రభావం, ఆమె ఎదుర్కొన్న విమర్శలు – ఎన్నార్కె విపులంగా విశదీకరించారు.

వందేళ్ల వయసులో కూడా తన సంగీత పయనాన్ని వివరించిన 'పినాకపాణి' మాటలు వినండి.

'హరి కథ' ప్రక్రియ తెలుగు వారికే ప్రత్యేకం అనుకోవచ్చు. ఇది కూడా అంతరించి పోవాలా?

'భారతీయ కావ్య మీమాంస' – సరికొత్త చర్చకు తెర తీస్తున్నది. రసజ్ఞులైన పాఠకులు ఇందులో పాల్గొన వలసిందిగా ఆహ్వానిస్తున్నాం.

ప్రపంచ సాహిత్యమంటే పాశ్చాత్య సాహిత్యమనే ప్రాచుర్యం వుంది. కాని తూర్పు దేశాల సాహిత్యం, అందునా కవిత్వం ఎంతటి సాంద్రమైనదో 'వియత్నాం విలయం'లో చదవండి.

మీ పిల్లలను బడికి మొదటి సారిగా పంపిస్తున్నారా? 'లింకన్ లేఖ' చదవండి!



**– సంపాదకులు**

# కమ్మతెమ్మెరలు

**ఉ**త్తరాలతో పలకరించే పాఠకులకు అభివందనాలు. ఎంతో ఆసక్తితో **మిసిమి** చదివి మీ అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్రాస్తున్నందుకు మా ఆనందాన్ని తెలుపుతూ, చేవగల్గిన ఉత్తరానికి **'అంతర్వీక్షణం'** పుస్తకం బహుమానంగా పంపుతున్నాము!

---

✶ "...***మిసిమి*** సెప్టెంబరు 2012 సంచికలో గొల్లపూడి మారుతీరావు *లే మిజరబుల్స్ వ్యాసం* చాల బావుంది. *లే మిజరబుల్స్* నాటక ప్రదర్శనా విశేషాలు ఆసక్తికరంగా, విజ్ఞాన దాయకంగా వున్నాయి. *అగాధం* చదివి ఆనందించాను. *Oscar Wilde's De Profundis* కి మీ అనువాదం చాల బావుంది. ఆస్కార్ వైల్డ్ *De Profundis* నేను చాల కాలం క్రితం చదివాను. మీ *అగాధం* చదువుతున్నప్పుడు - ఇంత పునరుక్తి వున్న దేమిటా అని ఆశ్చర్యపోయాను. మీ రచనలో 74వ పేజీ చదివాక సందేహం తీరింది. వైల్డ్–క్వీన్స్‌బెరీ మీద పరువు నష్టం దావా వెయ్యకపోతే అతని అపఖ్యాతి ప్రపంచమంతా వ్యాపించేది కాదేమో! నా దగ్గర *Wilde complete works* వుండేది. దాన్ని భాగవతుల నరసింగరావు (బీనాదేవి)గారు కావాలని అడిగితే ఇచ్చేశాను. అప్పుడప్పుడూ *Epigrames of Wilde* చదివి ఆనందిస్తున్నాను. వైల్డ్–జీనియస్. అతని పర్వెర్షన్ బాధాకరమే– "నన్ను నేను విధ్వంస పరచు కున్నాను" అనేది వాస్తవమే. ఆయన చివరి రోజులు మరింత బాధాకరం...

...క్రీస్తు కేవలం ప్రత్యేక వ్యక్తే కాదు చరిత్రలోనే మొదట ఉన్నతమైన వ్యక్తిత్వం గలవాడు. (39వ పేజీ) - మతి - బుద్ధుడు! వైల్డ్ దృష్టిలో బుద్ధుడు లేనేలేడా? *అగాధం* లోతైన ఆలోచనలు గల పుస్తకం. మళ్ళీ మళ్ళీ చదువుకోదగినది. ఇంతమంచి రచన చేసిన మీకు నా అభినందనలు..."

**– రామమోహనరాయ్,** గుంటూరు.

✶ "...అక్టోబరు నెల ***మిసిమి*** లో ఆచార్య బేతవోలు రామబ్రహ్మం "భావ చిత్రాలలో సామాజికాంశాలు" వ్యాసం చదివిన తరువాత, నాకు, ఒక వర్ణన గుర్తుకు వచ్చింది. యాభైసంవత్సరాల నాడు విన్నాను!...

...ఆ వర్ణన ఇది : ఒక రోజు, కాలమేఘుడు, ఆకాశంలో విహరిస్తున్నాడు. దారిలో నిండు పౌర్ణమి చంద్రుడు, కనిపించాడు. మేఘుడిని చూసి చంద్రుడు పలకరింపుగా సన్నగా నవ్వాడు. కాని, మేఘుడు తన నల్లటిరూపం చూసి, తెల్లటి చంద్రుడు హేళనగా నవ్వాడనుకొన్నాడు. కోపంవచ్చి, తన వెయ్యి చేతులతో చంద్రుడిని చుట్టేశాడు. అంటే పూర్తిగా చంద్రుడిని కప్పేశాడు. అప్పుడు, అంతా చీకటి వ్యాపించింది. చంద్రుడిని కనిపించకుండా చేశాననే విజయగర్వంతో మేఘుడు వికటాట్టహాసం చేశాడు. అంటే ఉరిమాడు. మెరుపు అనే తన కళ్ళతో నలుదిక్కులు చూస్తూ, క్రిందకు భూమి మీదకు చూశాడు. అదే సమయంలో ఒక వనిత, తోటలో విహరిస్తోంది. మేఘుడు ఆమె మోము చూశాడు. వెంటనే అయ్యో! నేను యిందాక భీకరంగా చేసిన వికటాట్టహాసానికి ఆకాశంలోని చంద్రుడు ఊడిపోయి, భూమిమీద పడిపోయాడే అని బాధపడి, పశ్చాతాపంతో భోరున ఏడిచాడు. అంటే వర్షించాడు..."

**– మనోహర్ పంత్,** హన్మకొండ.

✶ "...***మిసిమి*** అక్టోబరు సంచికలో చాలా రచనలు విజ్ఞానాత్మకంగా వున్నవి. ధర్మం మీద పుల్లెల శ్రీరామచంద్రుడి వివరణ *వేద వేదాంతాలు, పురాణాలు, ఆగమశాస్త్రాల* గురించిన విశ్లేషణ, ధర్మం గురించి అవి ఏమి తెలియజేస్తున్నది, సగటు మనిషికి అర్థమయేలా వుంది. వేదాలు, పురాణాలలో వున్న స్తుతి రూపం, నిందా రూపం, మనలో కొంతమందికి, హిందూ ధర్మం మీద కొంత విముఖత కలుగజేస్తున్నవి. ఈ రచన వలన ప్రాచీన సంస్కృతి, ఆచారాల మీద మనకు కలిగే సందేహాలకు కొంత నివృత్తి లభించింది. భారతీయులు అతిశయోక్తి ప్రియులు అన్నమాట ఎంతో నిజం. శ్రీరామచంద్రుడు అద్వైత తత్వాన్ని గురించి కొంత విస్తృతంగా తెలియ చెప్పితే బాగుంటుందని మా ఆశ..."

**– మండవ కృష్ణచంద్,** హైదరాబాదు.

✶ "...*గిరీశం* గారిని ఈతరం వారికి పరిచయం చేసిన మీకు ధన్యవాదాలు. ప్రతివ్యక్తి చదివి తీరాల్సిన *సాహిత్యం జాషువాది*. *కొరియా కవిత్వం* ఆనందాన్నిచ్చింది. అన్ని ప్రక్రియలనూ ప్రాధాన్యతగా తీసుకుని ప్రచురిస్తున్న ***మిసిమి*** నిజంగా చింతనాత్మక సారస్వతం. చందమామ, బాలమిత్రలాంటి పిల్లల పత్రికలను పిల్లలకంటే ముందరే చదవాలనుకునే పెద్దవాళ్ళు ఎంతోమంది. అట్టల మీది బొమ్మలకు వివరణ ఇవ్వటం బాగుంది. అందమైన ప్రింటింగ్, చక్కని పేపర్‌తో సాహితీ అభిమానులకు పండుగ **మిసిమి...**" **– గట్టుపల్లి సీతారామారావు,** హైదరాబాదు.

✶ "...గతంలో పబ్లిసిటీ ఈశ్వర్‌తో సినిమాపోస్టర్ సమయంలో మిమ్ములను కలిసికొన్న బృందంలో నేను ఒకడిని. ఆ సమయంలో మీరు చూపిన *Concern;* పోస్టర్‌ను అత్యంత శ్రద్ధతో ప్రింట్ చేసి అందించిన మీకు; కృతజ్ఞతలు చెప్పడం చాలా ఆలస్యం అయింది. అన్యథా భావించరని తలుస్తాను. "సినిమా పోస్టర్" కు "నంది" ప్రతిష్ఠాత్మకమైన అవార్డ్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిందని తెలుపటానికి మిక్కిలి సంతోషిస్తున్నాను.

...పుస్తకాన్ని పారిజాత పుష్పంలా తీర్చిదిద్దిన ఘనత మీదే. అందుకు కృతజ్ఞతలు. ఇహ ***మిసిమి*** నాకెంతో అమూల్యమైనది. గతంలో చిన్నపుస్తకం సైజు నుండీ చదివే పాఠకుణ్ణి. తెలుగులో ***మిసిమి***; తదితర ప్రచురణలన్నీ చదివితే ఏ పత్రికైనా ***మిసిమి*** తరువాతే– ***మిసిమి*** మేలిమి బంగారం – కృతజ్ఞతాభినందనలతో..."

**– వీరమాచనేని ప్రమోద్‌కుమార్,** విజయవాడ.

✶ "... ***మిసిమి*** అక్టోబర్ సంచికలో *విశ్వరూపం* పై వ్యాసం స్టీఫెన్ హాకింగ్, లొడినౌ రచన *గ్రాండ్ డిజైన్*‌కు న్యాయం చేకూర్చలేదు. ముందుగా గ్రీక్ తత్త్వవేత్తలు మొదలు నేటివరకు తత్త్వం అనేక ప్రశ్నలకు సమాధానాలు చెప్పింది. ఇప్పుడు ఆ పని చేయలేక పోవడానికి ఆధునిక సైన్సు ఏమి చెబుతున్నదో తెలియక పోవడమేనని వివరించారు. కనుక తత్త్వం పనికిరాని కాల దోషం పట్టింది. నేడు ఆ స్థానంలో సైన్స్ చేరి ఎప్పటికప్పుడు జనించే విషయాలను వివరిస్తున్నది అన్నారు. సాపేక్షత, న్యూ క్వాంటం సిద్ధాంతాలు కలసి చాలా వాటికి జవాబు ఇవ్వ ప్రయత్నిస్తున్నవి.

...ఇందులో అతి ప్రధానమైనది విశ్వంలో వున్న గురుత్వాకర్షణ స్వయం సృష్టి చేయగలగడమే. అందువలన దైవానికి చోటులేదని అతి స్పష్టంగా రాశారు. ఇది కీలకమైన అంశం. విశ్వంలో 14 స్థాయి వునికిని తమ M సిద్ధాంతం ద్వారా పేర్కొన్నారు. ఇది లోగడ వున్న 4 కోణాల ప్రతిపాదనకు మార్గాంతరం. అది ఇంకా రుజువు కావలసి వున్నది. ఇటువంటి ప్రధాన అంశాలు చెప్పకపోతే పుస్తకానికి న్యాయం జరగదు. పైగా అసందర్భమైన ఋషుల ప్రస్తావన, తేవడం బొత్తిగా బాగాలేదు. **– నరిసెట్టి ఇన్నయ్య,** ఆన్ లైన్.

✶ "...మీ పుస్తకం *అగాధం* నాకు పంపించినందుకు కృతజ్ఞతలు. ఇంతకాలంగా బౌద్ధసాహిత్యంలో తలమునకలవుతున్న నేను ఏనాడు కాల్పనిక సాహిత్య మీద దృష్టి పెట్టలేకపోయాను. మీ పుస్తకం ద్వారా ఆస్కార్ వైల్డ్ అంతరంగ వేదనను అర్థం జేసుకునే అవకాశం లభించింది. వారి జీవిత వివరాలను పుస్తకం చివరలో జోడించి మా బోటివాళ్లకు ఎనలేని సేవ చేశారు.

...పుస్తకం ఒక్కపట్టున చదివించింది. భాష సరళంగా ఉంది. శైలి బాగుంది. అనువాదం చదివినట్లుగా కాక Original రచన చదివినట్లనిపించింది. *ఆస్కార్ వైల్డ్* అనుభవాలను చదువుతుంటే ఒకింత ఆధునిక అస్తిత్వవాదం (existentialism) మనసులో మెదిలింది. ఆధునిక సాహిత్యానికి సన్నిహితం జేసిన మీకు అభినందనలు..."

**– ఎమ్. రాజగోపాలరావు,** గుంటూరు.

✶ "...చింతనాత్మక సారస్వతం అందిస్తున్న ***మిసిమి*** అక్టోబరు సంచిక మూడవ అట్ట *తన్మయస్నానం* చిత్రకారుడు ఫ్రెడరిక్ లీటన్ చిత్రించిన చిత్రం ప్రచురించారు. అది నా సొగసు చూడతరమా అనునట్లున్నది. లీటన్ గీసిన చిత్రం వారి దేశవాసులకు అభిరుచి కావచ్చు కాని మన తెలుగువారికది చుక్కెదురు. అలాంటిది ప్రచురించకుండా ఉంటే మంచిదేమో అనిపిస్తుందని నా విన్నపం..." **– రామమోహనరావ్,** గుంటూరు.



# రామానుజాచార్యులు

– సముద్రాల వేంకటకృష్ణ

**మా**నవాళిని దుఃఖం నుంచి విముక్తులను చేసి దారి చూపించటం కోసం తన రాజ్యాన్ని భోగభాగ్యాలను వదలి బుద్ధత్వం పొంది దుఃఖ నివారణ మార్గాన్ని బుద్ధుడు బోధించాడు.

విశిష్టాద్వైత సిద్ధాంతం నెలకొల్పిన రామానుజుడు గోష్ఠిపూర్ణుడనే ఆచార్యుని నుంచి అష్టాక్షరీ మంత్ర ఉపదేశాన్ని పొంది ఊరిజనాన్ని రమ్మనిపిలిచి వేదికనెక్కి అష్టాక్షరీ మంత్రాన్ని అందరికీ వినిపించేలా ఉచ్చరించాడు. "ఇన్ని వందలమంది వైకుంఠానికి పోయే అవకాశం కల్పించి నేను ఒక్కడినే నరకానికి వెళితేనేం" అని ప్రశ్నించాడు. వీరిరువురు తమ కోసం కాక తమ తోటి మానవాళికోసం పరితపించారు. బుద్ధుడు వర్ణవ్యవస్థను కులబేధాలను ఖండించాడు. శంకరాచార్యునిచే పునరుద్ధరింపబడిన వైదిక మతం, తిరిగి వర్ణవ్యస్థను తలకెత్తుకుంటే, రామానుజుడు స్త్రీ, పురుష, పండిత పామర, కుల జాతి, వయో భేదాలకు అతీతంగా ప్రవృత్తిమార్గాన్ని ప్రబోధించాడు.

---

**రా**మానుజులనగానే అందరికీ శ్రీవైష్ణవము (శ్రీవై) తలపుకొస్తుంది. వైష్ణవమంటే, త్రిమూర్తులలోని విష్ణువునే దేవాధిదేవుడని మర్యాదగా ముందర శ్రీ తగిలించారని అనుకుంటారు. విష్ణు అంటే సర్వత్రా వ్యాపించినది అని, అది ఒక వ్యక్తికి అతని తల్లితండ్రులు పెట్టిన పేరు కాదు. అది ఒక లక్షణము. ఆ లక్షణాన్ని తెలుసుకోడమే వైష్ణవము. విశిష్టాద్వైతము (విఅ)ను శ్రీవై అని వ్యవహరించటము ఆనవాయితి. చరిత్రకారులనే విధముగా వి.అ. రామానుజల స్థాపన కాదు. ద్వైతము ఆస్తిక వాదాలలో స్వాభావిక ఉత్పత్తి (natural produce) అద్వైతము వేళ్ళూనుకొంటున్న బోధివృక్షాన్ని కూకటి వేళ్ళతో పెకలించి, రెండు వర్ణాల కుహనాధిక్యత ఊతకర్రగా పాతిన మాయా దండము. ఏ మతమునూ వాదాన్ని కూలదోయడాని కుద్దేశించినది కాదు. దీని స్ఫూర్తి సృష్టి కర్త తలపులో నుంచి గీతామృతధారగా విశ్వానికి చేరింది. అంచేత అది ద్వైత మంత అనాది, అందుకే బహుశా అద్వైతం వలె ఫాషన్ అవలేదేమో. శ్రుతి లేక వేదములో మొదటి భాగము పూర్వమీమాంస, ఇది కర్మకాండకే అంకితము. ఈ కర్మల మొదటి ఉద్దేశ్యమేమైనా రాను రాను, ముఖ్యంగా స్మృతికర్తల పావమా అని అది ఒకటి రెండు వర్గాల వారికి గుత్తాధిపత్యమిచ్చే పరికరా లయినాయి. పైగా ఆ కర్మ కాండ కాలబద్ధము కాన కాలము చెల్లినది. అయినా ఆ కర్మ కాండ నిరాఘాటముగా కొనసాగించటం కేవలము ఒక వర్గగము వారి బాగు కోసమే.

శ్రుతిలో రెండవ భాగము వేదాంతము. ఇది కాల బద్ధముకాదు. బుద్ధుడు తిరస్కరించినది అహేతుకము, అసంబద్ధమైన కర్మ కాండ. అదే పూర్వమీమాంస, అందులో స్మృతికర్తలు దోపిన కులాధిక్యతను. అద్వైతము అంతా మాయంటూనే కులాధిక్యతకు పెద్దపీటవేస్తుంది. అందుకే దానికి బౌద్ధానికి  బద్ధ విరోధము. ఇక విశిష్టాద్వైతము ఆద్యుడు కులాతీతుడు. విశిష్టాద్వైత తత్వాన్ని బోధించిన వారు అన్ని కులాల వారు. ముఖ్యంగా ఆళ్వార్లలో ఇప్పటి అంట రాని తరగతుల వారే హెచ్చు. ఆ విధముగా విశిష్టాద్వైతము బౌద్ధాన్ని పడకొట్టేది కాక అనుయాయి; అద్వైతుల శాపనార్థాలలో బౌద్ధము, విశిష్టాద్వైతము తోడుదొంగలు. చరిత్రకారులు సృష్టించిన లెక్కలేనన్ని అసత్యాలలో విశిష్టాద్వైతము రామానుజులు స్థాపించినదన్న దొకటి. పైన చెప్పిన దాన్ని బట్టి విశిష్టాద్వైతము రామానుజులకు ముందే ఉన్నది.

విశిష్టాద్వైతము స్థాపకులు రామానుజాచార్యులు కారు; వారు విశిష్టాద్వైతము వాదనకు నిర్దిష్టమైన అక్షరాకారము, నిరూపణకు అవసరమైన వాదనలను (theoretical foundations) ఆలోచన, నమ్మకం నుంచి సహేతుక ప్రవర్త నావళిని (Organisational behavior perfectlay developed through logcic) సమకూర్చిన ఆచార్యులు మాత్రమే. అంతే కాదు, రామానుజులు, విశిష్టాద్వైతము కేవలం భగవంతుడికి సంబంధించిన నమ్మకమని కాకుండా, దానిలోని అది ముఖ్యమైన సాంఘిక మానవీయతను, ఆధ్యాత్మికముతో రంగరించి, మానవాళికి మహా ప్రభావశాలియైన రసాయనము చేసి ఇచ్చారు. ఆచార్య పరంపరలో ఆయనొక ముఖ్య కీలక ఘట్టము.

**రామానుజాచార్యులు – యతిరాజు – భాష్యకారుడు:** శ్రీ రామానుజులు శ్రీపెరుంబుదూరులో క్రీ.శ. 1017లో పుట్టినాడు. పెరుంబుదూరు అంటే పెను భూతము ఊరు.

పెను అనగా అన్నిటికీ ముందుది అని భావము, **ఆది భూతాయ భూభృతే** అన్న శబ్దం ఎప్పుడైనా విని ఉంటారు. దాన్ని బట్టి పెనుభూతమంటే ఏమిటో తెలియవస్తుంది. **తల్లి తిరుపతింటి తెలుగు ఆడపడుచు.** మామూలు గానే పుట్టి పెరిగాడు. చిత్రాలు, విచిత్రాలు ఏమీ చేయలేదు. చాలా చిన్న వయసులో అప్పటి ఆచారము ప్రకారం పెళ్లయింది. త్వరలోనే తండ్రి చనిపోయి, తల్లి మేన మామల ఇంటికి (తిరుపతి) చేరగా, రామానుజులు చదువుల కోసము భార్యతో సహా కాంచీపురము ( ఆ రోజుల్లో కంచి విద్వత్ శిఖామణులకు ప్రసిద్ధి; ఇప్పుడు, పట్టుచీరలకు, విషయవలయంలో చిక్కుకున్న ఆచార్యులకు ప్రసిద్ధి) చేరారు. అక్కడ ఆయనకు మొదటినుంచీ జాత బ్రాహ్మణుడు కాని అత్తివరదరాజానుగ్రహ పాత్రుడైన, కాంచీపూర్ణుడే మార్గదర్శకుడు. ఆయననే గురువుగా ఆచార్యునిగా ఆయన దగ్గరే శిష్యరికము చేయాలని విశ్వ ప్రయత్నము చేశాడు. కాంచీ పూర్ణుడు ససేమిరా అన్నాడు. ఎందుకంటే తను శూద్రుడు, రామానుజుడు బ్రాహ్మణుడు అని. విధిలేక రామానుజుడు, కంచిలో అద్వితీయ అద్వైత శిఖామణి అని పేరొందిన ఆచార్యులు యాదవ ప్రకాశునకు మింగుడు పడని శిష్యుడిగా అభ్యాసం చేయటం మొదలు పెట్టాడు.

అత్యంత మేధావి. స్వయం ప్రకాశుడవటంతో, రామానుజులు యాదవ ప్రకాశుని విపరీత, అసూయా పరమైన వ్యాఖ్యలకు అభ్యంతరం చెప్పేవాడు. అట్లాంటి వాటిలో ఒకటి, హిరణ్య గర్భుడైన పురుషోత్తముని వర్ణన ఛాందోగ్య ఉపనిషత్ 1.5.7 మంత్రములో భాగము.

**తస్య యథా కప్యాసమ్ పుండరీక ఏవమ్ అక్షిణి** అన్నది. దీనిని విద్యార్థులకు ప్రతిపదార్థమని ఆదిశంకరుని వ్యాఖ్య అని యాదవ ప్రకాశులిట్లా వివరించారు. "హిరణ్యగర్భుడైన ఆ పురుషోత్తముని కన్నులు కోతి అధోభాగము వలె (కప్యాసమ్) ఎర్రనైన తామర పూల వలెనుంటవి." ఇందులో కప్యాసమ్ కు యాదవ ప్రకాశులిచ్చిన అవహేళన పూరిత భాష్యం రామానుజిని కంట నీరు తెప్పించింది. పైగా అది మహాపురుషుడైన శంకరుని కన్వయించడం మరీ ఘోరమనిపించింది. కంట నీరు చూసే గురువు రామానుజుని అడిగారెందుకు దుఃఖమని.

అప్పటికే రామానుజుని ప్రతిభ రుచి చూసిన గురుడు, "ఇది శంకరుడు స్వయాన చేసిన భాష్యము, దానికి వంక పెట్టేంత పండితుడివా నీవు? మరి నీ భాష్యమేమిటి?" అని అడిగాడు.

రామానుజులు ప్రశాంతముగా, "కమ్ జలమ్ పిబతి" 'నీటిని త్రాగే వాడు' కపిః. సూర్యుడు జలమును త్రాగే కదా మేఘము నిచ్చేది. కాబట్టి ఇక్కడ కపికి సూర్యుడని భావము. అసమ్ అన్నది క్రియ నామ వాచకము కాదు. అసమ్ అనగా వికసించుట. అంచేత, ఈ వాక్యానికర్థము 'నీరజబంధు దర్శనమయి వికసించిన తామరస నయనుడు ఆ హిరణ్య గర్భ పురుషోత్తముడని" అని వాఖ్యానించాడు. రామానుజుని పటిమ కబ్బురపడినా యాదవ ప్రకాశులకు మదిలో వీడా శంకర భాష్యాన్ని తప్పుబట్టేది అని మనసులో ఉడికి పోయాడా అద్వైత శిఖామణి. పైకి మాత్రం చాలా బాగుంది కానీ అది పరోక్షార్థము, ప్రత్యక్షార్థము శంకరులు చెప్పినదే అని కప్పదాటు వేశాడు. ఇది తనకవమానముగా భావించిన గురుని మనోస్థితి ఎంత పతనమైందంటే, ఈ శిష్యుడు గురువు కొంప ముంచుతాడన్న భయము, తద్వార రామానుజుని పై క్రోధము, వైషమ్యము అన్నీ కలిగాయి. తన ఉనికిని పరువును దక్కించు కోవాలంటే రామానుజుని దూరం చేయాలిసిందేనని నిర్ణయించుకొన్నాడు.

ఆయన పథకం శిష్యులతో సహా కాశి-గంగ యాత్రకు వెళ్ళటము. దారిలో కంచికి దూరంగా రామానుజుని పీడ వదలించుకోటము. కంచికి చేరాక రామానుజులు ఏ గంగలో కలిసారనో, ఏ పులివాత పడ్డాడనో, అతని కథ మా కంటే ముందే కంచికి చేరిందని దొంగేడుపులు ఏడ్చి అందర్నీ నమ్మించడం. చేసిన పాప కృత్యానికి ఎటూచ్చీ గంగాస్నానం చేస్తాం కాబట్టి, పాపపరిహారమయిపోతుంది. కైలాస ప్రాప్తికే మాత్రం అడ్డంకి ఉండదు. ఈ యాత్రకు రామానుజుని ఒప్పించి బయలుదేర దీశాడు యాదవ ప్రకాశుడు.

శిష్యులలో ఒకడు గోవిందులు రామానుజునికి తమ్ముడి వరస. మాయావాదం వైపు విశేషంగా ఆకర్షింపబడి, యాదవ ప్రకాశుని అనుంగు శిష్యుడైనాడు. కుట్ర తెలిసిన గోవిందుడు సహజ భావముతో రామానుజునికి కుట్ర తెలిపి, రాత్రికి రాత్రే గుంపునుంచి విడిపొమ్మని చెప్పాడు. రామానుజుడా చీకట్లో ఎటో వెళ్ళిపోయాడు. తెల్లవారింది. రామానుజుడు కనిపించలేదని కలకలము. లోపల మాత్రం యాదవ ప్రకాశ సన్నిహితులు, కాగల కార్యం గంధర్వులు కాకపోయినా వ్యాఘ్రేశ్వరు లెవరో తీర్చేశారని సంతోషిస్తూ కాశీయాత్ర కొనసాగించారు. రామానుజులు చీకట్లో నడవగలిగినంత దూరం దక్షిణ దిశగా నడచి, ఒక చెట్టు కింద సొమ్మసిల్లి పడిపోయాడు.

తెల్లవారి మధ్యాహ్నం దాటింది. అప్పుడు కళ్ళు తెరిచిన ఆయనకు ఎదురుగా ఒక శబరజంట, తన యోగక్షేమాలు చూస్తూ కనిపించారు. వారు పెట్టింది తిని, ఇచ్చింది తాగి, ఓపిక తెచ్చుకున్న రామానుజులు జగతః పితరుల వలె నున్న ఆ శబర దంపతులకు తన కథ వినిపించారు. వేంటనే వారు, ''మాకు ఎంతటి కీకారణ్యమైనా దాని నుంచి బయటపడే దారి తెలును, చూవగలము. వేము రామేశ్వరమును పునర్దర్శించడానికి వెళ్తున్నాము, నీ కంచి అటే కనుక మాతోటి వస్తే నీకు దారి చూపుతాము'' అన్నారు. రామానుజుడు వారితో తిరుగు ప్రయాణము సాగించాడు. వారి సన్నిధానములో ఎన్నిరోజులు నడచినా ఆయనకలసట కలుగ లేదు. అడవి జాతి వారు, కిరాతులు పంచములు వంటి వారు అజులనీ సంస్కార హీనులని, పాపులనీ తర తరాలుగా పేరుకొన్న అంధకారమా శబర జంట సాంగత్యముతో కొద్ది కొద్దిగా తొలగిపోయింది.

కడకు ఒక రోజు మధ్యాహ్న సమయంలో ఒక గుబురు కాడులో ఒక చెట్టుకింద కూల బడిన ఆ జంట ''రామానుజయ్యా, మాకు దాహంతో వళ్ళు ఎండి పోతూందయ్యా, కానిని నీళ్ళు తెచ్చి మా గొంతులు తడవకపోతే వేము అడుగెయ్యలేము'' అన్నారు. అచ్చెరువొందాడు రామానుజయ్య, ఇన్ని రోజులు అలుపెరుగక, అన్నింటా తమదే ముందడుగన్న ఈ జంట ఇప్పుడు కదలలేమంటారేమిటని. వాళ్ళు ఈయనకు ఒక దిశ చూపుతూ, ఆ దిక్కున ఒక బావి ఉండాలి, కాస్త వెళ్ళి అక్కడ నీ దప్పి తీర్చుకొని మాకూ కాసిన్ని నీళ్ళు తెచ్చి పెట్టు నాయనా అన్నారు. అట్లాగే నని రామానుజులా దిశన వెళ్ళి నూతిలో నీళ్ళతో దాహం తీర్చుకొని తాటాకు దొన్నెలో వారికి నీళ్ళు తెచ్చాడు. వారులేరక్కడ. చుట్టూ వెదికాడు. మళ్ళీ ఆ నూతివద్దకు వెళ్ళాడు. వారక్కడ కనిపించ లేదు కానీ ఇప్పుడు ఆ నూతి నుంచి దాపున ఎత్తైన గోపురాలతో ఊరు కనుపించింది. ఆ ఊరు తన కంచియే నని తెలిసింది.

అప్పుడు "ఏ కీకారణ్యమునుంచైనా బయట పడే దారి మాకు తెలును, చూవగలం'' అన్న మాటకర్థము స్ఫురించింది. శబరి వరదుడే శబరకాంతుడయి తన్ను కంచి వరదుని వద్దకు చేర్చాడని "తారక మంత్రము కోరిన దొరికెను ధన్యుడనైతిని ఓరన్నా" అనుకుంటూ ఇల్లుచేరాడు. ఇంటి వద్ద కోడలుకు సాయంగ ఉన్న తల్లి తనయుడు క్షేమంగా తిరిగి రావటం అదీ అంత త్వరగా, ఒక్కడూ రావటంతో మురిసిపోయింది. జరిగిన విషయము, యాదవ ప్రకాశుని కుట్ర ఎవ్వరికీ చెప్పలేదు రామానుజుడు, గరళ కంఠుని వలె. నిస్వార్థప్రేమాను రాగాలతో రామానుజులకు కుల వర్ణ వ్యవస్థ పై ఏమన్న నమ్మకముంటే అది కాస్తా పుటుక్కుమంది. విశిష్టాద్వైత సిద్ధాంతము అనుభవ మయ్యింది. తర్వాతి రోజుల్లో, యాదవ ప్రకాశుడు రామానుజునకు శిష్యుడైనాడు. విశిష్టాద్వైతము గ్రంథ కర్తలలో ప్రముఖుడైనాడు. కాంచీ పూర్ణుడు బ్రాహ్మణేతరుడని ఏ ఆచార్యుడూ అతనికి నిగమాధ్యయనానికి అవకాశమివ్వ లేదు. కాని ఆయన వేదాంతాన్ని జీర్ణించుకున్న మహాజ్ఞాని. నిజముగా పరిశీలిస్తే వేదాంతములో ఎవరికైనా మనసు బుద్ధి, ఆత్మను (ఈ మూడింటి మేలు కలయికను పుండరీకమంటారు) సంధానము చేసి సరైన పంథాలో ఆలోచిస్తూ ఉంటే ఆ పరమాత్మ అనుగ్రహము తోడవుతుంది; పుట్టుకతో నిమిత్తములేదు. అప్పుడు అంతు చిక్కనిదేమీ ఉండదు (చూడండి, 18.13, భగవద్గీత).

కాంచీపూర్ణుల వారు, స్వయం కృషితో వరద రాజానుగ్రహం కలిగి వేదాంత దర్శి అయినారు. ఆది శంకరులు కంచి కామాక్షి పీఠము స్థాపించక ముందునుంచి, కంచిలో వరదరాజస్వామియే ప్రసిద్ధ దైవం. ఆయనకు అత్తి (మేడి పండు, ఔదుంబర) వరదుడని పేరు. అందుకే రామానుజులకు వారంటే అమిత భక్తి. డ్రాపౌట్ అయిన రామానుజునకు ఈ శూద్రపాయనే గురువు, దైవము. ఆయన భుజించిన శేష భోజనమే ప్రసాదమని భావన. ఇది భార్యకు అసలు ఇష్టముకాదు. ఈ విధి కాపురమెటులో నీవొక కంటను కనుమా అని ప్రార్థిస్తూ కంచి పూర్ణుని ద్వారా వరద రాజుని సేవలో స్వాధ్యాభ్యానము చేశారు. రామానుజులు. కంచిలో ఆయన కీర్తికంచు ఘంట వలె మ్రోగింది. ప్రతిభ కనకము మెరిసినట్లు విరిసింది, నలుదెసల ప్రకటితమైంది.

యామునుల వారి అంత్యకాలము సమీపించింది. శిష్యులలోకెల్ల పెద్దవాడు, యామునికే సమ వయస్కుడైన న్యాసి చూడామణి తిరువారంగ స్వామి చేత ఈ ప్రశ్న ఆడిగించారు. యామునాచార్యుని సమాధానము, విశిష్టాద్వైతానికి ఏకవాక్య భాష్యము.

''నారాయణుని భక్తుల సేవే నారాయణుని సేవ. నారాయణుని భక్తులకు, కులము, గోత్రమే కాదు జాతి (species) భేదము కూడా ఉండదు. మదమెక్కిన ఏనుగునుంచి కదలికట్టున ఉడుత కూడా నారాయణుని భక్తులవటానికి అర్హులే. భక్తి సారులు (తమిళములో

తిరుప్పానాళ్వారు, ఈయన ప్రస్తుతము షెడ్యూలు కులము వారని ముందే చెప్పాము)ను సేవించితే నారాయణుని సేవించినదానికంటే అధికం. ఇటువంటి భక్తాగ్రేసరులే కేశవుని అర్చామూర్తులు, వీరిని గుర్తించడము సులభము. వీరి జీవితములో అన్నీ భగవ దర్పణములే ఏ పనిచేసినా అది భగవత్సేవగానే చేస్తారు. ప్రజల శ్రేయస్సుకోసం పాలన కూడా చేపట్టి రాజర్షులవుతారు. కాంచీ పూర్ణుడిందుకింకొక ఉదాహరణ; ఆయన సేవ చేసేవాడు వరదరాజస్వామికి ఉత్తమ సేవకుడు. వారి ననుసరించటమే వెన్నుని సేవ, సర్వ ప్రాణి సేవయే మాధవ సేవ. మహాజనో యేన గతః స పన్థాః పెద్దలు ఆళ్వారులు లాంటి వారు చూపినదే భవతారణము." ఇది విన్న శిష్య గణమునకు యాముని పై భక్తి అమితంగా పెరిగింది. ఆయన లేక మిగిలేది చీకటే అని, మహాపూర్ణులును ఆచార్యులవారితోటి సహగమనము చేయతలచారు. ఇది తెలునుకొన్న ఆచార్యులు, మహాపూర్ణులను పిలిచి, "శరీరం పుట్టినది కావున మృత్యువాత పడటము సామాన్యము, అనివార్యము. పుట్టుకే లేని విశిష్టాద్వైత తత్త్వము అమరము. దీనికి అంతము లేదు, నేను ఆద్యుడను కాను, నాతోటే అంతమూ అవదు.

విశిష్టాద్వైతము ఆవరించిన చిరంజీవి ఎక్కడో ఉంటాడు; మన పని అల్లా ఆ మహాపురుషుని వెతికి పట్టుకోడమే. శరీరము చాలించే ఆలోచన మాని, వెతికే పని మొదలెట్టండి" అని ధైర్యము సలహా, ఆజ్ఞగా ఇచ్చారు. మహాపురుషుని వెతకటానికి మహాపూర్ణుని నియమించారు. యామునుల వారిని, పెట్టుకొన్న లక్ష్యాలతో కొన్నిటిని పూర్తిచేయలేక పోయాననే, వ్యధ చివరి దశన కూడా వదలలేదు. తన తర్వాత పీఠానికి ఎక్కేవాడు ఈ లక్ష్యాలను సాధించాలని అటువంటి వారసునికై వెతికాడు. చివరకు, కాంచీ పురములో రామానుజుని గురించి తెలిసి అతనే సరియని, ఉత్తమ శిష్యుడు మహాపూర్ణుడునే కంచికి రామానుజుని శ్రీరంగమునకు తెప్పించడానికి పంపారు.

శ్రీరంగమునుంచి కంచికి దాదాపు 260 కిమీ ఆ దూరాన్ని 4 రోజులలో అధిగమించారు. 4వ రోజు సంజవేళ మహాపూర్ణులు వరదరాజు సన్నిధి చేరారు. ఆయనకు ప్రథమంగా కాంచీ పూర్ణుని దర్శనమయ్యింది. కాంచీ పూర్ణుని ద్వారా రామానుజుని ప్రతిభా పాటవాలను సరిజూసుకొని, ఆయనతో సహా రామానుజుని కలసి, యాముని మాట విన్నవించారు. మొదట నమ్రతతో తన అల్పత్వానికిది తగని భారమని తర్వాత, కాంచీపూర్ణుని ఉపదేశముతో యామునిని దర్శనం చేనుకొనడానికి సిద్ధమయ్యాడు.

యామునాచార్యులు రామానుజులొచ్చేసరికి దేహం చాలించారు. సంకేతాల ద్వార ఆచార్యుని ఆశయమెరిగిన రామానుజుడు పీఠమెక్కడానికి సిద్ధమయ్యాడు. ముందు తయారీగా చాలా పాఠాలాయనకు యామున శిష్యులు నేర్పారు. వారిలో దాదాపు అందరూ బ్రాహ్మణేతరులే. గురుడు ఎట్లా పుట్టాడు కంటే ఏమి చెపుతున్నాడనే దాని మీదే దృష్టి పెట్టే రామానుజునికి ఇదేమీ పట్టలేదు కానీ ఆచారము సంప్రదాయమునకు విలువనిచ్చే ఆయన భార్య మాత్రం ఈ అకృత్యము సహించ లేక, దూరమైంది. ఉన్న ఒక ప్రాకృతిక బంధమూ తెగేసరికి స్వేచ్ఛా విహంగమ్మైనాడు రామానుజుడు.

**రామానుజుడు భాష్యకారుడు :** అప్పటికి ఆది శంకరుల అద్వైతము మూఢుల చేతికి చిక్కి, వెర్రిగా మారింది. అహం బ్రహ్మాస్మి అన్నది కేవలం ఒక వర్ణం వారికే పరిమితమైంది. విశిష్టాద్వైతము నానా జాతి సమితని ఎగతాళిగా చూసేవారు. శూద్రుల శిష్యరికము చేసేవారిని ఆచార్యుడుగా అంగీకరించమన్నారు. ఆచార్యత్వానికి వారు కొన్ని కొలబద్దలు పెట్టారు. అందులో ఒకటి బ్రహ్మ సూత్రాల (బాదరాయణ స్మృతి)కు వ్యాఖ్య వ్రాయడము. విశిష్టాద్వైతము స్మృతికంతగా మాన్యత ఇవ్వకపోయినా రామానుజులకా పని తప్పలేదు. పైగా ఆయనకు బాదరాయణ స్మృతి కర్త, మహాభారత రచయిత వేద వ్యాసులు కారని గట్టి నమ్మకము. మిగతా స్మృతులకన్న, బాదరాయణ స్మృతి సాంఘికంగా మెరుగైనా, అందులోని కొన్ని అంశాలు పరమాత్మ నిర్దేశాలను తక్కువ చేసి, మానవ కల్పితాలకు పల్లకీ కట్టారని అప్పటికే విశిష్టాద్వైతములో నెలకొన్న భావము. ముఖ్యంగా 124వ సూత్రము "అపశుద్రస్య అధికరణ విరోధాత్" ఏకంగా శూద్రులకు భక్తి అధికారము లేదు. ఎందుకంటే అది (శూద్రుల భక్తి) శూద్రులు కాని వారి కి భక్తి పై అధికరణము (అధికారము కాదు) నకు విరోధమవుతుంది, చాలా సులభంగా, అధికరణ బదులు అధికారము లేక అర్థత, అనే తప్పు భాష్యాలకు దారితీస్తుంది, తీసింది. కించిత్ ఇబ్బందికరమైన పుట్టుక, అదీ జాలరి కన్నె కడుపున కలిగిన భగవాన్, అన్న అపూర్వ గౌరవానికెదిగి, భక్తికే పరమార్థం చెప్పిన వ్యాసుల వారీ సూత్రము చెప్పారంటే

నమ్మటం కష్టమే. ఇంకా, వ్యాసులవారికి, ఋగ్వేదం లోని మహిదాను (ఐతరేయ బ్రాహ్మణము, ఉపనిషత్ కర్త), ఛాంద్యోగపనిషత్ లోని జాబాలి సత్యకాముని సంగతులు తెలియవా; శూద్ర అంటే అసలు అర్థము దుఃఖితుడు అని ఆయనకు మనం చెప్పాలా? అందుకని రామానుజుల బ్రహ్మసూత్రాలకు వ్యాఖ్యానము వ్రాయటము కేవల ఔపచారికమేనని నా అభిప్రాయము. వ్రాసిన వ్యాఖ్య శ్రీభాష్యము. అతి కఠినమైన శైలిలో కేవలము కుహనా పండితుల నోళ్ళు మూయించడానికే వ్రాసినట్టు స్పష్టము. అయినా వీలైనంత మటుకూ తన, విశిష్టాద్వైతము భావాలను అందులో నిలిపారు. బ్రహ్మ సూత్రాలు ఇది వరకే వ్యాఖ్యానించ బడ్డాయి. వాటిలో బోధాయనుని ప్రతి మాత్రమే ఆయన నమ్మదగ్గదిగా ఎన్నుకొన్నారు. ఆ ప్రతి ఒక్క కాశ్మీరము లోని సరస్వతీ పీఠములోనే (ఇప్పుడు, పాకీస్తాన్ అధీనములో ఉన్న ముజఫరబాద్‌లో మిలిటరీ కన్‌టోన్మెంట్‌లో ఉంది) ఉన్నది.

ఆయన ప్రామాణికముగా తీసుకొన్న ప్రాచీన ఋషి, ఆచార్యులు, ద్రవిడ, భరూచి, బోధాయనులే, బ్రసూకు వాక్యలెన్ని ఉన్నా శ్రీభాష్యముతో ఏదీ సరితూగేది లేదని కాబోలు, రామానుజులకే భాష్యకారులని పేరొచ్చింది. ఆచార్య పీఠమెక్కినాక అనేక సైద్ధాంతిక గ్రంథాలు వ్రాయటమే కాక ముక్కచెక్కలైన సమాజాన్ని చిన్నా భిన్నమైన భగవద్స్ఫూర్తిని పునరుద్ధరించడానికి ఎన్నెన్నో వేదికలపై ఆయన చర్చించి, వాదించి, ఒప్పించాడు. విశిష్టాద్వైతము స్ఫూర్తిని అద్వైత గ్రహణము నుంచి విడిపించాడు. శ్రీభాష్యము వలె కాక ఆయన గ్రంథాలన్నీ సులభశైలిలోను, సరళంగానూ ఉంటాయి. భగవద్గీత వ్యాఖ్య ఎక్కడా polomic (పరస్పర వైరుధ్యాలు) కాకుండా, ఉపనిషత్తులకన్నిటికీ వ్యాఖ్యగా సాగుతుంది. అందుకే ఆయన ఉపనిషత్తులకు ప్రత్యేక వ్యాఖ్య వ్రాయలేదు. వేదాంత సారము, శరణా గతి గద్యము ఆయన ఇతర వ్రాతలలో ప్రసిద్ధి.

**రామానుజుని బోధనావిధానము :**

సిద్ధాంతాలను ఆయన ఆచరణలో పెట్టటమే బోధన. ఆయన విద్వత్ పాండితీ ప్రకర్షపరమైన తాత్త్విక చర్చలను, అతి సామాన్యుని, పామరుని (man in the street) కల్మషరహితమైన భక్తి ప్రపత్తులను ఒకే గాట కట్టి వేయడమే ఆయన వైశిష్టత. ఆది శంకరుని వలె కేవలం పండితులకే అర్థమయ్యే (అయినా కాకున్నా తలలూపే వారికే) రీతిలో చెప్పడం కాకుండా సకల జన జేయము, ధ్యేయముగా సాగింది ఆయన ఆచార్యత్వం.

**రామానుజుల సమసమాజ నిర్మాణము : 1. ధనుర్దాసు హేమాంగి :** వయసు మళ్ళినాక నడిచేప్పుడు మనిషి ఆసరా కావాల్సి వచ్చింది రామానుజులకు. (రామానుజులు 120 ఏళ్ళు జీవించారు) స్నానానికి (కావేరికి) వెళ్ళేప్పుడు జాత బ్రాహ్మణ శిష్యులు ఆనరాగా వచ్చినా, స్నానాది కార్యక్రమాలైనాక, శుద్ధుడై తిరిగి వచ్చేప్పుడు మాత్రం ఆయనకి ధనుర్దాసనే బోయవాని ఆసరాయే. ఈ ధనుర్దాసు శ్రీరంగములో ఇప్పటి భాషలో ఇప్పటి భాషలో టూటౌన్ రౌడీ. అడవిలో (అపుడుండేవి లెండి) పక్షులను బట్టి ఊళ్ళో అమ్మడమే అతని జీవనాధారము. అక్కడి ఒక వేశ్య హేమాంగి నేత్రాల అందమునకు దాసుడై, ఒక్క క్షణము కూడా అవిచూడకుండ ఉండలేక ఆమె కళ్ళ మీద ఎండ పడకుండా గొడుగు పట్టి తను ఆ విశాల నేత్రాలనుంచి దృష్టి మరల్చ లేక వెనక్కు నడిచేవాడట.

ఆ ఏకాగ్రతను దీక్షను రామానుజులు చూసి నివ్వెర పోయారు. ఈ ఏకాగ్రత (యత చిత్తము) పరమాత్మ వైపున తిరిగితే ఎంతటి వాడవుతాడో నన్న ఆర్ద్రతతో ధనుర్దాసుని దృష్టి శ్రీరంగని వైపు తిప్పినారు. ధనుర్దాసు భక్తాగ్రేసరుడు అయినాడు. ఆచార్య శిష్యులలో ఉత్తముడైనాడు. ఆ వేశ్య తోనే రామానుజులు అతనికి వివాహము చేశారు. ఇప్పటికీ వేశ్యావృత్తిని, అందరూ స్వాముల వశమయ్యే ఈ రోజులలో కూడా వేశ్యలను పగటిపూట అసహ్యించుకుంటూ ఉంటే, రామానుజులు ఆవగింజంతైనా ఏవగించుకోక సంస్కరించారు. దంపతులిద్దరూ భక్తి వైరాగ్యములలో ఒకరిని మించి ఒకరన్నట్లు జీవితము సాగించారు. వైరాగ్యమున కసలర్థము అన్నీ భౌతికంగా వదిలేసి మనుసుతో స్మరిస్తూ పరాన్న భుక్కులవడం కాదు. అన్నింటి మధ్యా ఉంటూ దేనినీ అంటనిచ్చుకోక పోవటమని మనవి. శుద్ధ స్నానంతరం ఆచార్యునికే ఆసరా అయినది ఈ ధనుర్దాసే. అట్లా చేయటము రామానుజుని బోధనా ఫలితమే. ఈ ధనుర్దాసు వృత్తాంతము, చాలా ఏళ్ళ క్రితమే ఆంధ్రపత్రిక అనే వారపత్రికలో *విశాల నేత్రాలు* సీరియల్‌గా వచ్చింది.

**2. అష్టాక్షరీ :** ఓం నమో నారాయణాయను ఎవరూ పూర్తిగా అర్థము చేసుకోలేరు. (నారాయణుడనంతుడు కనుక). అది జపిస్తే సమస్త సన్మంగళాని భవంతు అని

అంటారే తప్ప, దాని అర్థమ్ ఎంత నేర్పినా ఇంకా అంతా మిగిలి ఉంటుంది. రామానుజులు ఉన్నత శ్రేణి పీఠమెక్కినా, స్వయముగా ఆచార్యులైనా ఈ మంత్ర రహస్యము పూర్తిగా తెలునుకోవాలని గోష్ఠీ పూర్ణుడనే మహనీయుని ఆశ్రయించాడు. 17 సార్లు తిరస్కరించి, చివర ఇది ఎవరికీ చెప్పరాదు, చెపితే నరకానికి పోతావనే హెచ్చరికతో నేర్పించాడాయన. లక్షలాది జనులు పునీతులైతే నేనొక్కడినే నరకానికెళితే ఏమైందని, ఊరిలోని గోపురమెక్కి ఆ రహస్యమందరికీ చెప్పారు. గోష్ఠీ పూర్ణుని తో సహా, అందరు పండితులూ నివ్వెర పోయారు. రామానుజలది ఒకటే జవాబు. భగవంతుని తో సహా చేరే భక్తి, జ్ఞానవైరాగ్య మార్గాలను కూడా ఎవరూ గుత్తగా తీసుకొనే అధికారము ఆ పరమాత్మకే లేదు, మావునికెక్కడ నుంచి వచ్చింది?

**ఛండాలురకు ఆలయ ప్రవేశం :** సనాతన ధర్మములో దేవాలయాల ప్రసక్తి లేదు. రాకీనాలు మిథ్ అన్న రామాయణములో కూడా. రాములవారుగానీ, ఇంకెవరు గానీ పనిగట్టుకొని దేవాలయాని కెళ్ళినట్టు లేదు. భారతములోనూ అంతే. ఉన్నవి చైత్యములే. అనగా చైత్యములంటే బౌద్ధమే అనేవారున్నారు. అది సరిగాదు. చైతన్యవంమ్ము చేసే పరిసరమే చైత్యము. అది ఒక ఇల్లవచ్చు, అడవి కానీ, ఏ రావిచెట్టు నీడనైనా కావచ్చు. జీసస్ ఎక్లెసియా (చర్చ్) మాదిరి. గుళ్ళు గోపురాలు మహా అవుతే 2000 ఏళ్ళ క్రితమువే కాబట్టి, ఒక జాతకులకు ఆలయ ప్రవేశము నిషేధము ధర్మం ప్రకారం కాదు. అది స్మృతుల ద్వార సంక్రమించిన తెగులే. రామానుజుల సమయానికి అది పెనుభూతమై సమాజాన్ని చిన్నా భిన్నం చేసింది.

చర్మకారులు జనావాసాలకూ, జల వనరులకూ దూరముగా ఉంచటము ఆరోగ్య, పర్యావరణ రక్షణ పరమే కానీ వేరే కాదు. కాలము స్వార్ధము అన్నిటినీ వక్రీకరిస్తుంది, ఇక్కడా అదే అయ్యింది. ఇది క్షుణ్ణంగా ఎరిగిన రామానుజులు అటువంటి వారిని ఆలయములోనికి రానివ్వకపోవడం అర్థం లేని మాట అన్నారు. ఆవు, ఏనుగు వంటి జంతువులను లోనికి ఆర్భాటంగా తీసుకవెళ్ళినపుడు సాటి మానవుని కేల ఈ అడ్డు అని ఆయన వాదము. "విద్యా వినయసమ్పన్నే బ్రాహ్మణే గవి హస్తిని ... (5.18. గీత)", "సమో అహమ్ సర్వభూతేషు .. (9.29 గీత)," యతః ప్రవృత్తిః భూతానామ్ .... (18.46 గీత), మహా భారతములోని నహుష ప్రశ్నలు, ధర్మ వ్యాధోపాఖ్యానము పండితులకు గుర్తు చేసి, ఏ వర్గమ్ వారికైనా, పరమాత్ముని ఇంటి తలుపులు మూయ వీల్లేదు అని వారి మూర్ఖత్వమును రూపుమాపారు. ఆళ్వారులలో అధికులు **భుజాల మీద కావేరి నుంచి గర్భగుడి వరకు విగ్రహాలను** మోసుకొచ్చిన సంగతి మరువరాదని హెచ్చరించారు. క్రిమి కంటుడనే రాజు వలన అరణ్య వాసము, చండాలుర మధ్య నివాసము చేసిన పిమ్మట ఇది జరిగిందటారు కథకులు. కానీ రామానుజులు వింధ్యాటవీ ప్రాంతమునుంచి కంచికి చేరిన విధం. కాంచీ పూర్ణుని శిష్యరికం ఆయనకు నిజనిర్ధారణ కలిగించాయన్నది తార్కిక సత్యం.

దాశరథి రామానుజులకు వరుసకు మేనల్లుడు. ఆయన రామానుజుల మొదటి శిష్యుడు. తెలుగు వాడు, తెలివైన వాడు. పట్టు, తల రెండూ కలిపి పట్టుదల పెంచుకున్న వాడు. దాశరథి రామానుజుని శిష్యునిగా చేరినాక, కూరేశు డనే ఆయన శిష్యుడై, రామానుజ భక్తుడు అయినాడు. అతనికి రామానుజులు అష్టాక్షరీ మంత్ర రహస్యాన్ని వివరించారు. దాశరథి మొదటి శిష్యుడైనా అతనికి ఉపదేశించ లేదు. ఆయన చెప్పిన కారణమొకటే. "నీవు నాకు మేనల్లుడివి. ఇది నేర్చుకొనే సమయములో నీవు చేసిన తప్పులను మన చుట్టరికం కప్పేస్తుంది. బోధన సరిగా సాగదు. అందు వల్ల నీవు ఇంకొక చోట నేర్చుకొంటే మంచిది." ఆ మాట ప్రకారం దాశరథి కొన్ని చోట్లకు వెళ్ళాడు.

రామానుజుల గురువైన గోష్ఠీపూర్ణుడు చివరకు, నారాయణ మంత్రము రామానుజులు తప్ప ఇంకెవ్వరూ చెప్ప సమర్థులు కారు అని తెగేసి చెప్పారు దాశరథికి. తిరిగి తిరిగి దాశరథి మరల రామానుజుల దగ్గరకు వచ్చి జరిగిందంతా విన్న వించాడు. ఆ సమయములోనే రామానుజునికి పీఠమెక్కే ముందు తర్ఫీదు ఇచ్చిన గురువు మహాపూర్ణుని కూతురు అతుల అనే ఆమెకు అత్తింటి ఆరళ్ళు భరించలేనంత తీవ్రమయినాయి. తండ్రి మహాపూర్ణుడు ఏమీ చేయపాలుపోక, రామానుజుని దగ్గరకు వెళ్ళి సలహా అడగమన్నాడు. ఆమె సోదరుడైన ఆచార్యుని దగ్గర మొర పెట్టుకుంది. అదే సమయంలో దాశరథి విన్నపాలు వింటున్నాడు రామానుజులు.

తను మేనమామ కాబట్టి తన బోధనను తేలికగా తీసుకొంటాడేమోనన్న శంక తీర్చుకోడానికి అతుల సమస్యలో పరిష్కారం కనుపించింది. దాశరథితో ఇలా అన్నారు ఆచార్యులు. "దాశరథీ ఈమె నాగురువు మహాపూర్ణుని కూతురు అంటే నా చెల్లెలు. ఈమె అత్తింట అనవసరమైన కష్టాలకు లోనవుతుంది. అత్తమామలను శిక్షించడం కంటే ఈమెను రక్షించడమే మన కర్తవ్యం. దాని ద్వారా వారికి

కనువిప్పు కావాలి. ఈమెను వారు, ఈమె తండ్రి మహాపూర్ణుని నుంచి ఒక వంటాయనను సేవకుడుగా తీసుకొని రమ్మని ఇంటినుండి పంపేశారు. సర్వ సంగ పరిత్యాగి, నా గురువులు ఎక్కడినుంచి తెస్తారు? ఆయన ఈమెను నా దగ్గరకు పంపించారు. నీవు నా చెల్లెలి వెంట సేవకుడిగా వెళ్ళి సేవచేసి నా చెల్లెలి కాపురము, జీవితము నిలుపు.”

అప్పటికే మహాపండితుడు, తత్త్వవేత్త అని ప్రశంసలందు కొన్న దాశరథి, మారు పలుకు లేకుండా, అతుల వెంట వంట వాడుగా వెళ్ళి అత్తింటిల్లిపాదికీ సేవకుడై స్థిరపడ్డాడు. కాలం గడచిన కొద్దీ అతుల కష్టాలు దాశరథికి బదిలీ అయినాయే కానీ వారి మనసులు మారలేదు. ఒక రోజు ఇంటి ముందు ఒక పండితుడు గీతా గోష్ఠి చేస్తున్నాడు.

అందరితో పాటు దాశరథి కూడా వింటున్నాడు. క్షేత్రజ్ఞ యోగములోని కొన్ని శ్లోకాలకు విపరీత, అపహాస్య వ్యాఖ్యలను విని దాశరథి, ఊరుకోలేక నిర్ద్వంద్వంగా ఖండించారు. ఖండనకు అనేక ఉపనిషత్తుల నుంచి, ఆండాళ్ తిరుప్పావై నుంచి అద్భుతి చూపాడు. అతుల అత్త మామలు “వంట వాడివి వంట చేసుకొనక గోష్ఠికి రావడం, అందునా వాదనకు దిగడం, ఎంత పొగరు” అని గర్జించారు. అయినా చెప్పేది భగద్విషయము, ఆ సందర్భములో ఉచ్చనీచాలు దొరలు బానిసలుండరని తన వ్యాఖ్యానం కొనసాగించారు. శ్రోతలందరూ, వ్యాఖ్యానము చేస్తున్న పండితునితో సహా, మంత్ర ముగ్ధులై దాశరథి వ్యాఖ్యానం విన్నారు. విని ఇంత మహానుభావుడు ఇక్కడ ఇట్లా పని చేయడమేమిటి అని ఆశ్చర్య పడి అసలు విషయం తెలిసి, అతుల అత్తమామలకు తగిన బుద్ధి చెప్పారు. అంతేకాక, అంతా కలిసి రామానుజుల దగ్గర దాశరథి స్వామిని, ఆ సేవక వృత్తి మాన్పించి మీ దగ్గరకు తీసుకోండి, మీ ఆజ్ఞ అయితే కాని ఆయన కదలడు అని మొర పెట్టుకొన్నారు. రామానుజులనుగ్రహించి, దాశరథిని అక్కున చేర్చి, నారాయణ మంత్ర సారము బోధించారు. దాశరథి సేవ ఆయనకు గురువు పెట్టిన పరీక్ష, అతులకు విముక్తి కూడా.

**రామానుజుల పర్యటన :** రామానుజుల కర్ణాటక అంతా (మేల్కోట, బేలూరు, హాలిబీడు) విస్తృతముగా సంచరించి విశిష్టాద్వైతము వైవిధ్యాన్ని ఎరుక పరిచారు. అంతే గాక విశిష్టాద్వైతము పూర్వ సహోదరులు, ప్రస్తుత కళింగ ప్రాంతీయులు (ఇప్పటి గోదావరి నుంచి, మహానది వరకు)న్న చోటుకు పయనించి, విశిష్టాద్వైతం జ్యోతి ప్రజ్వలనం చేశాడు. పశ్చిమ గోదావరి జిల్లాలో ఒక నృసింహ క్షేత్రములో ఇప్పటికీ అర్చకత్వము ఇప్పటి సేకు వారిదేనంటే అది రామానుజ విశిష్టాద్వైతము చోదితమే.

శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మము లో ఇప్పటికీ రామానుజ శాసనాలున్నాయి. సింహాచలమును రామానుజులు దర్శించి ఉద్ధరించారన్నది నిర్వివాదము. విశాఖపట్నము దగ్గర గుడి లోవ అనే ప్రాంతములో చాలా ప్రాచీన “రంగనాథా” లయంవుంది. నా అంచనా అది రామానుజులు శ్రీకూర్మము నుంచి, సింహాచలము వెళ్తున్నపుడు ఆ ప్రయాణమునకు స్మారకముగా వెలిసినదేనని. ధర్మకర్తలు ధర్మ భోక్తలవటంతో ఇప్పుడు దాదాపు శిథిలావస్థలో ఉంది. రామానుజులు ఏలిక కాదు కదా పీలిక పైన కూడా ఆధార పడలేదు. ఆయనకు ఏలికలు దాసో అహమ్ అన్నారే కానీ, ఏలికలకు ఆయన ఢిల్లీలో కూడా సలాము కొట్టలేదు. ఆయనకు సామాన్య మానవుడే స్నేహితుడు, పరమాత్మ ఒకడే శేషి, ఏలిక. మిగతా సృష్టి అంతా శేషమే బంటులే పరమాత్మకు. విశిష్టాద్వైతమంతా ఈ శేషి-శేష స్ఫూర్తియే. **భాష కాదు భావమే ముఖ్యమన్న ఆళ్వార్ల మనసెరిగినాయన.**

**ఆయన చివరి సందేశములు :** జ్యోతిష్ శాస్త్రము వేదాంగమే కాని, దాని వినియోగము వేద ప్రామాణికముగానే ఉండాలన్నారాయన. జ్యోతిష్యము, ఒక దేశ, ప్రాంత వాసులకు మంచి చేయ తలపెట్టిన పనికి స్థలము సమయము నిర్ణయించడానికే గాని జాతకాలలాంటి భవిష్యద్వాణులతో వ్యక్తి గతంగానూ, పరంగానూ ఉపయోగించ రాదన్న వైదిక సూత్రము మరువ వద్దన్నారు. అందులోని దత్తాంశాలు (lattitude, longtitude, time of birth) ఎవరూ ఖచ్చితంగా నిర్దేశించ లేరని, అందువలన ఆ దత్తాంశాలతో సాధించే ఫలితాలు వ్యక్తికన్వయించినపుడు మొదటిలో బాగున్నా పోను, పోను ఘ్నుత (Chaos) కు దారితీస్తుందని ఆయన శాస్త్రీయ తర్కము. పైగా స్వార్థము లేకుండా చేసిన పనికే సరిఅయిన ఫలితము. కాబట్టి జాతకాలవంటి వాటిని పక్కన బెట్టమని, పరమాత్మను తెలుసుకోవాలనుకునే వాడికి చెయ్యాలే కాని, భవిష్యత్తుకు పెట్టుబడిగా చూడవద్దని, ఆయన చివరి సందేశాలు.

రామానుజులు ఆయన తోటి, విశిష్టాద్వైతము 1137 CE లో అస్తమించారు. మి

ఆచార్య సముద్రాల వేంకటకృష్ణ, ఫోన్ : 9490743829

భారతీయ కావ్య మీమాంస :

# నన్నయ్య నవ్యత

– గంగిశెట్టి లక్ష్మీనారాయణ

ప్రతి దేశ సాహిత్యమీమాంస లోనూ సాహిత్య సిద్ధాంత కర్తల దృక్పథాలకు ఎంత ప్రాధాన్యముంటుందో, ఆ జాతి మహాకవుల దృక్పథాలకు కూడా అంతే ప్రాధాన్యముంటుంది. సిద్ధాంతాలు వేరు. కవి దృక్పథాలు వేరు. సిద్ధాంతాలు స్థూలమైనవి. వాటిని తన లక్ష్యాలకు అనుగుణంగా మలుచుకొని, మార్చుకొని, అవసరమైతే కొత్తవి కూర్చుకొని కవి తన కావ్య రచన సాగిస్తాడు. సిద్ధాంతకర్తలైన శాస్త్రకారులు వేరు. మహాకవులు వేరు. నిజమైన కావ్యకళానుభవం వారిదే. ఎక్కడ శాస్త్రం సమగ్రంగా ఉందో, ఎక్కడ పూరణ ఇంకా అవసరమో గ్రహించే అనుభవం, ప్రతిభ, దర్శనం వారి సొత్తు. ఆ భావ సంపన్నతతో, ఉన్నది అసమగ్రంగా ఉందను కొన్నప్పుడు, కావలసిన రీతిలో దాన్ని సరిచేసుకొని–తమ మార్గాన్ని తామే నిర్మించుకొని ముందుకు సాగుతారు. తరువాతి వారికి అదే మహామార్గమౌతుంది. అలాటి మహాకవుల దర్శనాలతో సాహిత్య చింతన విస్తృతి పొందుతుంది. నన్నయ తెలుగుకు మహామార్గ ప్రవక్త, యుగకర్త.

ఆదికవి అనే మాట ఇవ్వాళ, రేపూ వివాదాస్పదంగా మారిపోయినా, లభిస్తున్నంతమేరకు తెలుగులో నన్నయదే తొలి రచన. అత్యంత విస్తృత ప్రణాళిక ఉన్న, సంకీర్ణ ప్రక్రియా రూపమైన మహాకావ్యరచన. ఆ నాటికి తెలుగులో కావ్యమీమాంస లేదన్నది పునరుక్తి. సంస్కృతంలో అలంకార శాస్త్రయుగమన్న దొకటి ప్రత్యేకంగా ఏడవ శతాబ్దిలో మొదలై, దేశానికే గర్వకారణ మయ్యేటంత అత్యున్నత స్థితిని ఆయన కాలానికే పొందింది. ప్రధాన సిద్ధాంతాలన్నీ వచ్చేశాయి. వాటిల్లో చివరిదైన ఔచిత్య విచారాన్ని ప్రతిపాదించిన క్షేమేంద్రుడు కొద్ది అటూ ఇటూగా సమకాలీనుడు. వారి మతాలన్నిటినీ గౌరవిస్తూనే, అవి తన ప్రణాళికకు 'చాలవు' అని చెప్పకుండానే, కొత్త సిద్ధాంతస్థాపనకు దిగకుండానే, భారతీయ కావ్య మీమాంసకే సవరణల వంటి అతి ముఖ్య అంశాలను, కొత్త దిశా నిర్దేశాల వంటి అంశాలను ప్రతిపాదించాడు నన్నయ. మనం ఆయన మాటలను చాలా పరిమిత పరిధిలోనే చూడటానికి అలవాటుపడ్డాం కనుక, దురదృష్టం కొద్దీ ఆయన విడిగా అలంకార శాస్త్రగ్రంథం ఏదీ రాయలేదు కనుక, ఆయన మాటల విలువను, అర్థ పరిధిని సంపూర్ణంగా గుర్తించలేక పోతున్నాం.

'మృదు మధుర రసభావ భాసుర నవార్థ వచన విశారదులైన మహాకవులు' అని సమకాలీనులను భూషించడంలో సమకాలీన సాహిత్య మర్యాదలను కూడా ప్రస్తుతించిన నన్నయ, తన రచనా దృక్పథాలుగా ప్రత్యేకం చెప్పిన మాటలు రెండు– 'ప్రసన్న కథాకలితార్థయుక్తి', 'అక్షర రమ్యత'. రచనకు గుణంగా పేర్కొన్నది, తనకు భూషణంగా భావించినది 'నానా రుచిరార్థ సూక్తి నిధిత్వం'. రచనా ప్రయోజనంగా నిర్దేశించినది, 'జగద్ధితం'. ఈ నాలుగు మాటలు ఆయన కావ్యతత్త్వానికి సూచికలన్నది సుప్రసిద్ధమే.

ఇందులో మొదటి రెండు మాటలు మరీ కీలకంగా ప్రసిద్ధి పొందాయి. సాహిత్యానికి ప్రథమ నిర్వచనమైన 'శబ్దార్థ సహితౌ సాహిత్యమ్' అనే మాటల్లోని పదాల క్రమాన్ని మార్చి వాటిని 'గుణీకరించి' చెప్పినట్లు కొందరనుకోవచ్చు. కన్నడ ఆదికవి పంప వాడిన 'లలితపదముం, ప్రసన్న కవితెయుం' అనే మాటలనే కొంత మార్చి, కొంత పెంచి చెప్పినవే కదా అని కొందరనుకోవడమూ కద్దు.

అలా కాక, వాటిని నన్నయగారి స్వకీయ 'శాస్త్రీయ పరిభాష'గా గుర్తించినవారు, విపులంగా వాటిపై లోతైన పరిశోధనలు చేసి, ఆయన విశిష్టతను నిరూపించి చూపారు. ఆయన కథాకథనంలోని లోతూ, రమ్యత ఎలాటివో, ఆ పరిభాష ఎంత సార్థకమో విపులంగా అన్వయించి చూపారు విశ్వనాథవారు.

నన్నయ రచనాపరిధిలోనే వాటిని అన్వయించి చూడడం ఒక పద్ధతి. భారతీయ అలంకార శాస్త్రపరిధిలోకి వెళ్ళి, దాని వికాస నేపథ్యంలో ఆ మాటల విలువను పరిశీలించడం ఒక పద్ధతి. అప్పుడుగాని, 'శాస్త్ర పరిభాష'గా వాటి విశిష్టత, ప్రత్యేకత, నన్నయ మౌలికత అర్థం కావు.

* * *

భారతీయ సాహిత్య చింతనకు జీవ స్రోతస్విని *భరత నాట్యశాస్త్రం.* ఆ తరువాత ఆరేడు వందల సంవత్సరాల వరకు మరే సిద్ధాంత శాస్త్ర గ్రంథమూ రాలేదు. ఆ మధ్య కాలంలో అశ్వఘోష, కాళిదాస, భారవి, భాసాదిమహాకవులు సందర్భ వశాత్తో, ప్రాస్తావికంగానో చెప్పిన మాటలే నాటి సాహిత్య చింతనకు సూచకాలు. ఏడవ శతాబ్దంలో పాతికేళ్ళు అటూ ఇటూగా అటు కాశ్మీరం నుంచి భామహుడూ, ఇటు కాంచీపురం నుంచి దండి ఒకే ప్రణాళికతో, చాలా కొద్ది పాటి తేడాతో అలంకార శాస్త్ర గ్రంథాలను వెలువరించారు. అంటే, ఆ నాటికి ఆసేతు పర్యంతం ఏకరూపంగా అలంకార శాస్త్రచింతన అఖండంగా సాగుతున్నదనీ, దానికి సంకేతమే వారి ప్రణాళికల్లోని ఏకరూపత అనీ స్పష్టమవుతోంది. భామహుడు మేధావిరుద్రుడనే పూర్వుణ్ణి పేర్కొంటాడు. బహుశా ఒక శతాబ్ది పూర్వుడేమో. అతని రచన కాని, ఇతరుల రచలను కానీ ఏవీ దొరకడం లేదు. ఉద్దండ రచనలేవీ దొరకక పోయినా, శాస్త్ర సంప్రదాయం మాత్రం ఉద్దండంగా ఉందనడానికి దండి, భామహ రచనలే ఉదాహరణ. వారితో మొదలైన అలంకార శాస్త్రయుగం అటు పిమ్మట ఉద్భట, వామనులతో, రుద్రట, రాజశేఖరులతో విస్తరిల్లి ఆనందవర్ధనునితో శిఖరస్థాయినందుకొంది. ఆ శిఖరం ఔనత్యాన్ని చూపడానికి ప్రయత్నించిన అభినవగుప్తపాదునితో మరింత ఉన్నత పదాన్ని చేరుకొంది. వక్రోక్తి సహితంగా గుణాలంకార, రీతి, ధ్వని, రస ప్రస్థానాల వంటి ముఖ్య మార్గాలన్నీ ఆవిష్కృతమయ్యాయి. ఆఖరిదైన ఔచిత్య విచారం నన్నయకు కొద్ది ముందుగా వచ్చిందే. పదకొండవ శతాబ్ది నాటికి అలంకార శాస్త్రం ఉచ్చస్థితిలో ఉంది.

ఇక్కడ గుర్తించవలసిన ముఖ్యమైన అంశం ఒకటుంది. సాహిత్యానికి/కావ్యానికి ప్రాణభూతంగా వారు చెప్పిన ముఖ్య లక్షణం ఏమిటి? నన్నయ తొక్కుతున్న కొత్త మార్గం తీరూ, తత్త్వం ఏమిటి? వారు చెప్పిన గుణ, రీతి, ధ్వన్యాదాలు గొప్ప సిద్ధాంతాలే, కావ్యానికి ప్రాణం పోసే లక్షణాలే. అయితే కావ్యం కావ్యంలా రూపుదాల్చేది దేనివల్ల? లోకానికి, ప్రజానీకానికి చేరువయ్యేది దేనివల్ల?

ఆకర్షతే ఇతి చమత్కార: ... చమత్కార ప్రధానమైంది అలంకారం. ఉక్తి వైచిత్రి వల్ల, అర్థచ్ఛాయల వల్ల శోభించేది అలంకారం. కవితకు అందం ఆ అలంకారమే. ఆ మాట సొగసే, ఆ పదచిత్రాల చమత్కారమే అనే భావంతో కావ్యానికి శోభను పెంచే గుణ, దోషాలను వివరించి, ప్రత్యేకంగా వివిధ రీతుల అలంకారాలను నిరూపించి చూపారు దండి, భామహులు. ఉక్తిలో దండి స్వభావోక్తి పట్ల మొగ్గు చూపితే, వక్రోక్తిని సంక్షిప్తంగా ప్రతిపాదించాడు భామహుడు. దాన్నుంచి స్ఫూర్తి పొందుతూ, ధ్వని సిద్ధాంతాన్ని అతి విశిష్టంగా భారతీయాలంకార శాస్త్రానికే మకుటాయమానంగా ఆవిష్కరించాడు ఆనందవర్ధనుడు. దాన్ని, ముఖ్యంగా అందులోని రసధ్వనిని వివరిస్తూనే సాహిత్యరంగంలో రస ప్రాధాన్యానికి తిరుగు లేని పట్టం కట్టాడు అభినవగుప్తుడు. ఇవన్నీ కావ్యానికి ప్రాణభూతమైన జీవలక్షణాన్ని వివరించే సిద్ధాంత చర్చలే. కాని సమగ్రమైన కావ్యమంటే ఏమిటి అనే మాటకు ఇవి సమాధానం చెబుతాయా? ప్రాణిలో రూపం, ప్రాణం ఎలా వేరు వేరుగా చూపడానికి వీలు కాకుండా ఉంటుందో, కావ్యం అంటే కూడా అలా విడదీసి చూపడానికి వీలుగాకుండా ఉండాలి. విడదీసి 'చూపడం' శాస్త్రచర్చకు, శాస్త్రకారుల చర్చకు; సమగ్రంగా, సమేకంగా 'చూడడం' లోక ఉపయోగానికి, లౌకిక ప్రజానీకానికి. ఎందులోనైనా శాస్త్రదృష్టి వేరు. లోకదృష్టి వేరు. 'లోకజ్ఞుడ'నని తన్ను తాను ప్రకటించుకొన్నవాడు నన్నయ.

ఇక్కడ మరో ముఖ్య విషయం కూడా ఉంది... ఒక్క దండి తప్ప, మిగిలిన వారందరూ ఔత్తరాహులే. అందునా రాజశేఖరుని వంటి వారొకరిద్దరు తప్పితే భామహుడి నుంచి క్షేమేంద్రుడి దాకా, అటు పిమ్మటి మహిమ, మమ్మటాదులతో సహా అధికశాతం అలంకార శాస్త్రవేత్తలు కాశ్మీర దేశ వాసులే. దండి ఒక్కడే దాక్షిణాత్యుడు. తెలుగు నేలకు సాంప్రదాయకమైన దక్షిణపుటెల్లగా గుర్తించబడే కాంచీపురానికి చెందినవాడు. అసలు సిసలైన తెలుగు వాడు... అలంకార శాస్త్ర వేత్తలందరూ కావ్యమీమాంసలో ఉక్తివైచిత్రినే ప్రధానంగా గణిస్తూ ఉక్తిసంవాదాన్ని పెంచి

ప్రదర్శించిన వారే. బహు విధాల అలంకారాలను ఆవిష్కరించినవారే. అలంకార శాస్త్రమంటే లేదా కావ్యమీమాంస అంటే ఒక కథను అందంగా కవిత్వీకరించి చెప్పడంలోని నేర్పులు అనే భావన వెనక్కు పడిపోయింది. కథాసహితమైన కావ్యనిర్మాణంలో కనిపించే సమగ్ర సౌందర్య శిల్ప సమీక్ష అనే ఆలోచన కరువైపోయింది. బహుశా ఆ సమగ్ర దృష్టి భరతునితో మొదలై ఆయనతోనే ఆగిపోయిందా అనే సందేహమూ కలుగుతుంది. భరతుడు కూడా కాంచీపురవాసి అంటారు.

సుందరంగా వర్ణితమైన కథాప్రసంగమే కావ్యం అనే దృష్టి కంటే, మాటను అందంగా మలిచి చెప్పడమే కావ్యం, కావ్యకళ అనే దృష్టి భరతానంతర అలంకారికుల్లో పెరిగింది. అంటే కథ మీది కంటే, ఉక్తి చమత్కారం మీద ప్రాధాన్యం పెరిగింది. అలంకారమనే మాట ఆ చమత్కారానికే పరిమితమై పోయింది. కావ్యం, కావ్యకళ అనే రెండు మాటల మధ్య అస్పష్టత అప్పటికి బాగానే పాదుకొని ఉందనడానికి బ్రాహ్మణ పండితులతో పాటు, జైన పండితులు కూడా పేర్కొన్న చతుష్షష్టి కళావిభాగాల్లోని కావ్యకళా సంబంధమైన పేర్లే సాక్షి. దీర్ఘ కథా ప్రబంధ కావ్యానికి ఏకమాత్ర శ్లోక/పద్య పరిమితమయ్యే లఘు కావ్యానికి (కవితకు) మధ్య పెద్ద తేడా లేదనడానికి ముక్తకం నుంచి ప్రబంధం దాకా ఒకే వర్గంగా చూసిన వారి చూపే సాక్షి. ఆనందవర్ధనుడు మాత్రం లఘు, ఖండ కవితా భేదాలకు, దీర్ఘ కథాబంధ కావ్యభేదాలకు వర్గవిభాగ కల్పనను నామమాత్రంగా చేశాడు. లోచన వ్యాఖ్యలో అభినవగుప్తుడు వాటిని దృష్టాంతసహితంగా చూపించాడు. అంతే కాని కావ్యనిర్మాణపరంగా వాటి లక్షణాలను విశ్లేషించి, వివరించలేదు.

భరతుడు కథాసహితకావ్యాలన్నిటికి అన్వయించేలా చెప్పిన సంధులను కూడా స్పృశించలేదు. భరతుని పిమ్మట సంధి-సంధ్యంగ- వృత్తి, రస, భావాదులను ప్రత్యేకంగా ప్రస్తావించినవాడు దండి ఒక్కడే. 'చంపూకావ్యా'న్ని కూడా తొలిసారిగా ప్రస్తావించింది ఆయనే. చంపు అంటే గద్య పద్యాత్మకం అంటూ దాటేస్తున్నాము కాని, అది కథాసహితాత్మకమా? కదా? అనే ప్రశ్నను పట్టించుకొన్నది లేదు. ( ఈ 'చంపూ' అనే మాటే శుద్ధ దాక్షిణాత్య భావన. చెన్+పూ = చెంపూ, చంపూ) దండిని అనుసరించిన 9వ శతాబ్ది నాటి కన్నడ కవిరాజమార్గకర్త కావ్య నిర్మాణ తత్త్వాలను స్థూలంగా స్పృశించడం అటుంచి, 'ధ్వనివెంబళంకారం' అంటూ ధ్వనిని ఒక అలంకార మాత్రంగా, కావ్యానికి ముఖ్యమైన మూడు అలంకారాలలో ఒకటిగా మాత్రం చెప్పి ఊరుకొన్నాడు. **అంటే ఇక్కడ కావ్యతత్త్వ వివేచనలో ఉత్తర-దక్షిణాది భేదమొక్కటి స్పష్టంగా కనబడుతోంది. ఔత్తరాహులు ఉక్తి చమత్కార ప్రధానమైన అలంకారవివేచనకే ప్రాముఖ్యమిస్తే, దాక్షిణాత్యులు కావ్యనిర్మాణ అంశాన్ని కూడా దృష్టిలో ఉంచుకొన్నారు.** వాటిని గాఢంగా వివేచించక పోయినా, ప్రాధాన్యక్రమంలో పేర్కొన్నారు.....

ఉక్తిచమత్కారం మీద కాశ్మీరవాసులు అంత ప్రాధాన్య మివ్వడానికి కారణమేమిటి?... సాహిత్య మీమాంస చరిత్రలో చూడవలసిన మరో ముఖ్యమైన విషయం ఇది!

వ్యవస్థీకృత రాజ్య శక్తి-లౌకిక ప్రయోజనాల కోసమో, స్వప్రయోజనాల కోసమో లేదా పోషణ కారణంగానో సాంస్కృతిక నియంత్రణ విధానమొకదాన్ని పాటిస్తుంది. రాజ్యాధికారశక్తి లేదా రాజాస్థానం (కోర్టు) బలపడేకొద్దీ ఈ విధానం కూడా బలపడుతుంది. అది తన అధికార ప్రయోజనాలకెంత మేర అవసరమో అంతదాకా సాంస్కృతిక రూపాలను, వాటి వికాసాలను నియంత్రణ చేస్తుంటుంది. రష్యాలాగా, ప్రాచీన భారతం కళారూపాలను తన ప్రచారసాధనాలుగా తన వాడకం కోసం తయారుచేసుకోలేదు. తన ప్రయోజనాల కవసరమయ్యే మేరవరకే, రాజస్థితిపట్ల పూర్తి విధేయత ప్రబోధించేవరకే, తన నియంత్రణ స్వభావాన్ని చూపింది కాని, ఆ పరిధి దాటాక పూర్తి స్వేచ్ఛను, స్వయంప్రతిపత్తిని, ఏ పన్నులూ, కప్పాలు లేని పోషణనూ కల్పించింది. అందుకే ఆ కాలపు శాస్త్ర, సాహిత్య, కళా రంగాలు తమ పద్ధతిలో తాము సంపూర్ణ వికాసాన్ని పొందాయి. ప్రాచీన భారతావనికి ప్రపంచంలోనే ప్రత్యేక గౌరవాన్ని సముపార్జించి పెట్టాయి. రాజ్యశక్తే కనుక తన పరిధికి మించిన నియంత్రణ చూపి ఉంటే ఆ ఉన్నత స్థాయి సాధనలు సాధ్యమయ్యేవి కాదు. సంస్కృతికి సంబంధించిన అన్ని రంగాలలోనూ ప్రాచీన భారతం ఓ కొత్త శిఖరాన్ని అధిరోహించింది గుప్తుల కాలంలోనే.

దేశంలో రాజ్యశక్తి అన్నది, ఓ కేంద్రశక్తిగా కొత్త రూపు తీసుకోవడం మొదలుపెట్టింది మౌర్యుల కాలంలో అయినా,

అది బలంగా వేళ్ళూని నిలిచింది గుప్తుల కాలంలోనే. గుప్తులకు ఒకటి, రెండు శతాబ్దుల ముందూ, ఆ తర్వాత రెండుమూడు శతాబ్దాలూ భారతీయ సాంస్కృతిక చరిత్రకు స్వర్ణయుగంగా మారింది. దరిమిలా రాజాస్థానం శాస్త్ర, కళ రంగాలకు ప్రధాన పోషక స్థానమైంది. రాజసభా వినోదాలకోసం ప్రత్యేక సంప్రదాయాలు, శైలులూ మొదలయ్యాయి. విద్వజ్జన వైఖరికి, సామాన్య ప్రజా వైఖరికి తేడా మొదలై, కాలక్రమంలో అంతరం పెరగసాగింది. ఆ విద్వద్రాజ శైలికి సంబంధించిన ప్రత్యేక శాస్త్ర రూపీకరణలూ మొదలయ్యాయి. సంక్షిప్తంగా చెప్పాలంటే సరిగ్గా ఆ నేపథ్యంలో మొదలైంది అలంకార శాస్త్ర యుగం. రాజాస్థానాల్లోని కావ్య చమత్కారాలాకు, విద్వజ్జన సభారంజనే లక్ష్యంగా ఉన్న కావ్యరూపాలకు అనుగుణంగా శాస్త్రచర్చలు సాగుతూ, అవే అలంకారశాస్త్రాల్లో ప్రధాన స్థానమాక్రమించడమూ జరిగింది.

కాశ్మీరంలో ఏకారణం చేతో కానీ, రాజశక్తీ, విద్వద్రాజసభా మరీ బలంగా వేళ్ళూని నిలబడ్డాయి. మగధ ప్రాభవానంతరం, ప్రాచీన చారిత్రక యుగాంతం దాకా, అంటే తొమ్మిది, పది శతాబ్దాల పర్యంతం, శాస్త్ర, కళా, విద్యలకు కాశ్మీరమే పెట్టింది పేరు. ధార్మిక విద్యలకు, వాటి అధ్యయనాలకు అది పట్టుగొమ్మ. దక్షిణం నుంచి శంకర, రామానుజ ప్రభృతులు బ్రహ్మసూత్రాల అధ్యయనానికి కాశ్మీరమే వెళ్ళారు. స్వయంప్రతిపత్తి కలిగిన శాస్త్రవిద్యావికాసంలో కేవల సైద్ధాంతికమైన చూపు ప్రాధాన్యం వహిస్తుంది. పై చేతి వాటం చూపుతుంది. ఆ లక్షణం వల్ల కొంతా విద్వద్రాజసభామర్యాద వల్ల కొంతా ఎంతో విపులార్థంలో, కావ్య సమగ్ర సౌందర్యానికే పర్యాయంగా ప్రతిపాద్యమైన అలంకారం, తన విస్తృత పరిధిని కోల్పోయి, ఉక్తి చమత్కార విశేషానికే పరిమితమై పోయింది. కావ్యానికి ప్రాణం పోసే లక్షణం ఏది? అనే ప్రశ్నకు సమాధానం ఆ ఉక్తి చమత్కారం చుట్టే ఎక్కువగా తిరుగ సాగింది. దేని మీదైనా నొక్కుడు ఎక్కువయ్యాకే కదా ఔచిత్యం గురించి మొదలయ్యేది!

నన్నయ కాలానికి అది బాగా గట్టిపడిందనడానికి తార్కాణమే క్షేమేంద్రుని రచన. ఇదంతా ఔత్తరాహపు పోకడ. ఆ భావధారే దేశమంతా నడిచిందనడానికి, కొంచెం అటూ, ఇటూగా సమకాలికులైన ఉత్తరాది భామహుని రచనకూ, దక్షిణాది దండి రచనకూ ప్రధాన భాగంలో సారూప్యత ఉండటమే తార్కాణం. అయితే దండి పాటించిన రచనా విస్తృతి, అందులోని ప్రత్యేకత, ఆ తర్వాతి వారిలో అది కనపడకపోవడం వంటివి ఒక దాక్షిణాత్య సంప్రదాయాన్ని గుర్తించడానికి దోహదం చేస్తున్నాయి. దాని విపుల పరిశీలన ఈ వ్యాసపరిధికి మీరినట్టిది కనుక, దాన్నలా ఉంచితే నన్నయ తనదాకా ఉన్న ఆ ఔత్తరాహ సంప్రదాయ మర్యాదలను గౌరవిస్తూనే, కావ్యానికి ప్రాణభూతమైన అంశం మీద, వాటిని అంగీకరించలేక, తనదైన రచనా దృక్పథాన్ని, తన కొత్తమార్గాన్ని ప్రతిపాదించాడు. ఏ ఆర్భాటమూ లేకుండా, ఏ సైద్ధాంతిక చర్చలోకి దిగకుండా అతి సంక్షిప్తమైన నాలుగే నాలుగుమాటల్లో ప్రస్తావించాడు... వివరంగా చూస్తే కాని ఆ కావ్య సిద్ధాంతం, దాని నవ్యత స్పష్టం కావు.

* * *

కావ్యరూపంలో అలంకారికులు ముందు శబ్దాన్ని పేర్కొని, తర్వాత అర్థం (శబ్దార్థ సహితౌ) లోకి వచ్చారు. సహజమే. శబ్దాన్ని బట్టే కదా అర్థం ఉండేది. కాని నన్నయ 'ప్రసన్న కథా కలితార్థ యుక్తి' అని, ముందుగా అర్థాన్ని పేర్కొని, తర్వాత శబ్దాన్ని 'అక్షర రమ్యత'లో సంభావించడన్నది స్పష్టమవుతుంది. లోకప్రసిద్ధమైన క్రమాన్ని నన్నయ ఎందుకు మార్చాడు? భాషాప్రపంచంలో శబ్ద ప్రథమ ప్రాధాన్యాన్ని ఎందుకు గుర్తించలేదు? అనే ప్రశ్న సహజంగా ఉత్పన్నం కావాలి. నిజంగా ఆయన శబ్ద ప్రాథమ్యాన్ని గుర్తించలేదా? లేదా శబ్దాన్ని ఇతరుల కంటే భిన్నంగా, లోతుగా చూశాడా? నిత్య వ్యవహారంలో శబ్దమంటే కేవలం అలికిడి, ధ్వనుల కలయిక. వ్యాకరణ శాస్త్ర పరిధిలో పదం. నిర్దుష్టమైన – ఏదోషమూ లేని పదం. కాని కావ్యప్రపంచంలో?...'వాక్యం రసాత్మకం కావ్యం' అని విశ్వనాథుడు అన్నప్పుడు, ఏ వాక్యం అనే వంకర ప్రశ్న ఉత్పన్నమైతే, కావ్యం మొత్తం అఖండమైన మహాకావ్యమే అని తెలిసినవారు చెబుతారు. అలాగే శబ్దం విషయంలో కూడా! విడిగా ఒక మాట నుంచి మొదలుపెట్టి, కావ్యమంతా పరచుకొని ఉన్న మాటల సముదాయమంతా శబ్దమే. 'అవిచ్ఛిన్న పదావళీ' అన్నది దాని వివరణే. ఆధునికులు ఆ విస్తృత దృష్టితోనే దాన్ని form కు సమానార్థకంగా భావిస్తున్నారు. అయితే అది రూపం తీర్పుకు పొసగేది

కాదు. content కు దగ్గరగా వచ్చేది. రెంటిమధ్యగా, ఆ inter-space లో ఉంటుంది.

కావ్య జగత్తులో శబ్దమంటే కేవల పదమూ, పదాల సమూహమూ కాదు. ఆ పదాల సమూహం దేన్ని నిర్దేశిస్తోందో అది. దాన్ని ఆనందవర్ధనాదులు ముక్తకాది లఘుభేదాలను దృష్టిలో ఉంచుకొని కాబోలు వస్తువు అన్నారు. కాని దాన్ని కూడా ఎక్కువ ప్రపంచించలేదు. ఈ విషయంలో అలంకారికులు అనిర్దిష్టంగానే ఉండిపోయారు. తొలిసారిగా నన్నయ దాన్ని స్పష్ట పరిచాడు. 'కథ' అని సూటిగా పేర్కొన్నాడు. సాహిత్యంలో శబ్దమంటే ఒట్టి ధ్వనుల సముదాయం కాదు, మాటల గుంపు కాదు. అది మొత్తంగా చెప్పే విషయం. దాన్ని 'వస్తువు' అన్నా, ఆ మాట చాలదు. దాంట్లో అస్పష్టత ఉంటుంది. ఔత్తరాహ, రాజ'సభా సంప్రదాయానికి' ఆ పరిభాష కూడా ఒక గుర్తు. ముక్తకాలు కాక, వివిధ సర్గలలోకి పెరిగిన 'సర్గబంధ' / ప్రబంధ కావ్య భేదాలలో కూడా, కొన్ని ఋతువర్ణనవంటి లఘు విషయాలకు పరిమితమైన ప్రక్రియాభేదాలు ఉన్నాయి కనుక, వాటికి కూడా అన్వయించేలా 'వస్తువు' అనే మాటను వాడారు. ఒక అనిర్దిష్ట పరిధిలోనే వాడారు. అందువల్లే అది ఎంత కావ్యశాస్త్ర పరిభాషో, అంత తత్త్వశాస్త్ర పరిభాషగా కూడా మిగిలింది. తాత్త్విక పరిభాష కాబట్టే దాన్ని ఆనందవర్ధనాదులు ప్రపంచించలేదేమో! అలా కాకుండా దృశ్య, శ్రవ్య కావ్యభేదాలుగా ద్విధా ప్రసిద్ధికెక్కిన కావ్యప్రపంచంలో కథే కేంద్రం, సమస్త కావ్యకళాదేహం.

కావ్యమంటేనే ఒక విలక్షణ నిర్మాణమున్నట్టిది. ఒక నిర్దిష్ట సామాజిక ప్రయోజనాన్ని ఉద్దేశిస్తున్నట్టిది. అది కథ వల్లనే సాధ్యం కథ అంటే కొన్ని పాత్రలు, వాటి మనోభావాలు, వాటి సన్నికర్ష, వికర్షలు, ఫలితంగా ఏర్పడే సంఘటనలు. ఇవన్నీ వాస్తవ జగత్తులోని సామాన్య జన జీవన వ్యవహారాలకు ప్రాతినిధ్య అంశాలే. లేదంటే వాటి పురానమూనాలో, కాదా పూర్ణత్వాన్నిచ్చే సంపూరక (complementary) రూపాలో! సాహిత్యరచన పరమోద్దేశమే ఈ చివరి మాట. సామాన్య జీవితంలో అపూర్ణంగా ఉన్న వ్యక్తులకు, వ్యవస్థలకు ఆ అసంపూర్ణతాభావం ఆత్మగతమయ్యేలా చేసి, పూర్ణతాభావనను పెంపొందించడమే సాహిత్య రచన ఆశయం. ఆ సంపూరక (complementation) గుణం కథ వల్లనే సాధ్యం. కథే సాహిత్యం లోని అంతర్జగత్తు. అది లేనప్పుడు వట్టి చమత్కారాల కసరత్తు. ..పాటో, పదమో అయితే తప్ప శుద్ధ జానపదుడి సాహిత్య ప్రజ్ఞ కూడా కథారూపాన్నే ఆశ్రయిస్తుంది, పొడుపుకథ నుంచి మహా వీరగాథ దాకా !

కనుక కథే కావ్యజగత్తులో ప్రథమాంశం. ఔత్తరాహుల కంటే భిన్నంగా, నామమాత్రంగానైనా, దండి తొలిసారిగా కావ్యనిర్మాణ అంశాలను స్పృశించినా, కథను కేంద్రంగా ప్రతిష్ఠించ లేదు. దాన్ని స్పష్టంగా, సూటిగా కావ్యలక్షణ సందర్భంలో ప్రధానాంశంగా పేర్కొన్నది నన్నయే. లక్షణశాస్త్రచర్చ ఆయన లక్ష్యం కాదుకనుక, తానెంచుకొన్న లక్షణాన్ని మాత్రం ముక్తసరిగా నిర్దేశించి ముందుకు సాగిపోయాడు. విడిగానే ఆయన దాన్ని చర్చించి ఉంటే భారతీయ సాహిత్య సిద్ధాంతకర్తల్లోనే ఒకడిగా ప్రాముఖ్యం పొంది ఉండే వాడు. ఆ మాట తర్వాత కాలపు తెలుగు సాహిత్యగమనానికి, తెలుగు 'ప్రబంధ మండలి'కి ఒక పెద్ద దిశానిర్దేశంగా మారింది.

కథాప్రాధాన్యం లేని కావ్యకల్పనలు, కేవలం 'సభా సంప్రదాయ' మర్యాదలకే పరిమితమయ్యాయి కాని, చరిత్రకెక్కలేదు. వివరంగా చూడాలంటే, శ్రీనాథ యుంగంలో, వేమారెడ్డి ఆస్థానంలోని తెలుగు, సంస్కృత సాహిత్య రీతుల్ని చూడవచ్చు.

శబ్దార్థాల యుగళంలోని మాటల వరుసనుమార్చడం కాదు, శబ్దం అనే మాటకున్న రెండు అర్థ పరిధుల్ని, పొరల్ని, స్వభావాల్ని వివక్షలోకి తీసుకొన్నాడు నన్నయ. మొదటి పరిధి: పై పొర-శ్రవ్యతకు, వినికిడికి సంబంధించినది. తర్వాతది పైన ఏకరువు పెట్టింది.

ఆ పదసముదాయం దేన్ని నిర్దేశిస్తున్నదో అది. కథ అని నన్నయ స్పష్టపరిచినట్టిది. ఇక్కడ శబ్దమనే మాటను మరికొంత లోతుగా చూడాల్సిన అవసరం ఉంది. ధ్వని, రసం, పదం వంటి అనేక మాటలుండగా అలంకార శాస్త్రవేత్తలు శబ్దం అనే మాటనే ఎందుకు పరిభాషగా ఎంచుకొన్నారు? ఈ విషయాన్ని వ్యాఖ్యాతలు పెద్దగా పట్టించుకోలేదు. కాని ఎంతో విశిష్టమైన అర్థగౌరవమున్న పరిభాష ఇది. భారతీయ కావ్యమీమాంసకే వన్నెతెచ్చే పరిభాష.

శబ్దమంటే ఏమిటి? 'శప్ దదాతి ఇతి శబ్ద :', ఇదీ శాస్త్రనిర్వచనం. శప్ అంటే ? హ్లాదమయమైన శమ భావన.

ఏమాట లేదా మాటల సముదాయం చెవిన పడగానే, మనసుకు హాయి కలుగుతుందో, ఆహ్లాదమైన చిత్తశమం చేకూరుతుందో అది శబ్దం. అది ఆ అలికిడి-ధ్వని వల్లా కలగాలి. అది ఇచ్చే అర్థస్ఫూర్తి వల్లా కలగాలి. అర్థస్ఫూర్తి వల్ల మరింత బలంగా కలగాలి. ఎలాగైతే ఒక విత్తనం నేల పడి, పదింటిగా పండుతుందో, అలా పదిరెట్లు ఎక్కువ పెరిగేలా కలగాలి. ఆ శమనభావనను కలిగించనప్పుడు అది శబ్దమే కాదు. ఒట్టి సామాన్య ధ్వని. సామాన్య ప్రపంచం లోని అలికిడి, మాట వేరు; వ్యాకరణ, కావ్య ప్రపంచాల్లోని మాట వేరు. వ్యాకరణ ప్రపంచంలో నిర్దుష్టమైన మాట అని మాత్రమే అర్థం. కావ్య ప్రపంచంలో నిర్దుష్టత-దోషహీనత-తో పాటు, దానికి 'గుణం' అదనంగా చేరుతుంది. కావ్యసీమలో వాటి గుణ, దోషాల తీరే వేరు. అందువల్లే దండి, భామహాదులు వాటిని అంత వివరంగా నిర్వచించారు. కాని సర్వ గుణాతిశయి, సర్వనిర్వచ నాతిశయమైంది 'ప్రసన్నత'. చిత్తశమాన్ని కూర్చే ఆ హాయిని ఎవరు ఎలా నిర్వచించగలరు?

ఒక యోగి అది కలిగే విధానాన్ని వీలైనంత మార్మికంగా చెప్పి సాధన చేసుకొమ్మంటాడు. కాని కవి ఒక చమత్కారంతో మన మనస్సుల్లోకి దించి అనుభవింప చేస్తాడు. ఒక వర్ణన చమత్కారమిచ్చే హాయి ఒక క్షణానికి, ఓ కాస్సేపటికి సంబంధించింది. అదే ఓ కథ ఇచ్చేది, అందునా ఒక ఉదాత్తమైన కథ ఇచ్చేది, అదీ కాలదేశాల అల్ప పరిధుల్ని అతిక్రమించే కథ ఇచ్చేది -అంతరంగంలోకి దిగి, మన స్వభావాలనే ప్రభావితం చేస్తూ, ఒక్కోసారి నిరంతరం వెంటాడుతూ, నిత్యం అనుభవించే హాయి నిస్తుంది. ప్రతి వ్యక్తి నిరంతరం అంతరంగంలో ఓ ఉదాత్తత కేసి పయనిస్తుంటాడు. అంచేతే నిజజీవితంలో ఉదాత్తులు కానివారు కూడా, ఓ మంచి కథను చదివినప్పుడో, చూసినప్పుడో అందులోని ఉదాత్తపాత్రలతోనే మమేకం పొందుతారు కాని, దుష్ట పాత్రలతోనో, హీన పాత్రలతోనో గుర్తింపు కోరుకోరు. హ్లాదైకమయమైన శమాన్ని – హాయిని, ఏ సాధన క్లేశం లేకుండా, ఉదాత్తభావంతో రంగరించి ఇచ్చే కవి, యోగి కంటే గొప్పవాడు. అందుకే ఋషితుల్యునిగా గౌరవింపబడ్డాడు. అలాటి హ్లాద ప్రవర్ధమానమైన మాటే శబ్దం. అది ఉదాత్తమైన, నిండైన కథ తోనే సాధ్యం. కథ ఒక దృష్టాంతం. దాని వెనుక మన జీవితాలకవసరమయ్యే సందేశాన్ని, స్ఫూర్తిని ఇచ్చే ఒక జీవితానుభవముంటుంది. దాన్ని సలక్షణంగా మన చిత్తాలకు హత్తుకొనేలా ఆవిష్కరించేదే 'ప్రసన్న కథ'. శబ్ద తత్త్వాన్ని పూర్ణంగా సాధన చేసిన 'శబ్దశాసనుడు' కనుక నన్నయ, అలంకార శాస్త్రవేత్తలు ప్రథమంగా వాడిన శబ్దాన్ని అలాగే వాడకుండా, దాని స్థానే, దాని తత్త్వం సంపూర్ణంగా ఆవిష్కృతమయ్యే 'ప్రసన్న కథ' అనే సముచ్చయ శబ్దరూపాన్ని వాడాడు. అది కావ్యప్రపంచానికి నన్నయ ఇచ్చిన కొత్త పరిభాష. మధ్య యుగాంతం దాకా తెలుగు కవులందరూ ఆ పరిభాష భావాన్ని పట్టుకొని తెలుగుకావ్యజగత్తును తీర్చిదిద్దిన వారే. ఆ తర్వాత సాహిత్య కళాతత్త్వం మారింది.

పరిభాషగా 'ప్రసన్నత' శబ్దాన్ని మరికొంత లోతుగా చూసే అవకాశమూ ఉంది. పూర్వ యుగీన (early historical period) భావజాలానికి సంబంధించిన పరిభాష అది. సంక్షిప్తంగా చెప్పాలంటే 'క్లాసిసిజం' అభివృద్ధి పరచిన ముఖ్యమైన ఉత్తమ (పాజిటివ్) భావజాలాల్లో అదొకటి. ఏ భాషలోనైనా 'క్లాసికల్ లిటరేచర్' సాధించిన పరిణతికి అదో కొండ గుర్తు. పాశ్చాత్య దేశాలలో కూడా, నిరంతర నగరాల మధ్య అంతర్యుద్ధాలతో కొట్టుకు చచ్చిన గ్రీకుల అనంతరం, రోము సామ్రాజ్య అవతరణానంతరం, చోటుచేసుకున్న భావపరిణతికి సూచకంగా లాంజినస్ నోటివెంట 'సబ్ లైమ్' (Sublime) సిద్ధాంతం వెలువడింది. గ్రీకు, రోమనులది వెరసి పాశ్చాత్యుల 'క్లాసికల్' సాహిత్యం. సబ్‌లైమ్ కు అర్థం ప్రసన్నత అనే ! వ్యవస్థీ భూతమైన సామ్రాజ్య శక్తి, దాని ప్రత్యక్ష, పరోక్ష పోషణలో పెరిగే 'క్లాసికల్' సారస్వతం ఉపలక్షించే ఉత్తమ ఆశయాలలో అదొకటి.

మరోమాటలో చెప్పాలంటే సాహిత్యంలో కాని, సంస్కృతిలో కాని వ్యవస్థీకృత శక్తి ముఖ్య ఆశయం 'ప్రసన్నత'. అదో సమ్యక్ భావ స్థితికి, "అంతా లక్షణంగా ఉంది" అనే భద్ర భావనకు సూచిక. సామాజికంగా కావచ్చు, సాంస్కృతికంగా కావచ్చు, సాహిత్యపరంగా కావచ్చు, సలక్షణంగా తీర్చబడ్డ సుస్థితికి సూచిక. పురాణేతిహాస రచనలకు అదో ముఖ్యదృక్కోణం. వాటి కర్తలకు కథలను సృష్టించడం మీద కాదు దృష్టి. అది ఓ విధంగా అపచారమనే భావన కూడా వారికి ఉండి ఉండవచ్చు. కథ లోని ప్రామాణికతను నాటి సామాజిక –

సాంస్కృతిక శక్తికి ప్రతీకగా వారు భావించారు. పూర్వ
సాంస్కృతిక శక్తికి ప్రతీకగా వారు భావించారు. పూర్వ
సంస్కృతి చరిత్ర అధ్యయనానికి ఆ కథలే ఆధారం. కనుక ఆ ప్రామాణికతను పెంచి, పోషించి, పరిరక్షిస్తూ, వాటి అంతస్తత్త్వాన్ని మరింత శోభాయమానం చేసే కళాసాధ్యత లను మాత్రం గుర్తించి, ఆ మేరకు లక్షణ సముద్దీప్తంగా–ప్రసన్నంగా–ఆ కథలను ఆవిష్కరించేవారు. కథే వారి భావ రూపం, వారి భాష, వారి మాధ్యమం. దాన్ని ప్రసన్నంగా తీర్చడమే వారి కళా గౌరవం. **మార్గ సాహిత్య కళకు ప్రసన్న కథే సమగ్ర అభివ్యక్తి మాధ్యమం.** పూర్వయుగీన సాహిత్యభావజాలంలో ముఖ్యమైనదైనా, దానికి తొలిసారిగా పరిభాషా ప్రతిపత్తినిచ్చి వాడిన ఘనత నన్నయదే. దానికి పంపడు స్ఫూర్తి దాత అనడం కూడా న్యాయం కాదు. "లలిత పదముం, ప్రసన్న కవితెయుం" అనడంతో ఆయన దాన్ని కవితా రూపగుణంగానే ఉద్దేశించాడన్నది స్పష్టం. ఒకవేళ స్ఫూర్తి అని ఒప్పుకొన్నా, నన్నయ దానికి విశేష పారిభాషిక సామర్థ్యాన్ని కూర్చి ప్రయోగించాడన్నది సుస్పష్టం. విస్తృత చారిత్రక నేపథ్యంలో చూస్తే, అది పూర్వయుగీన సాంస్కృతిక చేతనకు గుర్తని, దాన్ని కావ్య మీమాంసలో అలా పరిచయం చేసిన ఘనత నన్నయదేనని బోధపడుతుంది.

ఇక ఈ మొదటి లక్షణం లోని రెండవ దళం : 'కలితార్థయుక్తి'– మరింత జాగ్రత్తగా చూడదగింది. 'కలితార్థ' నా? 'కవితార్థ' నా? అనే చర్చ ఇప్పుడు అవసరం లేదు. 'కలిత' అనే మాటే అక్కడ అర్థవంతమని విశ్వనాథ వారు తుది తీర్పు నిచ్చారు. అర్థయుక్తి అనే మాటను సాకల్యంగా చూడాలి. 'అర్థయుక్తి' అంటే మొత్తంగా చమత్కారం. కాని ఆ రెండు మాటలను ముందు విడివిడిగా చూసి తర్వాత మొత్తం అర్థాన్ని భావించడం సబబు. మొదటనున్న 'అర్థ' శబ్దం 'శబ్దార్థ' యుగళంలోని రెండవ మాట. ఈ అర్థ శబ్దపు లోతును ద్యోతకం చేయడానికి ఆనందవర్ధ నాచార్యులు ధ్వని ప్రస్థానాన్ని నిర్మించాడు. దాని మూలం భామహుడు చెప్పిన వక్రోక్తి లోనే ఉందని, విడిగా ధ్వని సిద్ధాంత అవసరంలేదని, దాన్ని ఖండిస్తూ, తర్వాత కుంతకుడు 'వక్రోక్తి జీవితాన్ని' విపులీకరించాడు. **'ధ్వని' లోని అస్పష్టతను గుర్తించి, దానికంటే మేల్తరంగా నన్నయ పై పదబంధాన్ని ప్రతిపాదించాడు.** 'అర్థం' అనేక రీతులుగా ప్రాచీనులనుంచి ఆధునికులదాకా, అర్థవంతమైన చర్చలకు అవకాశం కలిగిస్తూనే ఉంది. దీన్ని కనీసం నాలుగు విధాలుగా పరిశీలించవచ్చు.

అభిధ, లక్షణ, వ్యంజన అనే మూడు అర్థవృత్తులూ, శక్తులు, సుప్రసిద్ధాలు. ఇవి మూడుగా ఉన్నా, ఇందులో వరుసగా ప్రతి ఒకటి మరొకదానికి ప్రాతిపదిక అవుతుంది. అన్నీ కలిసి కావ్యసీమలో ఓ కొత్త అర్థాన్ని – సముచ్చయార్థాన్ని – అనుభూతిని కూడా కలుపుకొన్న సముచ్చ యార్థాన్ని పండిస్తాయి. మైసూరు విశ్వ విద్యాలయంలో పూర్వం సంస్కృత ఆచార్యులు, సుప్రసిద్ధ సంస్కృత – భారతీయ విజ్ఞాని ఆచార్య కె.కృష్ణమూర్తి గారి మాటలు ఇక్కడ అవశ్య స్మరణీయం. "In abstract thinking, as in mathematics, we are familiar with the phenomenon of signs remaining almost unrecognised as signs, and serving as promoters of ideas and relations between ideas. *Thinking is not so much referential as relation-finding*. If we can also call complex thought 'meaning', such meaning is the direct result, not of word`sings and symbols, but of the meanings of the word-signs... *In poetry, too... the referential and other familiar meanings of words and symbols cease to act as ends in themselves; they in their turn become means for further ideas and meanings. The first meaning itself becomes the symbol for a second meaning, the second for a third.* In this associative series of meanings, all are necessary, but only as subserving the last, of which alone as the critic is sure. But the magic of poetry is such that the last meaning strikes us as though it were as direct as the first itself." (Essays In Sanskrit Criticism; Karantak University, Dharwar, 1974; P. 17-18. పై పంక్తుల్లో కొన్నిటికి ఇటాలిక్స్ మార్పు నాది). అర్థ విజ్ఞానపు సారాన్ని అతి సంక్షిప్తంగా చెప్పే మాటలు కనుకనే వాటిని అంత వివరంగా ఉదహరించడం జరిగింది. సాంప్రదాయకంగా అర్థానికి సంబంధించిన పరిశీలనను ఆలంకారికులు తత్త్వ, తర్క శాస్త్రాల భూమికతో సమన్వయించి చేశారు. ఆ సారాన్నే

ఆచార్య కృష్ణమూర్తిగారు పై మాటల్లో అందించారు. పై మాటల్లోని చివరి వాక్యపు భావం ఒక విధంగా నన్నయ ఉపలక్షించిన 'అర్థయుక్తి'. ప్రసన్నంగా-సర్వ లక్షణ సంపన్నంగా తీర్చబడి-ఉన్న కథలో అనేక అర్థ స్తరాలుంటాయి. ఏ స్థాయిలో, లేదా ఏ స్థాయిలోని వారికి, ఆ అర్థమే స్వయం సమగ్రంగా భాసమానం కావడం ఒక అర్థయుక్తి, చమత్కృతి.

ఒక ప్రసన్న కథలో అనేక అర్థ స్తరాలుండవచ్చు. ఒక తాత్త్వికార్థముండవచ్చు. ఒక ఐతిహాసికార్థముండవచ్చు. ఒక శాస్త్రార్థముండవచ్చు. లేదా ఒక కావ్య సౌందర్యముండవచ్చు. నన్నయే తన భారత రచనకున్న వివిధ దృక్కోణాలను పరమ సుందరంగా వర్ణించారు. కనుక ఆయా దృక్కోణాలకున్న ఆయా అర్థాలు, ఆ ప్రసన్న కథాసముచ్చయంలో సముచ్చయమై ఉన్నాయన్న మాట! ఉదాహరణకు ఏకలవ్యుని కథే తీసుకొందాం. అందులోని, పౌరాణికార్థం 'గురుభక్తి'కి సంబంధించింది. ఐతిహాసికార్థం నాటి నిషాదులకు ధనుశ్శాస్త్ర విద్య నిషిద్ధం కావడానికి సంబంధించింది. ఇక తాత్త్వికార్థంలో, అదో యజ్ఞస్వరూపమని ఆచార్య సాళ్వ కృష్ణమూర్తి తమ పరిశోధనలో వివరించారు. ఇలా ప్రతి కథకు అనేకమైన అర్థస్తరాలు, దృక్కోణాలుంటాయి. వాటిని సారమతి అయిన కవీంద్రులు 'లోనారసి' చూస్తుంటారు. ఇవ్వాళైతే విమర్శకులకు కవిత్వం అందని మానిపండు కాని, ఒకప్పుడు సారమతి అయిన కవీంద్రుడే విమర్శకుడు. 'లోనారయుటే విమర్శ. (విమర్శకు లోనారయిక, లోనారిక చక్కటి తెలుగు పేరవుతుందేమో) కావ్యకర్మలో అభినివేశం లేనివాడు విమర్శకుడెలా అవుతాడు? ....'సారమతి'. ఎంత చిక్కటి అర్థమున్న మాట! మనస్సుకు ఎన్నో పర్యాయాలున్నాయి. అందులో 'మతి' కూడా ఒకటని సామాన్యార్థంలో భావిస్తుంటాము. కాని అందులో గతానికి సంబంధించిన స్మృతి ఉంది, ఆగతానికి సంబంధించిన ఊహాశక్తి ఉంది. గతాగతవర్తమానాలను సమన్వయించుకొనే ప్రజ్ఞావిశేషమే 'మతి' ఏ కాలంలోనైనా సారమెరిగిన మతిమంతులు, అందునా కవీంద్రులు, కొందరే ఉంటారు. వారు లోనారసి చూసినప్పుడు విశదపడేది అర్థయుక్తి.

అభిధ, లక్షణ, వ్యంజనాలని కాకుండా అర్థానికున్న వివిధ ఆముఖాలను చాలా సుందరంగా సంగ్రహించి చెప్పాడు పంప. "విదితం ప్రాతీతికం కోమళమతిసుభగం సుందరం సూక్తిగర్భం మృదుసందర్భం విచారక్షమ ముచితపదం" (ఆదిపురాణ-ప్ర.ఆ- 26వ). వీటికి వివరణ అక్కరలేదు. సత్కవితలో, సారం తెలిసిన కవి వాడే పదాలకుండే వివిధ అర్థశోభలన్నిటినీ సమగ్రంగా వివరించే మాటలు. అభిదాదులు తార్కిక క్షేత్రంలో గుర్తించతగ్గవి కాని (అందుకే కృష్ణమూర్తిగారు abstract thinking అంటూ చింతనాక్షేత్రం నుంచి మొదలు పెట్టారు.) కావ్య క్షేత్రంలో పంపని మాటలే శోభాయమానంగా ఉన్నాయి. (దీన్ని కూడా ఔత్తరాహ-దాక్షిణాత్య భేద సూచకంగా నేను భావిస్తాను). బహుశః వాటిని సర్వకవిసామాన్య, ఆవశ్యకలక్షణాలుగా భావించి కాబోలు నన్నయగారు మొదటి "మృదు మధుర రస భావ భాసుర నవార్థ రచన"గా పేర్కొన్నాడని అనుకొనే అవకాశమూ ఉంది. కాకనూ పోవచ్చు. అయితే ఇక్కడ ముఖ్యమైంది నవార్థ రచన అనే మాట. ఓ కథను ఏ కవి అయినా, ఏ భాషలోనైనా ఎందుకు మళ్ళీ మళ్ళీ చెబుతాడు? ఇక్కడ భాష అన్నది ప్రధానమే కాదు.

అనువాదమన్నది ఆధునిక వచన కాలంలో దాపురించింది కాని, పూర్వ కావ్య సంప్రదాయంలో దానికి పరిగణనే లేదు. లోక ప్రసిద్ధమైన కథను తీసుకోవడమే పూర్వ సంప్రదాయ మార్గం. దాన్ని పూర్తిగా ధ్యానించి, భావించి, అనుభవించి (దాని సారం లోన ఇంకి కొత్తగా మొలకెత్తినప్పుడే - 'భవించి' నప్పుడే - అనుభవించినట్లు!) తనదైన భాషలో సాక్షాత్కరింపచేస్తాడు కవి.

ఆ సాక్షాత్కార సార రూపమే ఛందస్సు. ఛందోబద్ధమైన రీతిలో కవి తన వాణి వినిపించాడంటే అది పునః సృజనే కాని, అనువాదం కాదు. అనువాదం మీద దృష్టి ఉన్నవాడు మరో భాషలో సమాంతర పాఠం తయారుచేయగలడే కాని 'రస భావ భాసురం' చేయలేడు. 'నవార్థ రచన'ను భావించనూ లేడు. ఆ రెండూ కావ్యకళా పరమ ప్రయోజనాలైనప్పుడు, కథ లోక ప్రసిద్ధంగానే ఉండాలన్నప్పుడు, అనువాదమనే మాటకు చోటెక్కడ? సంస్కృత అలంకారికులు అందుకేనా శబ్దమనే మాటను వాడారు, భాషాతీత సార్వదేశ్య స్థితికి సూచకంగా?... అల్పప్రతిభులైన కొందరాధునికులు ఆత్మభాషా మహత్కావ్య సంప్రదాయాన్ని న్యూనపరచడానికి వాడిన మాట అనువాదం అన్నది. అవిచార్యంగాసాగే ఆధునిక అధ్యాపనాల పుణ్యమా అని తరం వెంట తరానికి

అనుక్రమిస్తూ వస్తున్న అపపాఠం అది. నన్నయ తిక్కనాది "మహాకవుల"ను అర్థం చేసుకోవాలంటే, తెలుగు కావ్య సంప్రదాయ స్వతంత్ర గౌరవాన్ని గుర్తించాలంటే, వారి 'నవార్థ రచనా విశారద' తను గ్రహించాలి... దాన్నలా వుంచితే, నన్నయ అక్కడ వాడిన 'నవార్థరచన' అనే మాట అర్థం గ్రహిస్తే, ఇక్కడి 'కలితార్థ' అనే మాట అర్థం బోధపడుతుంది. పున: సృజనలో దేశ - కాల -సందర్భాలను బట్టి, ఆ భాషాసంప్రదాయాన్ని బట్టి, ఆ కవి సామర్థ్యాన్ని బట్టి ఎప్పటికప్పుడు నవార్థం చేరుతూనే- కలితమవుతూనే- ఉంటుంది. రచితమవుతూనే ఉంటుంది. రచన అంటేనే ఒక నిర్మాణం. ఒక విశిష్టమైన కూర్పు. ఇవ్వాళ తరచూ వాడే ఆంగ్లపదం structure కు సరిగ్గా సమానార్థకం.

ప్రతి రచనలోనూ రెండు అర్థ పరిధులు లేదా అర్థావృత్తులుంటాయి. బహిరంతర నిర్మాణాలూ, వాచ్యార్థా-సూచ్యార్థాలు అంటూ పలు విధాల జంటలుగా వీటిని చూడటం జరిగింది. ఓ జంటకూ మరో జంటకూ సాదృశ్యం లేకపోయినా, వాటివల్ల కావ్య రచనలో- నిర్మాణంలో- సమాంతరంగా ఉండే ద్వంద్వమేదో ఒకటి ఉందనే విషయం స్పష్టమవుతోంది. ఈ ద్వంద్వాన్ని మనం ఉద్దిష్టార్థం- అభివ్యక్తార్థం అని వ్యవహరిద్దాం. ప్రతి రచనలోనూ "ఈ రచన ఎందుకు? ఏం చెప్పడానికి?" అనే ఉద్దిష్టార్థం ఒకటి ఉంటుంది. అది ఒకటి రెండు ప్రశ్నలకు పరిమితమైనదే కాదు. దానికి సంబంధించిన అర్థావృతి ఒకటుంటుంది.

ఉదాహరణకు భారతమే చూద్దాం. దేన్ని చెప్పడానికి అది రచింపబడింది? పుట్టుక శాసించే జాతి సమస్యనా? పెంపుడు శాసించే జాతి సమస్యనా? (ఉదా: వ్యాస, విదుర, కర్ణ, ఏకలవ్య వృత్తాంతాలు, ఇత్యాది) లేదా జాతుల అంతస్సంఘర్షణనా? విలీనాన్నా? వాటిని తునుమాడిన రాజ్యశక్తినా? దాన్ని దక్కించుకోడానికి తలపడ్డ దాయాదుల అంత: కలహాన్నా? ప్రాకారం లోపల ప్రాకారంలా కట్టిన ఆ సంకీర్ణ నిర్మాణంలో, మూలాశయం-ఉద్దిష్టార్థం-ఇదీ అని చెప్పడం అంత సులభం కాదు. చాలా విస్తృతమైన అర్థావృతి. అంతకంటే విస్తృతమైన అర్థావృతి రెండవదైన అభివ్యక్తార్థానికి సంబంధించింది. చెప్పాలనుకొన్న ఉద్దిష్టాంశాల కంటే, చెప్పే తీరూ తెన్నూ ఎప్పుడూ విపులంగానే ఉంటాయి.

అందులోనూ అవి కళాసమ్మితంగా రూపొందినప్పుడు! ఈ ఉద్దిష్ట-అభివ్యక్త అర్థాల రెండింటి నడుమ పొందికయిన రూపనిర్మాణమే కావ్యరచన. కావ్యమంటేనే ఒక ఉద్దిష్టార్థాన్ని కళాత్మకంగా బయటికి అభివ్యక్తీకరించడం. రెండింటి శిల్పసమన్విత నిర్మాణమే. వీటిగూర్చి బ్రిటిష్, అమెరికన్ రూపవాద (formalist) విమర్శకులు విభిన్న పారిభాషిక పదాలతో వివిధ రీతుల్లో చర్చించారు. రూపపటిష్టత చర్చిస్తూ కర్షణ (tension) సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన ఆలెన్ టైట్ ఇన్‌టెన్షన్, ఎక్స్‌టెన్షన్ అనే రెండు ప్రత్యయాలను పరిచయం చేస్తాడు. కాని వాటి అర్థం వేరు. అందులో ఇంటెన్షన్‌కు మనం పేర్కొనే ధ్వని అలంకారాదులనే అర్థవ్యాప్తి. ప్రత్యేకంగా ఉద్దేశించిన అర్థాంతరాలని ఉద్దేశ్యం. పాత్ర, సంఘటన వగైరా కథనాత్మక అంశాల పరిశీలన రెండవదానికిందకు వస్తాయి. ఆయన దృష్టి, రూపవివేచన కౌశలాల (నెరేటివ్ టెక్నిక్స్) మీద. వాటికీ, పైన ప్రస్తావించిన అంశాలకు సాదృశ్యం లేదు. అర్థ-రూప సంయోజన భారతీయ-భారతీయేతర, ప్రాచీన-అర్వాచీన భేదం లేకుండా సాహిత్య శాస్త్రకారులను అనేక విధాల ఆలోచింపచేస్తూనే ఉంది.

'కలితార్థ'లోని కలిత శబ్దానికి ఆ సంయోజన అనే అర్థం. సాహిత్య శిల్పకళంతా ఆ సంయోజనే...

ఇక 'అర్థయుక్తి'లోని యుక్తి శబ్దానికి మూడు అర్థాలను గుర్తించవచ్చు. ఒకటి- చమత్కారం; రెండు- యుక్తమంటే చేరినదనే అర్థం ఉన్నది కనుక (చూ: సంయుక్తము), 'చేరినట్టిద'నే భావంలో (అర్థాంతరం); మూడు- యుక్తమనే మాటకున్న 'ఔచిత్య'మనే అర్థంలో. ఈ మూడింటినీ ముచ్చటగా స్ఫురింపచేయడమే ఒక అర్థయుక్తి! కళానుభవమేదైనా 'స్ఫురణ'కు జీవం పోసేదే, దానివల్ల సంపన్నమయ్యేదే. అందులో సాహిత్యకళ మరీను! ప్రసన్న కథాకలితార్థయుక్తి గురించి ఇంతంతా అయ్యాకా, ఇంకో చిన్న ప్రశ్న మిగిలి పోతూనే ఉంది. ఇంతకీ 'ప్రసన్న' శబ్దం దేనికి విశేషణం? కథకా? కలితార్థానికా? లేక అర్థయుక్తికా? మూడింటికీ అన్నది, సారమెరిగిన సహృదయులకు తెలిసిందే. ఒక్కొక్క అంశానికి అన్వయిస్తూ దాన్ని మొత్తంగా నిరూపించడం ఒక పెద్ద పరిశోధనావస్తువవుతుంది. తెలుగులో నన్నయపై ఇన్ని పరిశోధనలు వచ్చినా ఇది ఇంకా చేయడానికి మిగిలి ఉన్న పరిశోధనాంశమే...

నన్నయ తన రెండవలక్షణంగా – కాదు, తన దృష్టిలో సాహిత్యానికి రెండో ముఖ్య లక్షణంగా – చెప్పిన “అక్షర రమ్యత” అనే పదబంధాన్ని కూడా మనం పెద్ద లోతుగా పట్టించుకోము. లోతుగా పరిశీలించి, పరిశోధించిన వారు, పైన చర్చించిన మొదటి లక్షణ పరిధిని కూడా దీంట్లో గర్భీకరింప చేసి, దీని వ్యాప్తిని దాటి వెళ్ళడమైతే బాగుందికాని, దీని యథార్థ వ్యాప్తిని గుర్తించారా అనే అనుమానం మిగులుతోంది... దాన్నలాగుంచితే, నన్నయగారు అప్పటికి బాగా వ్యాప్తిలో ఉన్న ‘శబ్ద’ మనే మాటను వదిలి, ‘అక్షర’ అనే మాటను ఎందుకు వాడారు? లోకసామాన్యంలో అలికిడి ధ్వనిగా, మాటగా నలిగిపోయిన శబ్దమనే మాటంటే ఆయనకు పెద్ద అభిమానమున్నట్లు లేదు. అందుకే దాన్ని వాడదగ్గ ఈ సందర్భంలో కూడా వాడలేదు... ‘అక్షర’ శబ్దం లిఖిత సంప్రదాయానికి సంబంధించినది. అప్పటికది తెలుగునాట అంత ప్రాచుర్యం వహించింది కాదు. పోనీ శాసనాలలో ప్రచురమవుతోందనుకొన్నా, అప్పటికి తెలుగులో వెలువడిన శాసనాలు కూడా చాలా తక్కువ (నన్నయగారు రాసిన నందంపూడి శాసనం సంస్కృతం లోదే). వాటి ప్రాచుర్యం కూడా ఎక్కువ లేదు. అక్షరాస్యత అన్న మాటకి నాటికి అర్థమే లేదు. అయితే అక్షర అన్న మాటకు చాలా గొప్ప పూజ్య భావం రూఢిలో ఉంది. అది అనశ్వరమైన ఆత్మ / పరమాత్మ నుంచి వర్ణమాలలో ‘ప్రాణం’గా భావించబడే అచ్చు దాకా, చాలా మార్మికంగా వ్యాపించి ఉంది. విశ్వమంతా ఓంకారం నుంచే ఉద్భవిస్తోందన్నది ఒక విశ్వాసం. కనిపించే ప్రకృతి క్షరం, దానికి మూలమైన మూల / పరా ప్రకృతి అక్షరం అనేది తాత్త్విక విశ్వాసం. అది మరో పరిధి లోనిది.

మూలాధారం లోని బీజాక్షరం మాట అటుంచి, మార్మిక తాంత్రిక ఉపాసనా మార్గంలో కూడా దానికి ప్రాచుర్యం ఉందని విన్నాను. నన్నయ గారికి దాన్ని అంటగట్టలేకపోయినా, ఆయన అక్షర శబ్దాన్ని చాలా పూజ్యభావంతోనే ప్రయోగించాడన్నది స్పష్టం. ఆయన ఏ రూపంలో ఉపాసించాడో కాని ఫక్తు శబ్దోపాసనకుడన్నది స్పష్టం. అది ఆయన శబ్దం తీర్పులో ప్రతి చదువరికి అక్షరమక్షరంలో సాక్షాత్కృతమయ్యే సత్యం. అయితే సర్వత్ర ప్రచారంలో ఉన్న శబ్దమనే మాటను వదిలి ‘అక్షర’ మనే మాటను ఎందుకు వాడినట్లు. అలాటి పరిభాషా సందర్భంలో మహాకవి సాభిప్రాయంగా తప్ప వాడడు. మరి వారి అభిప్రాయం? భాష చరరూపం నుంచి స్థిర రూపం తీసుకోడానికి సంకేతం అక్షరం. అప్పటిదాకా సాహిత్యభాష ఎక్కువ భాగం చరరూపంలో ఉన్నటువంటిదే. నన్నయకు ముందు సాహిత్య రచన లేదని చెప్పడం దుస్సాహసమే. అలాగైతే శాసనాల్లో తగు మాత్రంగానైనా ఆ పద్యాలు కాని, వృత్తగంధి కాని చోటుచేసుకొనేవి కాదు. తొలినాటి రేనాటి శాసనాల్లోనే వృత్తగంధి తొంగిచూస్తున్నదంటారు. సాహిత్యరచన విషయంలోకి వస్తే, జైన సంబంధ సాహిత్యం తప్పకుండా వచ్చిందని చెప్పడానికీ లేదు, రాలేదని చెప్పడానికి లేదు. జైనానికి మరో పేరు శ్యాద్వాదం. దేవుడైనా, ఆత్మ అయినా ఉందా? లేదా? అంటే అవును, కాదు అని ఇదమిత్థంగా చెప్పలేమంటుంది (చూ: హిందీ–‘శాయద్’) కాబట్టి దానికి శాద్వాదమని ప్రతీతి.

తెలుగులో జైనసాహిత్యముందా, లేదా అనే విషయంలోనూ శాద్వాదమే శరణ్యం. దాక్షిణాత్య సాంస్కృతిక చరిత్రను ఉమ్మడిగా చూస్తే, ఒక్కో ప్రాంతం ఒక్కో మతవిధానానికి ఎక్కువ ప్రాచుర్యం కలిగించినట్లే, ఒక్కో మతం ఒక్కో భాషకు ఎక్కువ ప్రాధాన్య మిచ్చినట్లు, దాదాపు దాన్ని తన అధికార భాషగా గౌరవించినట్లు స్పష్టమౌతుంది. జైనమతం అలాగే కన్నడాన్ని స్వీకరించింది.[1] పంపడు జైనాన్ని అవలంబించడం వల్ల వేంగినుంచి కన్నడసీమకు వెళ్తే, నన్నయ వైదికమతావలంబి కావడం వల్ల అటు నుంచి ఇటు వచ్చాడు. వైదిక మతం ‘అక్షర’ శబ్దానికిచ్చే మార్మికప్రాధాన్యం, పూజ్యతాభావం వల్ల కొంతా, మౌఖిక పరంపరలోని చరరూపం లిఖిత సంప్రదాయపు స్థిరరూపం తీసుకొంటున్న వైనానికి సూచనగా కొంతా, నన్నయ ‘అక్షర’ మనే మాటనే వైయక్తికాభిమానంతో, సాభిప్రాయంగా వాడాడు. పై రెంటిలోనూ మొదటిదాని మీదనే నన్నయ ప్రాధాన్య వివక్ష ఉంటుందనుకోడానికి సందేహించనక్కర లేదు.

‘రమ్’ అనే ధాతువు నుంచి వచ్చింది, రమ్యత అనే శబ్దం. రమ్ అంటే క్రీడించు అని అర్థం. ఎందులో అయితే మన మనసు పూర్తిగా లీనమై, అందులోనే క్రీడిస్తూ ఉంటుందో అది రమ్యత. అక్షర రమ్మత కూడా అటువంటిదే. ఒక శబ్దం యొక్క మాధుర్యాది గుణాలలో మనసు పూర్తిగా లీనమై అందులో రమిస్తూ ఉండాలి. అప్పుడే శబ్ద సార్థక్యం.

కావ్యమంతా ఆసాంతమున్న శాబ్దికమనోహరత్వం అక్షర రమ్యత. వంపడు పేర్కొన్న ''కోమలమతినుభగ సుందరా"దులన్నీ ఆ మనోహరత్వంలోకి వచ్చేవే. లో నున్న అర్థయుక్తి సారమారసిం గ్రోలలేని ''ఇతరులు" దీన్ని ఆదరిస్తుంటారు. పంపడినేమో కాని, ఈ ఒక్క మాటతో నన్నయ చాలా గడుసుగా శాబ్దికప్రియులనందరినీ రెండో శ్రేణిలో పడేశాడు. అందునా మొదటివారిని "కవీంద్రు"లని భూషించి, యుక్తిగా వీరిని ఏ విశేషణం లేకుండా "ఇతరులు" అనడంలో ఏదో చిన్న తేలికపాటితనం యుక్తమై ఉన్నట్లు (కలిసి ఉన్నట్లు) ధ్వనిస్తోంది. "శబ్దార్థా" లంటూ శబ్దానికి ప్రథమపట్టం గట్టిన పూర్వ లాక్షణికులను కూడా అలానే చూశాడా ఏమిటి? అనే కుశంక తలెత్తే అవకాశం లేకపోలేదు. అలా ఊహిస్తే అతివ్యాప్తి దోషమవుతుంది కాని, ఊహించడానికి అవకాశమూ లేకపోలేదు.

తన కావ్య లక్షణాలను ప్రస్తావిస్తున్నప్పుడు ఆయన శబ్దమనే మాటను వాడదగ్గ సందర్భాలలో కూడా, ఇతర పర్యాయపదాలనే ఎన్నుకొన్నాడు కాని, శబ్దమనే పారిభాషిక స్థాయి మాటను వాడకపోవడం ఒకింత ఆశంకకు చోటిస్తోంది. శబ్దమనే మాట అన్నిటా సర్వ సామాన్యమై పోవడంతోనూ, వ్యాకరణ పరిభాషకంటే కావ్యశాస్త్ర పరిభాషకు ప్రత్యేకత ఉండాలనే ఆశయంతోనూ, బహుశ: ఆ మాటను వాడక పోయి ఉండవచ్చు కాని, పూర్వ లాక్షణికుల పట్ల గౌరవం లేక కాదని మాత్రం కాదు. అది నన్నయ వ్యక్తిత్వమూ కాదు. పోతే, అతివ్యాప్తి దోషం సంక్రమించకుంటే, ఇక్కడ ఇంకో చిన్న విషయముంది... ప్రసన్నత ఎలాగైతే క్లాసిసిజం కు సూచికో, రమ్యత అలాగే "రొమాంటి సిజం"కు గుర్తుగా పరిగణించ బడుతోంది.

క్లాసిసిజం పూర్వ యుగీన లక్షణమైతే, రొమాంటిసిజం మధ్య యుగీన లక్షణం. సాంస్కృతిక చరిత్ర పరంగా నన్నయ సంధియుగంలోని వాడు[2] అందుకే రెంటికీ సమప్రాధాన్యం, ఇవ్వ వలసిన తీరులో ఇచ్చాడు. రమ్యతకు మధ్యయుగంలో ఇనుమడించిన ప్రాచుర్యానికి గుర్తు– మొఘల్ కాలంలోని జగన్నాథ పండితరాయలు తనకు మునుపటి 'ఇష్టార్థ వ్యవచ్ఛిన్న పదావళి' లోని ఇష్టార్థ భావనని మార్చి, దాని స్థానే 'రమణీయార్థ ప్రతిపాదకశ్శబ్దః కావ్యం' అని నిర్వచించడం. ఈ మార్పును ఇదివరలో విమర్శక పండితులు గుర్తించినా, అది నాటి భారతీయ రొమాంటిసిజంకు గుర్తుగా చర్చించలేదు. రొమాంటిసిజం అనేది ఓ దేశానికి మరో దేశం నుంచి దిగుమతి అయ్యే భావజాలం కాదు. క్లాసిసిజం. రొమాంటిసిజంలనేవి ప్రతి దేశంలోనూ సహజసిద్ధంగా రూపొందే సమాంతర కళాతత్త్వాలే. చుట్టుపక్కల భావ ప్రభావాలుంటాయి కాని, దిగుబడులుండవు. ఒకప్పుడు ఒకటి పైచేయి అయితే, మరొకప్పుడు మరొకటి రూపం మార్చుకొని పైచేతి వాటం పొందుతుంది. వాటి విపుల పరిశీలన ఈ వ్యాస పరిధికి మరీ మీరినట్టిది. ఇక్కడ చెప్పొచ్చినదొకటే. ఒక కళాతాత్త్విక పరిభాష, ఒక కాల చేతనకు, ఒక సాంస్కృతిక చరిత్రకు గుర్తు అనీ, ఆ దృష్టితో చూస్తే నన్నయవంటి "సాంస్కృతిక ద్రష్ట" చూపు, దాని గాఢత మరింత స్పష్ట మౌతూంది అనీ, దరిమిలా తెలుగు సంప్రదాయ విశిష్టత మరింత దీప్తిమంతంగా తెలియ వస్తుంది అనీ!

తాను సంకల్పించిన రచన దేహాత్మల లక్షణాలను ప్రస్తావించిన తర్వాత, ఆ రచనాగుణాన్ని తనకు భూషణంగా ఉన్నదాన్ని పేర్కొంటున్నాడు నన్నయ," నానారుచిరార్థ సూక్తి నిధి" పేరిట! ... ఆ నిధి ఎవరు? తనా? భారతమా? రెంటి అభేదం. దీని అర్థం పెద్ద వివరించనక్కరలేదు కాని, ఇక్కడ గుర్తించవలసిన అంశం మరొకటుంది. ఒక కావ్యాన్ని, ఒక మంచి రచనను, జనం చదివేది ఎందుకు? గుర్తుపెట్టుకొనేది ఎందువల్ల?... ఒక ఆహ్లాదకరమైన స్ఫూర్తి కోసం!... ఒక అర్థవంతమైన మాటవల్ల!... వాటికోసమే ఓ రచనను మాటిమాటికి చదువుతుంటాం. వాటివల్లనే గుర్తుంచుకొంటాం. వాటివల్లనే అంత గాఢంగా అభిమానిస్తుంటాం. ఇప్పటికీ ఆధునిక విమర్శక లోకంలో ఒక మాటుంది. ''రచనలో కోటబులిటీ ఉండాలి. కోటబుల్‌గా ఉన్న మాటల వల్లే, పంక్తుల వల్లే కవిత నిలుస్తుంది'' అని! అవేమిటి? ఒకప్పుడు, 75లో, శేషేంద్రశర్మగారితో నాకొక చిన్న వివాదం ఏర్పడింది. అంతకొక రెండుమూడేళ్ళు ముందునుంచే వారొక పద్ధతిగా కవితాప్రచారం సాగిస్తున్నారు. బెంగుళూరుకు వచ్చినప్పుడు మాలాటి కుర్రాళ్ళం అభిమానంగా వారి కవిత్వాన్ని వినడానికి వారు బస చేసే అశోకా హోటల్‌కు వెళ్ళేవాళ్ళం. కవిత్వంలో విరుపు, చమత్కారం ఎంత ముఖ్యమో చెబుతూ, వక్రోక్తి ప్రాధాన్యం ప్రస్తావిస్తూ ''వంశిన్ వంచి మృణాళమున్ త్రెంచి... అక్కడ మొదలైంది తెలుగులో కవిత్వం. అందాకా

ఉన్నది. మరోలా..” అంటూ వారు కవితావేశంలో ఎటో వెళ్ళిపోయారు. అందరం తలలూపుతున్నాం కాని, నాకెందుకో అంగీకరించాలనిపించలేదు. “మాట విరుపు, చమత్కారం లేనిది కవిత్వం కాదంటే, మరి తెలుగు జాతి, చమత్కారాలకు నిలయమైన *పారిజాతాపహరణం* ద్వితీయాశ్వాసం లాంటి వాటిని కాక, ప్రథమాశ్వాసాన్ని ఎందుకు ఇష్టంగా గుర్తుపెట్టుకొంటుంది? వేమన పద్యాలను ఎందుకు నాలుకపై నిలుపుకొంటుంది?” అని అడిగాను.

ఆ తర్వాత ఉత్తరం రూపంలో ఆ ప్రశ్నల్నే లేవదీశాను. వారికి చిరాకు కలిగి, చురుగ్గా ఓ మాట అనడంతో, ఆ తర్వాత వారివద్ద కవితామర్మాలు వినే అదృష్టం పోయింది ... సభాసంప్రదాయానికి చమత్కారం, వక్రత ప్రాధాన్యం వహిస్తాయి. కాని, సామాన్య ప్రజా సంప్రదాయానికి కోటబుల్ మాటలే సరి. ఆహ్లాదంగా ఉంటూనే మనోవికాసం కలిగించే అర్థవంతమైన మాటలున్నప్పుడే లోకం ఓ రచనను గుర్తుంచుకొంటుంది. అంతెందుకు? ఆధునిక సాహిత్య చరిత్రలో చోటు చేసుకొనే *కర్పూర వసంత రాయలు, విశ్వంభర* వంటి కావ్యాలను ఎన్ని రాశారు ఆచార్య సి.నా.రె.గారు. ఇప్పటికీ క్రమం తప్పకుండా ప్రతి పుట్టిన రోజుకూ ఒక కావ్య సంపుటి తెస్తున్నారు. ఇన్ని ఉన్నా లోకం నాల్కల మీద ప్రపంచ పదులు కదులుతుంటాయి. లేదంటే ముచ్చటైన పాటల పాదాలు నర్తిస్తుంటాయి. శతాబ్దాల సాహిత్య ప్రస్థానంలో కేవల చమత్కార రచనలు, ఎన్ని వచ్చి పోయాయో!

ఒక్క రెడ్డియుగం లోనే ఎన్ని అవతరించి అంత రించాయోనని అనుమానించడానికి, అప్పటి ప్రముఖ ఆస్థాన కవి వామన భట్టబాణుని *శృంగార భూషణ భాణము* వంటి సంస్కృత రచనల సరళి, *ప్రేమాభిరామం, క్రీడాభిరామాల* వంటి కావ్యాల సరళి అవకాశం కలిగిస్తున్నాయి. *క్రీడాభిరామం* కూడా అదృష్టం కొద్దీ ఒక శిథిల ప్రతి తంజావూరులో పూజ్యులు మానవల్లిగారి కంట పడబట్టి ఇప్పటికిలా లభించింది. అది తెలుగు నగరానికి, తెలుగు జన జీవితానికి సంబంధించినది కావడం వల్ల బ్రతికింది. సంస్కృతం సభావిద్వద్భాష అయితే, తెలుగు సామాన్య జన భాష. వారి అభిరుచుల, అవసరాల మాధ్యమం. సాహిత్యరీతిని కూడా అదే మలుస్తుంది. అలా మలచబడ్డ వాటినే జాతి నిలుపుకొంటుంది.

ఆ రహస్యమెరిగిన లోకజ్ఞుడు కనుకనే ఆదిమార్గకావ్యప్రవక్త అయిన నన్నయ, భారతాన్ని నానారుచిరార్థ సూక్తి నిధిగా దర్శించి, మహాకావ్యగుణంగా ఆ సూక్తి నిధిత్వాన్ని భావించి, దాన్నే తన గౌరవ భూషణంగా నిలుపుకొన్నాడు. ఎన్నేళ్ళెంతగా ఆ రుచిరార్థ సూక్తులు విని ఉంటేనో రాజరాజనరేంద్రుడు ఆ నిధిస్వరూపాన్ని తెలుగులో అందించమని అభ్యర్థించి ఉంటాడు! “రుచిరం!” ఎంత సాభిప్రాయమైన మాట ! అందులో ఇష్టార్థ సంబంధమైన రుచి ఉంది. జనం దేన్ని ఇష్టపడతారు? ప్రియమూ, హితమూ రెండూ కలిసి ఉన్నదాన్ని. మనసుకు రుచించేదాన్ని. దాన్ని స్ఫురింప చేయడమొక అర్థ స్ఫూర్తి; లోక ప్రసిద్ధమైన రుచి మరో అర్థ స్ఫూర్తి. రచన పట్ల అనేమిటి? రచనాకృతి ప్రాతినిధ్యం వహించే జీవితంపట్ల రుచి పుట్టించడమూ, ఉన్న రుచిని మెప్పించడమూ సాహిత్య ఆశయం; రసవత్ సాహిత్య సార్థక్యమంతా రుచి మీదనే ఆధారపడి ఉంటుంది. రసానికి రుచి ఓ ప్రాతిపదిక. (“పదాలకు రంగూ, రుచి, వాసన లుంటాయి” కృష్ణశాస్త్రి, “మరల రామాయణంబదేలయన్న... ఎవని రుచి వారిది గాన” విశ్వనాథ); రుచిరమంటే మనోహరమనే అర్థముంది. పంపడన్న “సుందరం సూక్తిగర్భం మృదుసందర్భం విచారక్షమం” వగైరాలను ఒకే ఒక్క రుచిరార్థం గర్భీకరించుకొంది; వీటికంటే మించి రుచిర శబ్దానికి మరో గంభీరమైన అర్థముంది. అది రోచిస్సంబంధం. ఏదైతే మనస్సులో కాంతి నింపుతుందో అది రుచిరార్థం. నేడు వికాసమని విరివిగా వాడే మాటకు నాడు రుచిరం సమానార్థకం. సాహిత్య పరమ ప్రయోజనం అర్థం అదే: రుచిరార్థం. ఆ రోచిస్సును పెంపొందించే అర్థం / ప్రయోజనం సు + ఉక్తి వల్లనే సాధ్యం.

లక్షణం, గుణం తర్వాత చివరగా ప్రయోజనం: “జగద్ధితమ్”. చింతామణిని నన్నయ రాశాడో లేదో తెలియదు కాని, “విశ్వశ్రేయ: కావ్యమ్” అనే మాటకు ఇది సమాంతరమైన తెలుగు మాట. బహుశ నన్నయను చూసే ఆ మాటనందులో చేర్చి ఉండాలి. దాని వివాదమటుండనిస్తే. కావ్య ప్రయోజనమేమిటి? అనే ప్రశ్నకు “యశసేర్థకృతే వ్యవహారవిదే...” అంటూ డబ్బూ, కీర్తీ వంటి అత్యంత లౌకిక ప్రయోజనాలను పేర్కొన్నారే కాని, ఇంత సూటిగా, ఇంత హితమితంగా ఏ లాక్షణికుడైనా

సాహిత్య ప్రయోజనాన్ని నిర్వచించాడా అనే అనుమానం కలుగుతోంది. తెలుగు సాహిత్యానికి దాన్నే గట్టురాయిగా పెట్టేశాడు నన్నయ, దాన్ని లోతుగా భావనచేసి, అసంపూర్ణ రచన చెప్మా అనే ఆశంకకు పోకుండా, నిండు ఆరాధనా భావంతో పరిశేషభాగపూర్తిని ఒక యజ్ఞంగా భావిస్తూ స్వయంగా యాగం చేసి యాజియై భారతానువాదానికి పూనుకొన్న మనీషి తిక్కన. అంతకంటే తెగువతో, అరణ్యపర్వ శేషానికి పూనుకొన్న ఋషి ఎర్రన. నన్నయ సంకల్పించిన జగద్ధితానికి పూర్ణరూపమిచ్చిన పుణ్య మూర్తులు వారిద్దరూ. మధ్యయుగీనాంతం తెలుగు సాహిత్య ప్రస్థానమంతా ఆ జగద్ధిత మార్గంలోనే నడచింది...

విభేదిస్తున్న వైనం లోకుండానే చాలా గడుసుగా, ప్రసన్న గంభీరంగా, తన నవ్య మార్గరీతిని నిర్దేశించి సాగాడు నన్నయ. అదృష్టం కొద్దీ పూర్వం కావ్య శాస్త్ర చర్చల్లో సంవాదాలకు తప్ప వివాదాలకు చోటు లేదు. అంచేతే సంస్కృతాలంకారికులు నిరూపించిన త్రోవ కంటే, వాటిని సమన్వయించుకొని, నన్నయ పరచిన నవ్య మార్గం వెంట సాగింది అత్యధికంగా తెలుగుసాహిత్య వారసత్వం.

సాహిత్య విమర్శవేరు, సాహిత్య సిద్ధాంతం / శాస్త్రం వేరు. శాస్త్రంలో పరిభాష చాలా కీలక స్థానమాక్రమిస్తుంది. పరిభాషకు రూఢికెక్కిన స్వతంత్ర అర్థపరిధులుంటాయి. వాటిని సాంతం జాగ్రత్తగా అర్థం చేసుకోకపోతే సిద్ధాంతం కూడా సాంతం సరిగా అర్థం కాదు. ఒక మహాకవి ఒక బృహద్రచనను చేపడుతూ తన కావ్య మీమాంసా దృక్పథాలను, తనదైన రీతిలో కొత్తగా ప్రతిపాదించినప్పుడు, వాటిని జాగ్రత్తగా పరిశీలించి, శాస్త్రపరమైన ఆ నవ్యతను ఆవిష్కరించడమే ఈ వ్యాసం ఉద్దేశ్యం.

**అథస్సూచికలు :**

1 ప్రస్తుత హైదరాబాదు శివారు అయిన పఠాన్ చెరువు - నాటి పొట్లం చెరువు-లో బాహుబలికి మూలనమూనా విగ్రహముండేదని, జైనం మీద జరిగిన దాడిలో అది విధ్వంసమైందనీ, అలాగే కడపజిల్లాలోని దానవులపాడు గ్రామనామం ఆ విధ్వంస కాండకు సూచకమేనని చారిత్రక పరిశోధకులంటుంటారు. జైనం మీద దాడి జరిగినా అది కచ్చితంగా క్రీ.శ. 4,5 శతాబ్దులకంటే మునుపటిదే. 6వ శతాబ్దానికి రేనాటిలో శైవ, శాక్తేయాలు నిలదొక్కుకొన్నాయి. సాగరాంధ్రంలో వజ్రయానంతో బౌద్ధం తిరిగి తన ప్రాభవాన్ని పెంచుకొంది. కాని అదే దాని ఆఖరు దశ కావడం చారిత్రక వైపరీత్యం. ఆ చరిత్రనలా ఉంచితే, జైనం తెలంగాణా ప్రాంతంలో కొద్దిగా తప్ప, ఇతరత్రా ఆంధ్రదేశంలో చాళుక్య యుగం ప్రారంభం కావడానికి మునుపే ప్రాచుర్యం కోల్పోయింది. కన్నడనాడులో ప్రాముఖ్యం పుంజుకొంది. తూర్పు-పశ్చిమ చాళుక్యుల కలహాలలో, ఒక్క వారనే ఏమిటి? రాజకీయాలన్నిటిలోనూ, బయటి పోరలో మతం, ప్రాధాన్యం వహిస్తుంది. నేడు సంక్షేమమన్నట్లు, నాడు మతధర్మం పాలకుల అధికార కాంక్షకు బయటి పరివేషం. తూర్పు తెలుగునాటనున్న దాయాదులు వైదిక శైవాన్ని 'అవలంబిస్తే' పడమటి కన్నడగడ్డపైనున్న వారు జైనాన్ని 'అవలంబించారు'. జైనం కన్నడాన్ని 'అవలంబించింది'. ఎక్కడ తన అధికారికకార్యక్రమమైనా కన్నడంలోనే నడిపింది! దానికి గుర్తే 7 వ శతాబ్దిలో బెజవాడలో ఎత్తించిన జైనబసది శాసనం కన్నడంలో ఉండడం!

2. మధ్యయుగీన (క్రీ.శ.10-11 శతాబ్దుల నుంచి 16 శతాబ్దిదాకా భారతీయ సాంస్కృతిక చరిత్రలో మధ్యయుగీనదశగా గుర్తిస్తారు. మౌర్యానంతర కాలం నుండి 9 శతాబ్ది చివరిదాకా పూర్వయుగం. నన్నయ ఆ సంధి దశలోని వాడు) భావజాలంలో అత్యంత ప్రముఖమైంది రొమాంటిసిజం. కళాతత్త్వంలో ఉన్నత శ్రేణి మర్యాదల ప్రతిబింబమైనది క్లాసిసిజం గానూ, సకల జన వినోద సామాన్యమైనది రొమాంటిసిజం గానూ ప్రసిద్ధి.

9 వ శతాబ్ది చివరికంతా సామాన్య కృషివర్గప్రజ రాచరికస్థానాలను దక్కించుకోవడం, మిశ్రకులాలని చెప్పబడేవారు వాణిజ్య ఉత్పత్తుల పరంగా ప్రాధాన్యం పెంచుకోవడం భారతీయ సామాజిక సంస్కృతిలో పెద్ద మలుపు. యుద్ధాల ఒత్తిడితో పాటు, ఆలయ సంస్థ వ్యాప్తి, కళాసంస్కృతి పోషణ బలం పుంజుకొన్నాయి.

ఈ చివరి అంశం రొమాంటిసిజం ప్రభావానికి గుర్తు. దేవుడి పేరిట సకలజన వినోదమే ఆలయ సంస్కృతిలో కళాపోషణ ఆశయం.

ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ, పూర్వ వైస్ ఛాన్సలర్, కుప్పం విశ్వవిద్యాలయం, ఫోన్ : 9441809566

# వా...మనుడు

– ఆవుల సాంబశివరావు

(బలి చక్రవర్తి రాజప్రాసాదంలో దాన మందిరం)

బలి చక్రవర్తి నిలబడి ఉంటాడు. రాజలాంఛనాలు ఏమీ లేవు. ఆజానుబాహుడు, తేజోవంతమైన ముఖవర్చస్సు, బలిష్టమైన శరీరం, ధీరోదాత్తుల లక్షణాలు ప్రస్ఫుటంగా కనిపిస్తుంటాయి. అప్పుడే ఆనాటికి దానాలు ఇవ్వడం సంపూర్తి చేస్తున్నాడు.

ఆచార్య శుక్రుడు ఆసీనుడై ఉంటాడు. తపో సంపదతో ఆయన రూపం వెలుగొందుతూ ఉంటుంది.

బలి : ఆచార్యదేవులు ఈనాడు చాలా పరాకుగా ఉన్నారు. దిగులుగా ఉన్నట్లు కనిపిస్తున్నారు. మిమ్మల్ని కలతపరిచే సంగతి ఏదైనా జరిగిందా?

శుక్రుడు : అవును కుమారా! నా మనస్సు చాలా కలవరం చెందుతూ ఉంది.

బలి : (ఆతురతతో) ఎందుకని గురుదేవా ?

శుక్రుడు : ఏమని చెప్పను నాయనా! ఆ దేవతలు మంచివాళ్ళు కారు. ఏవేవో పన్నాగాలు పన్నుతున్నారని నా అనుమానం.

బలి : వాళ్లకేం అపకారం చేశాం మనం ?

శుక్రుడు : భూలోకంతో పాటు స్వర్గలోకాన్ని కూడా జయించావు కదా! వాళ్ల మత్సరానికి కారణం అదే.

బలి : రాజధర్మాన్ని అనుసరించి మానవలోకం దివిజ లోకం జయించానే కాని ఎవ్వరినీ ఎన్నడూ బాధ పెట్టలేదే (హింసించలేదే) న్యూనత పరచలేదే! రాజుగా నా ధర్మాన్ని అవలంబించి జైత్రయాత్రలు చేశాను. ఆ ధర్మాన్ని గుర్తించ లేని అజ్ఞానులా దేవతలు?

శుక్రుడు : (హేళనగా) ధర్మం! ఆ దేవతలకా! అవసరం వచ్చినపుడు ఆయుధంగా వాడే పదమే గాని ఇది, దాన్ని వారు ఆచరించడానికి కాదయ్యా. దేవతలేమిటి! ధర్మమేమిటి!

బలి : దేవతలకు ధర్మం లేదా?

శుక్రుడు : ధర్మపన్నాలు ఇతరులకు బోధించడానికే గాని, వారు అవలంభించడానికి కాదు. ధర్మశాస్త్రాలన్నీ, మానవులకు, దానవులకేనట. వారికి కాదట.

బలి : (శుక్రుని కెదురుగా కూర్చుంటూ) దేవతలు మానవ లోకవాసులు కారని ఎరుగుదుం. కాని వారిలో కూడ ధర్మనిరతి ఉండవద్దా?

శుక్రుడు : (ఈసడింపుగా) ధర్మనిరతీ లేదు. వాళ్లకు నీతినియమాలు లేవు. న్యాయ, అన్యాయాలు లేవు. అంతులేని స్వార్థమే వాళ్ల ధ్యేయం, స్వార్థమే ధర్మం. దాన్ని అవసరాన్ని బట్టి మారుస్తూ ఉంటారు.

బలి : మనం భూలోకాన్ని, అమరలోకాన్ని జయించింది భుజబలంతోనే కాని ఎక్కడా అధర్మ యుద్ధం చెయ్యలేదే. సాక్షాత్తు నీతికి మారుపేరైన మీ ఆధ్వర్యంలోనే కదా మనం యుద్ధం చేసిందీ. విజయాలు సాధించిందీను.

శుక్రుడు : విజయాలు సాధించావు కనుకనే నీ మీద ఆ దేవతలకు మత్సరం.

బలి : మరి, విజయాలను సాధించి, రాజ్యాన్ని సామ్రాజ్యం చేయడం రాజధర్మమని కదా ధర్మనిర్ణేతల వాక్కు. మహేంద్రుడు యుద్ధాలు చేయలేదా? భూలోకం మీద దాడులు జరపలేదా?

శుక్రుడు : నాయనా! ఎంత అమాయకుడవయ్యా? వారు చేసిన పనే నీవు కూడా చేశావని వాళ్లకు కోపం. వాళ్ళు దేవతలు. నీవు దానవుడవు. జాతిద్వేషం వాళ్ల గుండెల్లో మండుతూ ఉంది.

బలి : స్వామీ! నేను దానవుణ్ణే. కాని మీ నీతి, ధర్మ ప్రబోధనలతో, పెద్దలు చెప్పిన ఋజువర్తనను అలవర్చుకున్నాను. మీ ఆదేశం పొందకుండా నేనేమీ చెయ్యలేదే? యుద్ధాలు చేసినప్పుడు, విజయాలు సాధించిన తరువాత,

ఎక్కడైనా దారితప్పి కూడని పనులు చేశానా? ధర్మయుద్ధంలో జయించాం, మానవుల్నీ, దానవుల్నీ, దేవతల్నీ జయించిన తరువాత ఎవరినైనా ఇబ్బందుల పాలుచేశానా? అందర్నీ నా స్వంత బిడ్డలుగా చూచుకుంటున్నానే! ఎవరికీ ఏ లోటూ రాకుండా కాపాడుకుంటున్నానే! ఆర్తులకు, అర్థులకూ, అడిగిందల్లా ఇస్తున్నానే! గో, బ్రాహ్మణ సంరక్షణ సక్రమంగా నిర్వహిస్తున్నానే! ఇదంతా నా ధర్మంగా, మహోన్నతమైన నీతిగా అవలంభిస్తున్నానే! ఇందులో ఏమిటి అపరాధం?

శుక్రుడు : అపరాధం అల్లా నీవు దానవుడవు కావడం, వాళ్లు దేవతలు కావడం. ధర్మపరుడైన దానవుణ్ణి కూడా వాళ్లు సహించరు.

బలి : కనక, కర్తవ్యం ఏమిటి గురుదేవా?

శుక్రుడు : నీ పరాక్రమాన్ని చూచి పారిపోయిన ఆ ఇంద్రుడు మిగతా దేవతా ప్రభువులతో ఏదో కుట్రలు పన్నుతున్నాడని నా అనుమానం. అందరూ కలిసి నీకేదో అపకారం తలపెట్టారని నా భయం.

బలి : కానివ్వండి. అందరూ కలిసి దండెత్తనివ్వండి. ఎదుర్కొంటాను. ధర్మంగా పోరాడతాను. జయిస్తే జయిస్తాను. లేకపోతే ఓడిపోతాను. అందుకు నేను జంకను.

శుక్రుడు : (హేళనగా) నీ ఎదురుగా నిలిచి యుద్ధం చేసే సాహసం ఆ త్రిమూర్తులకే లేదు. కనక, నీతో పోరుకు తలపడరు. చాటుగా, మాటుగా మోసగించి నిన్ను రూపుమాపడానికి ప్రయత్నిస్తారని నా ఊహ.

**ఇంతలో ద్వారపాలకుడు ప్రవేశం**

ద్వార : మహాప్రభూ ! ఒక బ్రాహ్మణ వటుడు దానానికి వేచి వున్నాడు. ఈ రోజుకి దానాలకు సమయం అయిపోయిందని చెప్పినా వినడం లేదు.

బలి : ఎంతమాట! అర్థిగా వచ్చిన బ్రాహ్మణ బాలకుణ్ణి వట్టి చేతులతో పంపుతామా! ప్రవేశపెట్టు.
(ద్వారపాలకుడు వెంటరాగా వామనుడు ప్రవేశిస్తాడు. కాంతివంతమైన ముఖం, శరీరం, అయితే కుబ్జుడుగా అగుపిస్తాడు)

బలి : (సాదరంగా) రండి, ఆసీనులు కండి (అంటూ ఆసనం చూపిస్తూ) మీ నామధేయం?

వామ : (కూర్చుంటూ) నన్ను వామనుడంటారు. కాని దానంకోసం వచ్చిన నా ఊరు పేరులు కావాలా రాజా?

బలి : వాటితో పనిలేదు. అయితే బ్రాహ్మణ సత్కారం, దానశీలతలో ప్రధాన స్థానం కలిగి ఉంటుందని కదా ధర్మ ప్రవచనం. అందుకని అడుగుచున్నాను.

శుక్రుడు : ఏమయ్యా వటుడా? అంత గుంభనగా ఉంచదలచుకున్నావా నీ సంగతి?

వామ : లేదు లేదు. నేను బ్రాహ్మణ బాలున్ని, ఈ రాజు దానగుణం లోకమెరిగిందే. బ్రాహ్మణ భక్తి అందరకూ తెలిసిందే. అందుకనే దానార్థినై వచ్చాను.

శుక్రుడు : (అనుమానంగా) ఇంత పసివాడివి! నీకేం దానం కావాలి? నీ తల్లిదండ్రులు తీర్చలేని అవసరాలు నీకు ఈ పిన్నవయస్సులో ఏమున్నాయి?

వామ : ఏమిటి? గుచ్చి గుచ్చి ప్రశ్నలు అడుతున్నారు?
అడిగినదే తడవుగా దానమిస్తాడనే ప్రతిష్ఠ ఈ బలిరాజుకు ఉంది. అది నమ్మి వచ్చాను. వెళ్ళిపొమ్మంటే వెళ్లిపోతాను.

శుక్రుడు : ఈ మాటకే వెళ్లిపోతానంటున్నావు. అంటే నీవు కోరబోయే దానం నీకు అవసరం లేదన్నమాట.

వామ : ఏమయ్యా రాజా! ఇవ్వనని నీవే చెప్పగూడదూ? నీ గురువు చేత చెప్పిస్తున్నావా?

శుక్రుడు : (వెంటనే) బలి చక్రవర్తికి నేను గురువునని నీకెలా తెలుసు?

వామ : లోక ప్రసిద్ధులైన దానవాచార్యులు శుక్రులవారినే ఎరుగనా?

శుక్రుడు : అన్ని మర్మాలు తెలుసుకునే వచ్చావన్నమాట!

బలి : గురుదేవా! అన్ని సంగతులు తెలుసుకున్న పిమ్మటనే వచ్చిన ఈ బ్రాహ్మణ బాలుడు మన చెంతకు అర్థియై వచ్చాడు. ఆయన కోరికను తీర్చడం రాజునైన నా ధర్మం కదా! (వామను నుద్దేశించి) బాలకా! మీరు కోరే దానం ఏమిటి?

వామ : అడిగిందిస్తారు కదా!

బలి : అడిగింది లేదనేది ఈ బలి చరిత్రలోనే లేదు. తప్పకుండా ఇస్తాను.

వామ : మాట తప్పరు కదా?

బలి : ఎందుకీ సందేహం.

శుక్రుడు : వామనుని వంక తదేక దీక్షతో చూస్తూ ఉంటాడు.

బలి : వామనా! మీకేం కావాలో చెప్పరేం? ఎందకీ సందిగ్ధం?

వామ : నాకు కావలసిందల్లా, మూడడుగుల నేల, నా పదాలు మూడు సార్లు పెట్టగల చోటు.

బలి : ఇంత మాత్రానికేనా ఇంతసేపు సందేహించారు? (బలిని ఇంకొక మాట చెప్పనివ్వకుండా శుక్రుడు తటాలున లేచి నించుంటాడు. ఆందోళనతో కంపించి పోతూ ఉంటాడు).

శుక్రుడు : వద్దు! మహారాజా వద్దు. ఈ దానం ఇవ్వవద్దు.

బలి : (తాను లేచి నిలబడి) (సంభ్రమాశ్చర్యలతో) గురుదేవా! మీరేనా ఈ మాటంటున్నది? ఒక బ్రాహ్మణ వటుడు అడిగిన దానాన్ని తిరస్కరించమని పూజ్యపాదులు ఆదేశిస్తున్నారా?

శుక్రుడు : ఆదేశించడమే కాదు. వీలైనంత మట్టుకు నివారిస్తాను.

బలి : (ఆశ్చర్యంగా శుక్రుని వంక చూస్తూ) ధర్మశాస్త్ర పారంగతులైన తమరు ఈ విధంగా సెలవిస్తున్నారా?

శుక్రుడు : ధర్మశాస్త్రాలన్నీ ఎరుగున్న వాణ్ని గనుకనే నివారిస్తున్నాను. ఇతగాడు చేస్తున్నది పచ్చిమోసం. మోసాన్ని ధర్మంతో ముడిబెడితే అధర్మం, అన్యాయం తప్ప ఇంకేమీ మిగలదు.

వామ : మోసమా! శుక్రాచార్య! ఇందులో మోసమేమిటి? మూడడుగుల చోటే గదా నేనడిగింది.

శుక్రుడు : నీవు కోరేది మూడడుగుల చోటే అయితే, ఎంత పేదవాడైనా నీ తండ్రి తీర్చలేని కోరికా అది?

వామ : ఇచ్చే రాజు ఉన్నాడు గనుక వచ్చాను.

శుక్రుడు : చూడు వామనా! బ్రాహ్మణుడైన వాడు తనకు అవసరమైన వస్తువునే అడగాలి, అనవసర కోరికలతో దానమడిగితే బ్రాహ్మణ ధర్మానికి భంగం తెచ్చినవాడవవుతావు.

వామ : ఇందులో అవసరం లేనిదేమున్నది?

శుక్రుడు : తెలియక అడుగుతాను వామనా? మూడడుగుల నేలలో నీవు ఏమి చేయగలవు? ఇల్లు కడతావా? మొక్కలు నాటుతావా? పూజకు పూలు పూయిస్తావా? ఏమి చేస్తావు? నిజంగా నీవు కోరేది నీ బాలపాదాలు మూడుసార్లు పెట్టే చోటే అయితే దానితో నీకేమి ఉపయోగం? నీ కుటుంబానికేమి ఉపయోగం?

బలి : (సానునయంగా శుక్రునితో) ఆచార్యా! ఇన్ని అభ్యంతరాలు చెప్పి దానమివ్వటం సబబు కాదు కదా? ఎందుకివన్నీ అడిగిన మూడడుగుల చోటు ఇస్తాను.

శుక్రుడు : అమాయకుడా! ఈ వామనుడు చేస్తున్న మాయను తెలుసుకోలేకుండా ఉన్నావు.

వామ : (కోపంగా) మాయా? ?

శుక్రుడు : మాయకాక ఏమిటి? ఎందుకూ పనికిరాని మూడడుగుల చోటును అడగడం మాయకాదా? పెద్దలచాటున పెరిగే బాలుడు, దానం అడగడానికి రావడం మాయకాదా? అవసరమైతే పెద్దలే అడగ వచ్చు కదా?

వామ : బాలురు దానం అడగకూడదా శుక్రాచార్యా?

శుక్రుడు : అడగవచ్చు, తన కవసరమైన విద్యాదానమడగవచ్చు. అవసరమైతే అన్నదాన మడగవచ్చు. కాని మూడడుగుల నేలా ఒక బాలుడికి కావలసింది? ఇది ఏదో కప్పిపుచ్చడానికి చేసిన కోరిక కాక మరేమిటి?

వామ : (కోపంగా బలి వంక చూస్తూ) రాజా! మీ గురువు నీ దానవ్రతాన్ని భంగం చేయడానికి ప్రయత్నిస్తున్నాడు. తన వితండవాదంతో నిన్ను తికమక పరచడానికి ప్రయత్నిస్తూన్నాడు. అడిగిన దానం ఇస్తావా? ఇవ్వవా? ఇవ్వనంటే వెళ్లిపోతాను.

బలి : ఇస్తాను, వామనా! ఇస్తాను. నిస్సందేహంగా ఇస్తాను.

శుక్రుడు : (హతాశుడై ఆసనంలో కూడబడతాడు) హతోస్మి. పాపం క్షమించుగాక.

వామ : (హేళనగా శుక్రుని వంక చూస్తూ) దానవాచార్యా! ఇప్పుడేం చేస్తావు? ఇచ్చిన మాటను తప్పుతాడా బలిరాజు?

బలి : తప్పను వామనా! నీవు కోరిన మూడడుగుల నేల ఎక్కడ కావాలో కోరుకో.

వామ : సరే కోరుకుంటాను. ఇదిగో చూడు.
'అంతవరకూ కుబ్జుడుగా వున్న వామనుడు అంతై' మరింతై, ఆకాశ పథానికి ఎగిసే స్వరూపాన్ని పొందుతాడు. బలి చక్రవర్తి ఆశ్చర్యచకితుడై చూస్తూ ఉంటాడు).

బలి : మీరు నిజంగా వామనులేనా? ముందుగా వచ్చిన ఆబాలరూపం ఏమైంది? ఈ పెనురూపం ఎక్కడనుండి వచ్చింది? మీరెవరు?

వామ : (గర్వంగా) ఎవరినో తెలియడం లేదా రాజా? విశ్వరూపిని. విశ్వంభరుడను. త్రివిక్రముడు : విశ్వవ్యాప్తిని, త్రివిక్రముడను. విష్ణుమూర్తిని.

బలి : (తల పంకిస్తూ) ఆచార్యదేవులు చెప్పింది నిజమేనన్నమాట! అయితే త్రివిక్రములు బ్రాహ్మణ బాలరూపంలో రావలసిన అవసరం ఏమిటి? విశ్వరూపికి మూడడుగుల చోటు ఎందుకు కావలసి వచ్చింది?

త్రివి : ఎందుకా బలిరాజా? నీ అహంకారాన్ని అణచడానికి.

బలి : అహంకారమా? నాకా? ఎక్కడ చూశారు అహంకారం? ఎప్పుడు చూపాను అహంకారాన్ని? కలలో కూడ అహంకారాన్ని ఎరగనే!

త్రివి : బలవంతుడని గర్విస్తూ దేవలోకాన్ని జయించడం అహంకారం కాదా? దేవతలు పూజ్యులని తెలియదా? పూజ్యులైన వారిని జయించడం అహంకారం కాదా?

బలి : (తీవ్రంగా) నేను చాటుగా మాటుగా వెళ్లి జయించలేదే! సైన్య సమేతంగా బాహాటంగా దేవలోకం మీద దండెత్తాను. వీరోచితమైన ధర్మయుద్ధం జరిపాను. అందులో జయించాను. ఇందులో అహంకారమేమిటి? తప్పెక్కడ? లోకాలను జయించడం రాజధర్మమని మీ విశ్వంభరులు అనుమతితోనే కదా ధర్మశాస్త్రాలు వ్రాయబడ్డవి?

త్రివి : గురువుగారి వికటవాదన బాగా వంటబట్టించుకున్నావు రాజా. ఇంతకూ ఇస్తానన్న దానం ఇస్తావా? లేదా?

శుక్రుడు : (ఇంతలో శుక్రుడు తేరుకొని) కుమారా! ఇంత మోసమని తెలిసిన తరువాత దానమివ్వవలసిన అవసరం లేదు. ఈ త్రివిక్రముని చర్యను ఏధర్మమూ, ఏ నీతీ సమర్థించవు. కనుక నీవు ఆ దానమివ్వవలసిన అనవసరం లేదు.

త్రివి : (జుగుప్సతో) శుక్రాచార్యుల వారు క్రొత్త నీతులు వల్లిస్తున్నారు. ఇచ్చిన మాట తప్పడం అధర్మం కాదా?

శుక్రుడు : (చప్పున లేచి నిలబడి) త్రివిక్రముణ్ణని విర్రవీగబోకు విష్ణుమూర్తీ! సర్వజ్ఞుడనని భ్రమించబోకు. బలి చక్రవర్తి ఇచ్చిన మాట ఏమిటి? ఎవరికి? ఒక బాలుడికి. ఆ రూపంలో ఉన్న బాలునికి మూడు పాదాల చోటు ఇస్తానన్నాడు. ఆ పాదాల తోనే మూడడుగుల చోటూ తీసుకో.

త్రివి : (తికమక పడుతూ) నీవు బోధించిన శుక్రనీతినే త్రోసి రాజనే వాదాన్ని చెబుతున్నావు. వామనుడనైనా త్రివిక్రముడనైనా నేనే కదా?

శుక్రుడు : (గద్దిస్తూ) విష్ణుమూర్తివైనంత మాత్రాన సబబు తప్పకు. వామన రూపంలో మూడడుగులడిగావు కాని త్రివిక్రమ రూపంలో అడుగలేదు. చక్రవర్తి మాట ఇచ్చినది వామనునికి మూడడుగుల చోటు ఇస్తానని, త్రివిక్రమ రూపానికామాట మహారాజు ఇవ్వలేదే. మాట తీసుకుని ఆ తరువాత రూపం మారుస్తావా? కుబ్జరూపం నుండి బ్రహ్మాండమంతవుతావు? మాట తప్పుతున్నది నీవు త్రివిక్రమా! (త్రివిక్రమునికి సమాధానం తోచలేదు. బలి వంక చూస్తూ)

త్రివి : రాజా! ఈ తర్కవితర్కాలతో నాకు పనిలేదు. నా ఈ మూడు పాదాలు పట్టే ప్రదేశాన్ని ఇస్తావా లేదా?

బలి : విషయమంతా తేటతెల్లమయింది. ఆచార్యదేవులు సెలవిచ్చింది అక్షరాల నిజమైంది. (త్రివిక్రమునితో) వారు చెప్పిన వాదానికి మీకు సమాధానం లేదు. మాట తప్పినది మీరు. అయినా కానివ్వండి. సాక్షాత్తు త్రివిక్రములు, విష్ణువే స్వయంగా దానమడిగితే కాదనడం దేనికి? తీసుకోండి.

శుక్రుడు : (ఆవేదనతో) బలీ! ఇంత జరిగినా ఈ దొంగకు దానం ఇస్తున్నావా?

బలి : (శుక్రుని వంక చూస్తూ) ఇస్తాను గురుదేవా! మీ మాట కాదనాలని కాదు. సాక్షాత్తు విష్ణుమూర్తే "అర్థీ" అని అడిగాడు గనుక ఇస్తాను. (కృత నిశ్చయంతో త్రివిక్రముని వంక తిరిగి) స్వామీ! మీ దానం తీసుకోండి.

త్రివి : చాలా సంతోషం ! (అని మొదటి రెండు పాదాలు పెట్టి భూలోక దేవలోకాలను ఆక్రమిస్తాడు. మూడవ పాదానికి చోటు లేదు).

త్రివి : బలి చక్రవర్తీ! మూడవపాదం ఎక్కడుంచమంటావు? మరెక్కడా చోటు లేదే!

బలి : (నిండైన నిబ్బరంతో) అందుకే గదా విష్ణుమూర్తులు ఈ వామనావతారం ఎత్తింది. నన్ను హత మార్చడానికే కదా ఈ ప్రయత్నమంతా! కానివ్వండి. సిద్ధంగా ఉన్నాను. మూడవ పాదం నా శిరస్సు మీదనే ఉంచండి. (అని క్రింద కూర్చుంటాడు).

శుక్రుడు : నాయనా! నాయనా! !

త్రివి : (జాలిగా) చక్రవర్తీ! త్రివిక్రమ రూపంలో ఉన్న నాపాదం నీవు భరించ లేవు. నలిగిపోతావు.

బలి : (నిశ్చలంగా) లేదు త్రివిక్రమా, దానికి జంకను. నాకన్ని విషయాలూ అర్థమయినాయని ఇందాకనే చెప్పాను. మీరు దేనికోసమై వచ్చారో ఆ పని పూర్తి చెయ్యండి. అయితే ఒక క్షణం (శుక్రాచార్యులకు పాదాభివందనం చేస్తూ).

బలి : గురుదేవా! గురుదేవా, ఏడుగడగా నన్ను ఇంతకాలం నడిపారు. కనురెప్పగా కాపాడారు. అమోఘమైన మీ ఆశీస్సులతో ఇంతవాడనైనాను. మనసారా మీకు కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాను. అంతిమ సమయం, సెలవిప్పించండి.

శుక్రుడు : (కంటి కొలకుల నీరు ధారగా కారగా) తండ్రీ! వెళ్లిపోతున్నావా! ఎంత మహాపురుషుడయ్యా నీవు! ఈ దేవతలు ఉన్నా నశించినా, భూలోకం ఉన్నంత కాలం, సూర్యచంద్రులు వెలిగేంతవరకు, దానశీలతకు ప్రతిరూపమై, మారుపేరై నీ కీర్తి చిరస్థాయిగా నిలబడుతుంది. వెళ్లిరా.
(తన అశ్రువులు బలి శిరస్సుపై ఆశీర్వాదాక్షితలుగా రాలగా తల నిమురుతాడు)

బలి : (తిరిగి పద్మాసనం మీద కూర్చొని) త్రివిక్రమా! ఇక మీ పని పూర్తి చెయ్యండి.

త్రివి : (ఎంతో అనుతాపనతో తన మూడవ పాదం బలి తలపై పెట్టగా, ఆ బరువుకు బలి నలిగిపోతాడు).

శుక్రుడు : (ఆవేదనతో) నాయానా! బలీ! ఈ కర్కశ దేవతల క్రూరత్వానికి బలైపోయినావా? (కోపంతో త్రివిక్రముని వంక చూచి) ఏమి త్రివిక్రముడవోయి నీవు? ఏమి విష్ణుమూర్తివి? సిగ్గువేయడం లేదూ ఈ ఘాతుకం చేసినందుకు?

త్రివి : నేను చేసినది ధర్మ సంస్థాపన. అందుకే ఈ అవతారమెత్తాను.

శుక్రుడు : నువు చేసింది ధర్మ సంస్థాపనా? అధర్మాన్ని, అవినీతిని ప్రతిష్ఠించావు. అందుకే ఈ అవతారమెత్తావు?

త్రివి : శుక్రాచార్య! హద్దుమీరుతున్నావు.

శుక్రుడు : (ఆగ్రహంతో) హద్దు మీరుతున్నానా? అయితే శాపమే ఇస్తాను నీకు.

త్రివి : (ఆశ్చర్యంతో) నాకా! శాపమా!

శుక్రుడు : హేళనగా (త్రిమూర్తులలో ఒకడినని కులకబోకు. ధర్మాన్ని, సత్యాన్ని పరిరక్షించవలసిన నీవు ఈ మోసాన్ని, తప్పుడు పనిని చేశావు. శాపార్హుడవైనావు.

త్రివి : (కలత చెందుతూ) నీవు, నాకు, శాపమివ్వగలవా?

శుక్రుడు : ఇవ్వగలను. ఇస్తాను. నా ధర్మ సంపదను యావత్తూ వినియోగించి మరీ యిస్తాను. ఇంత మోసం. ఇంత ద్రోహం చేసిన నీకు, పుణ్యాత్ముడైన నా చక్రవర్తిని బలిగొన్న నీకు, శాపంకాక మరేమిటి?
ఈ అవతారమెత్తిన నిన్ను త్రివిక్రముడిగా ముందు తరాలు గుర్తుంచుకోవు. కొంచెపు ఆకారంతో వచ్చి, కొంచెపు బుద్ధితో వంచన చేసిన ఈ నీ అవతారాన్ని వామనుడగానే లోకం గుర్తింస్తుంది. (పండ్లు కొరుకుతూ) ఇక ఈ పగటి వేషం చాలించు. **ఫో... వా...మనా!** మి

---

(*మిసిమి* మార్చి, 1990)

**జస్టిస్ ఆవుల సాంబశివరావు (1917-2003), ఆంధ్రప్రదేశ్ అత్యున్నత న్యాయస్థానపు ప్రధాన న్యాయమూర్తి.**



# శతపత్ర బాణీ
# శ్రీపాద పినాకపాణి

*– గొల్లపూడి మారుతీరావు*

పద్మభూషణ్, సంగీతకళానిధి, కళాప్రపూర్ణ డాక్టర్ శ్రీపాద పినాకపాణి గారి శతజయంతిని ఈ మధ్యనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆయన అభిమానులూ చాలా ఘనంగా జరిపారు. ఆయన నాకు పిల్లనిచ్చిన మామగారికి స్వయంగా ఆఖరి తమ్ముడు. 52 సంవత్సరాల కిందట – తన 48వ యేట మా పెళ్ళిలో ఆయన చాంబర్ కచేరీ చేశారు. ఈ 52 సంవత్సరాలలో ఎప్పుడు వారిని కలిసినా కేవలం చుట్టపు చూపుగా కాక ఆయన కృషి, జీవనయాత్ర గురించి ముచ్చటించడం పరిపాటి అయిపోయింది. ఈ ప్రసంగం అక్టోబరు 24న వారి మనుమరాలి పెళ్లి సందర్భంగా కలిసినప్పుడు జరిగింది. నూరు సంవత్సరాలు నిండిన, 85 సంవత్సరాలు సంగీత ప్రపంచంలో తనదైన బాణిని నిలిపిన ఓ సంగీత కళానిధితో జరిపిన ప్రసంగ పాఠం.

నూరేళ్ళు జీవించిన ఈ మజిలీలో మీకు ఏమనిపిస్తోంది? అని అడిగాను. కాస్సేపు ఆలోచించి: "ఓ కోరిక తీరింది. ఏదీ శ్రీ కృష్ణ భగవానుడు మనం కోరుకున్నది ఇవ్వడు. కోరుకున్నంత మాత్రాన ఇవ్వడు. మన అర్హతని బట్టి ఇస్తాడు. వెళ్లిపోయే ముందు మరొక్కపని చేయాలని వుంది. ఆ ప్రయత్నం చేస్తున్నాను. దానిపేరు 'లెక్కచారం'. పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో సంగీత విభాగంలో లెక్చరర్ డాక్టర్ సీత, నూకలగారి శిష్యుడు చక్రపాణి శిష్యురాలు అనసూయ ఈ పనికి నాతో సహకరిస్తున్నారు.

కచ్చేరీలలో స్వరకల్పన చేయదగిన ముక్తాయిలు ఎన్నిరకాలుగా చేయవచ్చునో ఇలా మంచం మీద పడుకునే లెక్కలు వేశాను. Permutations, Combinations లెక్కలు వేయగా సుమారు 120 పైన తేలాయి. నా 'సంగీత సౌరభం' సిరిస్‌లో 16 పుస్తకాలకు అనుబంధంగా ఈ పుస్తకమూ వస్తుంది–ఆఖరి పుస్తకంగా. అది కూడా అయిపోతే ఇంక ఏం జరిగినా విచారం ఉండదు.

నేను సొంతంగా చేసిన పని పాల్ఘాట్ రఘు దగ్గర ముక్తాయిలు రాసుకోవడం. మిశ్రగతి, సంకీర్ణగతిలో రెండు పల్లవులు అమూల్యమయినవి. ఎవరూ చెప్పమంటే చెప్పరు. అవన్నీ మందుగుండు సామగ్రి. పాల్ఘాట్ రఘు దగ్గరికి వెళ్లి "లయ గురించి రహస్యాలు తెలుసుకోవాలంటే మీ పాదాలు పట్టుకోవాల"న్నాను. నా వినయానికి ఆయన ఆనందించాడు.

**ప్రశ్న :** ఈ నూరేళ్లలో మీరు చేయాలనుకున్నదంతా చేయగలిగారా?

**పినాకపాణి :** ఈ పుస్తకం వస్తే అయినట్టే. నూరేళ్లు అయిపోయాయి కదా? ఇంకేమయినా ఎవరూ పట్టించుకోరు. ఏమో! నేను వచ్చిందానికి, చేసిందానికి గుర్తింపు ఉంటుందను కుంటున్నాను. నేను లేకపోయినా నేను చేసింది నిలబడుతుంది. నేను నా జీవితంలో విన్న గాయకులందరి లోనూ 'మంచి'నే ఏరుకున్నాను. ప్రతీదానిలోనూ తేనెనే తీసుకున్నాను. నా బాణీ హిందూస్థానీలో ఘరానా అంటారు కదా? నా పాటలో ఫలానా విద్వాంసుల ఛాయలు కనిపిస్తే– ఆ ఫలానా ఛాయలను మెరుగుపెట్టిన 'మెరుపు'ని మీరు చూస్తారు. నా ఘరానా ఎన్నో ఘరానాల కలయిక. గాయని కిశోరీ అమోంకర్ యిలాంటి మాట అంది నిజానికి ఏ ఘరానా శుద్ధమయింది కాదు. ప్రతిబాణీలోనూ ఏవో కొన్ని లొసుగులు ఉండవచ్చు. ఆ లోపాలను సవరించుకున్నప్పుడే అది మంచి సంగీతమవుతుంది. మనం విన్న గురువులలో గొప్పతనాన్ని మనమే ఏరుకోవాలి. వారు ఒక్కొక్కప్పుడు చెప్పరు. కొందరికి అంతా చెప్పాలన్న మనస్సు ఉండదు. కొందరు సూచన ఇచ్చి వదిలేస్తారు. Notation, description, prescription – యీ మూడూ చాలాముఖ్యం.

**పినాకపాణి :** ఏదయినా సమగ్రంగా నేర్చుకోవాలి. మన కృషి నలుగురికీ చేరాలి. అన్నిటికన్నా ముఖ్యం – నేర్చుకోవడం ఎంత ముఖ్యమో, చెప్పడం తెలియడం అంతే ముఖ్యం. శిష్యుడికి గ్రహించే శక్తి ఉండాలి. గురువు చెప్పనిది వెదుక్కోగలగాలి. తనకి దక్కింది నలుగురికీ పంచాలి.

**ప్రశ్న :** ఇక్కడ నిలబడి వెనక్కి తిరిగి చూసుకుంటే – మీ జీవితంలో ఏ పాత్ర గొప్పగా, తృప్తిగా కనిపిస్తుంది? – వైద్యుడు, భర్త, తండ్రి, గాయకుడు, గురువు – యింకా యింకా.

**పినాకపాణి :** శ్రీ కృష్ణ భగవానుడు నాకు సంగీతమనే వరం ఇచ్చాడు. దానిని సద్వినియోగం చేసుకున్నాననుకుంటాను. ఆయన ఇచ్చిన వరాన్ని సత్ఫలితాలకు వినియోగించు కున్నానని తృప్తిపడతాడనుకుంటాను. రోజూ గాయత్రి జపం చేసుకున్నాక – నాకు సహాయం చేసినవాళ్లు. అండగా నిలిచిన వాళ్లు, నన్ను పైకి తెచ్చిన వాళ్లు, తీసుకొస్తే సంతోషించినవాళ్లు – అందరినీ తలుచుకుని మనస్సులో కృతజ్ఞతలు చెప్పుకుంటాను.

కొన్ని అపూర్వమైన సంఘటనలను ఇక్కడ గుర్తు చేసుకోవాలి.

ముడికొండాన్ వెంకటరామయ్యర్ దగ్గర నెఱవు నేర్చుకోవాలని కోరిక. ఆయన కచ్చేరీ వినిపించమని రంగరామానుజ అయ్యంగార్‌తో అన్నాను. "ఆయన కచ్చేరీలలో పాడడం కాదు. మా యింటికి భోజనానికి పిలిచి పాడిస్తాను. భోజనం ఆయాక, తాంబూలం నమిలి, ఫాన్ కింద పడుకుని పాడవయ్యా అంటే అప్పుడు వినాలి" అన్నారు. ఇది 1944 మాట. "ఆ అవకాశం కల్పించరా?" అన్నాను. నేనప్పుడు మద్రాసులో అసిస్టెంటు ప్రొఫెసర్‌గా ఉంటున్నాను.

ఓ సాయంకాలం రంగరామానుజ అయ్యంగార్ ఉత్తరం రాశారు – శలవు పెట్టి ఇంటికి రమ్మని. ముడికొండాన్ ఉన్నారు. ముగ్గురం భోజనం చేశాం. తర్వాత ముడికొండాన్ నేలమీద బార్లా పడుకున్నారు. ఆయన పాటితే వినాలని నా తహతహ. కాని నా వేపు చూసి "నువ్వు పాడు" అన్నారు. "ఇదేమిటి" ఆయన పాడితేకదా వినాలనుకున్నాను? నన్ను పాడమంటాడేమిటి?" అని రంగరామానుజ అయ్యంగార్‌తో మెల్లగా అన్నాను.

"ఇష్! పాడు" అన్నారు అయ్యంగార్.

27వ మేళకర్త సరసాంగి రాగంలో "నీకేల దయరాదు?" మొదలెట్టాను. రాగం అయింది. నెఱవు ప్రారంభించాను.

"నువ్వు కూడా పాడవయ్యా" అన్నారు అయ్యంగార్ ముడికొండాన్‌తో.

"సరసాంగి నాకు అలవాటు లేదే!" అంటూనే ఎత్తుకున్నారు. అద్భుతం. ఒకే ఆ వృత్త స్వరాలు 20–30 రకాలుగా వేస్తారు. ఇద్దరం గొంతుకలిపాం.

పాడడం మొదలెట్టాక నేను ఎవరినీ లెక్కచేయను. ఎదుటివాడి నెత్తికెక్కిపోతాను.

మా జుగల్ బందీ అయాక ''సరసాంగే ఇలా పాడుతున్నాడు. తోడి, శంకరాభరణం వంటివి ఎలా పాడతాడో!" అన్నారు ముడికొండాన్. అదొక అపూర్వమైన సంఘటన. మరొకటి –

ముసిరి సుబ్రహ్మణ్య అయ్యగార్‌ని కలిసిన సందర్భం. 1971లో డిసెంబరు సంగీతోత్సవాలకి నేనూ, బాలాంబ (పినాకపాణి సతీమణి) వెళ్లాం. ముసిరికి జబ్బు చేసిందని తెలిసింది. అకాడమీ కచ్చేరీలకి రాలేదు. ఆఖరి దశలో ఉన్నారని ఎవరో అన్నారు. చూదామని ఇద్దరం బయలుదేరాం.

ఇల్లు పెద్ద కాంపౌండు. గేటు దాటాం. సాయంకాలం అరుగు మీద కుర్చీలో కూర్చున్నారు ముసిరి. వెళ్తూనా బాలాంబ ఆయన పాదాలకి నమస్కారం చేసింది. నేను ఆయన్ని చూస్తూ పాడిన నెఱవు –

''పరంజ్యోతి నీదు భక్తి వేడక పరనారిపై వలచి యుండగ–" అని పాడుతూ సమీపించాను.

''భేష్! భేష్!'' అన్నారు ముసిరి వింటూనే. నేను పాదాభివందనం చేస్తూ "నెఱవుకి మీరు నా గురువు" అన్నాను. నిజానికి ఆయన కృతులు విన్నాకే నాకు నెఱవు వంటబట్టింది. జనరంజనిలో "నాడాడిన మాట" కీర్తనలో "తలకు వచ్చిన బాధ, తలపాగకు చేరినదంచు..." అన్న చోట, సరస్వతీ మనోహరి రాగంలో "ఎంత వేడికొందు" కీర్తనలో "చింత దీర్చుట కెంతమోడిరా" అన్న చోట ఆయన చేసిన నెఱవు అపురూపాలు.

మరొక గొప్ప జ్ఞాపకం – తిరువయ్యూర్‌లో జరిగినది. 1948 మాట. తిరువయ్యూర్ త్యాగరాజ ఉత్సవాలలో 45 నిముషాలు పండితులు, రసజ్ఞుల సమక్షంలో పాడాను. అయాక నా గదికి వచ్చి సామాన్లు సర్దుకుని స్టేషన్‌కి వచ్చేస్తున్నాను. దారిలో అరియక్కుడి రామానుజ అయ్యంగార్ కనిపించారు. వారితో నాకింతకుముందు పరిచయం లేదు. ఆయన్ని ముఖాముఖీ కలవడం అదే మొదటిసారి. నమస్కారం చేశాను. ఆయన నా పాట విన్నారు. నా భుజం మీద చెయ్యి వేసి నన్ను పక్కకి తీసుకెళ్లారు. ''ఇక్కడ పాడినవాళ్లంతా మంచి విద్వాంసులు. ఎవరి బాణీలో వారు పాడుతున్నారు. కాని పాడే పద్ధతి ఒకటి ఉంది. అది వాళ్లలో లేదు. నువ్వు పాడినదానిలో ఆ పద్ధతి ఉంది. అది వాళ్లలో లేదు. నువ్వు పాడినదానిలో ఆ పద్ధతి ఉంది. అనుస్వరం నీలో పలుకుతోంది. అది గురువులు చెప్పలేరు. ఎవరికి వాళ్లే వంటబట్టించుకోవాలి. గాడ్ బ్లెస్ యూ" అన్నారు.

మరో మరపురాని సంఘటన. ఓ సారి మద్రాసు వెళ్లినప్పుడు జి.ఎన్.బాలసుబ్రహ్మణ్యం గారిని కలుసుకోడానికి ఆయనింటికి వెళ్లాను. ఆయన గదిలో కూర్చుని సాధన చేస్తున్నారు. గదిలో రెండు పక్కలా రెండు నిలువుటద్దాలు. ఎటుచూసినా ఆయనే కనిపిస్తున్నారు.

నన్ను చూసి "ఎవరు నువ్వు" అన్నారు.

"నేను మెడికల్ స్టూడెంటుని. పరిచయం చేసుకోవాలని వచ్చాను" అన్నాను.

మాట్లాడాక, వెళ్లడానికి లేచి "సాయంకాలం రేడియోలో నా కచ్చేరీ వుంది. వీలుంటే వినండి" అన్నారు.

"నువ్వు పాడతావని నాకు చెప్పలేదే!" అన్నారు. పక్కనే ఉన్న అకాడెమీ సెక్రటరీ బాబు కచ్చేరీని గుర్తు చేస్తానన్నారు.

ఆ రేడియో కచ్చేరీలో వీరవసంత రాగంలో "ఏమని పొగడుదురా" పాడాను.

మర్నాడు ఆయన్ని కలుసుకోడానికి వెళ్లాను. ముందు రోజు ఆయనకీ నాకూ ఉన్న దూరాన్ని పూర్తిగా చెరిపేశారు. కూర్చోపెట్టారు. ''నాకు ఆ కీర్తన రాదు చెప్తావా? రాసుకుంటాను?" అన్నారు.

చెప్పాను. చాలా శ్రద్ధగా నోట్ చేసుకున్నారు. హిందూస్థానీ తోడిరాగంలో అబ్దుల్ కరీంఖాన్ రికార్డ్ ఉంది. దాని ఛాయలు కనిపిస్తాయి. రెండు మూడు సంగతులు మరీ మరీ అడిగి చెప్పించుకున్నారు.

"ఫలానా రోజున మద్రాసు యూనివర్సిటీ ఆడిటోరియం లో దీక్షితార్ జయంతి. నువ్వొరా. పాడుదువు గాని" అన్నారు.

వెళ్లాను. దీక్షితార్ కీర్తన - హిందోళనలో "నీరజాక్షి కామాక్షి" పాడాను.

ఆ సాయంత్రం ఆడిటోరియంలోకి వస్తూంటే అకాడమీ సెక్రటరీ బాబు కనిపించారు. లోపలికి వస్తున్న నన్ను ఆపారు.

"Are you Prinkapani? Your music is highly cultural" అన్నారు, అదీ మాట.

మరో అభినందనని మరిచిపోలేను. ఓ సారి కచ్చేరీలో రంగరామానుజ అయ్యంగార్ ఉన్నారు. కచ్చేరీలో షణ్ముఖప్రియ పాడాను. మర్నాడు ఆయన దగ్గరకి వెళ్లాను. "నువ్వు నెఅవు పాడుతూంటే అయ్యర్ పాడినట్టుంది, It is devine అన్నారు. (అయ్యర్ అంటే కోనేరి రాజపురం వైద్యనాథ అయ్యర్. వైతా అనేవారు ఆయన్ని.)

మరో మరిచిపోలేని అభినందన నాకు నా అభిమాన సంగీత సరస్వతి నుంచి దక్కింది. నాకు ద్వారం వెంకటస్వామి నాయుడు గారంటే అత్యంత భక్తి. ఆయన దేవుడే నాకు. ఆ రోజుల్లో వారికి చూపు లేక - సభాసదుల్ని చూసి పాడేవారు కాదు. అంతర్ముఖులయి పాడుతున్నట్టు నా కనిపించేది. ఆయన సంగీతంలో ఆధ్యాత్మికత కనిపించేది. ఆయన వాద్యంలో ప్రతీ సంగతీ దేవునికి సమర్పించే పువ్వులాగ తోచేది నాకు.

నాయుడుగారు మెచ్చుకునే ముగ్గురు హిందూస్థానీ విద్వాంసులు-ఫయ్యాజ్ ఖాన్, ఓంకార్ నాథ్ ఠాకూర్, అబ్దుల్ కరీం ఖాన్. వీరు కాక మరో ఇద్దరు పాశ్చాత్య గాయకులంటే ఆయనకి ప్రాణం-యహూదీ మెనూషిన్, యాషా హైఫెచ్ (Zasha Heifetz). ఆయన ఇంట్లో గోడకి హైఫెజ్ నిలువెత్తు ఫోటో వుండేది. ఆ సంగీతాన్ని వినేవారు. ఆయన ప్రతీ శనివారం సాయంకాలం మూడు గంటలసేపు ఇంట్లోనే కచ్చేరీ చేసేవారు. నేనప్పుడు విశాఖపట్నంలో పనిచేస్తున్నాను. నాకు ఉత్తరం రాశారు. "ఈసారి మీరు పాడండి. నేను వయొలిన్ వాయిస్తాను" అని వెళ్లి మూడు గంటల నలభై నిముషాలు కచ్చేరీ చేశాను. నా గొంతులో పాడిన గమకాలన్నీ యథాతథంగా ఆయన వయొలిన్ పలికింది. ఆయన తమ్ముడు ద్వారం నరసింగరావు. ఆయన్ని చిట్టి అనేవారు. కచ్చేరీ అయాక "చిట్టీ! చూశావా? పాణీ ఎలాపడేశాడో! ఇలా పాడితే ఇంక మనం హిందూస్థానీ సంగీతం వినడం ఎందుకు?" అన్నారు. నాకు దైవసమాను డైన నాయుడుగారిని మెప్పించడం నా అదృష్టంగా భావిస్తాను.

ప్రశ్న : మీ బాణీ, ధోరణి గురించి?

పినాకపాణి : పాట పాడడంలో నేను Idealistని. కొందరు ప్రేక్షకులని అలరించడం కోసం పాడతారు. వాళ్లకి అభినందనలు కావాలి. అది వారి దృష్టి, లక్ష్యం. నేను అలాగ కాదు. జనాన్ని పైకిలాగాలని ప్రయత్నిస్తాను. వారు నా స్థాయికి రాలేకపోతే నేను వారిస్థాయికి దిగను. వారిని నష్టపోడానికి సిద్ధపడతాను. అది నా ప్రవృత్తి, ఆదర్శం, లక్ష్యం.

ఈ సంఘటనలు చెప్తున్నప్పుడు, సంగీతాన్ని గురించి ప్రస్తావిస్తున్నప్పుడూ- వారి వయస్సు తేలికగా ఇరవై ముప్ఫై సంవత్సరాలు వెనక్కిపోయినట్టనిపించింది. ఆ సంఘటనలు నిన్ననో, మొన్ననో జరిగినట్టుగా - వారి కళ్లముందు ఆ దృశ్యాల్ని చూస్తున్నాట్టుగా చెప్పారు. నూరు సంవత్సరాలు ఊరి, పక్వానికి ఆయన ప్రతిభ, మేధాసంపత్తిలో ఈ లక్షణమే జీవశక్తి అనిపించింది.

నూరు సంవత్సరాలకి ఆ శరీరం అలసిపోయిందేమో గాని, వారి మనస్సు, మేధస్సు అలసిపోలేదు. వినూత్న మయిన, విలక్షణమయిన, విభిన్నమయిన కోణాలను సంగీతసారంలో ఇంకా ఇంకా ఆవిష్కరించాలని ఆరాట పడుతూనే ఉంది. అది అపూర్వం.

"మీరు తెలుగు దేశం చేసుకున్న పుణ్యం. సంగీత ప్రపంచానికి దక్కిన అదృష్టం" అన్నాను.

ఆయన కళ్ళు ఆర్ద్రమయ్యాయి. "నేను అంతమాటకి తగుదునా?" అన్నారు. అదీ ఓ పద్మభూషణ్, ఓ సంగీతకళానిధి, ఓ కళాప్రపూర్ణ, ఓ శతవర్షాభిషిక్తుని వినయసంపద.

## కూచిపూడి భాగవతులు
# భాగవతుల సేతురామ్



**కూ**చిపూడి నాట్యసంప్రదాయానికి జనసామాన్యంలో ప్రాచుర్యం కల్పించిన భాగవతుల రామకోటయ్య కుమారుడుగా నృత్య వారసత్వంతో పాటు ఆధునిక ప్రయోగాల్లో కృషి చేస్తున్నారు. రాష్ట్ర రాజధానిలో తొట్ట తొలి *కూచిపూడి నృత్యశిక్షణ* సంస్థగా ప్రభుత్వంచే గుర్తింపు పొందిన *శ్రీ కూచిపూడి నృత్యనిలయములో* వేలమంది కళాకారులను వికసింపజేశారు. 'సోలో'లుగా ప్రముఖుల ప్రసంశలు పొందిన 75 పైచిలుకు వైవిధ్య అంశాలు, ప్రదర్శనలు, భాగవతుల సేతురాం నుంచి వికసించాయి. *తరంగాలు, అష్టపదులు, జావళీలు, పదాలు, తిల్లానా, భావగీతాలు, బృందగీతాలు* వంటి వాటి రూపకల్పనలో ఈయన తన ప్రత్యేకతను పెంచుకున్నారు.

35 నృత్యనాటికలకు ఈయన నృత్యదర్శకత్వం వహించి అందరి మన్ననలు అందుకున్నారు. తను మలచిన ప్రదర్శన అంశాలు వినూత్న శైలిలో ప్రేక్షకుల్ని ఆకర్షించాయి. కూచిపూడి నాట్య సంప్రదాయానికి వన్నె పెంచిన *ప్రహ్లాద నాటకం, రామనాటకం, యక్షగానం* ప్రదర్శించటానికి స్వయంగా విద్యార్థులను తీర్చిదిద్దారు. తెలుగు విశ్వవిద్యాలయం వారు ప్రత్యేకంగా *ఉషా పరిణయం* యక్షగానం ప్రదర్శించటానికి శిక్షణాతరగతుల్ని నిర్వహించారు.

తరాలు మారుతున్న సమకాలీన సమాజంలో అభిరుచి, అభినివేశం పెంపొందించేలా ప్రత్యేక సృజన పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన అంటున్నారు. తరతరాల సంప్రదాయ వారసత్వంలో మౌలిక శాస్త్రీయ అంశాలను పరి రక్షించుకుంటూనే ఆధునిక ప్రదర్శనలు ఇతరుల అభిరుచులకు తగినట్టుగా నృత్యదర్శకత్వంలో మార్పులు చేపట్టాలి. ప్రపంచంలోని ఏ దేశం, ప్రాంతం, భాషకి చెందిన సంగీతం, నృత్యశైలికి అనువైన అన్వయము కూచిపూడి ద్వారా సాధ్యమవుతుందని భాగవతుల సేతురాం విశ్వసిస్తున్నారు. కూచిపూడి నృత్యంలో మూలం చెడకుండా, సందర్భోచితంగా రూపకల్పన కావించాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది, సృజనాత్మకత సంప్రదాయ పరిధిలోనే ఉండాలన్నది ఒక చెప్పనిచట్టం నృత్యనాటికలు, నృత్యాంశాలు, భావగీతాలు, సమకాలీన ఇతివృత్తాలపై నృత్యరూపకల్పన చేస్తున్నప్పుడు ఆయా ఇతివృత్తాల సాంద్రతను బట్టి శాస్త్రీయత (కూచిపూడి నృత్యం) యొక్క అన్వయం ఉండాలి. సమకాలీన ఇతివృత్త నృత్య రూపకల్పన చేసేప్పుడు, శుద్ధ నృత్తం, నృత్యం, అభినయ ప్రయోగం ఇమడదు. అలాంటప్పుడు కూచిపూడి మూలం చెడకుండా, భావావేశ ఆంగికం, నృత్తం, నృత్యం కూర్చాలి. ఏది ఏమైనా, రూపాంతరాలు చెందుతూ, నవ్యతను తనలో ఇముడ్చుకుంటూ, శాస్త్ర బద్ధమై (నాట్యశాస్త్ర గ్రంథాలలోని విషయాలననుసరించియున్న) జనసామాన్యానికి చేరువైన నాట్యం కూచిపూడి అన్నది నిత్యసత్యం.

**శ్రీరామపట్టాభిషేకం :** స్వాతి తిరుణాల్ కీర్తన *భావయామి రఘురామం* ఆధారంగా రూపొందిన నృత్యరూపకం. రామజననం నుండి పట్టాభిషేకం వరకు ఉన్న ఘట్టాలను ఆరుగురు నర్తకులు సూత్రధారులై, వారే పాత్రధారులై ప్రదర్శిస్తారు. *పుత్రకామేష్టి యాగం, యాగ సంరక్షణ, భృగురామ గర్వభంగం, మారీచునివధ, జటాయుమోక్షం, సీతాపహరణం, వారధిబంధనం, రావణ సంహారం మొ॥ ఘట్టాలు* విజయవంతంగా ప్రదర్శింపబడినవి. ఈ నిడివి $1^{1/2}$ గం॥లు. 75 సం॥ శ్రీరామపట్టాభిషేక మహోత్సవం (భద్రాచల క్షేత్రం) సందర్భంగా దేవాదాయ శాఖవారి ఆదేశం మేరకు మొట్టమొదటి సారి ప్రత్యేకంగా ప్రదర్శింపబడింది. (1981) రాష్ట్రసాంస్కృతిక శాఖ వారు, పుట్టపర్తిలో సత్యసాయి జన్మదినోత్సవ సందర్భంగా రవీంద్రభారతిలో కూచిపూడి నృత్యనిలయం వారిచే, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి, శ్రీ వైష్ణవి ఆర్ట్స్

అకాడమి మొ॥ వారు కోరగా ఈ నృత్యరూపకం ప్రదర్శింపబడింది. డి.యస్.వి. శాస్త్రి సందర్భాన్ని బట్టి సంగీతం కూర్చారు. దీనికి సంగీతం "భారతరత్న" యం.యస్. సుబ్బులక్ష్మి గారి పాట ప్రమాణం.

**మాళవికాగ్నిమిత్రం** : రచన నిర్మలాదేవి, ఆంధ్రమహిళాసభ వారి ఆహ్వానం మేరకు ఈ నృత్య నాటిక రూపొందించబడింది. కళాశాల విద్యార్థినిలలో నాట్యం తెల్సినవారు పాత్రలను పోషించారు. సంప్రదాయ పద్ధతిలో నృత్య రూపకల్పన చేయబడింది.

**వసంత రాజీయం** : రచన నిర్మలాదేవి, సంగీతం: శ్రీమతి విజయశ్రీ, ఆంధ్రమహిళాసభ ఆహ్వానం మేరకు ఈ నృత్యనాటిక నృత్యరూపకల్పన కావించబడింది. కళాశాల విద్యార్థినులే పాత్ర పోషణ కావించారు. రెండు సందర్భాలలో ఈ ప్రదర్శన ప్రదర్శించబడింది.

**వీరనారి దుర్గాబాయి** : రచన నిర్మలాదేవి. దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ జీవితంలోని స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలు ఆధారంగా రూపొందించిన నృత్యరూపకం ఆంధ్ర మహిళాసభ రజతోత్సవం సందర్భంగా ప్రదర్శింపబడింది. కళాశాల విద్యార్థినులు పాత్రధారులు. స్వతంత్ర్య నృత్య రూపకల్పన.

**తృణకుసుమం** : రచన నిర్మలాదేవి. తోటలోని పూలన్నీ (గులాబి, మల్లె, సంపంగి, మందారం మొ॥) వాటి యొక్క అందాలనూ, పరిమళం మొ॥ లక్షణాలన్నీ ఒక్కొక్కటీ సగర్వంగా వివరిస్తాయి. గడ్డిపూవు తన వాసన లేని దానని, పూజకు పనికిరాని దానినని వాపోతుంది. భగవంతుని దృష్టిలో సృష్టిలోని ప్రతి ప్రాణి సమానమేనని సూత్రధారుడు చెప్తాడు. స్వతంత్ర్య రూపకల్పన.

**స్వాతంత్రోద్యమం** : రచన నిర్మలాదేవి, ఈ నృత్య నాటికను దూరదర్శన్, హైదరాబాద్, సాంస్కృతిక శాఖ, హైదరాబాద్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం లో మరియు ఇతర సందర్భాలలో ప్రదర్శింపబడింది. స్వాతంత్ర్యోద్యమంలోని ఘట్టాలు ఉప్పుసత్యాగ్రహం, విదేశీ వస్తు బహిష్కరణ, జలియన్ వాలాబాగ్ ఉదంతం మొ॥నవి నృత్యరూపకంలోని ఘట్టాలు.

**జలయజ్ఞం** : రచన సంగీతం ఉషాకాంత్, ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ వారి ఆహ్వానం పై దివంగత ముఖ్యమంత్రి డాక్టరు రాజశేఖర రెడ్డి ప్రాజెక్ట్ ఆధారం ఇతివృత్తంగా నిర్మితమై విశేషంగా ప్రశంసించబడింది.

**ఊర్వశి** : రచన భార్గవీరావు, సంగీతం అమలాపురం కన్నారావు, కళాకారులు- వనజా ఉదయ్, కళాకృష్ణ ఇత్యాదులు. ఊర్వశి జీవిత ఇతి వృత్తంగా నిర్మించబడింది.

**భగవద్గీత** : గణపతి సచ్చిదానంద స్వామి వారి ఆదేశంతో గీతాతాత్పర్యం, గణపతి సచ్చిదానంద స్వామి వారిచే విరచితమైనది. సంగీతం శ్రీ అమలాపురం కన్నారావు, వేదిక మైసూరు నాదమండపం.

సాంస్కృతిక శాఖ వారు నిర్వహించిన నృత్యోత్సవాలు, ఆంధ్రప్రదేశ్‌లో పలుచోట్ల ప్రదర్శింపబడింది. నృత్య రూపకల్పనకి విశేషంగా ప్రశంసలు అందుకొనబడింది. ఆధ్యాత్మిక గీతకు, నృత్య రూపకల్పన చేయటం, చేసి మెప్పించటం నా గురు స్వామి ఆశీర్వాదంగా భావిస్తున్నాను.

**గీతాసారం** : భగవద్గీత చూసి విశేషంగా ప్రశంసించి గణపతి సచ్చిదానంద స్వామి స్వయంగా రచించి, సంగీతం కూర్చి ప్రదర్శింప చేయించారు. విదేశీయులచే మెచ్చుకొన బడింది.

**ఋణానుబంధం** : కథ అనుశృతం. రచన బ్నిం, సంగీతం డి.యస్.వి శాస్త్రి. సాంఘిక ఇతివృత్తం.

**గిరిజాకళ్యాణం** : రచన దండిభొట్ల వెంకట శాస్త్రి, మల్లాది రామకృష్ణ శాస్త్రి, సంగీతం శ్రీ పి.వి.జి. కృష్ణశర్మ, శ్రీ ఘంటసాల వెంకటేశ్వర రావు, ఆంధ్రప్రదేశ్ అంతటా, సిలికానాంధ్రా, అమెరికా, తెలుగు సమాఖ్య, సింగపూర్‌లలో మొత్తం 50 ప్రదర్శనలు ఇవ్వడం జరిగింది. వనజా ఉదయ్ ప్రధాన పాత్రలో ఇతర శిష్యబృందం ఇతర పాత్రలు పోషించారు.

**యుద్ధము-శాంతి:** రచన ఓల్గా, సంగీతం కన్నబాబు, సమర్పణ అస్మిత, యుద్ధానికి కారకులు స్త్రీలు అన్న ప్రచారం అసత్యం. పాకిస్థాన్, ఇండియా విడిపోయిన సమయంలో ఇరువైపుల స్త్రీలు శాంతినే కోరుకుంటున్నారు అన్న సందేశంతో నాటిక ముగుస్తుంది.

నవ్యతతో, సంప్రదాయ పద్ధతితో పాటు, భావ ప్రధానంతో నృత్యరూప కల్పనలో కొత్తదనం నిండిన నాటిక. నాకు ప్రత్యేక ప్రశంసలు తెచ్చిన రూపకమిది.

300 పై చిలుకు ప్రదర్శనలై అంతర్జాతీయ మహిళాదినోత్సవ సందర్భంగా శ్రీలంకలో ప్రదర్శింప బడింది.

# యక్షగానం

తెలుగువారి తెలుగు తనాన్ని చాటి చెప్పేది యక్షగానం. యక్షగానం తెలుగు వాఙ్మయంలో ఒక ప్రత్యేక శాఖగా వర్ధిల్లుతూ వచ్చింది. యక్షగానం ఒక సమాహార కళా స్వరూపం.

యక్షగానం ప్రస్తుతం ఆంధ్ర, తమిళ, కర్ణాటక రాష్ట్రాలలో ప్రదర్శనకు నోచుకుంటోంది. ఆంధ్ర, తమిళ, రాష్ట్రాల్లో తెలుగు భాషలోనూ, కర్ణాటక రాష్ట్రంలో కన్నడ భాషలోను ఈ ప్రక్రియను ప్రదర్శిస్తున్నారు.

*ప్రాచీనాంధ్ర సాహిత్యం* లో యక్షగానం గురించి ప్రస్తావించినవాడు పాల్కురికి సోమన.

**"ఆదట గంధర్వ యక్ష విద్యాథ**
**రాదులై పాడెదు నాడెదు వారు"** అని

తన *పండితారాధ్య చరిత్ర* లో శ్రీశైల శివరాత్రి జాతర జాగరణ సందర్భంలో ప్రశంసించాడు.

శ్రీనాథుడు *భీమేశ్వర పురాణం* లో...

**"కీర్తింతు రెద్దాని కీర్తి గంధర్వులు**
**గాంధర్వమున యక్షగాన సరణిన్"** - అనియు

అల్లసాని పెద్దన - *మనుచరిత్ర* లో...

**"గంధర్వ యక్ష ఘూర్ణితమగు నొక్క కోనగనియె"** అని

నంది తిమ్మన - *పారిజాతాపహరణం* లో...

**"యక్షులు మేళము గూడి పాడు చుందురు దిక్పాల సభల"** అని

అయ్యలరాజు రామభద్రుడు - *రామాభ్యుదయం* లో...

**"గరుడ గంధర్వ కిన్నెర కింపురుష యక్షగానంబు లనూ నంబులై బేరయ .... .... ...."** అని

తెలుగు సాహిత్యంలో యక్షుల గానాభినయ కళలను గూర్చి ప్రస్తావించారు.

యక్షజాతి కీర్తి ప్రతిష్ఠలు హిందూ, బౌద్ధ, జైన మత గ్రంథములు మూడింటను, ఇటు సింహళం నుండి అటు నేపాళం వరకు వ్యాపించినట్లు తెలుస్తోంది.

ఒక విశిష్ట వాఙ్మయ ప్రక్రియ ఎన్ని వాలకములు వేయగలదో అన్ని వాలకములు వేసినది యక్షగానం. ఒక్క ఆంధ్ర దేశములోనేగాక, ఇటు తెలంగాణములో, అటు తమిళనాడు నడిబొడ్డు అను తంజావూరు ప్రాంతమయిన, కన్నడ దేశపు మైసూరు ప్రాంతమునను చారిత్రకాది కారణములచే తెలుగు భాష వ్యవహరింపబడిన పలుచోటుల ఆయా భాషలలోనే కాక తెలుగున వెలసిన యక్షగానములు అనేకములు. ప్రస్తుతము ఇప్పుడు 500లు తెలుగుకు పైగా యక్షగానములు లభించు చున్నవి.

మత ప్రచారమునకు గీతాభినయ కళాత్మక ప్రక్రియలు గొప్ప సాధనములు. పూర్వకాలమున వివిధ దేశములందు పుట్టిన నాట్యసంగీత కళలు అనేకములు మత ప్రచారము కొరకు ఏర్పడి యుండుట లేదా మత బీజకములై యుండుట ప్రసిద్ధ విషయము. పాల్కురికి సోమనాథుడు చెప్పినట్లు శివరాత్ర్యుత్సవ సందర్భమున శ్రీశైలాది క్షేత్రములందు ప్రదర్శింపబడిన యక్ష వేషధారుల ఆట పాటలతో యక్షగానమునకు సంబంధముండి మత ప్రచారము కొరకు చేసిన ప్రక్రియగా అర్థమగు చున్నది. జాక్కుల జాతి గూడ యక్షగాన ప్రదర్శన ద్వారా మత వ్యాప్తి కొరకు పాటు పడ్డారనుటలో అతిశయోక్తి ఏ మాత్రము లేదు.

ఈ యక్షగానమునకు మూలము బొమ్మలాట అని లాక్షణికుల అభిప్రాయం. ఇవి పురాణ, ఇతిహాసములలోని కథలను సామాన్య జనులకు కన్నులకు కట్టినట్లు ప్రదర్శించి చూపుటయే దీని పరమార్థము. వీటియందు ప్రధాన రసము శృంగారము. వీర, కరుణ రసములకు కూడా ప్రాధాన్యత కలదు. హాస్య రసమునకు ఒక ప్రత్యేకస్థానము కల్పించబడినది. అందుచే సింగి-సింగడు, కటికమువాడు, సుంకరి-కొంకడు మొదలైన సంప్రదాయక పాత్రల ద్వారా హాస్యమును బహువిధాలుగా ప్రదర్శించుచున్నారు.

15వ శతాబ్దం ఉత్తరార్థంలో తెలుగులో ప్రప్రథమంగా ప్రోలుగంటి చెన్నశౌరి, *సౌభరి చరితం* రచించాడు. దీనికి సంబంధించిన ఏ ఒక్క ఆధారములు మనకు దొరకలేదు. దీని తదుపరి కందుకూరి రుద్రకవి *సుగ్రీవవిజయం* రచించాడు. ఇది ప్రదర్శనకు కూడా నోచుకున్నది.

*- పసుమర్తి కేశవ ప్రసాద్*

**లక్ష్మణరేఖ :** రచన ఓల్గా, సంగీతం కన్నబాబు, సమర్పణ అస్మిత, స్త్రీ పుట్టుక నుండి చరమాంకం వరకు సమాజంలోని వ్యక్తులు విధించిన కట్టుబాట్లలో నడుచుకోవల్సి వస్తోంది. తండ్రి, భర్త, కొడుకు వీరు విధించిన పరిధులలోనే తన జీవితాన్ని నియంత్రించు కోవాల్సి వస్తోంది. అయినా, నేటి స్త్రీలు ఈ కట్టుబాట్లను ఛేదించుకొని, అనేక రంగాలలో తమ ప్రతిభను చాటు కుంటున్నారు. అత్యంత ప్రజాదరణపొందిన ఈ నృత్యనాటికను ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాలలో 300 పైన ప్రదర్శించబడింది. నవ్యమైన, కొంగ్రొత్త రూపకల్పనతో రూపొందించ బడింది.

**రామారామం :** రచన డాక్టర్ వడ్డేపల్లి, సంగీతం ఈల పాట శివప్రసాద్, భద్రాచల పుణ్యక్షేత్రం, రామునికి ఆక్షేత్రంతో ఉన్న సంబంధం (రామదాసు చరిత) గుహుడు నది దాటించడం, శబరి మోక్షం మొ॥ ఘట్టాలు వివరిస్తూ ప్రదర్శించిన నృత్యనాటిక ఇది. సంప్రదాయ నృత్యరూప కల్పనతో పాటు అక్కడక్కడ సందర్భాన్నిబట్టి స్వతంత్ర్య రూపకల్పన చేయబడింది.

**పుష్పవిలాపం :** రచన జంధ్యాల పాపయ్య శాస్త్రి, సంగీతం ఘంటసాల, ఈ నృత్యరూపకాన్ని ఎన్నో సందర్భాలలో ప్రదర్శించి ప్రేక్షకుల మెప్పు పొందాము.

**వృక్షవిలాపం :** రచన డాక్టర్ నన్నపనేని రాజకుమారి, సంగీతం భాస్కర రావు, ప్రదర్శకులు : ఆంధ్రప్రదేశ్ ఎగువ, దిగువ సభలోని ఎం.ఎల్.ఏలు, మంత్రులు గీతారెడ్డి, వేదవ్యాస్, అంబటి రాంబాబు, వేణుగోపాలాచారి, నన్నపనేని రాజకుమారి మొ॥లగు వారు.

**భామా విలాపం :** ఈ నృత్య రూపకాన్ని కేవలం శ్రీమతి సరళారాణి అభ్యర్థనపై "నృత్యరూపకల్పన" చేశారు. రచన పాలగుమ్మి విశ్వనాథం. వారే సంగీతాన్ని సమకూర్చారు. అత్తగారింటి అగచాట్లను తెలిపిన ఇతివృత్తం. మొదటిసారిగా నేను ఆడవేషం (గయ్యాళి అత్తగా, సరళారాణి కోడలిగా) వేసి మెప్పించారు. "నా భామావిలాపం ఈ రోజు నేనూహించినట్లుగా చూశాను" ఇవి పాలగుమ్మి వారి పలుకులు.

**ద్రౌపది :** రచన ఓల్గా, సంగీతం డి.యస్.వి. శాస్త్రి, గోపాలకృష్ణ, శ్రీమతి స్వాతి సోమనాథ్ కోరగా "నృత్యరూపకల్పన" చేయబడినది. ద్రౌపది మనోభావాలు అవగతం చేసేదే దీని ఇతివృత్తం. నట్టువాంగం చేసి, భీముడు, దుశ్శాసన పాత్రలు పోషించారు. ద్రౌపదిగా శ్రీమతి స్వాతి సోమనాథ్ నా నేతృత్వంలో ఒకమారు రవీంద్రభారతిలో ప్రదర్శింపబడింది.

**గీతగోవిందం :** జయదేవుని అష్టపదులకు, ఉషాకాంత్ గారు (టెలి సీరియల్) సమకూర్చగా నృత్య దర్శకత్వం వహించారు.

**పద్మరాగం :** రచన ల సూ న, నవ్య నాటక సమితి వారిచే సిల్వర్ జూబ్లీ సందర్భంగా ప్రదర్శించబడింది. సూర్యుడు, పద్మాల మధ్య ఉన్న సంబంధం, సూర్య గ్రహణం (రాహువుచే కబళింపబడటం) శివుని అనుగ్రహంతో రాహువు చెరవీడిన సూర్యుడు, ఆనందించిన పద్మాలకు సూర్యాస్తమ సమయం వచ్చిందని నచ్చచెప్పి అస్తమించటం సారాంశం. సమయ నిబద్ధత, క్రమశిక్షణకి నిదర్శనంగా ఈ రూపకం నిలుస్తుంది.

*– మిసిమి*




**డి**సెంబరు మాసం, 1977వ సం॥లో క్రిస్టమస్ పండుగ దినాన (డిసెంబరు 25న) స్విట్జర్‌లాండ్‌లోని వెవే గ్రామ ప్రాంతంలో నున్న తన భవనంలో చనిపోయాడు. అతని ఎస్టేట్‌లో ఆయనను ఖననం చేశారు. 68 రోజుల తరువాత అంటే మార్చ్ 23, 1978వ సం॥లో అతని భౌతికకాయం ఉన్న శవపేటిక సమాధి నుంచి దొంగిలించ బడింది. దొంగిలించిన వారు, 6 లక్షల డాలర్లు డిమాండ్ చేశారు. చాప్లిన్ భార్య ఊనా, వాళ్ల బెదిరింపులకు లొంగ లేదు (ఇలాంటి వాటికి చాప్లిన్ లొంగేవాడు కాదు అంది.) వారితో ఒక పక్క సంభాషణ కొనసాగిస్తూ, పోలీసుల సాయం తీసుకుంది. పదకొండు వారాల తరువాత దొంగలు పట్టుబడ్డారు. మరి ఈ మధ్యకాలంలో ఆ భౌతికకాయం ఎక్కడుంది? దానిని వారు ఒక మొక్కజొన్న తోటలో కప్పి పెట్టారు. దాన్ని బయటకు తీసి చాప్లిన్ కాయాన్ని తిరిగి మొదటి స్థలంలోనే ఖననం చేశారు. భవిష్యత్‌లో మళ్లీ ఇటువంటిది జరగకుండా చాప్లిన్ సమాధిపై 6 అడుగుల మందాన కాంక్రీటు వేశారు. చాప్లిన్ శవపేటికను దొంగిలించిన వారు తూర్పు ఐరోపా దేశాల నుంచి కాందిశీకులుగా వచ్చినవారు. చనిపోయిన వ్యక్తి 'శాంతి'ని భగ్న పరిచారనే నేరం క్రింద న్యాయస్థానం వారిని శిక్షించింది.

* తాజావార్త : మొన్నీ మధ్య ట్రాంప్ వాడిన చేతికర్ర, టోపి, హాలివుడ్ వేలంలో రు. 63 లక్షలు పలికినవి.



ఆదిభట్ల నారాయణ దాసు

# తెలుగు వారి హరికథ

*– దామెర వేంకట సూర్యారావు*

"మానవుడు ఆర్థిక సాంఘిక వైజ్ఞానిక రంగాల్లో మాత్రమే వికాసం చెందితే ఆర్థిక పుష్టి, సాంఘిక గౌరవం, విజ్ఞాన దీప్తి, అభివృద్ధి చెందుతాయిగానీ జీవితంలో ఒక శుష్కత్వం, ఒక నీరసభావం, ఒక నిరానందం మాత్రం తొంగిచూస్తూనే ఉంటాయి. కళారంగం ఈ లోటును తొలగిన్తుంది" అంటారు ప్రసిద్ధ కళావిమర్శకులు సంజీవ్‌దేవ్. కళ జీవితానికి పరిపూర్ణతను సౌష్టవాన్ని ప్రసాదిస్తుంది. కళ సౌందర్య భరితం, సత్యాన్వేషణ, సుఖాన్వేషణ, సౌందర్యా న్వేషణ మానవుని జీవనయాత్రలో విశిష్టమైన లక్షణాలు. భారతీయ సంప్రదాయంలో సకల కళలు, సర్వవిద్యలు భగవదును ముఖాలై, పరమార్థ సాధనాలై ఉండాలనే భావన ఉంది.

జాతి సంస్కృతిక వాస్తవ దర్పణం లలితకళలు సామాజికాలను సంస్కారవంతులుగా తీర్చిదిద్దేవి కళలు. ఒకప్పటి కళాప్రయోజనం మానసికానందమే. ఈ నాటి కళల ప్రయోజనం సామాజిక చైతన్యం దేశకాల పరిస్థితుల ప్రభావం వల్ల ఎన్నో కళారూపాలు జనజీవితంలోనే అంతరించి పోయాయి. మరికొన్ని ఆదరణ లేక నామమాత్రావ శిష్టమయ్యాయి. ఒకప్పుడు తెలుగునాట పండుగల్లోను, పబ్బాల్లోను, ఉత్సవాల్లోను, పెళ్ళిల్లలోను, పల్లెప్రజలను, పట్నవాసులను కూడా విశేషంగా అలరించిన కళారూపం 'హరికథ' మార్గ–దేశి సంప్రదాయాల్లో హరికథ 'దేశి' తెగకే చెందుతుంది. ఐతే విద్వత్కవుల ప్రాపకంలో 'మార్గ' సంప్రదాయంవైపు మళ్ళడమూ కనిపిస్తుంది.

**హరికథ–పురాణం:** జానపద మధ్యమంగా ఇతర కళారూపా లతో పాటు ప్రాచీన కాలం నుంచి ప్రవర్తిల్లినది పురాణ ప్రవచనం. పురాణ ప్రవచనం చేసే సూతుల వ్యవస్థ ఉండేది. భారతదేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ దాదాపుగా పురాణ ప్రవచనం ఒక కళారూపంగా ఉండేది.

వేదవ్యాసుని తండ్రి పరాశరుడే మొదటి పౌరాణికుడుగా విష్ణుపురాణం వల్ల తెలుస్తోంది. వ్యాసుని కుమారుడు శుకమహర్షి, వ్యాసుని శిష్యులు పైల, జైమిని, వైశంపాయన, సుమంతు, రోమహర్షణులు పురాణ ప్రవచన పారీణులుగా గుర్తించడం జరిగింది. పురాణ ప్రవచనమే అనేక జానపద కళారూపాలకు జన్మభూమి. పురాణ ప్రవచనానికి సంగీత ప్రధానమైన కీర్తనలను జోడిస్తే 'హరికథగా' రూపొందుతుంది. భక్తి తత్త్వమే ప్రాణంగా హరికథ ఆవిర్భవించింది.

**హరికథ–యక్షగానం:** యక్షగానం 'హరికథ'కు మూలరూపంగా పెక్కుమంది భావించారు. యక్షగానాలు హరికథలుగా ఏకవ్యక్తి ప్రదర్శనలయ్యాని బాలాంత్రపు రజనీ కాంతరావు అభిప్రాయం. ప్రసిద్ధ కళా విమర్శకులు శ్రీనివాస చక్రవర్తి యక్షగాన ప్రబంధాలకు రూపాంతరాలే బుర్రకథ, హరికథ, కలాపం అనే కళారూపాలని భావించారు. సహకార గానం తోడయితే యక్షగానం హరికథగా పరిణమిస్తుందని పెక్కు మంది భావన.

**మరాఠీ మూలం:** హరికథా పితామహులు ఆదిభట్ల నారాయణ దానుతో సహా పెక్కుమంది హరికథకు ఆదిమపీఠం మహారాష్ట్ర ప్రాంతమని అంగీకరించారు. మరాఠీ భాషలోని తుకారాముని 'అభంగాలు' మూలమని చాలమంది పేర్కొన్నారు 'దోహరా' మరాఠీ భాషలో ప్రసిద్ధమైన సంగీత రచనాను కూలమైన ఛందో విశేషం. తెలుగులో దీనిని 'తోపరా, తోహరా' అని వాడుతుంటారు. ఇది తెలుగు వారి హరికథ, ఇతర సంగీత రచన విశేషాల్లోను ప్రయుక్త మయిందని, దీనిని హరికథ రచయితలు వాడుకున్నారని ఆచార్య తూమాటి దోణప్ప గారు వివరించారు. తెలుగు, మరాఠీ ప్రాంతాలు భౌగోళికంగా సన్నిహితమైనవి. చారిత్రక, సాంస్కృతిక సంబంధాలూ ఉండేవి. తమిళనాడులోని తంజావూరు ప్రాంతాన్ని పాలించిన మహారాష్ట్ర పాలకుల కాలంలో తెలుగులో యక్షగాన రచన వర్ధిల్లడం తెలిసిందే. మహారాష్ట్రులు హరికథను 'కీర్తన' అని వ్యవహరిస్తారు. కథా గాయకుణ్ణి 'కథాకారీ', 'కీర్తనకారీ' అని పిలుస్తారు. బాలగంగాధర తిలక్ జాతీయోద్యమ ప్రచారం కోసం హరికథాగాన రీతని ప్రోత్సహించినట్లు తెలుస్తోంది.

**హరికథ–నామౌచిత్యం:** హరికథ అనే పేరుతో ప్రచుర వ్యవహారంలో ఉన్న కళారూపానికి ఆంధ్రదేశంలోను, ఇతర రాష్ట్రాల్లోనూ అనేక పర్యాయ వాచకాలు వాడుకలో ఉన్నాయి. కథాకాలక్షేపం, కీర్తనం, యక్షగానం, హరికీర్తన, హరిసంకీర్తనం అని దక్షిణ దేశభాషల్లోని వ్యవహారాలు. ఆది భట్ల నారాయణదాసు హరికథను అచ్చతెనుగులో 'వేల్పు ముచ్చట' అన్నారు. 'హరి' అనే మాటకు నానార్థాలు ఉన్నా 'విష్ణువు అన్న అర్థమే రూఢి'లో వుంది. హరికథ అంటే

హరి శబ్ద వాచ్యుడైన విష్ణువు యొక్క కథ అని సామాన్యర్థం. కాలక్రమంలో హరి లీలాలక్షణాలకే గాక ఆయన పరివారానికి, భక్త పరంపరకూ, అసంఖ్యాక దేవతాకోటికీ సంబంధించిన ఇతివృత్తాలకే ఈ హరి కథ వ్యాపించింది. ఒకప్పుడు భగవత్కథలకే పరిమితమైన 'హరికథ' పరిధి అనంతర కాలంలో విస్తృతమైంది.

దేశనాయకుల జీవితగాథలు, త్యాగయ్య, రామదాసు వంటి వాగ్గేయకారుల చరిత్రలు హరికథలయ్యాయి. క్రమంగా వయోజన విద్య, కుటుంబ సంక్షేమం, వరకట్నం ఇంకా అనేక సాంఘిక దురాచారాలు, సాంఘిక సమస్యలు హరికథల ఇతివృత్తా లయ్యాయి. ప్రభుత్వం తమ కార్యక్రమాల ప్రచారానికి బుర్రకథల్లాగే హరికథకులనీ వినియోగించుకున్న సందర్భాలు ఉన్నాయి. క్రైస్తవుల ప్రార్థనా మందిరాల్లోనూ 'హరికథ' వినిపిస్తుంది.

ఆధునిక సమాజంలో హరికథ కేవలం భక్తి, జ్ఞాన, వైరాగ్య, ప్రబోధానికి మాత్రమే సాధనం కాదని సమాజంలోని మానవాళిని ఉత్తమ పథాను వర్తనులుగా మార్చడానికి ఆలంబనంగా స్వీకరిస్తున్నారని భావించవచ్చు. హరికథ వినోద, విజ్ఞానాలను అందించటంతో పాటు నైతిక ప్రయోజనం గల కళారూపంగా, దాని సామాజిక ప్రయోజనాన్ని గుర్తించారు. ఇతివృత్త వైవిధ్యంలో 'హరికథ' ఒక సాహితీ ప్రక్రియగానూ ఒక కళారూపంగానూ స్థిరపడింది.

**హరికథ-ప్రయోగం:** హరికథ యక్షగానంలో సమాహార కథాసాహిత్యం, సంగీతం, నృత్యాభినయం సంగమించిన కళాస్వరూపం. "శిశుర్వేత్తి, పశుర్వేత్తి, వేత్తి గానరసం ఫణీ" అని సంగీతం ఒక వైశిష్ట్యాన్ని సంతరించుకుంది. ప్రజలను అలరించే శక్తి సంగీతానికే ఉండటం వల్ల తన కథలోని ఇతివృత్తానికి అనుగుణమైన కీర్తనలు, పద్యాలు, గేయాలు మొదలైన వాటిని చక్కని సంగీతంతో సమ్మేళనం చేసి జన హృదయాల్లో సూటిగా నాటుకొనేలా రసభావ సమ్మేళనంతో గానం చేస్తున్నారు కథకులు. హరికథాగానాల్లో సంగీతం గాత్ర ప్రధానం. జంత్రగౌణం అంటే వాద్యాల గాత్రానికి సహకారులన్నమాట. ఐతే హరిదాసులందరికీ సంగీతంలో ఒక మాదిరి ప్రవేశమో, అభినివేశమో తప్ప కథాగాన నిర్వహణకి వలసినంత వ్యుత్పత్తి, కనిపించదు. సంగీత సాహిత్యాల రెండింటిలోనూ నిష్ణాతులైన దాసులు కూడా చాలామంది లేక పోలేదు.

**ఆవిర్భావ వికాసాలు:** ఆదిభట్ల నారాయణ దాసు హరికథా రంగానికి తమ రచనల ద్వారా, ప్రవచనం ద్వారా, ప్రయోగాల ద్వారా ఒక రమణీయ సంప్రదాయాన్ని సిద్ధపరచి అసదృశ సేవలందించి హరికథా పితామహు లయ్యారు. కానీ వారికి ముందే హరికథ తెలుగునాట ప్రచారంలో ఉండేదనటానికి ఆధారాలు ఉన్నాయి. చెన్నపట్నం నుండి విజయనగరం వచ్చి కానుకుర్తి వారి ఇంట ధృవ చరిత్రను హరికథగా చెప్పిన కుప్పుస్వామి నాయుడని, దాసు తన హరికథాస జీవితానికి ఉద్బోధకుడని నారాయణ దాసుగారు తన ఆత్మకథ *నా యెఱుక* లో స్పష్టంగా తెలిపారు. నారాయణ దాసు 1883లో తొలిసారిగా ధృవ చరిత్ర హరికథ చెప్పారు. నారాయణ దాసు సాక్షాత్తు, శిష్యుల్లో వాజపేయుల వెంకట సుబ్బయ్య, నేతి లక్ష్మీనారాయణ దాసు ముఖ్యులు. నారాయణ దాసు కంటే ముందు కాళహస్తి సంస్థానాధిపతులు దామెర కుమార వెంకటప్ప, కృష్ణప్ప నాయని గార్ల ఆస్థాన గాయకులు మునిపల్లె సుబ్రహ్మణ్యకవి రచించిన అధ్యాత్మ రామాయణ కీర్తనలు మన హరికథలకు తొలిరేఖలని శ్రీనివాస చక్రవర్తి పేర్కొన్నారు. నారాయణ దాసుగారి తర్వాత పెద్దింటి సూర్యనారాయణ దీక్షితులు పండిత, పామర రంజకంగా హరికథా రచన సాగించారు. ముసునూరి సూర్యనారాయణ శాస్త్రి మధురసంగీత కథాగానంతో ప్రజలను ముగ్ధుల్ని గావించే వారు. నారాయణ దాసు శిష్యులు ములుకుట్ల సదాశివ శాస్త్రి కర్నాటక సంగీత విద్వాంసులు. వీరు త్యాగరాయ చరిత్రను అద్భుతంగా గానం చేసేవారు. కాలక్రమంలో మహిళలు కూడా ఈ రంగంలో ప్రవేశం చేశారు. బెజవాడ నగరాజ కుమారి, ఇందిరాబాల, దుర్గాంబ మల్లీశ్వరి, మంత్రి ప్రగడ లలితకుమారి, సరిదె లక్ష్మీనరసమ్మ, కళ్యాణి మొదలైన వారు ప్రసిద్ధులు.

**సామాజిక ప్రయోజనం:** కాలగతిని అనుసరించి హరికథా కథనంలో మార్పులు చోటుచేసుకున్నాయి. కథానుకూల హాస్య ప్రసంగాల్లో సినిమాపాటలు, పిట్టకథలు, అశ్లీల సంభషణలు విజృంభించి హరికథలు నేతిబీర కాయలయ్యాయి. కథాగానంలో ధార్మికమైన మానవీయ విలువలను శ్రోతలకు సందేశంగా అందించాలి. దేశ కాల పరిస్థితులను బట్టి సామాజిక చైతన్యాన్ని కలిగించేలా హరికథలను తీర్చి దిద్దాలి. ప్రజల్లో దేశభక్తిని, ఉన్నత విలువలను, ప్రచారం చేయడానికి హరికథ సాధనం కావాలి. ఆధ్యాత్మిక, లౌకిక సంస్కృతులను, సమకాలీన సమాజ ధోరణులను ప్రతిబింబిస్తూ జాతిని జాగృతం చేయాలి. ప్రభుత్వ పరంగా ఈ కళారూపం పునరుజ్జీవనానికి కృషి జరగాలి.

డాక్టరు దామెర వేంకట సూర్యారావు, ఫోన్ : 9885188431

# అట్టమీద బొమ్మలు



**ముఖచిత్రం : అపోలో–డాఫ్నీ** .... *చిత్రకారుడు* – వాటర్ హౌస్.

గ్రీకు వాఙ్మయం ప్రకారం వారికి సృష్టికర్త లేదు, కానీ దేవతలున్నారు. నింగి, నేల, సముద్రం మొదలైన వాటన్నిటికీ ఆధిపత్య దేవతలున్నారు. ఈ దేవతలందరకూ అధిపతి జ్యూస్ కుమారుడైన అపోల్లో, గ్రీకు దేవతలలో ముఖ్యుడు. ఇతను సూర్యుడు. అందానికి, ఆరోగ్యానికి ప్రతిబింబం. పురుష దృఢత్వానికి, సౌందర్యానికి ప్రతీక. అతను వెలుగులు చిమ్మే దేవుడయినా సంగీతానికి, జ్యోతిష్యంలాంటి విద్యలకు మూలకారకుడు. గొప్ప వేటగాడు. పశువుల కాపర్లను వారి మందలను నిరంతరం రక్షిస్తూ ఉంటాడు. ఇవేకాక మరెన్నో బాధ్యతలున్నాయి. తన తండ్రయిన జ్యూస్ గొప్పదనాన్ని, లీలలను పాటల రూపంలో అందరికీ వినిపిస్తూ ఉంటాడు. అపోలో చిన్నతనంలోనే మనుష్యులను బాధిస్తున్న ఒక రాక్షసుణ్ణి డెల్ఫిన్ అనే చోట వధిస్తాడు. ఆ స్థలం గ్రీసు దేశం మధ్యనున్నదని, దాని చుట్టూ గ్రీసు ఆవరించి ఉందని ప్రాచీన గ్రీకుల నమ్మకం.

అపోల్లోకు గొప్ప గుణాలతోపాటు, కొన్ని లోపాలు కూడా ఉన్నాయి. మనుష్యులను రోగాల బారినుండి కాపాడే దేవతయినప్పటికీ, కోపం వస్తే ప్రజల మీదకి జబ్బులను, రోగాలను వదులుతాడు. అపోల్లో ఏనాడూ ప్రేమలో విజయం సాధించలేదు. అతను ఎందరి పైనో మోహాన్ని పెంచుకున్నా, చివరకు విఫల మనోరథునిగా మిగిలాడు.

పర్వత రాజపుత్రయిన డాఫ్నీ పై మరులు కొంటాడు. బలవంతాన ఆమె చేయిని పట్టుకోబోయినపుడు ఆమెకు ఇష్టం లేక లైర్ అనబడే ఒక సంగీత పరికరానికి అవసరమయ్యే వృక్షంగా మారిపోతుంది. ఈ చిత్రం ఆ గాథను మన కళ్ళ ముందుంచుతుంది. గ్రీకు దేశస్థులకు మరొక ప్రత్యేకత ఉంది. వారికి దేవతలంటే భయభక్తులున్నా, దేవదతలతో పరాచకాలాడే చనువు వుంది. అపోల్లో ఒక దేవతగా క్రైస్తవ మతం ప్రాబల్యం వచ్చేంత వరకూ ప్రజలతో పూజలందుకున్నాడు.



**రెండవ అట్ట : వనదేవత–చీకటి దేవుడు** .... *శిల్పి* – బెర్నినీ.

పెర్సిఫోన్ : పెర్సిఫోన్ గ్రీకు మైథాలజీ ప్రకారం వనదేవత గ్రీకు పురాణాలలో అగ్రగణ్యుడైన జ్యూస్ కుమార్తె, హెడ్స్ నరకాధిపతి చీకటి ప్రపంచపు రారాజు. పాపులను శిక్షిస్తుంటాడు. పెర్సిఫోన్ అందానికి ముగ్ధుడై ఆమెను ఎత్తుకు పోయి నరకానికి తీసుకొనివెడతాడు. వనదేవత భూమిపై నిష్క్రమించటంతో భూమి ఎడారిగా మారుతుంది. సంగతి తెలుసుకున్న దేవేంద్రుడైన జ్యూస్ హెడ్స్‌ను పిలచి ఆమె అంగీకారం లేకుండా వివాహం చేసుకోవడానికి వీలులేదని చెబుతాడు. ఇంతలో జ్యూస్ ఆజ్ఞలకు వ్యతిరేకంగా హెడ్స్ ఇవ్వగా పెర్సిఫోన్ ఒక దానిమ్మ పండును రుచి చూస్తుంది. దానితో కోపం తెచ్చుకున్న జ్యూస్ ఆమె భూమిపై శాశ్వతంగా తిరిగి రావడానికి అనుజ్ఞ నిరాకరించటంతో, ఆమె హెడ్స్‌ను వివాహం చేసుకుని ఆరు నెలలకాలం నరకంలో, మరో ఆరు నెలలకాలం భూమిపైనున్న ఒలింపిక్ పర్వతంలో తల్లితో నివసిస్తూ ఉంటుంది. ఆమె భూమిపై సంవత్సరంలో ఆరు నెలలకాలం ఉంటడము వలన భూమిపై ఆరు నెలలు మాత్రమే పంటలు పండుతాయిని గ్రీకులు నమ్ముతారు.



**మూవడ అట్ట : సెయింట్ థెరిస్సా ఆధ్యాత్మిక పారవశ్యం** ... *శిల్పి* – బెర్నినీ.

“సెయింట్ థెరిస్సా పక్కనే యౌవనంలో నున్న ఒక దేవత మానస రూపంలో నిలబడి వుంది. ఆ దేవత చేతిలో ఒక బంగారు బాణం నా గుండెలను చీల్చుతున్నట్లుగా ఎక్కుపెట్ట బడి వుంది” అని ఒక పారవశ్యంతో చెప్పిన మాటలకు శిల్పరూపమిది.



**నాల్గవ అట్ట : సెయింట్ పీటర్** ... *చిత్రకారుడు* – కార వేగియో, కాథలిక్ మత శాఖకు ముఖ్యుడైన మత ప్రవక్త పీటర్. రోమ్ నగర పాలకుడైన నీరో, పీటర్ క్రైస్తవ మత వ్యాప్తి చేస్తున్నాడని భావించి శిలువపై మరణాన్ని శిక్షగా వేస్తాడు. అంతకు కొన్ని సం॥ల ముందే జీసస్‌కు అదే శిక్ష విధించబడిన కారణంతో సెయింట్ పీటర్ తన మరణం భిన్నంగా ఉండాలని భావించటంతో, అతని కోరికపైనే అతను తల్లక్రిందులుగా శిలువ వేయబడి మరణిస్తాడు.



# రుక్మిణి అరుండేల్

– కాంద్రేగుల నాగేశ్వరరావు

1930 నాటికి మద్రాను (ఇప్పటి చెన్నై) దక్షిణాదికే తలమానికమై వర్థిల్లుతున్న ఒక మహానగరం. శ్రీకాకుళం నుంచి మద్రాసు వరకూ సముద్రతీరాన్ని ఆనుకుని వున్న ప్రాంతాన్ని కోస్తాప్రాంతమని, మద్రాసు నుంచి కన్యాకుమారి వరకూ వున్న ప్రాంతాన్ని కోరమండల్ అని, పడమటి దిక్కున సముద్రాన్ని ఆనుకుని కేరళ నుండి ఉత్తరాన మహారాష్ట్ర సరిహద్దుల వరకూ వున్న ప్రాంతాన్ని మలబారు ప్రాంతమని వ్యవహరించేవారు.

వింధ్యపర్వతాలకు దిగువనున్న దంతా దక్షిణాపథమే అయినా వ్యవహారికంలో మహారాష్ట్రను మినహాయించి మిగిలిన ఆంధ్ర, తమిళ, కన్నడ మళయాళ ప్రాంతాలను దక్షిణభారత దేశమని వ్యవహరించారు. వీటన్నిటికీ ముఖ్యపట్టణం మద్రాసుకావటం, మద్రాసులో పైన చెప్పిన జనాభా అందరూ ఉండటముతో, భాషా రాష్ట్రాల అవతరణ (1956సం॥) వరకూ దక్షిణభారతదేశీయులను ఉత్తరాది వారు మద్రాసీలని పిలిచేవారు. భారతదేశములో విదేశీదాడులకు లోనుకాని ప్రాంతం ఈ దక్షిణాపథమే. మతపరమైన దేవాలయ నిర్మాణాలలో, మండలపాలలో, వాస్తునిర్మాణంలో సంగీతంలో, చిత్రకళలో, నాట్యంలో తమదైన పురాతన సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించు కుంటూ గర్వంగా తలెత్తుకు నిలబడిన అతి ముఖ్యమైన భారతీయస్రవంతికి నిలువెత్తు సంతకం ఈ ప్రాంతం. ఆధునికమైన వేష, భాషలు జనస్రవంతిలో ప్రవేశించినా అది ఉపరితలానికే పరిమితమయింది తప్ప ఇంగ్లీషు చదువులు దక్షిణభారరత సంస్క ృతి సంప్రదాయాల పునాదుల్ని తాకలేక పోయింది. ఈ సంగమ కూడలికి క్షేత్రస్థానం మద్రాసు.

మద్రాసులో చూడదగ్గ ప్రదేశాలలో ముఖ్యమైనది అడయార్ ప్రాంతం. పట్టణ అంతర్భాగంలో పల్లె సొగసులకు అద్దం పట్టేది అడయార్. ఇది ప్రకృతి సౌందర్యానికి నెలవు. అడయార్‌లో వందలాదిగా ఊడలు దిగివున్న మఱ్ఱిచెట్టు వుంది. దీని అసలు కాండం ఎదో తెలుసు కోవటం చాలా కష్టం. మొదలు, చివర అంటూ తెలియకుండ పందిరిలా అల్లుకు పోయిన మహా వృక్షమది. (ఇప్పుడది కూలిపోయింది). దానిని తనలో కలుపుకుంటూ ఆ ఆవరణలోనే ఉంది థియోసాఫికల్ సొసైటి. ప్రఖ్యాతి గాంచిన భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలకే కాదు విశ్వమానవ సౌభ్రాతృత్వానికీ సమస్త మత సామరస్యానికీ, సోదర భావాలకు కూడలిగా నిలచింది. అంతేకాక కాలక్రమంలో దానికి అనుబంధ శాఖగా విస్తరిల్లిన కళాక్షేత్ర కేంద్రస్థానం కూడా అదే.

ఎంతో ప్రశాంతంగా వున్న మద్రాసు నగరం. డిసెంబరు 1935వ సంవత్సరంలో ఒక్కసారిగా ఉలిక్కి పడింది. కారణం ఒక బ్రాహ్మణ వివాహిత స్త్రీ మొదటిసారిగా గజ్జెకట్టి, నాట్యానికి అరంగేట్రం చేయటం, అంత వరకూ సభ్యసమాజంతో సంబంధాలున్నా దూరంగా ఉంటూ వచ్చిన దేవదాసీలకు మాత్రమే పరిమితమైన నృత్యంలోనికి ఒక ఉన్నత కుటుంబానికి చెందిన స్త్రీ ప్రవేశించటం. ఆమె పేరు రుక్మిణి.

ఇంతకీ ఎవరీ రుక్మిణి ? ఎవరీ రుక్మిణి అరుండేల్?

1977వ సంవత్సరంలో జనతాపార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత అప్పటి ప్రధాని మొరార్జీదేశాయ్ ఆమె భారతదేశ రాష్ట్రపతి పదవికి అన్నివిధాలా యోగ్యురాలని భావించారు. అయితే ఆమె దానిని సున్నితంగా తిరస్కరించారు. 1956లో ఆమెకు పద్మభూషణ్ అవార్డు లభించింది. 1975లో సంగీతనాటక అకాడమీ సభ్యత్వానికి ఆమె నామినేటయ్యారు. 1955వ సంవత్సరం నుంచి ఆమె మరణించేవరకు సుమారు 31 సంవత్సరాలు ఇంటర్‌నేషనల్ వెజిటేరియన్ యూనియన్‌కు ఆమె ఉపాధ్యక్షులుగా ఉన్నారు.

టిబెట్ పై చైనా ఆక్రమణను ఖండించిన వారిలో ఆమె ఒకరు. చివరి వరకు టిబెట్ స్వాతంత్ర్యం కోసం తన వంతుగా గొంతు వినిపించారు.

రుక్మిణి అరుండేల్ తండ్రిపేరు నీలకంఠ శాస్త్రి. మద్రాసు రాష్ట్రంలోని తిరువేసనల్లూరు నివాసి. సంస్కృత భాషలో నిష్ణాతుడు. ఉపనిషత్తులు పై తనదైన వాఖ్యానాలను వ్రాసి ప్రచురించారు. మద్రాసు Presidency Executive Engineer గా పనిచేశాడు. Dam నిర్మాణం, కాలువ పరిరక్షణలో భాగంగా రాష్ట్రంలో ఎన్నో చోట్ల పనిచేశారు. రుక్మిణి చిన్నతనంలో కొంతకాలం బొబ్బిలిలో పనిచేశారు. పిల్లలందరకూ తన మాతృభాషయిన తమిళంలోనే విద్యాబుద్ధులు చెప్పించారు. ఎంత సంప్రదాయ వాదో, అంత సంస్కరణాభిలాషి. స్త్రీల పట్ల మతం యొక్క చిన్నచూపును నిరసించినవాడు. ఆరోగ్యరీత్యా ఉద్యోగానికి రాజీనామా చేసి మద్రాసు వద్దనున్న అడయార్ లోని థియోసాఫికల్ సొసైటీకి దగ్గరలో ఒక ఇల్లు తీసుకొని అందులో తన ఎనమండుగురు పిల్లలతో నివసించే వారు. తాను నివసించే ఇంటికి బుద్ధనివాస్ అని పేరు పెట్టుకున్న బౌద్ధాభిమానాయిన. థియోసాఫికల్ సొసైటీ కార్యక్రమాలు అన్నింటి లోనూ నీలకంఠ శాస్త్రి కుటుంబ సభ్యులంతా పాల్గొనేవారు. 12 సం॥ల వయస్సులో మొదటిసారిగా రుక్మిణీ దేవి అనిబిసెంటును చూసి ఆమెపట్ల ఆకర్షితులైనారు. ఆ విధంగా రుక్మిణికి చిన్నతనంలోనే థియోసాఫికల్ సొసైటీలో మమైక్యత ఉండేది.

అనిబిసెంటు అధ్యక్షురాలుగా నున్న థియోసాఫికల్ సొసైటీకి ప్రపంచపు నాలుగు చెరగులా అభిమానులుండే వారు. ఆమె సిద్ధాంతాల కనుగుణంగా పని చేసే హేమాహేమీలైన మేధావులుండేవారు. వారిలో ప్రసిద్ధులు హెచ్.పి. బ్లావీట్స్కీ; హెచ్.ఎస్. ఆల్కాట్; సి.డబ్ల్యు. లెడ్ బీటర్; జి.యన్. అరుండేల్; ఎ.పి. సినెట్; సి. జినరాజదాస; శ్రీరామ్ (రుక్మిణి అన్నగారు); ఇందులో జి.యస్. అరుండేల్ ఐరిష్ దేశానికి చెందిన ఉన్నత కుటుంబీకుడు. అరుండేల్ కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో ఎమ్.ఎ., యల్.యల్.బి, డి.యల్.ఐ.టి చేశారు. అనిబిసెంటు కోరికపై భారత దేశానికి వచ్చిన కొత్తలో సెంట్రల్ హిందూ కాలేజిలో ప్రొఫెసర్ ఆఫ్ హిస్టరీగా చేరి, తరువాత అదే కాలేజీకి ప్రిన్సిపాల్ అయ్యారు.


రుక్మిణి అరుండేల్ వివాహానంతరం

అనిబిసెంట్ బెనారస్‌లో సెంట్రల్ హిందూ కాలేజిని మదన్ మోహన్ మాలవ్యాకు అప్పజెప్పి అడయార్ వచ్చారు. ఆమెతో మద్రాసుకు మకాం మార్చారు అరుండేల్.

1919లో నీలకంఠశాస్త్రి గుండెకు సంబంధించిన జబ్బుతో తీవ్ర అస్వస్థకు లోనయ్యాడు. ఆయనను తరచు వచ్చి కుశల ప్రశ్నలు వేసేవాళ్ళలో థియోసాఫికల్ సొసైటీ ప్రముఖులెందరో ఉండేవారు. అయితే ప్రముఖంగా చెప్పదగ్గ వ్యక్తి అరుండేల్. పెద్ద కుమారుడైన శ్రీరామ్ తండ్రి బాగోగులు చూసుకుంటూ, ఆయన ఆరోగ్యంపై శ్రద్ధవహించేవాడు. అప్పటకి రుక్మిణి వయసు 15 సం॥లు. చక్కటి ముఖవర్చస్సు, తుమ్మెద రెక్కల లాంటి వంకీలు తిరిగిన దట్టమైన నల్లటి జుట్టూ ఆమె సహజ సౌందర్యానికి మరింత శోభనిచ్చాయి.

ఈ సందర్భంలోనే అరుండేల్ ఆమె వైపు ఆకర్షితులైనాడు. అది పరస్పర ఆకర్షణగా రూపుతీసుకొంది. ఆమెను వివాహం చేసుకోవాలనే కోరిక ఆయన వెలిబుచ్చారు. రుక్మిణి సమ్మతించింది. ఇదంతా జరిగేలోపునే నీలకంఠశాస్త్రి మరణించాడు. 1920లో వారు వివాహం చేసుకోవాలనే కృతనిశ్చయానికి వచ్చినపుడు మద్రాసులో నున్న హిందూ, బ్రిటిష్ కమ్యూనిటీలు రెండూ అవాక్కయినాయి. 41 సంవత్సరాల వయస్సు గల ఉన్నత కులీనత కలిగిన అరుండేల్, 16 సం॥ల బ్రాహ్మల అమ్మాయిల మధ్య వివాహం అనేక అపోహలకు దారి తీసింది. థియోసాఫికల్ సొసైటీ సభ్యులే దీనిని రంగరించుకోలేక పోయారు. ఇక మిగతావారి విషయం చెప్పనవసరం లేదు.

అరుండేల్ మహోన్నతమైన వ్యక్తి, గొప్ప మానవతావాది. అతని పట్ల ఎందరో స్త్రీలు ఆకర్షితులవటం నేనెరుగుదును. సొసైటీకి పని చేయటం తప్ప మరొక దేనిపైనా దృష్టి కేంద్రీకరింపని అరుండేల్‌ను రుక్మిణి అంతగా ఆకర్షించిందంటే అది రుక్మిణి గొప్పతనమే అని రుక్మిణి సోదరైన విశాలాక్షి పేర్కొంది. వయస్సు రీత్యా అతను రుక్మిణికన్నా 26 సంవత్సరాలు పెద్ద. దీనిపై రుక్మిణి మాట్లాడుతూ నేను ప్రేమించిన వ్యక్తితో నాజీవితం



**కాలగతిలో రుక్మిణి**

తక్కువ కాలం కొనసాగించబడినా అది నాకు గొప్పది, విలువైనది. ప్రేమలేకుండా సమవయస్కుని పెండ్లాడి జీవితాంతం దుఃఖించలేను అంది. అరుండేల్ ఆమె గురించి చెబుతూ ఆమె అంతఃసౌందర్యం, బహిర్ సౌందర్యం రెండూ ఆమెలో పోటీపడు తుంటాయి అనేవాడు అరుండేల్. ఆమె వ్యక్తిత్వపు కాంతికి నేను సమ్మోహితుడ్నయినాను అనేవాడు. వారిద్దరి మధ్యా ప్రేమ అచంచలంగా నిలబడినా చుట్టూవున్న సమాజం విషయాన్ని గందరగోళం చేసింది. అనిబిసెంటు వద్ద పర్సనల్ సెక్రటరీగా పనిచేస్తున్న రుక్మిణి అన్నగారయిన శ్రీరామ్, ఆమె సోదరి విశాలాక్షి ఈ వివాహానికి ఆమోద ముద్ర వేశారు. రుక్మిణీ మేనమామయిన టి.ఎమ్.కృష్ణస్వామి అయ్యర్ ఈ వివాహాన్ని ఎలాగైనా ఆపమని రుక్మిణి తల్లి శేషమ్మాళ్‌తో వేడుకున్నాడు. తల్లి శేషమ్మాళ్‌కు హిందూమతం మీద నమ్మకం అమితం. మరొక మత వ్యక్తితో తన కూతురు పెండ్లిని ఆమె వెంటనే అంగీకరించ లేకపోయింది. గొప్ప సందిగ్ధంలో పడింది.

చివరకు కుమారుడయిన శ్రీరామ్ ఆమెను ఒప్పించటంతో పెండ్లికి సుముఖత తెలిపింది. ఈ వివాహానికి ముందు నుంచీ ప్రోత్సాహమిచ్చిన వారు అనిబిసెంట్. రుక్మిణి రెండవ అన్నగారైన యగ్నేశ్వరన్, మరికొంత మంది సాంప్రదాయ బ్రాహ్మణులు, కొందరు బ్రిటిష్ వారు ఈ వివాహాన్ని అడ్డుకోవాలనే ప్రయత్నం చేశారు. 5, మార్చి, 1920 నాటి హిందూ దినపత్రిక ఈ వివాహాన్ని పూర్తిగా అభిశంసిస్తూ వార్తగా వేసింది. అడయార్ చుట్టూ తిరుగుతున్నా కొన్ని ప్రమాదకర శక్తుల పని ఇది అంటూ ఆడిపోసుకుంది.

అంతే కాకుండా థియోసాఫికల్ సొసైటీ సిద్ధాంతం పైనా విరుచుకుపడింది. ఇది ఒక్కరోజుతో ఆగలేదు. వాద, ప్రతివాదాలతో వారి వివాహం అయ్యేంత వరకు ఇది సాగింది. అసలు ఖండాంతర వివాహం చెల్లదని, ఈ వివాహానికి చట్ట బద్ధత లేదనేంత వరకూ విమర్శలు కొనసాగాయి. వారి బంధువర్గం వివాహ అనుకూల, ప్రతికూల వర్గాలుగా విడిపోయారు. ఆ వైషమ్యం చాలా కాలం వరకూ కొనసాగింది.

27 ఏప్రిల్ 1920, అంగరంగ వైభోగ పటాటోపం లేకుండా ఎంతో ప్రశాంతంగా వీరిద్దరి మధ్యా సివిల్ మ్యారేజ్, బొంబాయిలో జరిగింది. పెండ్లి జరిగిన తరువాత పెద్ద పెట్టున వెల్లివిరిసిన విమర్శలు చల్లబడ్డాయి.

రుక్మిణి తన హిందూమత ధర్మానికే కట్టుబడింది. దీనికి అరుండేల్ తన వంతు ప్రోత్సాహాన్ని సహాయాన్ని అందజేసేవారు. పెండ్లి జరిగేనాటికి ఆమెకు ఇంగ్లీషు అనర్గళంగా మాట్లాడగలిగేది కాదు. అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులు బడసిన మేధావులు, ఆలోచనాపరులు, పఠనశీలుర మధ్యలో ఆమె వచ్చిపడింది. మొదట్లో అరుండేల్ సాంస్కృతిక జీవన విధానంతో ఆమె కలిసిపోవడానికి కొంత సమయం పట్టింది. హై సొసైటీ ఆమెకు బొత్తిగా కొత్త కావడంతో ఇబ్బంది తప్పలేదు.

బొంబాయిలో వివాహమయిన తరువాత దంపతులిద్దరు 1923 వ సం॥లో ఇండోర్ చేరుకున్నారు. ఇండోర్ మహారాజైన హోల్కర్ అరుండేల్‌ను తన ఆస్థానంలో విద్యాశాఖామంత్రిగా నియమించాడు. దానిని ఎంతో ప్రేమతో, నిబద్ధతతో నిర్వహించేవాడు అరుండేల్. అతని అపారజ్ఞాన సంపత్తి, హాస్యప్రియత్వం ఆమెను ఆనందింపజేసింది. అతను ఎందరితోనో స్నేహపాత్రంగా మెలిగేవాడు. విద్యపై అతనికి కొన్ని అభిప్రాయాలున్నాయి. తన డైరీలో ఇలా వ్రాసుకున్నాడు.

*చదువు జీవన భృతి కోసం కాదు, జీవితాన్ని అర్థం చేసుకోవడానికి. శాశ్వత, సుఖసంతోషాలకు అవసరమయ్యే జ్ఞానాన్ని ప్రసాదించటం విద్య లక్ష్యం కావాలి తప్ప డిగ్రీలు లాంటి కొలతలు కావు. అనుకరణను పెంచటం కాదు. అనురక్తిని నీలోని సహజ సంపత్తిని పెంపొందించుకోవటం.*

*భవిష్యత్ జీవితంలో వచ్చే అన్ని రాగద్వేషాలను సమానంగా చూడ గలిగే శక్తి నిచ్చేది చదువు.*

అప్పటి విద్యావిధానంకాక భారతీయులకు మరింత శ్రేష్ఠతతో కూడిన విద్య అవసరమని తలిచాడు. అనిబిసెంట్ అతన్ని పుత్రునిలా చూసుకునేది. అరుండేల్, రుక్మిణిలు కొంతకాలం తరువాత అనిబిసెంట్ కోరికపై అడయార్ తిరిగి వచ్చారు. అనిబిసెంట్ Westernised Indian Woman అంటే ఇష్టపడేది కాదు. కొందరు భారతీయ వనితలు విదేశస్థులను పెండ్లి చేసుకున్న తరువాత పాశ్చాత్యీకరణ ధోరణిలో అనుకరణ జీవితం సాగించటం ఆమెకు ఇష్టముండేది కాదు. రెండు భిన్న సంస్కృతులకు చెందిన వారెవరైనా వివాహం చేసుకుంటే వారు తమ సంస్కృతులను కొనసాగిస్తూనే వాటిని మరింత ఉన్నతీ కరించుకుంటూ, వివాహ వ్యవస్థ రెండు నదుల సంగమంలా ఉండాలని ఆమె భావించింది. విద్యపట్ల కళలపట్ల ఆమెలోని ఆసక్తిని, అనురక్తిని ప్రోత్సహించేది అనిబిసెంట్. క్రమేపి రుక్మిణి ఆమెకు ఆత్మీయురాలైంది.

1921వ సం॥లో అనిబిసెంట్ గోఖలే హాలులో కళావిభాగాన్ని ఆరంభించింది. ఇందులో సంగీతం, నాటకం, కవిత్వం లాంటి అంశాలున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఎందరో గొప్ప కళాకారులు ఆమె ఆహ్వానాన్ని వచ్చి బోధించారు. భారతీయ కళలను తిరిగి పునః జాగృతం చేయవలసిన అగత్యం ఉందని భావించారామె. అనిబిసెంటు ఐరోపా క్లాసికల్ శైలిలో సంగీతాన్ని నేర్చుకున్నారు. ఆమె పియానోపై ఎంతో ప్రతిభావంతంగా వాయించేది. 1924వ సంవత్సరం రుక్మిణి, భర్తతో కలిసి మొదటిసారిగా ప్రపంచ యాత్ర చేసింది.

1923 యంగ్ థియోసాఫికల్ సొసైటీ ప్రారంభించబడింది. రుక్మిణిని దానికి అధ్యక్షురాలుగా నియమించారు. థియోసాఫికల్ సొసైటీకి అరుండేల్ సెక్రటరీగా పనిచేశారు.

రుక్మిణిని వారంతా డార్క్ మడొన్నా అని పిలిచేవారు. తన విదేశీ పర్యటనలలో ఈజిప్టు, హంగేరియన్, దక్షిణ అమెరికా నృత్య రీతులపట్ల ఆకర్షితురాలై వాటిని నేర్చుకొన్నారు. సంగీతంపై ఆసక్తి చిన్నతనం నుంచీ వుంది. లండన్‌లో రష్యన్ బాలేనర్తకి అన్న పావలోవా నృత్యాన్ని ఆమె (1924)లో చూశారు. అప్పుడే పావలోవాతో "మీలాగా నృత్యం చేయాలనిపిస్తుంది. కానీ చేయలేనుకదా" అంది. "అందుకామె నువ్వు నాట్యంచేయవలసిన అవసరం లేదు. స్టేజి మీదుగా నడిచి వెళ్లితే చాలు అంది. నీ నడకలోనే నృత్యం వుంది. నీకు నృత్యం అంటే చాలా ఇష్టం అని తెలుస్తుంది. మరెందుకు నృత్యం నేర్చుకోవడం లేదు. కావాలంటే నేను నీకు నేర్పుతాను" అని కొన్ని బేసిక్ స్టెప్స్ నేర్పింది. తరువాత మద్రాసు వచ్చేసింది. ఎంతో కీర్తి గడించిన పావలోవా హఠాత్తుగా మరణించడంతో ఈమె కోరిక తీరలేదు.

నట్టువనార్ నృత్యం నేర్పే నాట్యకత్తె ఆమె ఇంటికి దగ్గరలోనే ఉండింది. ఆ రోజుల్లో నృత్యం చేసేవాళ్ళంటే ప్రజల్లో గౌరవం లేదు. వాళ్ళతో మాట్లాడాలని, ఆ నృత్యం గురించి తెలుసు కోవాలని ఆమెకు ఎంతో ఆసక్తి ఉండేది. కాని సంఘపరంగా అది అంగీకార యోగ్యం కాదు.

నవ్వుతూ, నవ్విస్తూ ఎందరినో అనుకరణ చేస్తూ రుక్మిణి ఎప్పుడూ పరువెత్తే సెలయేరులా ఉండేది. అరుండేల్ దంపతుల ఆత్మీయ మిత్రుడయిన నారాయణ మీనన్, ఒకసారి పందనల్లూరు సోదరీమణుల నృత్యానికి వీరిని ఆహ్వానించారు. మ్యూజిక్ అకాడమీ అధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమం ఆ రోజుల్లో రాయపేటలో నున్న వై.ఎమ్.సి.ఏ.లో జరిగింది.

పుదుక్కోటై దేవాలయ ప్రాంతంలో మొదటిసారిగా ఆమె భారతీయ నృత్యాన్ని చూసింది. సదిర్ అని పిలువబడే ఈ నృత్యాన్ని *చిన్నమేళం* అనికూడ అంటారు. ఇప్పుడంతా దానిని భరతనాట్యం అంటున్నారు. నిత్యసుమంగళులుగా భావించబడే దేవదాసిలు మాత్రమే ఆ నృత్యం చేసేవారు. ఈ నృత్యం సంగం (1వ శతాబ్దం) కాలం నుండీ వుంది. చోళ, విజయనగర రాజ్యాలలో ఇవి కొనసాగాయి. మొదటగా ఈ దేవదాసీలకు దేవునితో పెండ్లి జరుగుతుంది. దానిని *పొత్తుకట్టుట* అని పిలుస్తారు. దేవదాసి అయిన తరువాత ఆమెకు ఇనాం భూములు ఇవ్వబడతాయి. ఆ తరువాత ఆమె తనకు నచ్చిన పురుషునితో జతకట్టవచ్చు. కొంత మంది కులీనులు వారితో వివాహేతర సంబంధం పెట్టుకునే వారు. ఈ నేపథ్యం ఎలా ఉన్నా దేవదాసీలలో కళాసృజన చేసిన వారెందరో వున్నారు. అయినా కొందరు ఇది పురుషులను ఆకట్టుకునే అశ్లీల నృత్యంగా ఆ రోజుల్లో భావించారు.



బ్లావట్స్కీ, ఆల్కాట్

## థియోసాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా :

థియో (Theo) అనగా దేవునికి సంబంధమైన, సోఫియా (Sophia) అనగా జ్ఞానం. థియోసాఫికల్ సొసైటీని భారతీయులు 'దివ్యజ్ఞాన సమాజంగా' పేర్కొంటారు. దీనిని స్థాపించిన వారు హెలీనా పెత్రోవ్నా వాన్‌హెన్ (ఆమెకు బ్లావట్స్కీతో వివాహం జరిగిన తరువాత ఆమె బ్లావట్స్కీ అనే పేరుతోనే పిలువబడింది.) 1831వ సం॥లో రష్యాలో ఉన్నత కుటుంబంలో జన్మించిన ఆమెకు చిన్నతనం నుంచి అతీంద్రియ శక్తులపై ఆసక్తి ఉండేది. చిన్నతనం నుంచీ ఆమె కొన్ని అలౌకిక శక్తులను ప్రదర్శిస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తుండేది. ఆమె రెండు సార్లు వివాహం చేసుకున్నా అవి విడాకులకు దారి తీసింది. హెలీనా బ్లావట్స్కీకి చిన్నతనం నుంచి కలలలో ఒక మహాపురుషుడు సాక్షాత్కరించేవాడు. ఆమె తన ఇరవై రెండవ ఏట ఇంగ్లండ్ సందర్శించినపుడు ఆమెకు కలలో కనిపించిన మహాపురుషుడు ఆమెకు కనిపించాడు. అతను మొర్యా అనే పేరుగల హిందూ రాజవంశీకుడు. అతని ఆదేశానుసారం ఆమె 1852వ సం॥లో ఇండియాను సందర్శించింది. టిబెట్ వెళ్లి అక్కడ హిమాలయ పర్వతశ్రేణులలో నివసించే మహర్షులను, మహాత్ము లను తాను కలసినట్లు పేర్కొంది. మొర్యా అదేశానసారం ఆమె 1873 లో అమెరికా వెళ్లింది. అక్కడే నివసిస్తున్న హెన్రీస్టీల్ ఆల్కాట్ అనే లాయరు తోనూ, విలియం, క్యు జడ్జి అనే పేరుగల మరో వ్యక్తితోనూ కలిసి 1875 వ సం॥ న్యూయార్కులో థియోసాఫికల్‌సొసైటీని స్థాపించింది. దాని ప్రధాన ఆశయాలు ఈ విధంగా ఉన్నాయి.

1. జాతి, వర్ణ, మత, లింగ విచక్షణ లేకుండా, విశ్వమానవ సహోదరత్వం అనే ఆదర్శాన్ని ప్రోత్సహించటం.
2. వివిధ దేశాలకు చెందిన ప్రాచీన మతాల తత్వశాస్త్రాల, విజ్ఞాన శాస్త్రం అధ్యయనాన్ని ప్రోత్సహించటం.
3. ప్రకృతిలో ఇంతవరకూ అర్థం కాకుండా, అజ్ఞాతంగా వుండిపోయిన రహస్య సూత్రాలపై పరిశోధన చేయడానికి, మానవునిలో నిద్రాణంగా వున్నా అలౌకిక శక్తులను వెలికి తీసి వికసింప జేయడానికి దోహదం చేయటానికి, న్యూయార్క్‌లో సొసైటీ ప్రారంభమయినా మదాం బ్లావట్స్కీ తమ పరమ గురువుల ఆదేశానుసారం ఆ సంస్థకు అన్ని విధాల అనువైన ప్రదేశం భారతదేశమని భావించి 1879లో బొంబాయి కంటే మద్రాసు నగరం బయట ప్రాంతమైన అడయార్‌ను అనువైనదిగా ఎంపిక చేసుకొని, అక్కడే సొసైటీ యొక్క శాశ్వత ప్రధాన కార్యాలయం స్థాపించింది. బ్లావట్స్కీ తన సిద్ధాంతాలను *ది సీక్రెట్ డాక్ట్రిన్, ది వాయిస్ ఆఫ్ సైలెన్స్* మొదలైన గ్రంథాలను వ్రాసింది. థియోసఫీలో తాను కొత్తగా కనుగొన్న దేమీలేదని, వివిధ దేశాల ప్రాచీన మతాల నుంచి, రహస్య గ్రంథాలనుంచి సేకరించిన సిద్ధాంతాలను క్రోడీకరించటం, వివరించటం మాత్రమే తాను చేశానని చెప్పకుంది. కానీ ఆమె చెప్పిన హిమాలయ మహాత్ములు అంతా అభూత కల్పనని, ఇదొక గొప్ప ట్రాష్ అని, అతీంద్రియ శక్తులన్నీ గారడీ విద్యలని విమర్శలు చెలరేగటంతో 1885వ సం॥లో ఆమె ఇండియాను వదలి బ్రిటన్ వెళ్లిపోయింది. ఆమె భారత దేశానికి తిరిగి రాకపోయినా థియోసాఫికల్ సొసైటీ అధ్యక్షురాలుగా, ఆమె చనిపోయేవరకూ అంటే 1891 వరకూ కొనసాగింది.

ఆమె మరణానంతరం ఆమె సహస్థాపకుడైన కల్నల్. హెచ్. ఎస్. అల్కాట్ 1907వ సంవత్సరంలో చనిపోయే వరకూ కొనసాగారు. ఆ తరువాత అనిబిసెంట్ అధ్యక్షురాలైంది.

## అనిబిసెంట్ :

ఆమె అసలు పేరు అనీవుడ్, ఐరిష్ వనిత. 1847 వ సంవత్సరంలో లండన్‌లో ఒక ఉన్నత కుటుంబంలో



అనిబిసెంట్

జన్మించింది. స్వభావసిద్ధా ఆమె స్వేచ్ఛాప్రియురాలు. రెవరెండ్ ఫ్రాంక్ బిసెంట్‌తో వివాహమైనా త్వరలోనే విడాకులు తీసుకుని, స్త్రీలు పురుషులకంటే ఏవిధంగానూ తక్కువ కాదని భావించింది. సిడ్నీవెబ్, ఫి బియాట్రిస్ వెబ్, జార్జి బెర్నార్డుషాలు స్థాపించిన ఫేబియన్ సోషలిస్టు ఉద్యమంలో చురుకుగా పని చేసింది. నాస్తిక వాది చార్లెస్ బ్రాడ్లీ ప్రభావానికి లోనై, తనకు క్రైస్తవ మతంలో నమ్మకం లేదని, తాను నాస్తిక వాదినని ప్రకటించుకుంది.

అంత తీవ్ర భావాలు కలిగిన అనిబిసెంట్ ఒక్కసారిగా అంతే తీవ్ర భావాలు కలిగిన ఆస్తికురాలిగా మారిపోయింది. మదాం బ్లావట్స్కీ వ్రాసిన ది సీక్రెట్ డాక్ట్రిన్ గ్రంథం చదివి దాని వల్ల ప్రభావితురాలై 1889లో దివ్యజ్ఞాన సమాజంలో సభ్యురాలిగా చేరింది. అద్భుతమైన వాదనా పటిమ ఆమె సొంతం. భారత దేశంలో దివ్యజ్ఞాన సమాజానికింత గుర్తింపు రావటానికి ఆమె కారణం.

అనిబిసెంట్ 1893వ సంవత్సరంలో షికాగ్ నగరంలో జరిగిన మతసదస్సుకు, థియోసాఫికల్ సొసైటీ ప్రతినిధిగా హాజరై అటునుంచి, అటే ఇండియా వచ్చి మొదట బెనారస్‌లో స్థిరపడింది. కట్టూ బొట్టుతో సహా హిందూమత ఆచారాలను అనుసరిస్తూ, సంస్కృత భాషను అభ్యసించి ఉపనిషత్తులు, రామాయణ, మహాభారత, పురాణాలను ఇతర హిందూ, బౌద్ధ వాఙ్మయాలను అధ్యయనం చేస్తూ తన మిత్రుడయిన డాక్టర్ భగవాన్ దాస్‌తో కలిసి భగవద్గీతను ఇంగ్లీషులోకి అనువదించింది. భారత జీవన పునర్జీవనానికి తన వంతు కృషి సల్పింది.

అనిబిసెంటు ఒక వైపు భారతీయ ప్రాచీన మతాలవైపు, తత్త్వ చింతనవైపు ఆకర్షితురాలైనా భారతీయ సమాజంలోని లోపాలను తొలగించటం అత్యవసరమని భావించి అనేక సంస్కరణోద్యమాలలో పాల్గొంది. ఆమె వ్యతిరేకించిన వాటిలో వర్ణవ్యవస్థ, స్త్రీల అణచివేత ముఖ్యమైనవి. విద్యావిధాన సంస్కరణలపై దృష్టి నిల్పింది.

ఆమె మొదట్లో రాజకీయపరమైన ఆసక్తిని కనపరచేది కాదు. అప్పట్లో 13 సం॥ల వయస్సు వున్న జవహర్‌లాల్ నెహ్రూ ఆమె వ్యాసాలు, ఉపన్యాసాల పట్ల ఎక్కువ ఆసక్తిని కనపరచేవారు. అలానే గాంధీ కూడా. ఆయన డర్బన్ లో ఉండగా థియోసాఫికల్ సొసైటీ అసోసియేటెడ్ సభ్యునిగా ఉంటూ ఆరునెలలు కొనసాగారు. (నెహ్రూ, గాంధీలు ఆ తరువాత థియోసాఫికల్ సొసైటీని విభేదించారు.) అనిబిసెంట్ ప్రారంభించిన హోమ్‌రూల్ ఉద్యమం ప్రత్యేకించి కొనియాడదగినది. కాంగ్రెస్ నాయకులు 1917లో ఆమెను కలకత్తా మహాసభకు అధ్యక్షురాలుగా ఎన్నుకుని గౌరవించారు.

1933వ సంవత్సరం అనిబిసెంట్ మరణానంతరం తొమ్మిది నెలల తరువాత జార్జి సిడ్నీ అరుండేల్ నాలుగవ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు.

అరుండేల్ మరణానంతరం సి. జినరంజనదాస ఐదవ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. (ఆయన 1921-28 సం॥ల మధ్యకాలంలో అనిబిసెంట్ అధ్యక్షురాలుగా వున్నప్పుడు ఉపాధ్యక్షులుగా పనిచేశారు.) 1946 నుంచి 1953 మరణించేంత వరకు ఆ పదవిలో కొనసాగారు.

ఐదవ అధ్యక్షునిగా నీలకంఠ శ్రీరామ్ (రుక్మిణి అరుండేల్ అన్నగారు) 1953 నుంచి 1973 మరణాంతరం వరకు కొనసాగారు. ఆయన తరువాత 1973 నుంచి 1979 వరకు జాన్ కోట్స్ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఆయన మరణానంతరం 1980లో జరిగిన అధ్యక్షపదవికి రుక్మిణి అరుండేల్ పోటీచేసి రాధాబర్నియర్ చేతిలో ఓడిపోయారు. 1980 నుంచి ఇప్పటివరకు రాధాబర్నియర్ అధ్యక్షునిగా కొనసాగుతున్నారు.

రుక్మిణితో కలిసి పనిచేసినవారు, ఆమె ఆదరణ పొందినవారు, ఆమెయొక్క మితిమీరిన ఆత్మవిశ్వాసం, మొండితనం, తాను పట్టిన కుందేటికి మూడేకాళ్లన్న నైజం తో చాలామంది ఆమె జీవిత చరమాంకంలో దూరమయ్యారు.

పండనల్లూరు సోదరీమణు లయిన జీవరత్నం-రాజ్యలక్ష్మి తిరువల్ల పుత్తూరు గ్రామం వాస్తవ్యులు. కుంభకోణం దగ్గరలో వాళ్ళ గురువు మీనాక్షి సుందరం పిళ్ళై శాస్త్రీయ నృత్యంలో అగ్రగణ్యుడు.

రుక్మిణి నాట్యం నేర్చుకోవాలనే కోర్కెను వెళ్ళ బుచ్చినపుడు ఆయన అవాక్కయ్యాడు. యజ్ఞేశ్వర్‌ను వెంటబెట్టుకుని మద్రాసులో ఉంటూ, నృత్యం చేసే దేవదాసీలనందరినీ ఆమె కలిసి వచ్చారు. ఒక సందర్భంలో బాలసరస్వతి నృత్యాన్ని చూడటం జరిగింది. "నృత్యం చేస్తున్నప్పుడు, సంగీతాన్ని అందులోని గతులను నేను అర్థంచేసుకోగలిగాను కానీ నృత్య ఫణితులు నాకు అర్థం కావటంలేదని'' పేర్కొని, రుక్మిణి గురువును వెతుక్కునే వేటలో పడింది. అడయార్ లైబ్రరీలో డైరెక్టరుగా పనిచేస్తున్న కుంజన రాజు ఆమెను గౌరీ అమ్మాల్ అనే దేవదాసి తో పరిచయం చేశారు. మైలాపూర్ కపిలేశ్వర దేవాలయపు దేవదాసి ఆమె. ఆమె అభినయానికి పేరుగాంచింది.



**రుక్మిణీ శిష్యబృందం దలైలామాతో...**

నృత్యంలో ప్రసిద్ధులైన ఎందరో నృత్య కళాకారిణుల నృత్యాన్ని ఆమె చూసింది. భానుమతి, వరలక్ష్మి, తారాబాయి, వీణభూషిణి అమ్మాళ్, కరైకల్ సోదరీమణులు, ఆండాళ్, బాలసరస్వతి, ఇలా ఒక్కొక్కరికి ఒక్కొక్క భిన్నమైన నృత్యరీతులు ఉండేవి. రుక్మిణికి పండనల్లూరు బాణీ అంటే ఇష్టం. ఇది తంజావూరు నృత్య సంప్రదాయానికి చెందినది. మీనాక్షి సుందరం నుంచి ఎలాగైనా నేర్చుకోవాలనే పట్టుదల ఉండింది. కానీ, అటు బ్రాహ్మణ్యం, ఇటు దేవదాసీ వర్గం రెండు చోట్ల నుంచి ప్రతిఘటన ఎదురైంది. అదే సమయంలో ఇ. కృష్ణయ్యర్ అనే న్యాయవాది సదిర్ నృత్యాన్ని ఆధునికం చేయాలని దీక్షబూనాడు. దాని నిమిత్తం పత్రికలో ఎన్నో వ్యాసాలు కూడా వ్రాశాడు. ఒక నాటకం కంపెనీలో ఆయన స్త్రీ పాత్రలు పోషించేవాడు. కాళిదాసు విరచితమైన మాళవికాగ్ని మిత్ర నాటకంలో ఆయన మాళవిక పాత్రను ప్రశంసా పూర్వకంగా పోషించారు.

మీనాక్షి సుందరం అప్పటికీ రుక్మిణికి నాట్యం నేర్పడానికి సుముఖం కాలేదు. రుక్మిణి, చదువుకున్నది, ధనవంతురాలు, పైపెచ్చు బ్రాహ్మణ వనిత. ఆమెకు ఇదొక విలాసం, వృత్తికాదు. "నేను నేర్పేవారికి ఇదొక వృత్తి. అదొక జీవన విధానం.ఇది నేర్చుకోవా లంటే చాల కష్టపడాలి. రోజుకు ఏడెనిమిది గంటల అభ్యాసం తప్పని సరి. నేను క్రమ శిక్షణను ఒక నియంతలా పాటిస్తాను. నృత్యం నేర్చుకోవటంలో ఏ మాత్రం అలసత్వం కనిపించినా నేను వారికి విద్యనేర్పనటం మానేస్తాను. ఈ నిబంధనలను నేను నీ పట్ల పాటించ లేననిపిస్తుంది. అందుచేతనే అంగీకరించటం లేదు" అన్నాడు. దానికి రుక్మిణి "నేను దానిని యేదో కాలక్షేపం కోసం నేర్వటంలేదు. ఎలాగైనా దీనిని సాధించాలనే పట్టుదల ఉంది. దానికోసం ఎంత కృషయినా చేస్తాను. మీరు మీ మిగతా శిష్యులను ఎలా చూస్తారో నన్ను అలానే చూడండి. నన్ను ప్రత్యేకంగా భావించవద్దు. నేనొక మంచి నృత్య కళాకారిణి కావాలనుకుంటున్నాను" అన్నది.

ఈ సమాధానంతో ఏం చెయ్యాలో పాలుపోని సుందరం పిళ్ళై తనకు జ్ఞాతి, వరసకు తమ్ముడయిన పొన్నయి పిళ్ళైతో మాట్లాడాడు. పొన్నయి పిళ్ళై సంగీతజ్ఞుడు, నృత్యకారుడు. మద్రాసు మ్యూజిక్ అకాడమీకి అధ్యక్షుడు. ఆమె శ్రద్ధాసక్తులను పరిశీలించి చూసి తనకు చెప్పమని తమ్మునితో చెప్పాడు. పొన్నయి పిళ్ళై రుక్మిణి చేస్తున్న నాట్యసాధన చూశాడు. ఆమెకు నేర్చుకునే ఆసక్తి ఉంది. అది పైపై ఉబలాటం కాదు. ఆమె శరీరాకృతి నృత్యానికి అన్ని విధాలా సరిపోతుంది. ఆమెకు సంగీత పరంగా చక్కటి లయజ్ఞానం ఉంది. దీనితో సుందరం పిళ్ళై ఆమెను తన శిష్యురాలుగా అంగీకరించాడు.

సుందరం పిళ్ళై శిక్షణలో ఆమె కఠోర సాధన మొదలుపెట్టింది. సుందరం పిళ్ళై ఏకారణం చేతనైనా రాకపోతే డాన్సర్ అయిన తన అల్లుడు చొక్కలింగం పిళ్ళైను పంపేవాడు. ఒక్క రోజుకూడా అలసత్వం చూపకుండా రుక్మిణిదేవి రెండు సంవత్సరాలకాలం ఈ నృత్య రీతులను అభ్యసించింది. ఈమెకు సంగీతం నేర్పేసరికి సుందరం పిళ్ళై అరవై సంవత్సరాల వయసువాడు.

20 సెప్టెంబరు 1933లో అనిబిసెంట్ మరణించింది. అరుండేల్ థియోసాఫికల్ సొసైటీ అధ్యక్షుడైనాడు. థియోసాఫికల్ సొసైటీకి కొత్త సభ్యులను చేర్చటంకోసం, దాని ప్రత్యేకతను వివరించడం కోసం రుక్మిణితో కలసి ప్రపంచ దేశాలన్నీ పర్యటించి వచ్చారు.



అడయార్‌లోని మఱ్ఱిచెట్టు

డిసెంబరు 1935లో థియోసాఫికల్ సొసైటీ ఏర్పడి 50 సం॥లు పూర్తయిన సందర్భంలో డైమండ్ జూబ్లి తలపెట్టారు. ఆ రోజు థియోసాఫికల్ సొసైటీని దీపాలతో అలంకరించారు. మఱ్ఱి చెట్టు నీడను వేదికగా మార్చారు. సంస్కృతిలో ఒక భాగంగా రుక్మిణి దేవి నృత్యప్రదర్శన ఏర్పాటు చేశారు. అది ఆమె మొదటి ప్రదర్శన. ప్రదర్శనకు ముందు ఆరంగేట్రం కోసం సుందరం పిళ్ళై అనుమతి పొందింది. అందరిలో ఒక ఉత్కంఠత. ఆమె నృత్యం ఎలా ఉంటుంది, దాని ప్రభావం భావి తరాలపై ఏ విధంగా వుంటుంది? ఏది ఏమైనా అదొక చారిత్రక ఘట్టం. దక్షిణ పథాన నృత్య చరిత్రలో ఒక గొప్ప అధ్యాయానికి అంకురార్పణ జరిగిన సందర్భం.

భరతనాట్యం (ఇది కృష్ణయ్యర్ పెట్టిన పేరు) తో మతనమ్మకం, శాస్త్రీయత, ఫిలాసఫీని కలిపి రుక్మిణి కలబోత చెయ్యటం అప్పట్లో థియోసాఫికల్ సొసైటీ సభ్యులకు కొరుకుడు పడలేదు. ఇది సొసైటీ స్థాయిని తక్కువ చేస్తుందని అభిప్రాయ పడ్డారు. మద్రాసులో ప్రసిద్ధులనదగిన వి.యస్. శ్రీనివాస శాస్త్రి, టి.ఆర్. వెంకటరామ శాస్త్రి, పి.యస్. శివస్వామి అయ్యర్, రుక్మిణి నృత్యాన్ని తీవ్రంగా అధిక్షేపిస్తూ ఆమెను పిలచి తూలనాడారు. ఇది నీలాంటి వారికోసం కాదు, అసలు నీవేమి చేయదలచుకున్నావు అని ప్రశ్నించారు. రుక్మిణి మైలాపూర్‌లో నున్న తనకు తెలుసున్న బ్రాహ్మణ కుటుంబాల వారి వద్దకెళ్ళి తన నాట్య ప్రదర్శనకు ఆహ్వానించింది. కొందరు సమ్మతించారు. కొందరు తిరస్కారభావంతో చూశారు. మరి కొందరు తటస్థంగా ఉండి పోయారు. అంతకు కొంత కాలం క్రిందటనే బ్రాహ్మణ్యం లోని ఒక వర్గం ఇటువంటి నాట్యాలను చూడ కూడదని, ప్రోత్సహించ కూడదని, నిశ్చయించుకుని సంతకాలు సేకరించారు. విచిత్ర మేమంటే రుక్మిణి తండ్రయిన నీలకంఠ శాస్త్రి వాళ్ళలో ఒకడుగా సంతకం చేశాడు. ఈ నృత్యంలోని శృంగార భావాలు అశ్లీల మయినవిగా తలపోశారు చాలా మంది. అప్పటికే స్వదేశీ ఉద్యమం ఊపందుకుంది. బ్రహ్మనమాజపు యాంటినాచ్ ఉద్యమం దానికి తోడయింది. అసలు సదిర్, లేదా చిన్నమేళం నృత్యాన్ని బహిష్కరించాలనే ఉద్యమం మొలకెత్తింది.

డిసెంబరు 30 వ తేదిన, ముప్పై ఒక్క సంవత్సరాల రుక్మిణి అరుండేల్ నృత్య ప్రదర్శన ఇచ్చి తనపై వచ్చిన విమర్శలను తల్లకిందులు చేసింది.

ఆమె దివినుండి వెలిసిన దేవతలా రంగస్థలం మీదకు వచ్చి మెరిసిపోయింది. అయిదు నిముషాల లోనే ఆమె నృత్యం అందరినీ ఆకట్టుకొంది. అంతటా నిశ్శబ్ద వాతావరణం అలముకుంది. సంగీతం నృత్యం తప్ప మరే శబ్దం వినబడటం లేదు. నృత్యం ముగిసింది. ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తూ, అంతవరకూ వున్న విమర్శలకు అప్పటి ప్రేక్షక కరతాళ ధ్వనులే సమాధానం చెప్పాయి.

సదిర్ నృత్యం చేసేవారు పట్టుచీరెని ఒక పరికిణీని లాగూల కుట్టించుకుని దానిపై కుచ్చిళ్ళతో నున్న వస్త్రాన్ని వడ్డాణంలా ధరించి నృత్యం చేసేవారు. ఇది నృత్యం చేసేవారికి అన్నివిధాలా అనుకూలంగా ఉన్నా, ఇది చూడటానికి ఇంపుగా లేదు. ఇందులో సౌందర్య దృష్టి లోపించిందని భావించిన రుక్మిణి చీరను కుచ్చిళ్ళతో కుట్టించి ఒక ప్రత్యేకమైన రూపం ఇచ్చింది. ఇప్పటికీ అందరు దీనినే వాడుతున్నారు. రుక్మిణి తన నృత్యాలలో శృంగారం పాలు తక్కువ చేసింది, ఇది మరో నృత్యకళా కారిణి అయిన బాలసరస్వతి విమర్శకు గురైంది.

చిదంబర దేవాలయ ప్రధాన పూజారిని ఒప్పించి చిదంబరంలో దైవసాన్నిధ్యంలో నృత్యం చేసింది.

*వరుగలమో అయ్యా* అనీ హరిజనుడైన నందనార్ కీర్తనకు ఆమె నృత్యం చేసింది. దేవదాసిలు ఈ నృత్యం రుక్మిణికంటే ఎంతో ప్రజ్ఞతో చేస్తారు. కానీ నృత్యం చేస్తున్నపుడు రుక్మిణిలో కనిపించే తాత్త్విక తాదాత్మ్యత వారి నృత్యంలో కనిపించదు.

అంతవరకూ విమర్శిస్తున్న పత్రికలు భారతీయ నృత్యానికి ఇది పునర్జన్మ అని పేర్కొన్నారు. ఈ నృత్యం జరిగిన రాత్రి ఆమెకొక ఆలోచన వచ్చింది. సంప్రదాయం కళలన్నిటినీ కలుపుతూ ఒక కేంద్ర స్థానాన్ని ఎందుకు ఏర్పరచ కూడదు అన్నదే ఆ ఆలోచన.

జనవరి 6, 1936 న రుక్మిణి International Academy of Arts at Adayar స్థాపన జరిగింది. అప్పుడు తరగతులు నిర్వహించడానికి గదులులేవు. పాపనాశనంశివం లాంటి అఖండ ప్రజ్ఞాశాలి మొదటి సంగీత అధ్యాపకులుగా పని చేశారు.

ఒక చెట్టు, దాని కింద ఒక విద్యార్థి, ఒక ఉపాధ్యాయుడు, ఒక చదువు ఇలా సాగేది కళాక్షేత్ర విద్య. థియోసాఫికల్ సొసైటీలో ఒక సరికొత్త విభాగం వచ్చి చేరింది, అదే నృత్యం.

జూన్ 3, 1940 కళాక్షేత్ర ఒక Public body గా రిజిస్టరు చేయబడింది. సంస్కృత పండితుడైన సుబ్రహ్మణ్య శాస్త్రి – కళాక్షేత్ర అన్న పేరును సూచించారు. సంగీతంలో నిష్ణాతులైన వారికి సంగీత శిరోమణి అనే డిగ్రీని ప్రసాదించడం, నృత్యానికి అనుబంధంగా సంగీతంలో కొన్ని తాళగతులు మార్చబడ్డాయి. సంప్రదాయానికి ఏమాత్రం భంగం కలుగకుండా దీనిని విద్వాన్ కె. కృష్ణమూర్తి తయారు చేశారు. రుక్మిణి అరుండేల్ పాశ్చాత్య మిత్రులు, భారతీయ కళల పట్ల ప్రేమ ఉన్న అలెక్స్ ఎల్మోర్, కొర్నార్డ్ రాగే, ఆర్థర్ బేనో ఈ మహాక్రతువులో తమ వంతు కర్తృత్వం వహించారు. కళాక్షేత్ర ప్రారంభం నుంచే అంచెలంచెలుగా ఎవరి ఊహకు అందనంతగా ప్రజాదరణ పొందింది. పిల్లలను కళాక్షేత్రానికి పంపటం గర్వంగా, ఒక మన్ననగా సాగింది. కె.రాజగోపాల్, పాపనాశనంశివం లాంటి ప్రసిద్ధిగాంచిన గాయకులు రుక్మిణి నాట్యానికి నేపథ్య సంగీతం వినిపించారు.

1975లో కళాక్షేత్ర తమిళనాడు రిజిస్టర్ సొసైటీ యాక్ట్‌లో నమోదయ్యింది. కళాక్షేత్ర గురించి మాట్లాడుతూ అరుండేల్ ఇది భారతీయ సౌందర్యానికి ఒక ఆలయం లాంటిదని పేర్కొంది. సెప్టెంబరు 23, 1993 కళాక్షేత్ర ఫౌండేషన్ సెంట్రల్ అటానమస్ బాడీగా గుర్తించబడింది.

సెప్టెంబరు 20, 1933 అనిబిసెంట్ మరణం. తరువాత కాలంలో ఆరునెలల అనారోగ్య అనంతరం, ఆగష్టు 12, 1945 సం॥లో అరుండేల్ మరణించారు. తన 82వ పుట్టిన రోజుకు నాలుగు రోజుల ముందు ఫిబ్రవరి 24, 1986న రుక్మిణిదేవి మరణించి ఆధ్యాత్మిక కళాక్షేత్రలోనికి నిష్క్రమించింది.

అంతకు ముందు నెలలో అదే సంవత్సరం జిడ్డు కృష్ణమూర్తి మరణించారు. ఈమె నాట్యాన్ని తీవ్రంగా విమర్శించిన వారిలో ముఖ్యులు బాలసరస్వతీదేవి. చిన్నమేళంలో శృంగారం ప్రధాన భూమిక వహిస్తుంది. శృంగారపరమైన భావలను పక్కకు పెట్టి కేవలం భక్తి ప్రధానంగా రుక్మిణి చేస్తున్న నాట్యం సంపూర్ణమైనది కాదని ఆమె భావించారు. ఇందులోని శృంగార భావాలు భగవత్ దృష్టితో చూడదగ్గ మధుర భక్తికి సంబంధించినది. ఏమాత్రం హేయమైనది కాదు.

రుక్మిణి నాట్యంలో శృంగార భావాలు లేక పోలేదు కానీ అవి అంతగా బహిర్గతం కావు. పదము, జావళు లలోని శృంగార భావనలు పక్కన పెట్టడం సరికాదు అన్న బాలసరస్వతి భావాలతో ఎక్కువ మంది ఏకీభవించినా రుక్మిణి యొక్క నాట్య సంప్రదాయం పై దాని ప్రభావం అంతగా పడలేదు.

---

కాండ్రేగుల నాగేశ్వరరావు,
ఫోన్ : 9948083387



# సవర లిపి-గిడుగు

**– అల్లంసెట్టి చంద్రశేఖర రావు**

**శ్రీ**కాకుళం ప్రభుత్వ కళాశాల ఆవరణలో గిడుగు రామమూర్తి ప్రతిమ వుంది. దాని క్రిందనున్న శిలాఫలకం పై వ్యావహారిక భాషావాది, సవర భాషాలిపి నిర్మాత, శాసన భాషావేత్త, కళాప్రపూర్ణ గిడుగు వేంకట రామమూర్తి అని శిలాక్షరాలలో రాసి వుంది. శిలాక్షరాలలో రాసివున్నంత మాత్రాన నిజం కానక్కరలేదు. సవర లిపి నిర్మాత గిడుగు కాదు.

గిడుగు రామమూర్తిని సవర భాషాలిపి నిర్మాతగా భావించడానికి కారణం లేకపోలేదు. రామమూర్తికంటే ముందు సవర భాష గ్రంథస్థం కాలేదు. ఆ భాషకు లిపిలేదు. అంతా మౌఖిక వ్యవహారమే. గిడుగు రామమూర్తి సవర భాష నేర్చుకొని ఆ భాషకు వ్యాకరణం రచించారనీ, ఆ భాషలో పుస్తకాలు రచించారనీ కొందరికి తెలును. రామమూర్తి సవర భాషలో రాసిన పుస్తకాలు చూసే భాగ్యం ఏ కొద్ది మందికో దక్కింది. వాటిని చూడని వారు గిడుగు రామమూర్తి సవర భాషకు లిపిని కనిపెట్టి ఆ లిపిలో పుస్తకాలు రాశారని భావించారు. ఒక భాషకు ఒక ప్రత్యేకమైన లిపి ఉండాలి అనే భావనలో వున్నవారు భాషకు లిపికి గల సంబంధం అర్థం చేసుకొంటే వారి భావన తప్పని గ్రహించ గలుగుతారు.

ప్రపంచంలో ప్రత్యేక లిపులున్న భాషలు రెండు రకాలు. 1. వందల వేల సంవత్సరాల చారిత్రక పరిణామం లో బహుకాలం క్రితమే లిపి బద్ధమైనవి. 2. ఇటీవల లిపి బద్ధమైనవి. ప్రపంచంలో వాడుకలో వున్న కొన్ని లిపులు ధ్వనులకు సంకేతాలైతే, మరికొన్ని అర్థాలకు సంకేతాలు. ఇంగ్లీషు భాష రాయడానికి ఉపయోగిస్తున్న రోమను లిపి ధ్వనిలిపి. ఒక్కొక్క అక్షరసంకేతానికీ ఒక్కొక్క ధ్వని వుంటుంది. చైనా, జపాన్ లిపులు పదాల భావాలను తెలియజేసే సంకేతాలు. వీటికి ధ్వనితో సంబంధంలేదు. దీనిని పదలిపి లేక లోగోగ్రాఫి అంటారు. ఈ లిపిని చిత్రలిపి, పిక్టొగ్రాఫి లేదా ఇడియోగ్రాఫి అని గూడ అంటారు. ఇందులో ఒక గుర్తు ఒక పదాన్ని సూచిస్తుంది. ఈ లిపిలో ఒక సౌలభ్యం వుంది. భాషలు వేరైనా భావాన్ని గ్రహించవచ్చు, చదువుకోవచ్చు. జపానువాళ్ళు తమ భాష రానుకోవడానికి క్రీ॥శ॥ 300 నుండి చైనా లిపిని వాడుకొంటున్నారు. భాషలు వేరైనప్పటికీ లిపి సంకేతం ఒకటే కావడం చేత వారిలో ఏ భాషవారైనా తమ భాషలో చదువుకోవచ్చు. మనిషికి వాడే గుర్తు రెండు భాషలలోను ఒకటే. ఐనా దీనిని చైనావాడు 'యన్' అని చదివితే, జపాన్‌వాడు 'హిట్' అని చదువుతాడు. చైనా దేశంలో ఒకే లిపి వాడుతున్నంత మాత్రంచేత ఆ దేశంలో ప్రజలందరూ ఒకేభాష మాట్లాడుతున్నారని అనుకోకూడదు. మనలో చాలామందికి దేవనాగరి లిపి రాదు. ఐనా భగవద్గీతను తెలుగులో చదవడం లేదా? రాజభాష హిందీ దేవనాగరి లిపిని ఎరువు తెచ్చుకొంది. అలాగే ప్రపంచభాష ఇంగ్లీషు రోమను లిపిని వాడుకొంటూ వుంది.

రామమూర్తి తెలుగు *సవర నిఘంటువు, నాలుగు సవర రీడర్సు, సవర సాంగ్స్* అన్న పుస్తకాలు రచించారు. వీటిని నాటి మద్రాసు ప్రభుత్వం 1912–14




**గిడుగు రామమూర్తి ప్రతిమ క్రిందనున్న శిలాఫలకం**

సంవత్సరాలలో ప్రచురించింది. ఈ పుస్తకాలు రాయడానికి రామమూర్తి తెలుగు లిపిని వాడుకొన్నారు. 1936, 37, 38 సంవత్సరాలలో *సోర మాన్యుయల్, సోర ఇంగ్లీషు డిక్షనరీ, ఇంగ్లీషు సోర డిక్షనరీలు* వెలువడ్డాయి. వీటిని గూడ మద్రాసు ప్రభుత్వమే ప్రచురించింది. ఈ పుస్తకాల రచనలో అంతర్జాతీయ ధ్వని లిపిని ఉపయోగిం చారు. రామమూర్తికి లిపి విషయంలో స్పష్టమైన అభిప్రాయం వుంది. తాను తెలుగులో రాసిన సవర వాచకాలు ధ్వని విషయంగా లోపభూయిష్టంగా వున్నాయిన వారు గ్రహించే వుంటారు. లిపి ధ్వని విధేయంగా వుండాలన్నది వారి అభిప్రాయం. తాను అంతర్జాతీయ ధ్వనిలిపిని ఎందుకు ఉపయోగించవలసి వచ్చిందో *సోర మాన్యుయల్, సోర ఇంగ్లీషు డిక్షనరీ* లకు రాసిన ముందుమాటల్లో రామమూర్తి వివరించారు. సవరభాషలో వున్న ఈ పుస్తకాలు పునర్ముద్రితం కాని కారణంగా ఇప్పుడు అందుబాటులో లేవు. *సోర మాన్యుయల్, సోర ఇంగ్లీషు డిక్షనరీ*లకు రాసిన ముందుమాటల అనువాదం ''గిడుగు రామమూర్తి ముందుమాటలు" అన్న పేరుతో 2008లో వెలువడింది.

లిపి విషయంలో రామమూర్తి అభిప్రాయాలను వారి మాటల్లోనే విందాం. అంతర్జాతీయ ధ్వని సంబంధ సంస్థ ఆమోదించిన ధ్వని సంకేతాలు ఇప్పుడు ఎంతో వ్యాప్తిలోకి వచ్చాయి. సవర భాషా శబ్దాలకు నేనా ధ్వని సంకేతాలనే సవర మాన్యుయల్‌లో ఉపయోగించాను. లిపి రహిత భాషలను వ్రాతలో తెలుపుటకు అనేక సంవత్సరాల ఆచరణాత్మక అనుభవమును ఆధారము చేసుకొని ఎంతో మంది భాషాశాస్త్రవేత్తలు కలిసి ఈ ధ్వని సంకేతాలను నిర్ణయించారు. సవరలకు సంప్రదాయ అక్షరమాలలేదు ఏ భారతీయ అక్షరమాల పరిపూర్ణమైనదికాదు. నేను 1912-14 సంవత్సరాలలో తెలుగు అక్షరాలతో సిద్ధం చేసిన సవర వాచకాలు తెలుగురాని ఒరియావారికి ఉపయోగపడలేదు.

ఒరియా అక్షరమాలను అటు పాలకులు ఇటు పండితులు సమానంగానే తిరస్కరించారు. ఒరియా అక్షరమాల సవర భాషకు ఉపయోగపడదు. దేవనాగరలిపి కూడ సవర భాషకు తగనిదని భాషా పరిశీలనలో తేలింది. 'లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా' రికార్డులలో రోమను లిపినే వాడారు. టర్కీ, రష్యా, జపాన్, చైనా నాయకులు రోమన్ అక్షరాలను ఉపయోగించుట వలన కలిగే ప్రయోజనాలన ఎప్పుడో గుర్తించారు. అరబ్బీ ప్రజల సాంస్కృతిక నిద్రమత్తును కొనసాగించే క్లిష్టమైన అరబ్బీ అక్షరాలకు బదులు రోమన్ అక్షరాలు వాడుక లోనికి వచ్చాయి. ఆధునిక కెమాల్-టర్కీ కంటె ముందుగానే రష్యాలోని మహమ్మదీయదేశం అజర్‌బైజాన్ అరబ్బీ అక్షరాలకు ఉద్వాసన పలికింది. క్రైస్తవ మిషనరీలు, అభివృద్ధిలేని భాషలను వ్రాయుటకు ధ్వని లిపినే ఎల్లప్పుడూ వాడతారు. మత గ్రంథమయిన బైబిలేకాదు వాచకాలు కూడా వాటితోనే చాలా భాషలలో ప్రచురించారు. ఈ ధ్వని అక్షరమాల టర్కీలో వారి సంప్రదాయ అక్షరమాలకు బదులుగా వాడుకోవలసి వచ్చింది. హీబ్రూ భాషకు గూడ దీనినే ఉపయోగించే ఆలోచన ఉన్నది. విదేశీయులు చీని, "జపాను భాషలను ధ్వని లిపిద్వారానే అభ్యసిస్తున్నారు. ధ్వని లిపిని ఉపయోగించుట వలన భారతదేశంలో విభిన్న మాండలికాలను తొలగించలేక పోయినప్పటికీ విభిన్న లిపులను తొలగించ వచ్చును," అంటూ సవర ఇంగ్లీషు నిఘంటువులో రామమూర్తి రాశారు.

**రామమూర్తి అంతర్జాతీయ ధ్వని లిపిలో రాసిన సవర మాన్యుయల్‌ను పరిచయం చేస్తూ అప్పటి గంజాం జిల్లాకు ఏజంటు ఐన గెలెటీ దొరగారు "సవర భాషను పాఠశాలలో బోధన భాషగా వాడుకలోనికి తేవలెనంటే దానిని వ్రాతలో చూపగలగాలి. రామమూర్తి మొదట రాసిన సవర వాచకములు తెలుగులో ఉన్నవి. ఈ భాషను తెలుగు అక్షరాలు కాని, ఒరియా అక్షరాలు కాని సరిపోవు. అక్షరలిపికి బదులు మరే పాతలిపిని కూడ అమలు చేయలేము. సవర ధ్వనులను రోమను లిపికంటె తెలుగు లిపిలో లేదా ఒరియా లిపిలో చక్కగా పలికించలేము. సవర పిల్లల నెత్తిపై ఒకటికి మించిన లిపుల భారాన్ని మోపలేము. మాధ్యమిక స్థాయిలో వారు ఇంగ్లీషు నేర్చుకొనక తప్పదు. దానికి రోమను లిపి కావాలి. ఎంతో కొంత మార్చకపోతే ఈ రోమను లిపి కూడ సవర ధ్వనులన్నిటినీ పలికించ జాలదు. అందుచేతనే సవరభాషకు అంతర్జాతీయ ధ్వని లిపిని వాడాలనే రామమూర్తి పంతులు ప్రతిపాదనను ఆమోదించాను. సవరలు నిజంగా అదృష్టవంతులు. శాస్త్రీయమైన ధ్వని లిపిని తొలి నుంచీ వాడుకునే అవకాశము కలిగిన ప్రపంచంలోని మొదటి జాతి సవరజాతే" అంటూ ప్రశంసించారు.**

"బడి ఈడు పిల్లలనందరినీ పాఠశాలల్లో చేర్పించాలి. బహుభాషా ప్రాంతాలలో భావవ్యక్తీకరణ సామర్థ్యం వున్నంతవరకు మాతృభాషలోనే విద్యాబోధన సాగించాలి," అంటూ 1953లో యునెస్కో ప్రాథమిక విద్యమీద ఒక మోనోగ్రాఫ్ విడుదల చేసింది. మాతృభాషలోనే విద్యాబోధన సాగించాలంటే ఆ భాషలో వాచకాలు రాయాలి. సమస్య ఏమిటంటే చాలా భాషలకు లిపిలేదు. ప్రాచీనకాలం నుండి

లేఖన విధానంలేని, గ్రంథాలులేని భాషను లిపిబద్ధం చెయ్యాలంటే ముందుగా ఆ భాషలోని వర్ణాలను కనుగొనాలి. భాషకు వర్ణనిర్ణయం జరిగిన తరువాత ఆ వర్ణాలను లిపిసంకేతాలు ఏర్పాటు చేసుకోవాలి. ధ్వని వర్ణభేదాలను శాస్త్రీయంగా పరిశీలించకపోతే లిపిని నిర్ణయించడం సాధ్యపడదు. ఇప్పటి విద్యావిధానంలో లిపి నేర్చుకోడం ఎంత ప్రధాన స్థానాన్ని ఆక్రమించినా, భాషకి లిపికన్నా ధ్వని ముఖ్యమని గ్రహించాలి. అక్షరాన్యతను పెంపొందించడం కోసం బహుభాషా ప్రాంతాలలో ఉపయోగించ వలసిన లిపి గురించి యునెస్కో కొన్ని సూచలను చేసింది. రాయడం చదవడం సులభతరం చెయ్యడం కోసం ఉచ్చారణకూ, లేఖనానికీ సంబంధం వుండేటట్టు చూడాలి. భాషలోని వర్ణాలను కనిపెట్టి వీలైనంత తక్కువ చిహ్నాలు వాడాలి. విశేష చిహ్నాలు అంటే గుణింతాలలోని ఒత్తులు (డయాక్రిటికల్ మార్క్స్) తక్కువగా వుండాలి. అక్షరాలు ఒకేవరుసలో వుండాలి. ప్రాంతీయ భాషాలిపికి దగ్గర పోలికలు కలిగి వుండాలి. సులభంగా, వేగంగా రాయగలిగేటట్లు వుండాలి. త్వరగా నేర్చుకోవడానికి అనువుగా సరళమైన లేఖన విధానం వుండాలి. చేతిరాతకు తగినట్టు వుండాలి. టైపు, ప్రింటింగులకు యంత్రాలను ఉపయోగించే అవకాశం వుండాలి. విద్యార్థుల భాషా వ్యవహర్తల అంగీకారం పొందేటట్లు వుండాలి. ఇవి ఆచరణ యోగ్యమైన లిపి లక్షణాలను చెప్పింది. యునెస్కో చెప్పిన ఏభై సంవత్సరాల తరవాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2004-2005 విద్యాసంవత్సరం నుంచి గిరిజన భాషలలోనే విద్యాబోధన జరపడానికి నిశ్చయించింది. రాష్ట్రంలోని పది గిరిజన భాషల్లో ఎనిమిది భాషలను గుర్తించి ఆ భాషలలో ఒకటవ తరగతి పాఠ్యపుస్తకం 2004లో ప్రచురించింది. తరవుఆత వరునగా ప్రతిసంవత్సరం పై తరగతులకు పాఠ్యపుస్తకాలను ప్రచురిస్తూ వస్తున్నది. వీరు పాఠ్యపుస్తకాల రచనకు తెలుగు లిపినే ఉపయోగించారు.

ఇదే సమయంలో గిరిజన భాషలకు లిపులను కనిపెట్టే పరిశోధకులు తయారయారు. మచిలీపట్టణానికి చెందిన ప్రముఖభాషా నిపుణుడు చిలుకూరి అమరప్రసాద్ పలు గిరిజనభాషలకు సమైక్యలిపిని రూపొందించారు. కడపకు చెందిన జి.టి. రామమోహన రావు ఎరుకల భాషకు లిపిని కనిపెట్టి పేటెంటు హక్కులు గూడ తీసుకొన్నారు. మరి కొంత కాలానికి 2010లో ఆంధ్ర విశ్వకళా పరిషత్ ఇంగ్లీషు శాఖాధిపతి ప్రొ.ప్రసన్నశ్రీ వాల్మీకి తెగ మాట్లాడే కుపియా భాషకు లిపిని రూపొందించి అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రశంసలు అందుకొన్నారు. అదే స్ఫూర్తితో బగద, గదబ, కొండదొర, జతాపు, కోండు, కొలాం, కోయ గిరిజన తెగలకు లిపులు రూపొందించారు. ఈమె రూపొందించిన ఈ ఎనిమిది భాషల లిపులకు వరల్డు లాంగ్వేజస్ కౌన్సిల్ గుర్తింపు లభించింది. ప్రొఫెసర్ ప్రసన్నశ్రీ రూపొందించిన ఈ లిపులు యునెస్కో చెప్పిన మంచిలక్షణాలు కలిగివున్నాయో లేదో పరిశీలకులే తేల్చాలి.

ఏభై అరవై సంవత్సరాల క్రితమే సవరభాషకు సవర పండిత మంగయ్య గొమంగ్ గారు ఒక లిపిని కనిపెట్టారు. మంగయ్యగారికి మిర్చిగూడ వద్ద వున్న ఒక కొండపై నున్న రాతి పలకపై సవర అక్షరాలు కనిపించాయి. ఈ లిపిని వారు ప్రచారం చేశారు. వారి అనుయాయులు ఆ కృషిని కొనసాగిస్తున్నారు. గత ఏభై సంవత్సరాలుగా ఈ కృషి సాగుతూనే వుంది. ఇది ధ్వని లిపి, గుణింతాలు లేవు. అక్షరం క్రింద అక్షరం రాదు. కాని చేతిరాతకు అనుకూలం కాదు.

కొన్ని సరళ, వక్రరేఖలతో కొత్తగా లిపిని తయారు చేసుకోవచ్చు కాని అది వాంఛనీయం కాదు. వీలైనంతవరకు వాడుకలోవున్న లిపి సంకేతాలనే ఉపయోగించాలి అనే నిబంధనను అంతర్జాతీయ ధ్వని లిపి సంఘం విధించు కొంది. అంతర్జాతీయ ధ్వనిలిపిలో గ్రీకు, రోమన్ అక్షరాలు వాడారు. ఒక భాషను వాడుకలోవున్న ఏ లిపిలోనైనా రాసుకోవచ్చు. ప్రాంతీయలిపిని, లేదా ఎక్కువ మంది ఉపయోగిస్తున్న లిపిని వాడడం మంచిది. ఆంధ్రప్రదేశ్‌లో నివసిస్తున్న గిరిజనులు తెలుగు లిపిని వాడుకోవచ్చు. కాని ద్విత్వ, సంయుక్తాక్షరాలు రాసేటప్పుడు హల్లు క్రింద హల్లు రాయడానికి బదులుగా పొల్లుతో కూడిన హల్లు వాడడం మంచిది. ఈ లేఖన విధానంలో ధ్వనులు ఏవిధంగా రేఖా మార్గంలో వినిపిస్తాయో అదేవరుసలో రాయడం జరుగుతుంది. ఈ లిపి విశ్లేషనకు అనువుగా వుంటుంది. అక్షరం క్రింద అక్షరం లేని ఈ లేఖన విధానాన్ని సవర బులిటిన్‌లో సవర భాష రాయడానికి ఉపయోగిస్తున్నారు. సవర భాషకు వర్ణనాత్మకవ్యాకరణం రాసిన డాక్టరు చంద్ర శేఖర రావు ఈ లేఖన విధానాన్ని సవర విద్యార్థులకు నేర్పుతున్నారు. ఈ లిపిలో సవరలు రచనలు చేస్తున్నారు. తెలుగువారు కూడ తమ లిపిని సంస్కరించుకోవడంలో తప్పులేదు. లిపి విషయంలో రామమూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి. రామమూర్తి వంటి మేధావికి సవర భాషకు లిపిని తయారు చెయ్యడం అసాధ్యం కాదు. లిపిని తయారు చెయ్యకపోవడమే రామమూర్తి విజ్ఞత.

మి

డాక్టరు అల్లంసెట్టి చంద్రశేఖర రావు, ఫోన్ : 9949605141




గాంధీ సమాధి

# సంస్కార

– ముత్తేవి రవీంద్రనాథ్

*ఎప్పుడైనా ఒలుకులకు వెళ్లండి - అక్కడ అయినవారో ఆత్మీయులో అగ్నికి ఆహుతి అయి, పునీతులవుతుంటే పరీక్షగా చూడండి. ఈ జీవిత పరమార్థం లోని ఒక కోణం అవగాహనకు రావచ్చు - గుండెల్లోని బాధ, తెలియని భయాలు ఆ మంటల్లో, ఆ పొగలో - ఆ చిటపటల్లో కలిసి పంచభూతాలలో విలీనమైపోతాయి. ఆత్మ వుందా లేదా - అనే మీమాంస కంటే ఇప్పటివరకూ మనతోనే వున్న ఆత్మీయులు ఎటు వెళ్లిపోయారో అనే అయోమయం మిగిలి పోతుంది.*

ఒక వస్తువును ఒక విశిష్ట ప్రయోజనం కోసం యోగ్యమైనదిగా చేసేదే సంస్కారం. సంస్కారం ఒక వస్తువులోని దోషాలను పోగొట్టి గుణాలను కలిగిస్తుందనీ, మనకు కనపడని సత్ఫలితాలను ఇస్తుందనీ సనాతనుల విశ్వాసం. మనం సంస్కారాలు పాటించడం కారణంగా దోషనివారణ జరగడం. స్వర్గప్రాప్తి వగైరా సత్ఫలితాలు చేకూరడం అనేవి కేవలం మన నమ్మకాలకు సంబంధించిన విషయాలు మాత్రమే. అవి ఎవ్వరూ శాస్త్రీయంగా రుజువు పరచ గలిగేవి కావు.

**షోడశ సంస్కారాలు:** సంస్కారం అంటే సంస్కరించడం. అంటే యోగ్యత, పవిత్రత చేకూర్చడం. మన భారతీయులు పదహారు సంస్కారాలు పాటిస్తారు. వీటినే షోడశ సంస్కారాలు అంటారు. కర్మ సిద్ధాంతం, పునర్జన్మ సిద్ధాంతం, విగ్రహారాధన, వర్ణాశ్రమ ధర్మాలు వగైరాలను నమ్ముతున్నట్లే మన ప్రాచీనులు షోడశ సంస్కారాలపై కూడా విశ్వాసముంచి అనాదిగా వాటిని పాటిస్తూ వచ్చారు. బిడ్డ కడుపులో పడింది మొదలు చనిపోయే వరకు భారతీయులు ఈ పదహారు సంస్కారాలను పాటిస్తారు. అవి వరుసగా: గర్భాధానము, పుంసవనము, సీమంతము, విష్ణు బలి, జాతకర్మ, నామకరణము, అన్నప్రాశనము, కర్ణవేధ, చూడాకరణము, అక్షరాభ్యాసము, ఉపనయనము, కేశాంతము, వేద వ్రతములు, స్నాతకము, వివాహము, అంత్యేష్ఠి. ఆయా వ్యక్తులు పాటించే ఆగమ సూత్రాలను అనుసరించి వారు పాటించే సంస్కారాల్లో కూడా కొన్ని తేడాలుంటాయి.

**అంత్యేష్టి:** భారతీయ సంస్కారాల్లో చివరిదే అయినా అన్నింటికన్నా అతి ముఖ్యమైనది 'అంత్యేష్టి' సంస్కారం. ఒక వ్యక్తి మరణానంతరం చేసే సంస్కారమిది. దీన్నే శవ సంస్కారం, ప్రేత సంస్కారం అనికూడా అంటారు. చనిపోయిన వ్యక్తికి ఉత్తమ గతులు సంప్రాప్తించేట్లు చేయడం కోసం వారి పిల్లలు పాటించే సంస్కారమిది. ఒక వ్యక్తి చనిపోయినప్పుడు మరణించేది దేహమే కానీ, లోపలున్న ఆత్మ కాదనీ, ఆ ఆత్మకు అఖండమైన జ్ఞానం కలిగేవరకు అది ఒకదాని తరువాత ఒకటిగా పునర్జన్మలు ఎత్తుతూనే ఉంటుందనీ మన ప్రాచీనుల విశ్వాసం. మరణించిన వ్యక్తికి ఉత్తమ గతులు (ఉన్నత జన్మ) చేకూరాలనీ, ప్రేతత్వం నుంచి విముక్తి లభించాలనీ లేక జన్మ రాహిత్యం లేక మోక్షం లభించాలనీ కోరుతూ ఆ వ్యక్తి సంతానం పాటించే సంస్కారమిది.

సంస్కృత భాషలో 'ఇష్టి' అంటే యజ్ఞం అని అర్థం. జీవితపు అంత్యదశ (ముగింపు దశ లేక చరమాంకం) అంటే మరణానికి సంబంధించి జరుపబడే యజ్ఞం కనుక దీనిని 'అంత్యేష్టి' అన్నారు. శవ సంస్కారాన్ని కూడా మన ప్రాచీనులు యజ్ఞం గానే భావించారు. అగ్ని సంస్కారం వల్ల మరణించిన వ్యక్తులకు పాప ప్రక్షాళన అవుతుందని వారి నమ్మకం. పుణ్య పాపాలు, స్వర్గనరకాలు, పునర్జన్మ, ఒక అతీతమైన శక్తి మనల్ని నడిపిస్తున్నదనే విశ్వాసం మొదలైన విషయాలపై ఈ సంస్కారం ఆధారపడి ఉంది. మరణం వెంటనే ఒక వ్యక్తి పార్థివ దేహానికి, తరువాత అతడిని ఉద్దేశించి జరిపే మొత్తం కర్మల సముదాయం అంత్యేష్టి. మన అందరికీ మరణించిన వ్యక్తిమీద ప్రేమ, లేక ఆ వ్యక్తి గురించి భయము సహజంగానే ఉంటాయి. అతడు మరణించినా అతడి ఆత్మ మనతో సంపర్కం కలిగి ఉంటుందనీ, అతడికి మరణానంతరం ఉత్తమ గతులు కలగకపోతే, ఆ ఆత్మ బ్రతికి ఉన్నవారిని బాధించి, సాధిస్తుందనీ ప్రాచీనులు నమ్మేవారు. మన పట్ల అభిమానం,

అనురాగం కల పెద్దలకు సక్రమమైన రీతిలో అంతిమ సంస్కారాలు నిర్వహిస్తే వారి ఆత్మలు సంతోషపడి, మనకు మేలు చేస్తాయనే నమ్మకమే అంత్యేష్టి నిర్వహణకు మూలం.

**మరణం ఆసన్నమైతే?:** బర్మా దేశంలోని మెర్గ్వీ దీవుల్లోని సీలింగ్ జాలి ప్రజలు మనిషి చనిపోకముందే భయంతో అతడిని వదిలేసి దూరంగా పారిపోతారట. సైబీరియా లోని యాకూత్ జాతివారు ఒక వ్యక్తికి చావు దగ్గర పడిందని తెలియగానే మూడురోజులపాటు మహోత్సవంలాగా విందులు జరుపుకుంటారు. ఆ తరువాత అతన్ని అడవికి తీసుకెళ్ళి ఆయుధాలు, ఆహార పదార్థాలు, పాత్రలు మొదలైన వాటితో సహా అతడిని గొయ్యితీసి పాతిపెడతారు. మన ప్రాచీనులు మరణం ఆసన్నమైన వ్యక్తిని కటిక నేలమీద దర్భలు పరిచి దానిమీద పడుకోబెడతారు. క్రైస్తవులు జీవుడి ప్రాణం అంతిమ దశలో తూర్పు దిక్కుకు వెళ్తుందనే నమ్మకం కారణంగా మరణించనున్న వ్యక్తి పాదాలు తూర్పు వైపుకు ఉండేట్లు పడుకోబెడతారు.

ముస్లిములు మక్కా వైపుకి ముఖం ఉండేటట్లు కుడివైపుకి తిప్పి పడుకోబెడతారు. క్రైస్తవులలోని రోమన్ కాథలిక్కులలో చనిపోబోయే వ్యక్తి తాను చేసిన పాపాలన్నీ మతగురువుకు పూసగుచ్చినట్లు వివరించి ప్రాయశిత్తం కోరుకుంటాడు. హిందువలలో మరణం సమీపించిన వ్యక్తి షోడశ మహాదానాలు అనే పదహారు దానాలు చేస్తాడు. కొన్ని దేశాల్లో వ్యక్తి మరణించిన వెంటనే ఇంటి కిటికీలన్నీ తీసేసి ఆత్మ నిరాటంకంగా బయటికెళ్ళిపోయే ఏర్పాటు చేస్తారట! చనిపోయిన వ్యక్తికి సంతాప సూచకంగా మన దేశంలోనూ, ప్రాచీన గ్రీసు లోనూ బిగ్గరగా ఏడవడం ఉంది. గరుడపురాణం ఇది తగని ఆచారమని ఖండించింది. మహమ్మద్ ప్రవక్త కూడా దీన్ని తప్పుబట్టాడు. కూలికి తీసుకొచ్చిన జనం చేత ఏడ్పులు, పెడబొబ్బలు పెట్టించడం తమిళనాడులో ఉందట.

**పలు రకాల శవసంస్కారాలు :** చనిపోయిన వ్యక్తి మాంసాన్ని ఇతరులు పంచుకు తినడం అనే అనాగరక ఆచారం కొన్ని జాతుల్లో ఉంది. కొన్ని జాతులవారు నిర్జన ప్రదేశంలో శవాన్ని వదిలేసి వొస్తారు. కొందరు గుహలలో పాతిపెడతారు. పార్శీలు (జోరోయాస్ట్రి యన్ మతస్థులు) అగ్నిని పరమ పవిత్రమైనదిగా భావిస్తారు. కనుక వారు శవదహనం చేయరు. అది అగ్ని పవిత్రతను చెరుపుతుందని వారి విశ్వాసం. వారు శవాలను కుక్కలూ, నక్కలూ, గద్దలూ, రాబందులూ పీక్కుతినేందుకు అనువుగా ఒక నిర్మానుష్య ప్రదేశంలో వాటిని వదలివేస్తారు. సికింద్రాబాద్ లోని పార్శీ గుట్ట అనే చిన్న కొండ మీద అక్కడి పార్శీలు ఇలా శవాల్ని పారేస్తారు. భారతీయులు ముఖ్యంగా దహనం (తగులబెట్టడం). ఖననం (పాతిపెట్టడం) అనే రెండు రకాల శవ సంస్కారాన్ని పాటిస్తారు. అవివాహితులైన చిన్న పిల్లలనూ, సన్యాసులనూ మరణానంతరం పాతిపెడతారు. చిన్న పిల్లలకు పుణ్యమూ, పాపము చేసే అవకాశమే ఉండదనీ, సన్యాసులు పుణ్యపాపాలకు అతీతులనీ నమ్మడం కారణంగా వారి దేహాలకు దహన సంస్కారం అవసరం లేదనీ మన పూర్వులు భావించారేమో!

సన్యాసుల శవాలనైతే ఎటువంటి సంస్కారమూ చేయకుండా నీటిలో వదలివేసినా చాలట; యుద్ధాలలో చంపబడ్డ శత్రు సైనికులను సామూహికంగా ఖననం చేయడం సహజం. వారికెవరూ దహన సంస్కారం చేయరు. ఆత్మహత్యలు చేసుకున్నవారికీ దహన సంస్కారం ఉండదు. రెండు సంవత్సరాల లోపు పిల్లల శవాలను పాతిపెట్టడమే కానీ వాటికి దహన సంస్కారం ఉండదు. అలాగే ఉపనయనం కాని పురుషులకు కూడా ఖననమే తప్ప దహన సంస్కారం ఉండదట. వివాహం కాని స్త్రీలకు కూడా దహన సంస్కారం చేయరు. గ్రీకులు శవాలను దహనం చేసి, ఆ తరువాత ఆ చితాభస్మాన్ని కూజాలలో ఉంచి, వాటిని పాతిపెట్టి, దానిపై సమాధి నిర్మిస్తారు.

ఒక రకంగా మన దహనం, ఖననం అనే రెండు రకాల శవ సంస్కారాల మేళవింపే ప్రాచీన గ్రీకుల అంత్యక్రియల పద్ధతి. మనకులాగే గ్రీకులలో కూడా ఆత్మహత్య చేసుకున్న వారికి దహన సంస్కారం గౌరవం దక్కేది కాదు. పాప ప్రక్షాళన, పుణ్య లోకాల ప్రాప్తి వంటి అశాస్త్రీయ విశ్వాసాలను పక్కనపెట్టి, శాస్త్రీయ దృష్టితో ఆలోచించినా మృత దేహాన్ని అలాగే వదిలివేయకుండా దహనం (Cremation) లేక ఖననం (Burial) అనే సంస్కారలలో ఏదో ఒకటి చేయడం అందరికీ ప్రయోజనకరం. మృతదేహాలను అలాగే వదలివేస్తే కుళ్ళి, భరించరాని దుర్గంధం వ్యాపించడమే కాక, ప్రమాదరకమైన అంటురోగాలు ప్రబలుతాయి. కరవులో ఆహారం దొరకక మనుషులు మరణిస్తే, పశుగ్రాసం లభించక పశువులు మరణిస్తాయి. మనుషుల, పశువుల మృత కళేబరాలను ఒకప్పుడు సంస్కారం చేయడానికి కూడా సాధ్యపడని రీతిలో గుట్టలు గుట్టలుగా పడి ఉంటాయి. అవి కుళ్ళి దుర్గంధ భరితంగా తయారై, ప్లేగు మొదలైన ప్రమాదకరమైన అంటు

వ్యాధుల వ్యాప్తికి దోహదపడతాయి. అది మరింత జననష్టం, పశునష్టాలకు దారితీస్తుంది. ఈ దశనే కాటకం అంటారు. కరవు (Famine) వెంటనే కాటకం (Pestilence) వస్తుందనేది మనకందరకూ తెలిసిన విషయమే.

ఇలా కరువు కాటకాలు ప్రబలినప్పుడు మృత దేహాలన్నింటికీ దహన సంస్కారం చేయడం సాధ్యపడేది కాదు కనుక వాటిని సామూహికంగా ఖననం చేస్తారు. దహనం, ఖననం-ఈ రెండు విధాల సంస్కారాలలో భూసారాన్ని పెంపొందించే ఖననమే శ్రేష్ఠమైనది. అయితే హిందూ మతస్థులలో మృతుని చితాభస్మాన్ని భద్రపరచడం, లేక అస్థికలనూ, చితాభస్మాన్ని నదులలో కలపడం అనే ఆచారం ప్రబలంగా ఉన్న కారణంగా ఎక్కువమంది దహన సంస్కారం చేయడానికే ఇష్టపడతారు.

ఒకప్పుడు ప్రాచీనులు మనదేశంలో కూడా ఎక్కువగా మృతులను పూడ్చడం చేసేవారు. ఆర్య సంస్కృతి విస్తరణ కారణంగా క్రమంగా ఖననం స్థానంలో దహన సంస్కారమే ఎక్కువగా ప్రజాదరణ పొందుతూ వచ్చింది. అగ్నిలో కాల్చబడిన ప్రతి పదార్థమూ ఉన్నత లోకాలకు వెళుతుందనీ, భూమికి దిగువన ఏడు అథోలోకాలు, పైన ఏడు ఉన్నత లోకాలు ఉన్నాయనీ, అగ్ని కాలలు ఎప్పుడూ పైకే వ్యాపిస్తాయి కనుక మృతాత్మలు కూడా ఉన్నత లోకాలకు చేరుకుంటాయనీ ఆర్యులు నమ్మేవారు. వాస్తవానికి శరీరం దహనమైనప్పుడు అందులోని కర్బనం (Carbon) మండి, గాలిలోని ప్రాణవాయువు (Oxygen)తో కలిసి కార్బన్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ అనే రెండు వాయువులు వెలువడతాయి. అవి రెండూ గాలికంటే తేలికైనవైన కారణంగా అగ్ని శిఖలు ఎప్పుడూ పైకే మండుతూ ఉంటాయి. మృత కలేబరాన్ని తగులబెడితే ఉన్నత లోకాలకు వెళ్లేది ఆ రెండు వాయువులే!

దహనం, ఖననం - ఈ రెంటిలో ఏది అనుసరించదగిన సంస్కారం అనే విషయంలో చాలా చర్చలు జరిగాయి. ఖననం చేయడానికి, సమాధులు నిర్మించడానికి జనసంఖ్య పెరిగే కొద్దీ ఎక్కడి స్థలాలూ చాలవు. అంచేత దహనమే అత్యుత్తమ సంస్కారం అని కొందరి వాదన. అదీగాక అంటు వ్యాధులున్న రోగి మరణించినప్పుడు అతడని ఖననం చేస్తే ప్రమాదకరమైన ఆ వ్యాధులు ఇతరులకు కూడా సంక్రమించే అవకాశం కూడా ఉంది. ఆ కారణంగా కూడా దహనమే ఉత్తమమని కొందరి వాదన. అయితే కొన్ని మతాలలో మరణించిన తరువాత కొంత కాలానికి పునరుత్థానం (Resurrection) లేక పునరుజ్జీవనం సాధ్యమేనని నమ్ముతారు. అందుకే వారి నమ్మకానికి తగినట్లుగా వారు శవాన్ని శవపేటికలో భద్రపరచి పాతిపెట్టడమే చేస్తారు. అయితే ప్రపంచంలో పలు కారణాల రీత్యా దహన సంస్కారానికే అదరణ నానాటికీ పెరుగుతున్నది.

**శ్మశానం:** శవ సంస్కారం చేయడానికి ప్రాచీనులు నిర్దేశించిన స్థలమే శ్మశానం. కేరళలోని నంబూద్రీ బ్రాహ్మణ కుటుంబాలలో ఇంటి వెనుక పెరట్లోనే మృతుల శవాలను దహనం లేక ఖననం చేసే ఆచారముంది. మన రాష్ట్రంలో కూడా కొందరు తమ పొలాలలో అంత్య క్రియలు నిర్వహించి అక్కడే సమాధి నిర్మిస్తుంటారు. అయితే ఇంటి ఆవరణలోనే అంత్యక్రియలు నిర్వహించడం, సమాధి కట్టడం మన ప్రాంతంలో చాలా అరుదు.

ప్రభుత్వం యేపోరంబోకు స్థలాలనో, లేక గ్రామ కంఠాలు అనబడే ఊరుమ్మడి స్థలాలనో (Village Common Properties) శ్మశానాలుగా కేటాయిస్తుంది. కొన్ని చోట్ల ఉదార స్వభావం కల భూస్వాములు, రైతులు దానం చేసిన భూములలో శ్మశానాలు ఏర్పడ్డాయి. ఇంకొన్ని చోట్ల శ్మశాన భూములను కూడా వదలకుండా గ్రామీణ పెత్తందార్లు ఆక్రమించుకుని సాగుచేసుకుంటున్న సందర్భాలూ ఉంటున్నాయి. అది వేరే విషయం. మరికొన్ని చోట్ల క్రైస్తవ మిషనరీలు, ముస్లిం వక్ఫ్ బోర్డులూ తమ మతస్థుల కోసం శ్మశాన భూములను కొనుగోలు చేయడమూ ఉంది. మతావారీగా హిందూ క్రైస్తవ, ముస్లిం శ్మశాన వాటికలు నేడు మనం చూస్తున్నాం. క్రైస్తవ శ్మశాన వాటికలను 'గ్రేవ్ యార్డ్' అనీ, 'సెమెటరీ' (Cemetery) అనీ అంటారు. క్రైస్తవులు శవాలను చెక్క పెట్టెలలో పెట్టి ఖననం చేస్తారు. ఆ స్థలం మీద వారి వారి ఆర్థిక స్తోమతును బట్టి సమాధి (grave) నిర్మించడమో, లేక కేవలం సమాధి రాయి (Tomb-Stone) గా ఒక బండను ప్రతిష్ఠించడమో చేస్తారు. ఆ సమాధి రాయి మీద మరణించిన వ్యక్తి గురించిన వివరాలు నమోదు చేస్తారు. ఇలా నమోదు చేసిన వివరాలను 'ఎపిటాఫ్' (Epitaph) అంటారు. ఖర్చు భరించలేని కొందరు పేద క్రైస్తవులు కేవలం మృతదేహాన్ని గొయ్యితీసి పూడ్చడంతో సరిపెట్టేస్తారు. ఒక్కొక్కసారి ఓ వ్యక్తి ఏదైనా దూరదేశం వెళ్లి అక్కడే చనిపోవడం జరుగుతుంది. అక్కడే అంత్యక్రియలు జరిగిపోతాయి. లేక అంత్యక్రియలకు బంధువులకు శవం కూడా లభించదు. (సహజంగా

యుద్ధంలో శత్రువుల చేతులలో మరణించిన సైనికుల శవాలు, సముద్రాలలో జరిగే విమాన, ఓడ ప్రమాదాలలో మృతుల దేహాలు ఒక్కోసారి కుటుంబ సభ్యులకు లభించవు.) అలాంటి సందర్భాలలో ఖననం చేసేందుకు శవం లేకపోవడం చేత ఖాళీ సమాధి నిర్మిస్తారు. అలా ఒక వ్యక్తి స్మారకార్థం నిర్మించబడే ఒట్టి సమాధిని 'సెనోటాఫ్' లేక 'కెనోటాఫ్' (Cenotaph) అంటారు.

ముస్లిం శ్మశాన వాటికను 'కబ్ర్-స్థాన్' అంటారు. ఉర్దూలో 'కబ్ర్' అంటే సమాధి లేక శవాన్ని పాతిపెట్టే గుంట అని అర్థం ముస్లిం సమాధులను గోరీలు అనికూడా అంటారు కనుక స్థానికులు ముస్లిం శ్మశాన వాటికలను 'గోరీల దొడ్లు' అని కూడా వ్యవహరిస్తారు.

నేడు శ్మశానాలు నిర్వహించబడుతున్న తీరుతెన్నులు చూస్తుంటే మనకె మత ప్రమేయం లేని సెక్యులర్ శ్మశాన వాటికలు కూడా ఉండడం అవసరమేమోననిపిస్తున్నది. హిందూ మూలాలు కలిగిన నాస్తికుడి శవానికైనా సరే అంత్యక్రియలు చేసుకుంటూ ఉంటే హిందూ శ్మశాన వాటికలలో ఎప్పుడూ అభ్యంతరం పెట్టరు కాని, ఒక క్రైస్తవ శవ సంస్కారాన్ని హిందూ శ్మశానవాటికలో జరపడాన్ని ఎప్పుడూ ఒప్పుకోరు. ఇందుకు నాకు తెలిసిన ఒక చిన్న ఉదాహరణ చెపుతాను. ఒక గ్రామంలో హిందూ అగ్ర వర్ణానికి చెందిన ఒక పెద్దాయన ఒక దళిత క్రిస్టియన్ స్త్రీని చేరదీశాడు. వారికి ఒక కుమార్తె కలిగింది. ఆ పెద్దాయన ఆ స్త్రీకి గానీ, ఆ అమ్మాయికిగానీ సమాజంలో తన భార్య, కుమార్తె స్థాయి గౌరవం ఎన్నడూ కల్పించలేదు. అయితే చనిపోయేవరకు దళితవాడకు దూరంగా తన పొలంలో తాను వారికోసం నిర్మించిన ఇంటిలోనే వారిని ఉంచి, పోషిస్తూ రోజూ వస్తూ పోతూ ఉండేవాడు. కొన్నాళ్ళకు ఆయన చనిపోయాడు. తరువాత తల్లి పోషణలో ఆ అమ్మాయి కూడా దళిత క్రిస్టియన్ గానే పెరిగింది. యుక్త వయస్సు వచ్చాక ఒక క్రిస్టియన్‌నే పెళ్ళి చేసుకుంది. కొంతకాలానికి ఆ అమ్మాయి అనుకోనిరీతిలో హఠాత్తుగా అనారోగ్యంతో మరణించింది. తన కుమార్తెకు అంత్యక్రియలు అందరు దళితులలా క్రిస్టియన్ శ్మశాన వాటికలో జరపడం ఆమెకు సుతారాం ఇష్టం లేదు. ఆమె అగ్రవర్ణ రైతు కుమార్తె కనుక హిందూ శ్మశాన వాటికలోనే తన కుమార్తెకు అంత్యక్రియలు జరపాలని తల్లి కోరుకుంది. ఆ అమ్మాయి తండ్రి బంధు వర్గానిదే ఆ గ్రామ పెత్తనమంతా. కనుక వారెవ్వరూ దీనికి అడ్డు చెప్పరని భావించింది. ఆయన బతికి ఉన్నట్లయితే పరిస్థితి ఎలా ఉండేదో మరి? ఒక్కరంటే ఒక్కరు కూడా ఆమె తరఫు మాట్లాడలేదు. గ్రామ పెద్దలు అందరూ మూకుమ్మడిగా ఇందుకు ససేమిరా వల్లకాదన్నారు. దాంతో ఆమె చేసేదేమీ లేక అటు క్రిస్టియన్ శ్మశాన వాటికకూ తిరిగి వెళ్ళడానికి ముఖం చెల్లక, తన ఇంటి వెనక స్థలంలోనే కుమార్తె శవాన్ని పూడ్చిపెట్టి ఒక సమాధి నిర్మించింది. ఇంకా ఇలాంటివే ఎన్ని జరుగుతున్నాయో?

**శవాలంకరణ:** మనవారు అంత్య క్రియలకు ముందు శవానికి స్నానం చేయించి నూతన వస్త్రాలు కట్టబెడతారు. చైనీయులు మరణానికి బాగా ముందు నుంచే అలంకారాలతో కూడిన వస్త్రాలను సిద్ధం చేసుకుంటారట. బ్రిటీష్ దీవులలో శవం కాళ్ళకు కొత్త చెప్పులు కూడా తొడుగుతారట. మరి నరకం దిశగానో, స్వర్గం దిశగానో సుదీర్ఘమైన మహా ప్రస్థానం (Long March) చెయ్యాలి కదా- కాళ్ళకి చెప్పులు లేకపోతే ఎలా మరి! కొన్ని జాతులలో మరణించిన వ్యక్తికి ఇష్టమైన ఆహార పానీయాలు, వస్త్రాలు, ఆభరణాలు వగైరాలన్నీ ఆ వ్యక్తి శవంతో పాటే పూడుస్తారు. ప్రాచీన ఈజిప్టు దేశంలోని ఫారోలు అనబడే రాజులు మానవుడి ఆత్మ మరణానంతరం శరీరాన్ని వీడి, ప్రస్తుతానికి వేరొక జన్మ ఎత్తినా, తిరిగి కొన్ని జన్మల అనంతరం మళ్ళీ తన మొదటి దేహాన్ని వెతుక్కుంటూ వచ్చి, ఆ దేహంలో ప్రవేశిస్తుందని నమ్మేవారు. అందుకే వారు తాము మరణించిన తరువాత తమ శరీరం చెడకుండా నూనెలు పూసి, కొన్ని ద్రావకాలలో దాన్ని ముంచి 'మమ్మీ' అనే పేరుతో పెట్టెలలో భద్రపరచేవారు. ప్రస్తుతానికి సాధారణ మానవునిగానో లేక ఏదైనా జంతువుగానో జన్మించినా తమ శరీరం చెడకుండా భద్రపరిస్తే తిరిగి రాజుగా జన్మించవచ్చునని వారి ఆశ. ఇలా ఆత్మ వివిధ శరీరాల్లో ప్రవేశిస్తూ అంతిమంగా తన పూర్వపు శరీరాన్ని వెతుక్కుంటూ తప్పక వస్తుందనే నమ్మకాన్ని ఆంగ్లంలో 'Metempsyschosis' అంటారు. కళేబరాలకు ఇదే తరహాలో తైల లేపనం (Embalming) చేసి ప్రాచీన గ్రీకులు వాటిని ఖననం చేసేవారు.

**అంతిమయాత్ర:** శవ యాత్ర లేక అంతిమ యాత్ర గురించి కూడా కొన్ని విషయాలు చెప్పుకోవాలి. శవాన్ని శ్మశానికి తీసుకువెళ్ళే అంతిమ యాత్రలో ప్రస్తుతం మృతుని బంధువర్గంలోని పురుషులు మాత్రమే పాల్గొంటున్నారు. ఇంటి ఆవరణ దాటి స్త్రీలు శవం వెంట వెళ్ళే అలవాటు

ఏ మతస్థులలోనూ కానరాదు. దశరథుడి శవాన్ని శ్మశానానికి తీసుకువెళ్ళేటప్పుడు భార్యలు ముగ్గురూ శవాన్ని అనుసరించి శ్మశానానికి వెళ్ళినట్లు వాల్మీకి *రామాయణమ్* లో పేర్కొన్నాడు. ప్రాచీన కాలంలో మృతుడి భార్యలు జుట్టుముడి విప్పి, విరబోసుకుని ఒంటిపై దుమ్ము చల్లుకుంటూ శవం వెంట వెళ్ళేవారని కొన్ని గ్రంథాలు పేర్కొన్నాయి. ఏమైనా పురుషులతో పాటు శవ యాత్రలో స్త్రీలు కూడా అనుసరించడం పాటించదగిన సత్సంప్రదాయం. వారిని ఈ విషయంలో కట్టడి చేయడం మంచిది కాదు.

ఆర్య సామాజికులు నిర్వహించే అంత్యక్రియలలో మిగిలిన వారందరికీ ఆదర్శంగా స్త్రీలు కూడా అంతిమ యాత్రలో పాల్గొంటారు. పాల్గొనడమే కాదు; చితికి స్త్రీలే నిప్పు పెట్టిన సందర్భాలూ నేనెరుగుదును. దహన సంస్కారంలో తండ్రికి పెద్ద కుమారుడు, తల్లికైతే చిన్నకుమారుడు చితికి నిప్పు పెట్టడం ఆనవాయితీగా వస్తున్నది.

కుమారులు లేని తండ్రికి దత్తత కుమారుడు అంత్యక్రియలు నిర్వహిస్తాడే కానీ తల్లిదండ్రులకు కుమార్తె అంత్యక్రియలు నిర్వహించే సంప్రదాయం హైందవ సమాజంలో లేదు. అందుకే పురుష సంతానం కలిగితే పున్నామ నరకం తప్పిపోతుందని కొడుకు పుట్టాలనే కోరికతో ప్రాచీన కాలంలో 'పుంసవనం' అనే యజ్ఞం కూడా చేసేవారు. దశరథుడు 'పుత్రకామేష్టి' అనే యాగం చేస్తే ప్రత్యక్షమైన యజ్ఞపురుషుడు ఇచ్చిన పాయసం తిన్న కౌసల్య, సుమిత్ర, కైకేయిలకు రాముడు, అతడి సోదరులు ముగ్గురూ జన్మించారని *రామాయణమ్* పేర్కొంది. శాస్త్ర విజ్ఞానం అభివృద్ధి చెందడంతో పురుష, లేక స్త్రీ సంతానం కలగడానికి 'సెక్స్ క్రోమోజోములు' ప్రధాన కారణమని రుజువైనందున ఇవాళ మగపిల్లలు కలగడం కోసం యజ్ఞాలు ఎవ్వరూ చేయడం లేదు. మారిన పరిస్థితులలో పురుషాధిక్యపు భ్రమలు తొలగిన తల్లిదండ్రులు 'ఆడపిల్లలే నయం' అనుకుంటున్నారుగానీ, పున్నామ నరకాన్ని గురించి ఎవరూ ఆలోచించడం లేదు. ఇది నిస్సందేహంగా మంచి పరిణామమే. ఇక చిన్నగా తమ తల్లిదండ్రుల చేతికి స్త్రీలే నిప్పుపెట్టే సంప్రదాయం మొదలుకావాల్సి ఉంది. నేను ఇప్పటికే కుమారులు లేని తల్లిదండ్రులు మరణించిన కొన్ని సందర్భాలలో వారి కుమార్తెలు చితికి నిప్పు పెట్టడం చూశాను.

శవ వాహకులు (Pall-bearers) గా మృతుడి గోత్రీకులే ఉండాలనే నియమం కూడా ఉండేది. వారు లభ్యం కానప్పుడు ఇతరులు శవాన్ని మోసుకెళతారు. వారూ లభించని సందర్భాలలో అనాథ శవాల విషయంలో వలెనే ఏదైనా వాహనం మీద శవాన్ని ఉంచి శ్మశానానికి తీసుకెళ్ళడం జరుగుతున్నది. శ్మశానం మృతుడి ఇంటికి దూరంగా ఉన్న సందర్భాలలోనూ, కొందరు అట్టహాసంగా హంగు, ఆర్భాటంతో అంతిమయాత్ర నిర్వహించే సందర్భాలలోనూ శవ యాత్రకు లారీల వంటి వాహనాలు వాడతారు. శవయాత్ర విషయంలో ముస్లిం మతస్థులు పాటించే విధానం ఆదర్శప్రాయంగా ఉంది. విశ్వమానవ సౌభ్రాతృత్వం (Universal Brotherhood) అనే ఇస్లామిక్ సూత్రానుసారం మృతుని ప్రాంతంలోని ముస్లిములందరూ శవవాహకులుగా వ్యవహరిస్తారు. శవాన్ని ఉంచిన చెక్క పెట్టె (Coffin) ను ఒకరి తరువాత మరొకరు భుజం మార్చుకుంటూ వేగంగా పరుగెడుతుంటే చూసేవారికి ముచ్చటగానూ ఉంటుంది. మోసేవారికి తామూ శవయాత్రలో పాల్గొని తమ సౌభ్రాతృత్వం చాటుకున్నామనే తృప్తీ మిగులుతుంది.

హిందువులలో శవయాత్రలో స్త్రీలేకాదు; తల్లిదండ్రులు బతికున్న ఏ పురుషులూ కూడా పాల్గొనరాదనే నియమం ఉంది. తమ తల్లిదండ్రులు బతికి ఉన్న ఏ పురుషుడూ శవాలు మోయడం కానీ, శవంతోపాటు శ్మశానానికి వెళ్లడం కానీ చేస్తే అతడి తల్లిదండ్రులకు అరిష్టమని ఒక అంధ విశ్వాసం. నేను నాకు ఇరవై ఆరేళ్ళ వయస్సు వచ్చింది మొదలు నేటివరకు కనీసం యాభై శవాలైనా మోశాను. శవయాత్రలలో పాల్గొని కొన్ని వందల సార్లు శ్మశానాలకు వెళ్లాను. దీనివల్ల నా తల్లిదండ్రులకు ఎలాంటి అరిష్టమూ జరగలేదు. వాళ్ళిద్దరూ సుదీర్ఘ కాలంపాటు ఆనందంగా, ఆరోగ్యంగా జీవించారు. మా నాన్న 2000 సంవత్సరంలో తన 95వ యేట, మా అమ్మ 2009 సంవత్సరంలో తన 99వ యేట మరణించారు. అందుకే నా స్వీయానుభవం తోనే ఇదొక అంధ విశ్వాసమనే నిర్ధారణకు వచ్చాను.

శవ యాత్ర అనగానే గుర్తొచ్చే మరొక విషయం ప్రస్తావిస్తాను. నేను ప్రత్యక్షంగా పాల్గొన్న ఆ ఘటనలో మాదిగ క్రైస్తవులు కొందరు నా మిత్రుడైన ఒక మాల క్రైస్తవుడి భార్య శవ యాత్రను తమ మాదిగ గూడెం లోనుంచి వెళ్ళ నివ్వబోమని ఆటంకపరిచారు. శవాన్ని అంత్యక్రియల కోసం తీసుకెళుతున్నది మాల క్రైస్తవ శ్మశాన వాటికకే

అయినప్పటికీ, దగ్గర దారి అని మాదిగ గూడెంలో నుంచి తీసుకు వెళ్తుంటే, అది పబ్లిక్ రోడ్డే అయినప్పటికీ కూడా, 'మా ఇళ్ళ మధ్యగా తీసుకు వెళ్ళడానికి వీల్లేదు; చుట్టూ తిరిగి వెళ్ళ' మని అంటూ అటకాయించారు. ఎలాగోలా వారికి సర్దిచెప్పి ముందుకు సాగాం. ఇంచుమించు ఇలాంటి సంఘనే ఉయ్యూరు సమీపం లోని ఆకునూరు గ్రామంలో జరిగి, అది ఇరు సామాజిక వర్గాల మధ్య వైమనస్యానికి దారి తీసిందని పత్రికల్లో చదివాను. పంచాయతీ లేక మునిసిపల్ రోడ్లమీద జరిగే శవ యాత్రల వల్ల ఎవరికి నష్ట? వాటిని ఎవరైనా ఎందుకు ఆటంక పరచాటి? ఈ విషయంపై ప్రభుత్వాలు ప్రేక్షక పాత్ర వహించి ఊరుకోకుండా, వీటికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. శ్మశానాలన్నిటికీ - ప్రత్యేకించి రోడ్డు సౌకర్యం లేనిచోట్ల ఆ సౌకర్యం కల్పించాలి.

శవయాత్రుల తమ వీధి లేక ప్రాంతం గుండా వెళితే, తమకేదో అరిష్టం జరిగి, కీడు మూడుతుందనీ అశాస్త్రీయ విశ్వాసం కూడా చాలా మందిలో ఉంది. మరొక మతం లేక  కులం వారి శవయాత్రలు తమ ప్రాంతం నుంచి వెళుతున్నప్పుడే ఈ తరహా ఉద్రిక్తతలు తలెత్తడానికి కారణం ఈ అంధ విశ్వాసమే. తమ మతం లేక కులం వారి శవ యాత్రలు తమ ప్రాంతం లేదా వీధిలో నుంచి వెళ్ళినప్పుడు జరగని అరిష్టాలు అన్యమతస్థుల, లేక అన్య కులస్థుల అంతిమ యాత్రలు తమ ప్రాంతం గుండా వెళితే జరుగుతాయని భావించడం శుద్ధ తప్పు. మనిషన్నాక ఎవరైనా మరణించక తప్పదు కదా!

తమ ఆత్మీయుల మరణం కారణంగా పరితపిస్తున్న వారి స్థానంలో మనల్ని ఊహించుకుని చూద్దాం. అప్పుడు వారిపై సానుభూతే కానీ ఆగ్రహం కలుగదు. క్లిష్ట స్థితిలో ఉన్నవారిని శవయాత్రకు అభ్యంతరం చెప్పి మరింత విసిగించకుండా వారి దుస్థితికి సానుభూతి తెలపడం మనందరి  కర్తవ్యం.

**మైల:** దాదాపుగా దీని వంటిదే 'మైల' కూడా. ఒక ఇంట్లో శిశువు జన్మించినా, లేక స్త్రీకి గర్భస్రావం జరిగినా ఆ కుటుంబం జననాశౌచం (జనన+అశౌచం) లేక సూతకం అనే మైలను పాటిస్తారు. అలాగే ఒక వ్యక్తి మరణించినప్పుడు కూడా వారి సన్నిహిత బంధువులకు అశౌచం లేక మైల (Defilement or Impurity) ఏర్పడుతుందని నమ్ముతారు. దీన్ని మృతాశౌచం (మృత+అశౌచం) అంటారు. ఇలా ఏర్పడే మైల మృతుడి సన్నిహిత బంధువులకు పది రోజులపాటు ఉంటుందని నమ్ముతారు. ఆ పది రోజులూ వారు వేరెవరినీ తాకరాదు. శారీరక సుఖాలను త్యజించాలి. కేశాలు ఖండించ కూడదరు. ఆ పదిరోజులూ వస్త్రధారణ, మాసిన గడ్డం, వారి వేషభాషలు దుఃఖాన్ని వ్యక్తం చేసేవిగానే ఉండాలి.

వేద మంత్రాలు చదవడానికి మైల పట్టినవారు అర్హులు కాదు. వారు కటిక నేలపైనే పడుకోవాలి. పగటి పూట మాత్రమే భోజనం చేయాలి. వారు సహపంక్తిలో కూర్చుని ఇతరులతో కలిసి భోజనం చేయరాదు. అలాగే ఆ పదిరోజులూ వారు ఎటువంటి పవిత్ర కార్యాలూ చేయరాదు. సమానోదకులు, సపిండులూ ఈ తరహా మైల నుంచి బయట పడాలంటే ఏయే ప్రాయశ్చిత్తాలు చేయాలో *మనుస్మృతి* 11వ అధ్యాయంలో వివరించబడింది.

ధర్మ సూత్రాల ప్రకారం మైల బ్రాహ్మణులకు పది రోజులు, క్షత్రియులకు పన్నెండు రోజులు, వైశ్యులకు పదిహేను రోజులు, శూద్రులకు ఒక నెల వరకు ఉంటుందట. బ్రాహ్మణులలో కూడా నిత్యాగ్ని హోత్రి, వేదాధ్యయనపరుడు అయినవాడికి మైల ఒకరోజులోనే తొలగిపోయి అతడు తిరిగి శుద్ధి పొందుతాడట. కేవలం వేదాలు వల్లెవేసే బ్రాహ్మణుడికి మూడు రోజులపాటు మైల ఉంటుందట. ఈ అర్హతలు ఏవీ లేని కేవల జన్మ బ్రాహ్మణుడికి పది రోజులపాటు మైల కొనసాగుతుందట. మిగిలిన అందరిలో ప్రస్తుతం పదహారు రోజులట. మొలక్కా దేశంలోనైతే శవానికి సంస్కారం చేసేవరకూ ఆ గ్రామంలోని ప్రజలు ఎవ్వరూ ఏపనీ చేయరట. ఒకప్పుడు మన దేశంలో కూడా ఒక వీధిలో ఎవరైనా మరణిస్తే ఆ శవానికి సంస్కారం జరిగేవరకు ఆ వీధిలోని ఎవ్వరూ ఏవిధమైన పనులూ చేసేవారూ కారట. టిబెట్ లో బౌద్ధ మతాధిపతి దలైలామా మరణిస్తే వారంపాటు సంతాపదినాలు పాటించి ఎవ్వరూ ఎలాంటి పనులూ చేయరు.

స్త్రీలైతే నెలరోజుల పాటు ఎలాంటి నగలూ ధరించరు. మైలకు భయపడే, ఆ పది రోజులు ముగిసేవరకు ఆ కుటుంబాన్ని పలకరించి పరామర్శించడానికి కూడా మృతుడి సపిండులూ, సమానోదకులూ (సన్నిహిత బంధువులు) తప్ప ఇతరులెవరూ మృతుడి ఇంటికి వెళ్ళేవారు కారు. ఈ మైల అనేది కూడా ఎటువంటి శాస్త్రీయ ఆధారమూ లేని అంధ విశ్వాసమే. ఇది ఎంత  అశాస్త్రీయమైన విషయమో ఒక్క విషయం ఆలోచిస్తే గ్రహించగలం.

"శవం సమీపంలో తిరుగాడే ఆ ఇంటిలోని మృతుడి సమీప బంధువులు మైల పాటింపు ఎందుకు పెడతారంటే వారిని తాకినప్పుడు వారి నుంచి ఇతరులకు ఏవైనా కనపడని సూక్ష్మ క్రిముల కారణంగా వ్యాధులు సంక్రమించే అవకాశముందనీ, దాన్ని నిరోధించడానికే ఈ మైల పట్టడం అనే ఆచారం ప్రాచీనులు ప్రవేశపెట్టా" రని ఒక శాస్త్రీయ వివరణ ఇవ్వబోతారు కొందరు. వారికి నేనొక ప్రశ్న వేస్తాను. మృతుడి శవానికి వేల మైళ్ళ దూరంలో ఎక్కడో విదేశాలలో ఉంటున్న మృతుడి సపిండులూ, సమానోదకులూ కూడా మైల పడతారు. మరి వారి నుంచి ఇతరులకు ఏ వ్యాధులు, ఎలా సంక్రమిస్తాయి? వారు మృతుడిని తాకడం కాదుకదా– కనీసం మృతుడికి సమీపంలో ఉన్న వాళ్ళు కూడా కాదే? శాస్త్ర విజ్ఞాన పురోగతి కారణంగా మైల పాటింపు అర్థం పర్థం లేని ఆచారమని క్రమంగా గ్రహించినందున ప్రస్తుతం ఒక వ్యక్తి చనిపోయాడని తెలియగానే అతని సన్నిహిత బంధువులే కాదు, ఇతరులు కూడా అతడి ఇంటికి వెళ్ళి పలకరించి, ఆ కుటుంబానికి సానుభూతి తెలిపి వస్తున్నారు. కొందరైతే ఆ కుటుంబీకులు ఇచ్చే టీ, కాఫీలు కూడా నిరభ్యంతరంగా సేవించి మరీ వస్తున్నారు. ఇది చాలదా? మైల పాటింపు ఎంత అశాస్త్రీయమో నేటి ప్రజలంతా చాలా చక్కగా గ్రహించారని చెప్పడానికి?

ప్రాచీనకాలంలో అంత్యక్రియలు నిర్వహిం చేందుకు మృతుడి సన్నిహిత బంధువులు కొందరు సుదూర ప్రాంతాల నుంచి కూడా రోజుల తరబడి కాలినడకన ప్రయాణం చేసి రావాల్సి ఉండేది. అప్పటి వరకూ శవాన్ని అలాగే ఉంచాల్సి వచ్చేది. అగరు ధూపాలు, పన్నీరు వంటి ఎన్ని సుగంధ ద్రవ్యాలు వాడినా, ఎన్ని రోజులని శవం కుళ్ళి, కంపు కొట్టకుండా ఉంటుంది? సన్నిహితులకైతే ఎటుతిరిగీ తప్పదు. కనీసం ఇతరులైనా ఈ దుర్గంధం, శవం నుంచీ అంటువ్యాధులు సంక్రమిస్తాయనే భయం వగైరాల నుంచీ తప్పుకొనడానికి 'మైల' అనే పాటింపు ఏర్పరచి ఉంటారు. శీతల శవ పేటికలు అందుబాటులో ఉన్నందున ప్రస్తుతం మృతుడి అంత్యక్రియలు జరపడంలో కొద్ది రోజులు జాప్యమైనప్పటికీ శవం కుళ్ళి కంపు కొట్టడం జరగదు కూడా. అలా ప్రస్తుతం మైలను దాదాపు ఎవరూ పాటించని పరిస్థితే ఉంది. అయితే ఈ మైల పాటింపు గృహ యజమానుల్లో మరో రూపంలో నేటికీ కొనసాగుతూనే ఉండడం విచారకరం. అద్దె ఇళ్లలో ఎవరూ చావకూడదట. అలా చస్తే ఆ ఇంటి యజమానికి అరిష్టమట. అందుకని అద్దెకుండే కుటుంబంలోని మనిషి చావబోయే ముందే ఆ ఇంటి యజమానులు ఆ కుటుంబాన్ని 'మీ చావు మీరు చావం'డని తమ ఇంట్లోంచి బయటకు గెంటివేసి బజారు పాల్జేస్తారు– ఎవరు ఎప్పుడు చనిపోతారో ఎవరు మాత్రం ముందుగా ఊహించి చెప్పగలరు? అందుకన్న మాట – ఆ ముందు జాగ్రత్త! అందుకని సొంత ఇల్లు లేని కుటుంబాల్లో ఎవరైనా మరణిస్తే వారికి సత్రాలే గతి అవుతున్నాయి – అవి కూడా కులాలవారి సత్రాలు! ఒక కులం వారి సత్రాల్లో వేరొక కులం శవాలకు నో ఎంట్రీ! ఈ పరిస్థితుల్లో మార్పు తెచ్చేందుకు మనం ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులు ఏమేరకు స్పందిస్తారో, వారు చేస్తున్న చట్టాలు ఏ మేరకు పనిచేస్తాయో వేచి చూద్దాం. అంతకు మించి ఈ విషయంలో మనం వెంటనే చేయగలిగింది ఏమీ లేదు. ప్రజల ఆలోచనా సరళిలో మార్పు తెచ్చేందుకు సమాజ హితం కోరే వారంతా ఇలాంటి అశాస్త్రీయ విశ్వాసాలకు వ్యతిరేకంగా విస్తృత ప్రచారం చేపట్టడం ద్వారా కొంత మేరకు సత్ఫలితాలు సాధించ వచ్చు.

**దింపుడు కళ్ళం:** శవయాత్ర శ్మశానానికి వెళ్ళే మార్గాన్ని నాలుగు భాగాలుగా విభజించి, అందులో మొదటి మూడు భాగాలలో శవాన్ని నేలపై దింపుతారు. కొందరు మొత్తం దూరాన్ని మూడు భాగాలుగా చేసి, మధ్యలో రెండు చోట్ల మాత్రమే శవాన్ని నేలపై దించుతారు. ఇలా దించే ప్రదేశాన్ని 'దింపుడు కళ్ళం' అంటారు. ఇలా దించినపుడు మృతుడు జీవించే అవకాశాలేమైనా ఉంటాయోమోననే ఆశతో అతడి నోటిలో అన్నం, బియ్యం వంటి ఏదైనా ఘనపదార్థమో, కొందరైతే తులసి నీళ్ళు వంటి ద్రవ పదార్థాలో, ఇంకొందరు బంగారం లేక నాణాలు ఉంచడమో చేస్తారు. వైద్యపరంగా 'కోమా' అనే స్థితి ఉంటుందని జనసామాన్యానికి తెలియని రోజుల్లో, కోమా లోకి వెళ్ళిన ఒక రోగికి అతడు మృతి చెందాడనుకుని అంత్యక్రియలు నిర్వహించబోతే అతడు తెలివి వచ్చి లేచి కూర్చుని ఉంటాడు. ఒక్కొక్కసారి కోమాలో ఉన్న వ్యక్తి చితికి నిప్పు పెట్టిన తరువాత ఆ సెగ కాకకు కూడా స్పృహలోకి వచ్చి లేచి కూర్చున్న సందర్భాలూ ఉండే ఉంటాయి.

అందుకని ఇది వింతగా అనిపించినా జనానికి ఏ వ్యక్తికైనా అంత్యక్రియలు నిర్వహించే లోపు అతడు వాస్తవంగా మరణించాడా, లేక జీవించే ఉన్నాడా అనేది ఒకటికి రెండు సార్లు నిర్ధారించుకోవడం ఒక ఆనవాయితీ అయింది. అతడింకా జీవించే ఉండొచ్చుననే ఆశతో చివరి

ప్రయత్నంగా చేసే పని కనుక దీన్ని దింపుడు కళ్ళెం ఆశ (A Hope Against Hope) అనడం పరిపాటి అయింది. గొంతుకు అడ్డం పడ్డ తెమడ ఏదైనా ఉంటే తులసి నీళ్ళ కారణంగా అది తొలగిపోయి శ్వాస సాఫీగా పీల్చే వీలు కలిగి, ఆ వ్యక్తి అప్పటికింకా మరణించి ఉండకపోతే చివరి క్షణాలలో తిప్పుకుని ఊపిరి పీల్చుకునే అవకాశం ఉంది. బంగారం, నాణెములు శవం నోట్లో ఉంచడం వల్ల ప్రమాదమే తప్ప ఏ ప్రయోజనం ఉండదు. దింపుడు కళ్ళంలో శవం చుట్టూ బియ్యం, లేక అన్నం వేపి భూత, ప్రేతాలకు బలి సమర్పణ చేయడం కూడా అంధ విశ్వాసమే. దింపుడు కళ్ళంలో ఒకప్పుడు శవం చెవిలో 'యమ స్తుతి' చేసేవారట. ప్రస్తుతం 'నారాయణ...నారాయణ' అంటూ చెవి దగ్గర బిగ్గరగా అంటారు. ఒకవేళ ఇంకా మృతి చెందని వ్యక్తి లేచి కూర్చుంటాడేమననే 'దింపుడు కళ్ళం ఆశ'తో.

**సహగమనం:** 'రాచ పీనుగ ఒంటరిగా పోదు' అనే సామెత ఊరికే రాలేదు. ప్రాచీన కాలంలో రాజుల పార్థివ దేహాలతో పాటు రాణులనూ, ఉంపుడు కత్తెలనూ, దాసీ జనాన్ని కూడా తగులబెట్టడం లేక పూడ్చి పెట్టడం చేసేవారు. బానిసలను బలి ఇచ్చిన తరువాతనే రాచ పీనుగకు అంత్యక్రియలు జరుపడం అనే ఆనవాయితీ కూడా ప్రపంచంలోని అన్ని దేశాల్లోనూ ఉండేది.

భర్త శవంతో పాటు భార్యను కూడా చితి ఎక్కించే ఆచారం గృహ్యా సూత్రాలలో చేర్చబడ్డదే. భర్త శవానికి ఉత్తర దిక్కుగా భార్యను పడుకోబెట్టాలా లేక అతడి శవానికి ఎడమవైపునా– అనే విషయంలో అభిప్రాయ భేదాలున్నాయి. సంస్కృతంలో 'సతి' అంటే శీలవతియైన భార్య అనే సామాన్యార్థం ఉన్నప్పటికీ, భర్త చితిపై సహగమనం చేసే స్త్రీనే సతి అనడం పరిపాటి అయింది. సతి అయ్యేవరకు స్త్రీకి పునర్జన్మ తప్పదని *గరుడ పురాణం* పేర్కొంది. గర్భిణులకు, చిన్న పిల్లలున్న స్త్రీలకు సహగమనం నిషేధమని కూడా చెప్పబడింది. రాజా రామమోహన్ రాయ్ వంటి వారు సహగమన నిషేధం కొరకు పోరాడారు. బ్రిటీష్ గవర్నర్ జనరల్ విలియం బెంటిక్ (1774–1839) చట్ట రీత్యా సతీసహగమనాన్ని నిషేధించాడు.

భార్యే కాదు చనిపోయిన వ్యక్తితో పాటు ఎవరు వెళ్ళినా దాన్ని సహగమనమే అంటారు. మణిపూర్ రాష్ట్రంలోని ఒక జాతివారిలో చనిపోయిన వ్యక్తితోపాటు వెళ్ళడానికి ఒక దున్నపోతును బలి ఇస్తారు. అది వైకుంఠ ద్వారాన్ని తన బలమైన కొమ్ములతో బద్ధలు కొట్టి మృతుడి ఆత్మ స్వర్గ ప్రవేశం చెయ్యడానికి తోడ్పడుతుందట. మృతుడికి స్వర్గానికి వెళ్ళే మార్గం చూపెడతాయని అంత్యక్రియలప్పుడు కుక్కల్ని బలి ఇవ్వడమూ పలు జాతుల్లో ఉంది. పోలండు దేశస్థులు అందుకే వ్యక్తుల శవాలతో పాటు కుక్కల్నీ పూడుస్తారు. *మహాభారతం* లో స్వర్గారోహణలో ధర్మరాజుకు ముందుండి నడిచింది శునకమే కదా! అంత్యక్రియల సందర్భంగా భారతీయులు గోవును బలి ఇచ్చే ఆచారమూ ఉంది. ఆ ఆవును 'అనుస్తరణి' అంటారు. దాన్ని చంపి దాని తోలుతో శవాన్ని ఆపాదమస్తకం కప్పడం ఆచారం. పుస్తక ప్రియులు మరణించినప్పుడు వారితోపాటు పుస్తకాలు పాతిపెట్టడం, పిల్లలు చనిపోయినప్పుడు వారితోబాటు ఆటబొమ్మల్ని పాతిపెట్టడమూ కొన్ని దేశాల్లో ఉంది.

**పిండ ప్రదానం:** సనాతన ధర్మం ఒకపక్క ఆత్మకు ఆకలి దప్పులు ఉండవని చెపుతుంది. మరో పక్క ప్రేతాత్మలకు ఆహారంగా పిండాలు పెట్టమనీ చెబుతుంది. స్థూలమైన దేహం లేకపోయినా మరణించిన వ్యక్తి ఇంకా జీవించి ఉన్నట్లుగానే, అతడికి అందరు జీవులు అన్నపానాదుల వలెనే పిండాల ద్వారా ఆకలి, తర్పణలు ద్వారా దాహం తీర్చాలనుకోవడం విడ్డూరం. వారు చెపుతున్నట్లు ప్రత్యగాత్మ పరమాత్మలో ఒక అంతర్భాగవే కనుక అయితే పరమాత్మకూ ఆకలి దప్పులు ఉన్నాయనుకోవలసి ఉంటుంది. సకల పరిపూర్ణుడైన పమాత్మకు ఆకలి దప్పులేమిటి? ఒకదానికొకటి పొసగని అశాస్త్రీయ విశ్వాసాలు!

'పిండములను జేసి పితరుల దలపోసి కాకులకును బెట్టు గాడ్దెలారా' అంటూ వేమన ఈ తరహా విశ్వాసాలను పరుష పదజాలంతో విమర్శించాడందుకే. అశుద్ధం తినే కాకి పితరుడెట్లా అయ్యాడని కూడా ఆయన ప్రశ్నిస్తాడు. యమధర్మ రాజు దూతలలో కాకి అగ్రతణ్యమని భావించి దానికి పిండాలు పెట్టి, నీటిని పుడిసిళ్ళతో తీసి ఆ నీటిలోనే పోస్తూ ఆ పిండాలూ, తర్పణలూ తమ పితరులకు చేరుతున్నాయని భావించడానికి ఎటువంటి శాస్త్రీయ పునాది లేదు. తండ్రి, తాత, ముత్తాత – వీరిని పితరులు అంటారు. వీరిని పితృదేవతలు అనికూడా అంటారు. వీరికి అధిష్ఠాన దేవతలైన వసు, రుద్ర, ఆదిత్యులను శ్రాద్ధములతో తృప్తి పరిస్తే, పితరులు కూడా తృప్తి పడతారనే నమ్మకంతోనే హిందువులు శ్రాద్ధ కర్మలు ఆచరిస్తారు. పితృ దేవతలు ఎప్పుడు ఏ రూపంలోనైనా ఉండవచ్చునట. శ్రాద్ధాన్ని బ్రాహ్మణుడికి పెడితే, అతడు తృప్తి పడితే పితృ దేవతలు

తృప్తి పడినట్లేనట. భోక్తలుగా అతిథి ఇంటికి వచ్చే బ్రాహ్మణుడిపై పితృ దేవతలు నివసిస్తారని మనువు చెప్పాడట. పితరులకు పిండాలు పెట్టేందుకు అపరాహ్ణం శ్రేష్ఠ మైనదట. అమావాస్య నాడు పితరులు వాయు రూపం ధరించి గృహ ద్వారం సమీపానికి వచ్చి నిలబడతారట. సూర్యుడు అస్తమించే వరకు అక్కడే ఆకలి దప్పులతో బాధపడుతూ నిలబడి ఉంటారట. శ్రాద్ధాలు పెట్టకపోతే సూర్యుడు అస్తమించిన తరువాత బాధపడుతూ ఆ వంశస్థులను శపిస్తూ వెళ్ళిపోతారట. కనుక అమావాస్య శ్రాద్ధ కర్మలకు ప్రశస్తమైన తిథి అని *గరుడ పురాణం* పేర్కొన్నదట. ఇవన్నీ ఎటువంటి ఆధారాలు లేని అశాస్త్రీయ విశ్వాసాలే.



ముంతాజ్ సమాధి

శ్మశానాన్ని గురించిన ముచ్చట్లు ముగించబోయే ముందు మరికొన్ని విషయాలు కూడా చెప్పుకోవాలి. ఒలికిమిట్ట, ఒలుకులమిట్ట, బొందలగడ్డ, కాడు, పితృ వనం, ప్రేతవనం – ఇలా శ్మశానాన్ని రకరకాల పేర్లతో పిలుస్తారు. దాన్ని ఏ పేరుతో పిలిచినా అదంటే అందరికీ భయమే – ఒక్క వెట్టివానికి తప్ప. ఈ భయం ఒక్క రోజులో ఏర్పడింది కాదు. తరతరాలుగా మనందరి మనస్సులలో నాటుకుపోయింది. మన శవాలను శ్మశానంలో కాల్చడమో, పూడ్చడమో చేస్తారు. ఏ సంస్కారం పాటించినా పాంచభౌతికమైన మానవ శరీరం తిరిగి పంచభూతాలలోనే లీనమై పోతుంది. అయితే భౌతిక పదార్థాలు కానటువంటి ఆత్మలు, భూతాలు, దయ్యాలు, పిల్ల దయ్యాలు, పిశాచాలు, ప్రేతాలు వగైరాలు మరణించిన వ్యక్తులకున్న భూ సంబంధమైన కాంక్షలు తీరకుండానే ఆ వ్యక్తి మరణించిన సందర్భాలలో శ్మశానాలనే అంటిపెట్టుకు తిరుగుతాయనీ – ఇవన్నీ మానవులకు కీడు చేసే స్వభావం కలిగినట్టివనీ కొందరు నమ్ముతున్నారు.

భూతాన్ని అందుకే శ్మశానవర్తి, శ్మశానవాసి అనే పేర్లతో పిలుస్తారని వారి నమ్మకం. శివుడు కాటిరేడు అంటే శ్మశానానికి అధిపతి అనీ, అతడే ఈ భూత, ప్రేత, పిశాచ గణాలు అన్నింటికీ అధిపతి అనీ వారి విశ్వాసం. ఇదికూడా పూర్తిగా అంధ విశ్వాసమే. 'ఉన్న ఊరివాడికి కాటి భయం; పొరుగూరివాడికి నీటి భయం' అనే సామెత మనందరికీ తెలిసిందే. పొరుగూరి వాడికి కాలువలు, చెరువులు, బావుల లోతు తెలియదు వాటిలోకి దిగాలంటే సహజంగానే భయపడతాడు. ఊరి జనం అందరికీ ఆ ఊరి కాడు (శ్మాశానం) అంటే భయం. ఎందుకంటే తరతరాలనుంచీ వాళ్ళ గ్రామంలో మరణించిన అందరినీ అక్కడే దహనమో ఖననమో చేయడం కారణంగా, వారిలో కనీసం కొందరి ప్రేతాత్మలైనా అక్కడ తిరుగాడుతూ ఉంటాయనీ, వాటిలో తమకు హాని చేసే ఆత్మ ఒక్కటైనా ఉండి ఉండచ్చేమోనని వారి భయం. అయితే పొరుగూరి వాడు ఎప్పుడైనా రాత్రిళ్ళు ఆ ఊరికి రావలసివస్తే శ్మశానం మీదుగానే నిర్భయంగా నడుచుకుంటూ వచ్చే సందర్భాలూ లుంటాయి. శ్మశానంలో దయ్యాలూ, భూతాలూ ఉండేటట్లయితే అవి ఆ పొరుగూరి వాడికి ఏ హానీ చేయడం లేదేం?

ఇక వెట్టివాడు పొరుగూరి వాడు కాదు. ఉన్న ఊరివాడే. అయినా అతడికి శ్మశానం అంటే ఎలాంటి భయమూ లేదు. కారణం అతడు ఎన్నో రాత్రులు శ్మశానంలో గడిపినా అతడేనాడూ ఏ దయ్యాన్నీ, భూతాన్నీ చూడలేదు కనుక. కారణం అవి ఉన్నాయనుకోవడం భయపడేవాళ్ళ భ్రమే కనుక. వెట్టి శ్రామికుడు దయ్యాలూ, భూతాలూ ఉన్నాయనే అంధ విశ్వాసాన్ని, కేవలం నోటిమాటలతో కాక తన రోజువారీ కార్యకలాపాలన్నీ పగలూ రాత్రీ శ్మశానంలోనే నిర్భయంగా చేసుకొనడం ద్వారా పటాపంచలు చేస్తున్నాడు. శాస్త్రీయ దృక్పథం కలిగిన వారందరూ, ప్రజలలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలని కోరుకొనే వారందరూ వెట్టి శ్రామికుడిని ఇందుకు అభినందించి తీరాలి. శ్మశాన సంబంధమైన విషయాలు ఇంకా ఎన్నైనా వివరంగా చెప్పుకోవచ్చు. ఈ వ్యాసంలో అతి ముఖ్యమైన విషయాలు. వాటికి సంబందించిన శాస్త్రీయ సత్యాసత్యాలు– అదీ క్లుప్తంగానే నా శక్తి మేరకు వివరించే ప్రయత్నం చేశాను. ఈ నా ప్రయత్నంతో చదువరులలో శ్మశాన భూములను ఆక్రమణల నుంచి రక్షించుకుని అక్కడి సౌకర్యాలను మెరుగు పరచుకోవాలనే వాతావరణం కోసం కృషి చేయాలనే అభిలాగా కలిగించ గలిగినా ఇందులో చర్చించిన పలు విషయాలపై చదువరులలో శాస్త్రీయ దృష్టి పెంపొందించ గలిగినా నా కృషి సఫలమైనట్లే నని భావిస్తాను.

ముత్తేవి రవీంద్రనాథ్, ఫోన్ : 9849131029



హో చి మిన్

## తూర్పుగాలి
# వియత్నాం విలయం

– ముకుంద రామారావు

*చైనా, మంగోలియా, ఫ్రెంచ్, జపాన్, అమెరికా, ఇన్ని దేశాలు వియత్నాంని అనేక శతాబ్దాల పాటు రణక్షేత్రంగా మార్చివేశాయి. ఇంకా అంతర్యుద్ధం కూడా అతలాకుతలం చేసింది. అమెరికా, చైనాలు నిష్క్రమించినా ల్యాండ్‌మైన్లతో పాటు క్షతగాత్రులు మిగిలిపోయారు. ఇవన్నీ భౌతికమే. అయినా వియత్నాం చైతన్యాన్ని, భావనావిధానాన్ని, ఏదీ తాక లేక పోయింది. ఒక్క బౌద్ధం మాత్రమే రెండవ శతాబ్దం నుంచీ వారి సంస్కృతీ సంప్రదాయాలకు ఆలంబనగా నిలిచింది! ఆలోచన, సహనం అలవాటు చేసింది... కవిత్వానికి పచ్చని దారి వేసింది!*

తమకు తాము కవులుగానే, వియత్నమీయులు ఎప్పుడూ భావించుకుంటారు. స్వోత్కర్షగా అనిపిస్తున్నా, పూర్తిగా అతిశయోక్తి కాదు. వారి దేశచరిత్ర గ్రంథస్థం కాకపోయినప్పటి నుండీ, వారి కవిత్వం రాతలో రాకముందు నుండీ, వియత్నాం విలువైన కవిత్వ వారసత్వం వేళ్లూనుకుని ఉంది. దానికి సాక్ష్యంగా క్రీ.పూ. 5వ శతాబ్దం నుండీ కనిపిస్తున్న అద్భుతమైన జానపద సాహిత్యాన్ని సాహిత్యకారులు చూపిస్తారు. అప్పటి డోంగ్సన్ నాగరికత, గొప్పగా అభివృద్ధి చెందిన కళాత్మక కాంస్యయుగ సంస్కృతి, ఆ కాలంలో ప్రావీణ్యతగల నావికులుగా, వేటగాళ్లుగా సూర్యుణ్ణి ఆరాధిస్తూ జరుపుకునే ఉత్సవాల్లో సంగీత ప్రాధాన్యంగా డోలు వాయించే సంప్రదాయం, ఉదాహరణలుగా చూపిస్తారు. వియత్నాం సంప్రదాయంలో సంగీతం, కవిత్వం విడదీయలేనివి కాబట్టి, పండితులు ఈ ఉత్సవాల్లో కవిత్వం తప్పకుండా ఒక భాగమై ఉంటుందని భావిస్తున్నారు. దురదృష్టంకొద్దీ ఆ కాలపు ఏ సాహిత్యమూ గ్రంథస్థం కాలేదు. కేవలం ఊహాత్మకంగా వచ్చిన నిర్ధారణలే ఇవన్నీ.

క్రీ.పూ. 111లో– వియత్నాం మీద చైనా హాన్ సామ్రాజ్యం దండయాత్ర సమయంలో, మొదలైన వియత్నాం కవిత్వయాత్ర 939 వరకూ కొనసాగింది. కానీ చైనా భాషతోపాటు, చైనా కవిత్వ ప్రభావం కొట్టొచ్చినట్టు వాటిల్లో కనబడుతుంది. అది 19వ శతాబ్దం వరకూ ఉంది. మొదట్లో వియత్నాం భాష, చైనా భాషకు ఒకవిధమైన రూపాంతరంగా ఉండింది. ఫలితంగా చైనా వియత్నాం మీద, భాష సాహిత్యంతో బాటు అన్ని విధాలా ఆధిపత్యం కొనసాగించింది. అయినా వియత్నమీయులకోసమే అన్నట్టు, వియత్నాం సాహిత్యకారులు వారి ప్రత్యేకతను నిలుపుకుందుకు కృషి చేస్తూనే పోయారు.

తూర్పున చైనా నాగరికత, కొంతవరకు, పశ్చిమాన రోమన్, గ్రీక్ ప్రాచీన సంప్రదాయంతో పోల్చిచూడొచ్చు. పౌరాణిక ఇతివృత్తాలతో సాగిన పశ్చిమ నాగరికత ఆంగ్ల, ఫ్రెంచి, స్పానిష్ భాషల్ని ప్రభావితం చేసినట్టు, జపాన్, కొరియా, వియత్నాంలను, చైనా అంతగా తన పరిధిలో ఉంచుకోగలిగింది. అయితే చైనాను అనుకరిస్తున్నట్టు వియత్నాం కనబడక, వారితో పోటీ పడుతున్నట్టు ఉండటంతో, ఉత్తరానున్న చైనా తమ పొరుగువారైన వియత్నాంని, సాంస్కృతిక రాజ్యంగా చూసేట్టు చేసుకో గలిగింది.

చైనా, తమ నాగరికత వ్యాప్తికోసం, పొరుగునున్న రాజ్యాల్ని జయించి, చైనా భాషని, పరిపాలనని, జయించిన దేశాలమీద బలవంతాన రుద్దేది. అదెంతవరకంటే ఆయా దేశాలు తమ స్వీయ భాషని మరచిపోయేంతవరకూ, అయినా వియత్నాం జానపద సంగీత సాహిత్యాల మూలాన, తన ప్రత్యేకతను కాపాడుకోగలిగింది. 939లో వియత్నాం తిరిగి స్వతంత్ర దేశమయిన తర్వాత మరో మూడు వందల సంవత్సరాలకు వియత్నాంకు తమదైన రాతలిపి తయారైంది. చైనా పరిపాలన నుండి బయటపడ్డాక,

వియత్నాంలో కొన్నాళ్ళు భూస్వామ్యవాదం, పౌర కలహాలు రాజ్యమేలాయి. లై సామ్రాజ్యం (1010-1225), ఆ తరువాత ట్రాన్ సామ్రాజ్యం (1225-1400) అంటే 15వ శతాబ్దానికి వియత్నాం సంఘటితమై (1257, 1285, 1287) లలో కుబ్లాయ్, ఖాన్, మంగోల దండయాత్రల్ని తిప్పి కొట్టగలిగాయి. అది వియత్నమీయులకు సంతృప్తిని, అత్యంత ఆత్మ విశాసాన్ని కలగజేసింది. ఫలితంగా 1282లో తమకంటూ ఒక జాతీయ భాషగా 'చు మోం (దక్షిణలేఖనం) ఏర్పర్చుకుందుకు తగ్గ వాతావరణం ఏర్పడింది. అయినా 15వ శతాబ్దం లై సామ్రాజ్యం (1427-1527) వరకూ, ఈ కొత్త భాష సాహిత్యంలోను, కవిత్వంలోను రానేలేదు. అంతకుముందు 1417 నుండి 1427 వరకూ చైనా నుండి 'మింగ్', వియత్నాం మీద దండెత్తి, వియత్నాం నాగరికత సంపూర్ణంగా రూపుమాపడానికి అనేక ప్రయత్నాలు చేశాడు. అందులో వియత్నాం సాహిత్యసంపదంతా అగ్నికి ఆహుతయింది.

లై సామ్రాజ్యంలోని సైన్యాధిపతి, ప్రధానమంత్రి అయిన గ్యాయెన్ ట్రాయ్, జాతి పునర్నిర్మాణ దిశలో భాగంగా 'చు మోం'ని ప్రతిభావంతంగా సాహిత్యంలోను, కవిత్వంలోను తీసుకువచ్చారు. ఈ భాషని అధికార భాషగా తీర్చదిద్దింది మాత్రం (1460-1497) ప్రాంతంలో స్వయాన రచయిత కవి అయిన చక్రవర్తి లై థాన్ టోంగ్. అంతే కాకుండా వియత్నాం మొదటి సాహిత్య సాంస్కృతిక సంస్థని కూడా ఆయన నెలకొల్పారు. అందులో ప్రసిద్ధులైన పండితులందరినీ చేర్చి అనేక గ్రంథాలు రావడానికి దోహదపడ్డారు. 'చు మోం' తో అప్పటి నుండి మొదలైన కవిత్వం 20వ శతాబ్దం వరకూ వియత్నాం కవిత్వానికి, ప్రధాన భాషగా మారింది.

1527 లోనే, లై సామ్రాజ్యం అంతరించిపోయినా, ఆ సామ్రాజ్యపు ఛాయలు 1786 వరకూ ఉన్నాయి. ఎక్కువ భాగం 'చు మోం' లోని రచనలు సాగినా, చైనా భాషలో కూడా కొంత రాకపోలేదు. 16వ శతాబ్దం నాటికి వియత్నాం, దక్షిణ వియత్నాం - గ్యూయెన్ కుటుంబం, ఉత్తర వియత్నాం - ట్రాన్ కుటుంబాలుగా, రెండూ కలహాల్లో మునిగి తేలడం మొదలయింది. ఆధిపత్యం పోరుగా అది 18వ శతాబ్దం చివరివరకూ ఉండింది. వియత్నాం మీద లై సహేతుక సామ్రాజ్యాధిపతులుగా చేయడానికి, చైనా చేస్తున్న ప్రయత్నాన్ని విఫలం చేస్తూ, టేసన్ గ్రామం నుండి ముగ్గురు సోదరులు రంగంలోకి వచ్చి, గ్యాయెన్ ట్రిణ్‌లని ఓడించి, గొప్ప హీరోలుగా కీర్తించబడ్డా, పరిపాలన తెలియక పోవడంతో 1802లో, గ్యాయెన్ తిరిగి వారినుండి రాజ్యాన్ని లాక్కోగలిగారు. అప్పటినుండి వియత్నాం స్థిరంగానే ఉన్నా, వియత్నాంలోకి వర్తకం పేరున, ఫ్రెంచి ప్రవేశించి, వియత్నాంని 1883 నాటికి, తమ చేతుల్లోకి తీసుకోగలిగింది. 1945 లో బావో డాయి చక్రవర్తి పదవీత్యాగం చేసేవరకూ, గ్యూయెన్ సామ్రాజ్యం పేరుమీదే, వియత్నాం కొనసాగింది.

ఫ్రెంచి విస్తరణలో భాగంగా వియత్నాం భాషని, రోమన్ లిపిలో రాసేందుకు ఫాదర్ అలెగ్జాండర్ డె రోడ్స్ చేసిన కృషి ఫలించింది. దాన్ని మొదట్లో చర్చి కార్యకలాపాల్లో వాడినా 20వ శతాబ్దం నాటికి ఫ్రెంచి ప్రభుత్వ ప్రోత్సాహంతో 'చు మోం' బదులు, ఈ రోమన్ అక్షరాల్లోని భాషనే అధికార జాతీయ భాషగా వాడుకలోకి తీసుకొచ్చారు. ఈ భాషకు 'క్యుఓక్ గూ (జాతీయ భాష)' అని నామకరణం చేశారు. వియత్నాం భాషని, చైనా అక్షరాల్లో రాస్తే 'చు మోం' అని. రోమన్ అక్షరాల్లో రాస్తే



**వియత్నాం ఇంటిశోభ**



పొగ మంచులో సూర్యుడు

'క్యుఓక్ గూ' అని పిలవడం మొదలైంది. రానురాను 'క్యుఓక్ గూ' ఎక్కువ ప్రాచుర్యంలోకి రావడం మొదలయింది. దానికి కారణం ఆ అక్షరాల్లో వచ్చే పశ్చిమ సాహిత్యం, వియత్నమీయుల్ని ఎక్కువగా ఆకట్టుకోవడం. ఆ ప్రభావంతో 1931-32 నాటికి 'క్యుఓక్ గూ' లోనే, వియత్నాం కవిత్వం వచ్చింది. ఆ తరువాత ఒకటి తరువాత ఒకటిగా, రెండవ ప్రపంచ యుద్ధం, జపాను ఆక్రమణ, వియత్నాం విప్లవం, చైనా, ఆంగ్లేయుల ఆక్రమణ, ఫ్రెంచ్ తిరిగి రాక, వీటన్నింటితో కవిత్వం బాగా నష్టపోయింది. ఫ్రెంచి నుండి స్వతంత్రం పొందిన కొన్నాళ్లకు 'క్యుఓక్ గూ' ఆధునిక భావజాలాన్ని మరింత సంతరించుకుంది. ఫ్రెంచితో యుద్ధం, ఉత్తర దక్షిణ వియత్నాం పోరాటాల నడుమ, సరికొత్త కవిత్వం రావడం మొదలైంది. అది సమకాలీన వియత్నాం లోని సంక్లిష్టత, వియత్నాం సాహిత్య సంప్రదాయం లోని సంపదని ప్రతిబింబించింది.

**(చైనా) సంగ్ సామ్రాజ్య కాలం (960-1279) :**

గ్రంథస్థం కాబడ్డ మొదటి వియత్నాం కవితకు, చాలా చారిత్రక నేపథ్యం ఉంది. 939లో ఇంగో క్యుయెన్ నాయకత్వంలో వియత్నాం సైన్యం, చైనా నాం హన్ సైన్యాన్ని పూర్తిగా ఓడించి, వియత్నాం నుంచి చైనాని వెళ్లగొట్ట గలిగింది. 1100 సంవత్సరాల చైనా అవిచ్ఛన్నమైన ఆధిపత్యం, అలా ముగిసింది. ఆ ఓటమిని జీర్ణించుకోటానికి చైనాకు, దాదాపు 50 ఏళ్లు పట్టింది. వియత్నాంను స్వతంత్ర రాజ్యంగా అంగీకరిస్తూ, 987లో, చైనా రాయబారి లీచ్యూ, ఇరు దేశాల మధ్య దౌత్యసంబంధాలు నెలకొల్పడానికి వస్తున్న సందర్భమది. ఆ రాయబారికి ధీటుగా ఉండేవారికోసం, వెతికి ఇద్దరు బౌద్ధ సన్యాసుల్ని ఎన్నుకున్నారు. అందులో ఒకరైన డో ఫాప్ థువన్ (915-991), సరంగు రూపంలో ఆ రాయబారిని తీసుకొచ్చేందుకు పంపారు. చైనా రాయబారి ఆ సరంగు ముందు, తన పాండిత్యాన్ని ప్రదర్శించేందుకు నదిలో ఈదుతున్న రెండు బాతుల్ని చూసి రెండు పంక్తుల శ్లోకం చెప్పాడు. దానికి ధీటుగా, ఆ సరంగు మరో రెండు పంక్తుల శ్లోకాన్ని జోడించి పూర్తిచేశాడు. అదీ ఆ కవిత. ఈ కవితకు వెయ్యేళ్లు పూర్తయిన సందర్భంగా, వియత్నాంలో 1987లో, కవిత్వ వేడుకలు జరిగాయి. (ఈ కవిత మూల కవిత కాకపోవచ్చు అని కొందరు రచయితల అభిప్రాయం. వారు ఇదే తరహా కవిత, చైనా టాంగ్ సామ్రాజ్యంలోని కవి, రాజకుమారుడు లీ పిన్ ది ఉదహరిస్తారు. అది వేరే విషయం).

**రెండు అనాగరిక బాతులు :**

**అక్కడ : అనాగరిక బాతులు, ఆకాశాన్ని తేరిచూస్తూ**
**పక్క పక్కనే ఈదుతున్నాయి**
**ముదురు నీలం పైన, తెల్లటి ఈకలు**
**ఆకుపచ్చ అలల్లో, మంటలా ఎర్రటి కాళ్లు**

*- లీచ్యూ, డో ఫాప్ థువన్*

అది ఆ రెండు దేశాల పరిస్థితుల్ని అన్యాపదేశంగా తెలియజేస్తూనే ఉంది.

**లై సామ్రాజ్యం ( 1010-1225) :**

సంగ్ కాలానికి, ఈ కాలానికి మధ్య కవిత్వంలో ప్రస్ఫుటంగా కనిపించే రెండు అంశాలివి. ఇతివృత్తాలు - 1. బౌద్ధానికి సంబంధించినవి 2. జీవితం, కదలిక, క్రియాశీలమైన ఆలోచనలకు సంబంధించినవి (అశాశ్వత జీవితం, విశ్వంలో కనిపించే నిస్సారత, వైరుధ్యాలు మొదలైనవి). ఈ కాలంలో బౌద్ధం ప్రాబల్యం కవిత్వంతో పాటు అన్నింటా కనిపిస్తుంది. డొవన్ వన్ ఖం, లై థు ఓంగ్ కైట్ లాంటి కొందరు కవులు తప్ప, కవిత్వం రాసేవారంతా అప్పట్లో జెన్ బౌద్ధసన్యాసులే. రెండవ మూడవ శతాబ్దంలో వియత్నాం లోకి ప్రవేశించిన బౌద్ధం, అక్కడ బాగానే నాటుకుపోయింది. ఎందరో బౌద్ధ సన్యాసులు, అద్భుతమైన కవిత్వం రాశారు. వాటిని జెన్ కవిత్వమన్నా, అందులోని సున్నితత్వం, తాత్వికత, అద్వైతం అందర్నీ ఆకట్టుకుంటుంది.

మూడు తరాల్ని ప్రభావితం చేసిన గొప్ప బౌద్ధ సన్యాసి వాన్ హన్ రాసిన ప్రసిద్ధ కవిత ఇది.

**మనిషి శరీరం :**

> వసంతం ఎదుగుదల శరత్కాలంలో ఆగిపోయినట్టు
> మెరుపు మెరియడం లాంటిది మనిషి శరీరం
> ఉన్నదేదో కేవలం శూన్యంలోకి పోవడానికి
> ప్రయోజనంలేని ప్రక్రియ మీద ఆలోచనని వ్యర్థం కానీకు
> మంచులా అది వచ్చీ పోతుంది *- వాన్ హన్ (? - 1018)*

ఇదే సలహా మరో బౌద్ధ సన్యాసి వైన్ చియూ (998-1090) కవిత్వంలో కూడా చూడొచ్చు.

డియూ హన్ (1042-1114) గ్రంథస్థమైన మొదటి వియత్నాం సన్యాసిని, కవయిత్రి, ఆమె ప్రసిద్ధ కవిత ఇది.

**జననం, వయస్సు, అనారోగ్యం, మరణం :**

> జననం, వయస్సు, అనారోగ్యం, మరణం,
> ఇవి జీవితపు అచలాలు.
> తప్పించుకుందుకు ప్రయత్నించొద్దు
> ఆ చిక్కుల్లో మరింత చిక్కుకు పోతావు
> బుద్ధుని ప్రార్థించు
> నీ కంగారులో జెన్ వైపు మళ్లు
> వద్దు, మరో పదం వద్దు
> అది కేవలం వ్యర్థం.

ఉదాసీన కవిత్వంలా అనిపించినా, అప్పటి జెన్ బౌద్ధ కవిత్వమంతా యిలా నిరాశపూరితంగా అయితే లేదు. ఇటువంటి కవిత్వంలో కూడా మెరిసే ఆశని గమనించ వచ్చని మరికొందరి అభిప్రాయం. తక్కువ వయస్సులో మరణశయ్య మీద ఉంటూ రాసిన ఈ ప్రసిద్ధ కవితలోని ఆశని గమనించొచ్చు.

**పునర్జన్మ :**

> వసంతం పోతుంది, దానితోపాటు వంద పూలు
> వసంతం వస్తుంది, దానితోపాటు వంద పూలు
> పోయేవాటిని నా కళ్లు చూస్తుంటాయి
> సంవత్సరాలతో నా తల నిండిపోతుంది
> అయినా వసంతం పోతే, అన్ని పూలూ అనుసరించవు
> గత రాత్రి నా గుమ్మం దగ్గరే రేగుకొమ్మకు పువ్వొచ్చింది
> *- మన్ గియక్ (1051-1096)*

**బుద్ధుడు :**

> కనిపించే రూపమయినా, రహస్య ముసుగైనా
> బుద్ధుడు ఒకడో అనేకుడో కాదు
> అతని రూపాన్ని ఆవిష్కరించాలనుకుంటే
> కొలిమిలో పద్మం విచ్చుకుంటున్నట్టు ఊహించు
> *- డావ్ హూ (? 1171)*

ఈ కవితలోని వైరుధ్యమంతా చివరి చరణంలోనిది. అగ్నిగుండంలో కూడా పద్మం వికసిస్తుందనటం. ఈ కాలంలో బౌద్ధ సన్యాసులు, తోటి బౌద్ధ సన్యాసుల కోసమో, అనుయాయులకోసమో రాసినవే కవితలన్నీ. ఒక్కోమారు అవి అత్యంత తాత్త్వికతని, గూఢార్థాల్ని గుబాళించటానికి కారణం, ఆలోచనలపరంగా, ఆధ్యాత్మికపరంగా బాగా ఎదిగినవారిని అవి ఉద్దేశించి రాసినవి కావడం. అయినా వాటిల్లోని విశ్వజనీనత మూలంగా ఇప్పటికీ వాటి సౌరభాన్ని అవి కోల్పోలేదు.

10 వ శతాబ్దం నుండి 20 వ శతాబ్దం వరకూ, మరీ ముఖ్యంగా లై, ట్రాన్ సామ్రాజ్యాల్లో జెన్ బౌద్ధ కవిత్వం కనిపిస్తుంది. **'ఉనికి ఉందేదంతా కేవలం ఇతరుల ఉనికిమీదే'** అన్న బౌద్ధ సిద్ధాంతం మీద వియత్నాంలో బౌద్ధులు తమ వ్యవహారాలు నడిపేవారు.

**అవును కాదు :**

> మనం అవునంటే లేశం ధూళైనా మిగులుతుంది
> మనం కాదంటే విశ్వమంతా శూన్యం
> నదిలో చంద్రుడిలా అవును కాదు
> ఎవరు చెప్పగలరు అదక్కడ ఉందని,
> ఎవరు చెప్పగలరు అది కాదని?
> *- జెన్ గురువు 'టులో' అని పిలవబడే టు డాఒ హాణ్ (? 1117)*

**ట్రాన్ సామ్రాజ్యం (1225-1400) :**

ఈ కాలంలో బౌద్ధం తగ్గుముఖం పట్టడం మొదలైంది. టావో, కన్ ఫ్యూసియస్ పండితుల ప్రభావం



**వియత్నాం ముత్యం**



కడలిలో కొండలు

పెరగడంతో, గురువులకు, బౌద్ధ సన్యాసులకు పరిమితమైన కవిత్వమే, అందరినీ చేరదీసింది. పైగా మంగోలియన్లను తిప్పి కొట్టిన సంతోషం, విభిన్న కవిత్వానికి దారితీసింది. రూప పరంగా అది చైనా కవిత్వానికి దగ్గరైనా, వస్తువు, భావన వియత్నమీయులదే. మొదటి కొన్ని పంక్తులు అందమైన వర్ణ చిత్రంలా ఉండి, ఆఖరి పంక్తి, పై పంక్తులన్నింటినీ వెలిగిస్తుంది. అయినా బౌద్ధం నిశ్శబ్దంగా దాని పని అది చేస్తూనే పోయింది. యుద్ధం మూలాన కష్టాల్ని, నష్టాల్ని హృదయానికి హత్తుకునే రీతిలో అద్భుతంగా చెప్పగలిగింది. మిగిలిన రెండు మతాలు, ప్రకృతిని కీర్తిస్తూ, ధర్మాల్ని బోధిస్తూ కొనసాగాయి. కొన్నాళ్లకు ఈ మూడు భావధారలు కలిసి, 'మూడు మతాలు, ఒకే జన్మస్థానం' పేరు మీద ఒకటై, శాంతి సామరస్యాలకోసం పనిచేశాయి. అది అప్పటి కవిత్వంలో కూడా ప్రతిఫలించింది. దాని ఫలితంగా, సరైన ధర్మం చేయమని కన్ ఫ్యూసియస్, మార్మిక శోధన మార్గం కోసం టావో, జ్ఞాన తృష్ణలో బౌద్ధం, ఒక్కోమారు వీటి సమ్మిశ్రితంగా కవిత్వం వచ్చేది.

**అన్ బాంగ్ పర్యటన :**

**ఉదయం కొండలు, మేఘాలు**
**రాత్రి, వెన్నెలలో ఉన్న అఖాతం**
**హఠాత్తుగా ఈ ప్రదేశపు శోభ**
**నా కుంచె చివర్లకి చిక్కి అనేకత్వపు ఆకారం**

*– ట్రాన్ థాణ్ టోంగ్ (1240–1290)*

**ఖైదీలపట్ల జాలి :**

**ఇంటికి వార్తలు పంపడానికి, వాళ్ల రక్తంతో జాబులు రాస్తారు.**
**ఏకాంతపు వెర్రి పక్షి మేఘాల్లో రెక్కలల్లారుస్తుంది**
**ఎన్ని కుటుంబాలు ఇదే వెన్నెల్లో రోదిస్తున్నాయో?**
**అదే చింతన ఎంత దూరం పరిభ్రమిస్తుందో?**

*– హుయెన్ క్వాంగ్ (1254–1334)*

ట్యూ ట్రంగ్‌గా పిలవబడే ట్రాన్ క్వాక్ టాంగ్ (1252–1313) కూడా ఈ కాలపు ప్రసిద్ధ కవి.

ట్రాన్ సామ్రాజ్యంలో తాత్వికత కంటే, తమ దేశాన్ని తిరిగి పొందిన ఆత్మాభిమానం ఎక్కువ కనబడుతుంది. దేశభక్తి కవిత్వం కూడా ఈ సమయంలో ఎక్కువగానే వచ్చింది. దానికి ఆద్యులు ట్రాన్ క్వాంగ్ ఖై (1241–1294), ఫం గూ లావో (1255–1320). ఈ కాలంలో ఇతర కవుల్లో ముఖ్యులు, చక్రవర్తులు ట్రాన్ థణ్ టోంగ్ (1240–1290), ట్రాన్ ణాన్ రోంగ్ (1258–1308). మంగోలియన్లతో భీకర యుద్ధాల తరువాత, వీరిరువురికి ప్రశాంత వాతావరణంలో అక్కడి అనేక ప్రాంతాల సౌందర్యం ఎక్కువ ఆహ్లాదాన్ని కలిగించింది. సహజంగానే వారి కవిత్వంలోకి కూడా అది చొరబడింది. కానీ ట్రాన్ సామ్రాజ్యం చివర్లో ఆ సామ్రాజ్యం పట్ల ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లడం మొదలయింది. అప్పటి ప్రసిద్ధ కవి చు వన్ అన్ (1300–1370) ఈ పరిస్థితికి కారణమైన వారిని దండించమని చక్రవర్తిని అభ్యర్థించాడు. కానీ అది నెరవేరకపోవడంతో ప్రకృతి అందాన్ని పరవశిస్తూ గానం చేస్తూ గడిపాడు. మరో కవి ఫం సు మణ్ (1300–1372) ప్రజల్ని ఉత్తేజ పర్చి, జాగృతం చేసే దిశలో కవిత్వం రాశాడు. గూయెన్ ట్రై తండ్రి, గూయెన్ ఫీ ఖణ్, ట్రాన్ సామ్రాజ్యాన్ని ఇక ఎవరూ కాపాడలేరని పగటికలలు కంటూ ఇలా వాపోయాడు.

**బాధలో ఒక సాయంత్రం :**

**చర్య కోసం ఆశపడుతూ, నా దిండుతోనే నేను వ్యాకులపడతాను**
**కొద్దిగా పరిమళం ఇంకా ఉంది – నా సాక్ష్యం అది ..**
**నేనేమి చేయగలనిపుడు,**
**నా పుస్తకాన్ని లాలిస్తూ, పాడుకోవడం తప్ప**

గూయెన్ ట్రాయ్ తాత, ట్రాన్ గూయెన్ డన్ (1320–1390) కూడా, తన కవిత్వంలో–నేను కోలుకున్నా, అనారోగ్యంతో ఉంటేనే బాగుండుననుకున్నాడు. నా తెల్లజుత్తు, ముప్పయివేల పుస్తకాలున్నా వ్యర్థమనుకున్నాడు. డేంగ్ డంగ్ లాంటి కవి, వియత్నాం సాహిత్యంలో అత్యంత నిస్పృహతో రాసిన కవితలు అప్పటివే.

**జానపద సాహిత్యం (జనరంజకమైన సంప్రదాయం) :**

వియత్నాంలో క్రీ.పూ 500 కి ముందునుండి, ఈ సాహిత్యం జాడలున్నా 1232 వరకూ రాతలో లేదు. జానపద సాహిత్యం ఎప్పుడూ ఒక తరం నుండి మరో తరానికి, ప్రాంతాన్నిబట్టి, సమయాన్నిబట్టి మార్పులు చేర్పులతో చేరుతూనే ఉంది. దానిమూలాన మూల రచయితలెవరో చాలా వాటికి తెలియనే తెలియదు. ఇవి ఎక్కువ జోలపాటలు, ప్రేమపాటలు, నారుపాటలుగా ఉన్నా ఇతివృత్తాలు విశ్వజనీనమైన ప్రేమ, పెళ్లి, పని, మతం, ప్రకృతి మొదలైన వాటి చుట్టూ తిరిగేవే. అవి అంత ఆసక్తికరంగా ఉండటానికి కారణం – అప్పటి అక్కడి జీవన విధానాల్ని, పరిస్థితుల్ని కళ్లకు కట్టినట్టు చూపిస్తాయి కాబట్టి. ఈ కవితల్లో / పాటల్లో అప్పటి గ్రామీణ వియత్నాం అడుగడుగునా కనిపిస్తుంది. సామాన్య జనుల గొంతు అది. కోతకాలంలోను, పండగల్లోను, రాత్రంతా జాగారం ఉంటూ కూడా, పాడే పాటల్లో నీతిబోధ, వినోదం కూడా ఎక్కువే.

**రైతు :**

కొందరు వడ్లని కూలికోసం నాటుతారు
నేను మాత్రం కాదు
నేనలా నిల్చొని చూస్తూనే ఉంటాను
ఆకాశాన్ని భూమినీ మేఘాల్నీ
వర్షాల్నీ రాత్రుల్నీ పగల్నీ
నా కాళ్లు రాళ్లయేదాకా
నా రాళ్లు కరిగి
ఆకాశం నిర్మలమై
సముద్రం నెమ్మదించాకే
నాకు శాంతి



రైతు కుటుంబం

**బర్రె :**

బర్రె! బర్రె! విను
కలిసి పనిచేయడానికి, పద పోదాం పొలానికి
వ్యవసాయం మన వృత్తి
నువ్వుగాని నేనుగాని పొలాన్ని వదలొద్దు
ధాన్యం మొలకెత్తి పంట చేతికొస్తేనే
నా గిన్నెలో అన్నం / నీ మేతకు గడ్డి !

**భర్తకావాలా? –బాగా ఆలశ్యమైంది :**

పెళ్ళిళ్ల కాలంలో నువ్వెక్కడున్నావు?
దొరికే పురుషులంతా వెళ్లిపోయారిప్పుడు
నీ స్థితిని చూపించి, ఆకాశంతో మూలుగుతావు
"ఓ ఆకాశమా, ఓ భూమీ!
నాకోసం చిన్న భర్తని చూపించలేరా?"
తల బయటకు పెట్టి ఆకాశం జవాబిస్తాడు
"సరుకు ఉన్నప్పుడు మరీ ఎక్కువ ఎంపికలో పడ్డావు నువ్వు
ఇప్పుడిక ఇంటికి పో, మేము కూడా అమ్ముడుపోయాం"

**జాతీయ కవిత్వం ఎదుగుదల పదిహేవ శతాబ్దంనుంచి –**

ఈ శతాబ్దం నుంచి సాహిత్యంలో చెప్పుకోదగ్గ మార్పులు రావడం మొదలయ్యాయి. దానికి ముఖ్య కారకుడు గూయెన్ ట్రాయ్ (1380–1442). గూయెన్ ట్రాయ్ ఒక అసాధారణ వ్యక్తి – అనేక సాంస్కృతిక సంస్థల్ని నెలకొల్పిన వియత్నాం సాంస్కృతిక రాయబారి, కవి, పండితుడు, 'చు మోం' వాడకాన్ని వ్యాప్తిలోకి తేవడంతో సాహిత్యంలో మార్పులకు ఆస్కారం కలిగింది. లై సామ్రాజ్యపు (1427–1527) చక్రవర్తి లై లోయ్ సైనిక సహాయకుడిగా పనిచేసే చైనా మింగ్ దాడుల్ని సమర్ధవంతంగా తిప్పి కొట్టగలిగాడు. అతని చివరి దశలో కవిత్వంతోనే గడిపాడు.

**ఆలస్యమైన వసంతం :**

వృథా సమయం: నా చిత్రశాల రోజంతా మూసి ఉంది.
బయట, ఒక్క ఆత్మా లేదు; వసంతమొక్కటే
కోయిల కూతలు, తుపంర్లలో వికసిస్తున్న దివ్యమైన పూల మధ్య
చిత్రలేఖనం ఆగిపోయినట్టే

*– గూయెన్ ట్రాయ్ (1380–1442)*

గూయెన్ ట్రాయ్ మరణించాక, 'చు మోం' కూడా అంతరించిపోతున్న దశలో, లై థణ్ టోంగ్ (1460–1497) ఆ పరిస్థితిని అద్భుతంగా చక్కదిద్దాడు. స్వయంగా రచయిత, కవి కావడంతో, ప్రసిద్ధులైన 28 మంది పండితులతో 'టావ్



వియత్నాం పడవలు



**పో, పో ! మా నేలను వదిలి పో !**

డాన్ (లాలిత్య సభ)' ని ఏర్పాటుచేసి, కవిత్వ సేకరణ కార్యక్రమాన్ని చూపట్టాడు. వారి చేత సంకలనపర్చిన 'చు మోం' కవిత్వ గ్రంథం పేరు - హోంగ్ దక్ క్వాకం థి టప్ (హోంగ్ డుచ్ యుగపు జాతీయ భాషలో కవిత్వం). సంకలన కర్తల ఇష్టాఇష్టాల మూలంగా అది అంతగా ఆమోదయోగ్యం కాలేదు. గూయెన్ ట్రాయ్ లాంటి ప్రసిద్ధులైన కవులెందరో అందులో లేరు. మినహాయింపుగా చేర్చబడ్డ లణ్ టోంగ్ కవిత్వమొకటే అలరిస్తుంది.

**అన్ బాంగ్ ప్రదేశం :**

**సముద్రం పైకి, కలిసి పొడుచుకొచ్చిన వేయి పర్వతశిఖరాలు**
**అంతా నీలం, ఏటవాలుగా ఎన్నో నక్షత్రాలు లేదా చదరంగం పావులు**
**సమృద్ధమైన చేపలు, లవణంతో జనానికి చేతినిండా పని**
**పొలాలు లేవు - వాళ్లు చెల్లించాల్సిన పన్ను తక్కువ**
**పర్వతాల వైపు ప్రవహిస్తూ, అలలు విరిగి విరిగి త్రుళ్లుతాయి**
**శిలలగోడల వైపు పడవలు జారుతాయి**
**చాన్నాళ్లవరకు శాంతి తప్ప ఈ జానాలకు ఏమీ తెలియదు**
**నలభై ఏళ్లవరకూ యుద్ధ సంఘర్షణలనుండి తప్పించబడ్డారు**

*- లై లణ్ టోంగ్ (1460-1497)*



**అమ్మా ! అమ్మా !**

పదహారో శతాబ్దం చాలా వరకు విస్తరించిన మరో గొప్ప వియత్నాం కవి గూయెన్ బిణ్ ఖైయం (1491-1585). అప్పట్లోనే డాక్టరేటు పొందిన వారు. చు మోం లోనే ఎక్కువగా కవిత్వం రాశారు. ఇతని కాలంలో వియత్నాం అంతర్యుద్ధంలో కొట్టుమిట్టాడింది. ఉత్తరం నుండి ట్రిణ్, దక్షిణం నుండి గూయెన్ కుటుంబాల కలహాలు, వారిని అదుపు చేయలేని సంకటస్థితి నెలకొంది. అతి తక్కువ కాలం ఉన్న మాక్ సామ్రాజ్య చక్రవర్తి దగ్గర పనిచేసినా, తాను ఏవిధంగానూ పరిస్థితుల్ని చక్కదిద్దలేనని తెలుసుకుని ఏ పదవిలోనూ కొనాసాగలేకపోయారు. భవిష్యవాణి చెప్పడంలోనూ దిట్ట. గూయెన్ బిణ్ ఖైయం చేసిన భవిష్యవాణి, ఇప్పటికీ నిజమనే వియత్నాం వాసులు నమ్ముతారు.

**సారాంశం :**

**పాత కాలంలా మళ్లీ శాంతి నెలకొంటుందా?**
**ఇరు పక్షాల పట్ల దుఃఖించు, వాళ్లు కలహించుకుంటూనే ఉంటారు**
**సర్వత్రా కాలువలా రక్తం, ఎముకల గుట్టలు**
**భయం - చేపల్ని అడుగుకి పంపిస్తున్నాయి, పక్షుల్ని పొదలకి**
**ఎవరికైనా ఇది ఏమి మంచి చేస్తుంది?**
**నేను అదృష్టాన్ని చూసుకున్నాను. గుర్రం ఎలా దాటిపోగలదో చూశాను.**
**ఏమీ చేయొద్దు, గుంటనక్కల నుండి జాగ్రత్తలు తప్ప**
**ప్రపంచం గురించి మాట్లాడుతూ ఎందుకు శ్వాస వృథా చేసుకోవడం?**
**తాగుతూ నది ఒడ్డున కవితాగానం చేసుకోవడమే మేలు**

*- గూయెన్ బిణ్ ఖైయం (1491-1585)*

గూయెన్ బిణ్ ఖైయం తరువాత (1558-1776 మధ్య) వియత్నాం సాహిత్య చరిత్రలో పెద్ద విరామం 18వ శతాబ్దం వరకూ ఏర్పడింది. కొత్త ప్రక్రియల ప్రయత్నాలు ఫలించక, ఉన్న వాటిని అభివృద్ధి చేయని ఒక నిద్రాణ సమయమది. ట్రిణ్ - గూయెన్ కుటుంబాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం, సరిహద్దుల్లో సంఘర్షణ, వాటిని సరిచేయలేని లై సామ్రాజ్యం అశక్తత కూడా ఈ పరిస్థితికి కారణమయింది. అప్పుడొచ్చిన కవితల్లో అవే ప్రతిబింబించాయి.

**యుద్ధం :**

**యుద్ధం ఆగేట్టు లేదు, జనం అన్ని వైపులా చెదిరిపోయారు**
**ఏ మనిషయినా దాన్ని ఆలోచించకుండా ఎలా ఉండగలడు?**
**నల్లటి గాలులు, సంవత్సరాల తరబడి ఉగ్రమైన వర్షాలు**

భూమిని వ్యర్థపరుస్తూనే ఉన్నాయి
చర్య తీసుకోవాలా వద్దా, ఏ మనిషైనా తనకుతానే నిర్ణయించుకోగలడు
ప్రపంచం కోసం ఒకరి గొంతుకల్ని ఒకరు కోసుకుంటారు.
నేను దీనిలో ఎక్కువ ఆసక్తి చూపలేను
మేఘాల్ని జరిపి సూర్య ప్రకాశానికి అనుమతిచ్చేది ఎవరది?
అతను మాటాడతాడు, అతను నవ్వుతాడు,
ప్రపంచ శాంతిని అతను తెస్తూనే ఉంటాడు — *ఫుంగ్ ఖక్ ఖోన్*

18వ శతాబ్దంలో వియత్నాం సాహిత్య పునరుద్ధరణలో భాగంగా ప్రముఖ కవులందరూ 'చు మోం' లోనే రాస్తున్నా, ఎక్కువ భాగం కవిత్వం చైనా భాషలోనే రావడం మొదలయింది. వాటి ని 'చు మోం' లో అనువాదం కూడా చేసుకునేవారు. వియత్నాం మహాకావ్యంగా పిల్చుకునే 'సైనికుని భార్య దుఃఖం' అప్పట్లో వచ్చిందే. 1741 లో డాంగ్ ట్రాన్ కోన్ అది చైనా భాషలో రాశారు. దాన్ని 'చు మోం' లో ఫన్ హుయ్ ఇచ్ (1750–1825), ప్రతీ చరణం (7–7–6–8) వర్ణంలో అనువాదం చేశారు.

భూమ్మీద యుద్ధధూళి వీస్తున్నప్పుడు
కష్టాలు అనుభవించేది స్త్రీయే!

అని మొదలై ఆశనిరాశల మధ్య, ఎదురుచూపుల భయాలమధ్య, ఇంట్లో పిల్లల్ని, ముసలి వారిని, తామే కొడుకై, తండ్రై, సంసారాన్ని ఈడ్చుకొస్తున్న దైన్యాన్ని, అత్యంత హృదయ విదారకంగా రాసిన దీర్ఘ కావ్యమిది. వియత్నాం లో కావ్య పద్ధతిలో రాసిన నవల ని 'ట్రూయెన్'గా పిలుస్తారు. అలా వచ్చిన నవలల్లో బాగా పేరు పొందినది, గూయెన్ డు రాసిన 'కైయూ కథ' ఒకటి. రైతుల పక్షాన టే సన్ సోదరుల తిరుగుబాటుతో 250



దిక్కులేని దీనులు



ఎవరు కారణం ?

సంవత్సరాల లై సామ్రాజ్యం పతనమయింది. లై సామ్రాజ్యాన్నీ తిరిగి తేవాలన్న చైనా ప్రయత్నాన్ని వారు పొసగనివ్వలేదు. పరిపాలన చేతగాక 1771 నుండి 1802 వరకే పాలించగలిగారు టే సన్ సోదరులు. వారినుండి గూయెన్ మళ్లీ రాజ్యాధికారం లాక్కోగలిగారు. అయితే ఈ సమయంలోనే అత్యంత పేరు ప్రఖ్యాతులు పొందిన కవయిత్రి హో జువన్ హువాంగ్ వియత్నాం కవిత్వం లోకి ప్రవేశించిది. అశ్లీలం చమత్కారం, జానపద సంప్రదాయ సంగ్రహంతో ఒక విభిన్న కవిత్వానికి ఆమె నాంది పలికింది. స్త్రీ హక్కులకోసం ఆమె పోరాడింది. బహుభార్యాత్వానికి విరుద్ధంగా ఎలుగెత్తింది. మరో అర్థం వచ్చేట్టు రాసినా, ఆమె కవిత్వం కామం గురించి మొండిగా, సూటిగా కూడా రాసింది.

**భర్తని పంచుకోటం :**

ఒకరు వెచ్చని దుప్పట్లో చుట్టుకుపోతారు
ఇంకొకరు గడ్డకట్టుకుపోతారు
ఈ వెధవ భర్త పంపకం
ఎప్పటికైనా అతన్ని పొందటం నీ అదృష్టం
దీని పోట్లాట కోసమే
బహుశా నెలకి ఒకటి రెండు మార్లొస్తాడు
సంగం సేవకురాలు, జీతంలోని పనికత్తెగా మార్చి
ఇదే నాకు తెలిసుంటే
ఒంటరిగానే ఉండిపోయేదాన్ని — *హో జువన్ హువాంగ్*

**పనసపండు :**

నేను చెట్టుమీద పనసపండులాంటి దాన్ని
రుచి చూడాలంటే తాజాగా ఉన్నప్పుడే తీయాలి వెంటనే నన్ను
చర్మం గరుకు, కండ దళసరి, అవును

**కానీ, నిన్ను హెచ్చరిస్తున్నాను ముట్టుకోవద్దని –**
**సమృద్ధమైన రసం చిమ్మి నీ చేతులకు మరకవుతుంది**

*– హో జువన్ హువాంగ్*

గూయెన్ సామ్రాజ్యం (1802–1883) సారవంత మైనదిగా భావిస్తారు. వైవిధ్యమైన సాహిత్యం ఈ కాలంలోనే వచ్చింది. 19వ శతాబ్దపు కవులు, వ్యక్తిగతంగానూ, అనేక విధాలగానూ–అప్పటి సంఘటనలకు సరికొత్త నిర్వచనాలతో ప్రతిస్పందించారు. గూయెన్ డు (1765–1820) ఒక విధంగా ఆ తరం కవులకు మార్గదర్శి. వియత్నాం సాహిత్యానికి తండ్రిలాంటివాడు. అతను చైనా భాషలోనే 'చు మోం' లో కూడా అంతే ప్రతిభావంతుడు.

థంగ్ లోంగ్ :

**సమయం మారుతుంది, కానీ టన్ పర్వతం కాదు, లో నదీ కాదు**
**థంగ్ లోంగ్ కి నేను తిరిగొస్తాను**
**అదృశ్యమైన రాజభవనాల గుండా వీధులు విస్తరిస్తాయి**
**అంతా కొత్త**
**అందమైన ఆడపిల్లలు గుంజుతున్న పిల్లలిపుడు**
**మగపిల్లలు పెద్దమనుషులు, పండితులు, అధికారులు**
**సగం దుఃఖిస్తూ మెలకువతోనే పడున్నాను**
**వెన్నెలలో ఎక్కడో వేణువు ఏడుపు**
**కానీ అదే చంద్రుడు**
**అదే థంగ్ లోంగ్ ఒకప్పటి రాజధాని**
**పాత ప్రదేశాలు కొత్తగా మారాయి**
**ఎంత వింత, వేణువులు, వీణల కొత్త చప్పుళ్ళు**
**పాత మిత్రులు జారిపోయారు**
**కానీ ఇంక ఏడుపు లేదు**
**నీ తలచూడు: తెల్లబడిపోయింది.** *– గూయెన్ డు (1765–1820)*

1883 లో ఫ్రెంచితో చేసుకున్న ఒప్పందం ప్రకారం వియత్నాం ఒక ఫ్రెంచి రాజ్యంగా మారాల్సొచ్చింది. చైనా భాషగానీ, 'చు మోం' గానీ బతుకుదెరువుకు పనికిరాక, ఫ్రెంచి కూడా నేర్చుకోవాల్సిన పరిస్థితిలో, వియత్నాం తన అస్థిత్వాన్ని కోల్పోతున్న తరుణంలో, కవులు నిరాశ, నిస్పృహలకు లోనయారు. 'రేపు ఉంటేనేం లేకపోతేనేం' అన్న తాత్విక చింతనలో కఠినులుగానూ, దుర్మార్గులుగానూ తయారయారు. అది స్పష్టంగా అప్పటి వియత్నాం కవిత్వంలో కనిపిస్తుంది.

ఒక ఆలోచన :

**ఇప్పుడు చైనా అక్షరాలతో నువ్వేమి చేయగలవు?**
**ఘే లేదా కోంగ్‌లతో నువ్వు మెలికలు తిరుగుతూ పస్తుందు**
**కార్యదర్శి కావడానికి బహుశా చదవొచ్చు**
**ఉదయం నీకు ఆవుపాలు దొరుకుతాయి, రాత్రి తెల్లసారా**

*– ట్రాన్ టె జ్యోంగ్*

(సంప్రదాయ వియత్నాం విద్యలో, అత్యుత్తమ పట్టా – ఘే, ఆ తరువాత పట్టా – కోంగ్)

ఫ్రెంచి ప్రాబల్యంతో వియత్నాం 20వ శతాబ్దంలోని పశ్చిమ దేశాల సాహిత్యం వైపు మొగ్గాయి. ఫలితంగా సాహిత్యంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. విదేశీ భాషీయుల పాలనతో వచ్చే కష్టనష్టాలు వారి కవిత్వంలోకి ప్రవేశించాయి. ఫ్రెంచి వారు, రోమన్ అక్షరాలతో రూపొందించిన 'క్వాక్ గూ' నేర్చుకోక తప్పలేదు. అది పశ్చిమ సాహిత్య అధ్యయనానికి తోడ్పడింది. వారి జానపద సాహిత్య పోకడల్లోని ప్రేమ కవిత్వం – ప్రతీకాత్మకం. రుపాత్మకం అయితే, అది మారి తక్షణం, విషయాసక్తం అయిపోయింది.

శతాబ్దపు విగ్రహం :

**ఎడబాటు బాధని సమ్మెటతో భరిస్తాను**
**ఉద్యానవనంలో విగ్రహమై నిలపడానికి**
**దానికింద అడ్డంగా శాసనం చెక్కుతాను**
**అదీ ఇలా : 20వ శతాబ్దపు ఆత్మ**
**నా విగ్రహం కన్నీరొంపదు**
**అందుకు ఏమీ మిగలలేదు కాబట్టి**
**నా విగ్రహం కథలు చెప్పదు**
**కథలు చెబితే ప్రయోజనం లేదని**
**నా విగ్రహం : శతాబ్దపు ఆత్మ**
**దాని తలమీద ఏ వెలుగూ లేదు**
**నా విగ్రహం : శతాబ్దపు ఆత్మ**
**దాని కాళ్లకింద ఫీనిక్స్ పక్షులూ లేవు**
**నా విగ్రహం నిజానికి అచ్చంగా నగ్నం**
**దాని చేతిలో ఏజెండా లేదు**
**స్థిరంగా శూన్యంవైపు చూస్తున్న రాతి కళ్లతో**
**లక్ష్యం లేకుండా అన్ని వైపులా, నా విగ్రహం నీడలు పరుస్తుంది**

**విశ్వం** (మనిషి ప్రపంచం) :

**ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి నీకున్నాయి**
**ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి నువు తింటావు**
**మంచివి చెడువీ అటూ ఇటూ ఫిర్యాదులుంటాయి**
**మంచివారు చెడ్డవారు వస్తూపోతుంటారు**
**కన్నీళ్ళు, నవ్వులు, బ్రహ్మాండమైన బాంబులు,**
**ప్రచండమైన తూటాలూ ఉన్నాయి**
**నచ్చినవన్నీ అంచాత తిను**
**నచ్చిన ఫిర్యాదులన్నీ చేయు**
**నీకు నచ్చినట్టు పోరాడు**
**తరువాత నీ కళ్లు మూయు** – *ఫం ఐ పూయెన్*

1900 నుండి : 1900 ప్రాంతానికి హో చి మిన్ నాయకత్వంలోని జాతీయవాద శక్తుల సమీకరణంతో వియత్మిన్ పేరుమీద, ఫ్రెంచి పాలననుండి విముక్తికోసం పోరాటం మొదలెట్టాయి. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో ఫ్రాంన్, జర్మని అధీనంలోకి పోవడంతో ఫ్రెంచి, వియత్నాంని పోగొట్టుకుంది. కానీ అదే అదునుగా చూసి జపాను, వియత్నాంని తన ఆధీనంలోకి తీసుకుంది. వియత్మిన్ శక్తులు జపానుకు వ్యతిరేకంగా పోరాడాయి. రెండవ ప్రపంచ యుద్ధం చివరికి 1945లో, జపాను అన్ని విధాలా కోలుకోలేని పరిస్థితుల్లో, హో చి మిన్ నాయకత్వంలోని వియత్మిన్, వియత్నాంని, హనోయ్ రాజధానిగా సర్వస్వతంత్ర ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా ప్రకటించబడుతుంది. ఫ్రెంచి దీన్ని అంగీకరించక, వియత్నాం మీద దండెత్తింది. హో చి మిన్ శక్తుల్ని ఉత్తర వియత్నాం వైపు వెళ్లగొట్టగలిగినా, 1954 సరికి



**ఇది ఏ ధర్మం ?**



**ఇదేనా న్యాయం ?**

ఓడిపోతున్న దశలో, హో చి మిన్ తో సంధి ప్రయత్నాలు చేసి జెనీవా ఒప్పందానికి రాగలిగారు. ఆ ఒప్పందం ప్రకారం ఉత్తర వియత్నాం కమ్యూనిస్టు ప్రాబల్యం రాజ్యంగా హో చి మిన్‌కు అప్పగించి, దక్షిణ వియత్నాం ఫ్రెంచి మద్దతున్న చక్రవర్తికి అప్పగించారు. 1956కి రెండు వియాత్నాంలు, స్వతంత్ర ఎన్నికలు జరిపి ఏకమవాలని తీర్మానించారు. ఆగ్నేయాషియా అంతా కమ్యూనిస్టుల వశమైపోతుందన్న అనుమానంతో, అమెరికా దక్షిణ వియత్నాం, గొ డిన్ డైం కి మద్దతిచ్చి ఉత్తర వియత్నాంని, తద్వారా కమ్యూనిజాన్ని అరికట్టొచ్చని భావించింది. అమెరికా వెన్నుదన్నుతో, గొ డిన్ డైం గణతంత్ర వియత్నాంగా తమ దేశాన్ని ప్రకటించి, జెనీవా ఒప్పందం ప్రకారం 1956లో జరగాల్సిన ఎన్నికలను సైతం రద్దు చేశాడు. కానీ డైం ప్రభుత్వం అరాచక పాలన మూలంగా, అమెరికా అతన్ని గద్దెదించి, మరొకనికి పగ్గాలందించినా, పరిస్థితిలో మార్పురాలేదు. కానీ అమెరికా తన ప్రయత్నాల్ని కొనసాగిస్తూనే పోయింది. ఉత్తర వియత్నాం, అమెరికా యుద్ధ నౌకలమీద దాడి ప్రారంభించాక, అమెరిక స్వయంగా రంగంలోకి దిగి, యుద్ధాన్ని అన్ని విధాలా కొనసాగించింది. అది ఇరువైపులా అనేక విషాదాల్ని మిగిల్చింది. ప్రపంచ వ్యాప్తంగానే కాకుండా, అమెరికా అంతా కూడా యుద్ధాన్ని



రణ భూమి

ఆపమని ఒత్తిడి పెరగడంతో, 1973 నాటికి అమెరికా సైన్యం వియత్నాం నుండి పూర్తిగా వైదొలగింది. అయినా దక్షిణ వియత్నాంకి సహాయసహకారాల్ని ఆపలేదు. 1975 ఏప్రిల్ నాటికి ఉత్తర వియత్నాం, దక్షిన వియత్నాంని ఓడించి, సమైక్య వియత్నాంని, సామ్రాజ్యవాద గణతంత్ర రాజ్యంగా ప్రకటించింది.

52 ఏళ్ల వయస్సులో, 1942లో హో చి మిన్ దక్షిణ చైనాలో, గూఢాచార నేరారోపణలో బంధించబడ్డారు. 14 నెలలపాటు ఒక జైలునుండి మరో జైలుకి తరలించబడ్డారు. ఏ జైలులో ఉన్నా, అక్కడి రోజువారి జీవితంలోని కష్టాల్ని నష్టాల్ని అద్భుతంగా ఆ కవితల్లో నిక్షిప్తం చేశారు. ఆ కవితల్లో హో చి మిన్ వియత్నాం పట్ల దేశభక్తి, వియత్నాంని స్వతంత్ర దేశంగా చూడాలన్న పట్టుదల ఆకాంక్ష అడుగడుగునా కనిపిస్తాయి.

**హో చి మిన్ జైలు కవితలు :**

**1. బంది :**

కొండల్లో ఒక పులిని చూశాను.
అది నన్ను చూస్తే, నేను దాన్ని.
అయినా వేర్వేరు మార్గాల్లో ఎలాగోలా బయటపడ్డాం
స్పష్టమైన మార్గంలో నేనిక సురక్షితమనుకున్నాను
కానీ మనుషులు నన్ను బంధించారు.

**2. భూమిక :**

శరీరం జైలులో ఉన్నా
మనస్సు స్వేచ్ఛగానే ఉంది
ఉన్న కష్టాల నుండి బయటపడేందుకు
నాకు ప్రాణాధారమదే

**3. నానింగ్ జైలు :**

ఈ అద్భుతమైన ఆధునిక జైలులో
రాత్రంతా దీపాలు కాంతివంతంగా వెలుగుతాయి
తిండి మాత్రం పనికిమాలిన గంజి
బరువు తగ్గేందుకే పనికొస్తుంది

**4. నాలుగు నెలలు :**

సరైన తిండిలేక నిద్రలేక
దుస్తులులేక నాలుగునెలలైంది
నేనెప్పుడు స్నానం చేయగలనో
ఆ దేవునికే తెలియాలి

**5. నిద్రలేని రాత్రులు :**

నిద్రలేని అనేక రాత్రుల్లో
కొవ్వొత్తి వెలుగులో చిన్న కవిత రాసుకుంటాను
నేను రాయడం ఆపేసాక
నక్షత్రాకాశం నన్ను ఊరడిస్తుంది

**6. శరత్కాలపు రాత్రి :**

భుజం మీద తుపాకీతో
గేటు ముందర రక్షకుడు
ఆకాశంలో మేఘాల్లోంచి
పారిపోతున్న చంద్రుడు
రాత్రి నల్ల సైన్యంలా
పక్కలమీద దండెత్తుతున్న నల్లులు
అలలు అలలుగా దాడిచేస్తున్న
దోమల సైన్యం
నా దేశాన్ని నేను గుర్తుచేసుకుంటాను
చాలా దూరం ఎగిరిపోగలనని కలగంటాను
దుఃఖపూరిత సాలెగూడులో
అద్భుతంగా చిక్కుకుపోయినట్టు కల
ఇక్కడ ఒక సంవత్సరం గడిచిపోయింది
నేనేమి నేరం చేశాను?
కన్నీటిలో కరిగి కరిగి
నేను మరో జైలు కవిత రాసుకుంటాను.

**7. మంచి రోజులొస్తున్నాయి :**

అన్నీ మారతాయి
న్యాయచక్రం ఆగకుండా తిరుగుతుంది
వర్షాల తరువాత ఎంత మంచి వాతావరణం
కనురెప్పపాటులో విశ్వం తన మురికి దుస్తుల్ని విసిరేస్తుంది
అనేక మైళ్ల దూరం వరకూ
ధరించిన అద్భుతమైన జరీవస్త్రం

**పిల్లగాలులు**

**నవ్వుతున్న పూలు**

**మెరుస్తున్న ఆకుల మధ్య**

**మెత్తని సూర్యరశ్మి**

**చెట్లకి వేలాడుతుంది**

**పక్షులన్నీ ఒక్కటిగా పాడతాయి**

**మనుషులు, జంతువులు పునర్జన్మలో**

**ఇంతకంటే సహజమైనదేది?**

**దుఃఖం తరువాత**

**సంతోషం వెల్లివిరుస్తుంది.**



యుద్ధంలో చనిపోయిన సైనికుని దుస్తుల్లో దొరికిన ఫొటోలు

వియత్నాం మొదటి ఆధునిక కవిగా పిలిచే టాన్ డా (1889–1939), అసలు పేరు గూయెన్ ఖక్ హైయూ, తాను జన్మించిన ప్రదేశపు పేరు సన్ టే, కొండల పేరు టాన్, అక్కడి నది పేరు డా. ఆ కొండలు, నది పేరు కలిపి టాన్ డా గా తన పేరు మార్చుకున్నారు. నిజానికి అతని కవిత్వమంతా అక్కడి ప్రాంతాన్ని అప్పటి పరిస్థితుల్నీ అద్భుతంగా తెలియజేస్తుంది. చైనా భాషతోపాటు, ఫ్రెంచి కూడా నేర్చుకున్నారు. కొత్త పాతల మేలుకలయిక అతని కవిత్వం, తాను కావాలనుకున్న యువతి కోసం, ప్రభుత్వ ఉద్యోగం కోసం రాసిన పరీక్షలో ఉత్తీర్ణుడు కానప్పుడు తనమీద తానే రాసుకున్న కవిత ఇది.

**నన్ను నేనే ఏడ్పించుకుంటూ..**

**సన్ టే మట్టినుండి ఒక మనిషి మొలకెత్తాడు**

**ఫలప్రదమైన కవిత్వపు వయస్సుతో**

**డా నది, టాన్ కొండలు, ఎవరు సృష్టించారు అతన్నలా?**

**రుషి కలం, దేవుడి పదాలు, అంతటా పరుచుకుని**

**అలాంటి శైలి, అటువంటి అక్షరాలు, అవి దేనికి తక్కువ?**

**ప్రోత్సాహించి, అధిక మార్కులు, వచ్చాయా లేవా?**

**చాలా తెలివైనవాడవు గనకే నువ్వు ఉత్తీర్ణుడివి కాలేదేమో**

**అయితేనేం? వైఫల్యంలో, నువ్వింకా అపరిమితుడవు**

చైనా కవుల ప్రభావంతో తాగుడు మీద రాసిన అతని కవితలు కూడా అంతే ప్రసిద్ధమైనవి. తాగకముందు, తాగి, ఇంకా తాగుతూ, మళ్లీ తాగుతూ అన్న కవితలు అక్కడి గాయకీమణులు పాడుకునేందుకు వీలుగా రాసిన కవితలు.

గూయెన్ చి థియెన్ (27 ఫిబ్రవరి – 2 అక్టోబరు 2012) : హనోయ్‌లో జన్మించిన థియెన్, హో చి మిన్ సాధించిన విజయంలో పాలుపంచుకున్నాడు. వియత్నాం



**గూయెన్ చి థియెన్**

రెండు భాగాలవడం ఏ విధంగానూ నచ్చలేదు. చైనా, రష్యా అండ దండలతో, ఉత్తర వియత్నాం కమ్యూనిష్టు రాజ్యంగాను, అమెరికా సహాయంతో దక్షిణ వియత్నాం ఉదార భావాల వైపు మొగ్గడం అతన్ని బాధించేవి. కమ్యూనిజం ఆకర్షించినా, ఉత్తర వియత్నాం లో, కమ్యూనిస్టు వ్యతిరేకుల్ని అణగదొక్కిన విధానం, కమ్యూనిజాన్ని అందరిమీదా రుద్దే ప్రయత్నాన్ని ఆయన వ్యతిరేకించడంతో ఉత్తర వియత్నాంలో వివిధ జైళ్లలో, అనేక మార్లు నిర్బంధించబడ్డారు. 27 సంవత్సరాలపాటు కారాగారాల్లోనే మగ్గారు. 1966 లో ఉత్తర వియత్నాం, దక్షిణ వియత్నాం మీద విజయం సాధించినపుడు, ఆయన ఇలా వాపోయారు.

**ఒకే ప్రాంతపు కష్టాలతో మనమిప్పుడు సమైక్యం**

**ఒకే ప్రాంతపు ద్వేషాలతో మనమిప్పుడు సమైక్యం**

**ఓ దక్షిణ వియత్నాం ! నువ్వు ఓడిన ఈ రోజు**

**ఒక వేయి, పది వేల వేదనలతో నేను బాధ పడుతున్నాను**

థియెన్ కవిత్వం కమ్యూనిష్టు వ్యతిరేక కవిత్వంగా భావించి, వియత్నాంలో ప్రచారం కాకుండా అక్కడి ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంది. అయినా అవి తతిమా ప్రపంచానికి చేరాలన్న ఉద్దేశంతో, థియెన్ ఎవరికీ తెలియకుండా బ్రిటన్ రాయబారికి తన 400 కవితల్ని అందజేయటంతో, అవి ఆ తరువాత రెండు సంకలనాలుగా వచ్చాయి. అవి *అగాధం నుండి ఒక ఆర్తనాదం, నరకంలోని పూలు,* దరిమిలా అవి అనేక ప్రపంచ భాషల్లోకి అనువాదమై



**వియత్నాం విలయం**

అనేక బహుమతుల్ని పొందింది. అమెరికాలో తలదాచుకున్నాక రెండు కథా సంకలనాలు కూడా వచ్చాయి. రాయడానికిగాని, చదవడానికిగాని వీలులేని పరిస్థితుల్లో కారాగారాల్లో ఉన్నా 700 కవితలవరకు దాదాపు కంఠతాగా ఉంచుకుని, ఆ తరువాత వాటిని బహిరంగ పరచడం ఒక విశేషం. నోబెల్ బహుమతికి అర్హుడుగా కూడా వీరిని భావించారు. జీవితాంతం జైల్లోనే ఉండాల్సొస్తుందన్న భావనతో ప్రియురాళ్లున్నా, ఎవరినీ వివాహం చేసుకోలేదు. 73 ఏళ్ల ప్రాయంలో అనారోగ్యంతో కాలిఫోర్నియాలో మరణించారు. తన కవిత్వం ఎలాంటిదో ఆయనే ఇలా చెప్పుకున్నాడు.

**నా కవిత్వం కేవలం కవిత్వం కాదు, కాదు**
**అది ఏడుస్తున్న జీవితపు వెక్కిళ్ల శబ్దం**
**చీకటి కారాగారపు తలుపుల మొర**
**పాడైపోయిన ఊపిరితిత్తుల గుర్రు**
**కలల్ని పాతేస్తున్న భూమి దెబ్బ**
**చలిని తట్టకోలేని పళ్ల కొరుకుడు**
**అటవికంగా బలాత్కరిస్తున్న ఆకలి కడుపు ఆర్తనాదం**
**అనేక నాశనాలముందరి నిస్సహాయ స్వరం**
**సగం బతికి, సగం చచ్చిన శబ్దం**
**నా కవిత్వం కేవలం కవిత్వం కాదు, కాదు**

తిక్ నాట్ హన్ (1926–) మధ్య వియత్నాం లో జన్మించిన బౌద్ధ భిక్షువు. ఉత్తర, దక్షిణ వియత్నాంలను కలపాలనే తీవ్ర ప్రయత్నం చేశారు. వియత్నాంలో బౌద్ధ ప్రచారానికి ప్రచురణ సంస్థని, ఒక విశ్వ విద్యాలయాన్ని కూడా నెలకొలిపారు. 1966 లో అమెరికా, యూరపు దేశాల పర్యటన తరువాత వీరిని వియత్నాంకి రానివ్వలేదు. అనేక ప్రదేశాలు పర్యటిస్తూ, ఇప్పటికి 50 గ్రంథాల వరకూ రాశారు. అందులో కవిత్వం అందర్నీ అలరించింది. ప్రస్తుతం వీరు ఫ్రాంస్‌లో ఉంటున్నారు.



**తిక్ నాట్ హన్**

**1. బాంధవ్యం :**

**నువ్వే నేను / నేనే నువ్వు / తెలిసిన బాంధవ్యమే**
**నేను అందంగా ఉండాలని / నీలోని పుష్పం వికసిస్తుంది**
**నీకు ఇబ్బందిగా ఉండకూడదని / నాలోని మురికి మాయమవుతుంది**
**నాకు నువ్వు / నీకు నేను / సహాయ పడుతూనే ఉంటాము**
**నేను ప్రపంచంలో ఉన్నది / నీకు శాంతిని సమకూర్చేందుకు**
**నువ్వు ప్రపంచంలో ఉన్నది / నాకు ఆనందాన్ని కలిగించేందుకు**

**2. గమనం :**

**అలలమీద దిండులా నా తల ఉంది**
**ప్రవాహానికి నా గతిమారుతోంది**
**విశాలమైన నది**

వియత్నాం మొదటినుండి ఒక యుద్ధభూమి. వియత్నాం యుద్ధ కవితలు అక్కడి వారే కాదు, ప్రపంచ వ్యాప్తంగా కవులు రాశారు. అమెరికా సైనికులు స్థూపాల మీద, వారు ఇంటికి రాసిన ఉత్తరాలు సైతం హృదయ విదారకంగా ఉంటాయి. అనేక భాషలు అనేక విధాలుగా అక్కడ రాజ్యమేలడంతో అక్కడి సాహిత్యం పరిపుష్టమైంది. అనేక సంఘర్షణల, అనేక భాషల అద్భుత సమ్మిశ్రితం వియత్నాం కవిత్వం. మి



**ఆయువుని ఆహుతి చేసుకుంటున్న బౌద్ధ భిక్షువు.**
**బాధను జయించిన బుద్ధుడు!**

(వెనుక సిగరెట్టు వెలిగించేందుకు నిప్పుకోసం వెదుకుతున్న పోలీసుని చూడవచ్చు.)

**ముకుంద రామారావు, ఫోన్ : 9908347273**

# ఔరంగజేబు జవాబు



*చరిత్రలో ఔరంగ జేబుకు చాలా చెడ్డ కీర్తే ఉంది. కాని అతని భాషాపాండిత్యం, లౌకిక వ్యవహార జ్ఞానం, దూర దృష్టి తప్పక చెప్పుకోవాలి. ముత్యాల్లాంటి అక్షరాలతో వుత్తరాలు వ్రాయగలడు. తన దగ్గరకు వచ్చిన అర్జీలన్ని స్వయంగా పరిశీలించి జవాబులు వ్రాసేవాడు. అతనికి చిన్న వయస్సులో చదువు చెప్పిన ముల్లా సాలె అనే గురువు తనకు గొప్ప ఉద్యోగ మివ్వమని అర్జీ పంపాడు. దానికి ఔరంగజేబు ఈ క్రింది విధంగా ప్రత్యుత్తరం వ్రాసి పంపాడు.*

మీరు నాకు అవసరంలేని అరబ్బీభాష నేర్పటానికి ఎన్నో సంవత్సరాలు వృధాచేశారు. కోమలమైన నా బుద్ధిని, తీక్షణమైన నా జ్ఞాపకశక్తిని వ్యర్థం చేశారు. రాజపుత్రులకు లౌకిక విషయాలలో ఎందుకూపనికిరాని భాషను నేర్పే మిషతో పుష్కరకాలం నా జీవితంలో గడిచిపోయింది. నన్ను వ్యాకరణ కర్తగా, ధర్మశాస్త్ర పారంగతునిగా చేయటానికి మీ ప్రయత్నం హాస్యాస్పదం! విద్యార్థులకు వారి ఇచ్ఛననుసరించి – వారికి లౌకిక జీవితంలో అవసరమైన విద్యలు, జ్ఞానము నేర్పాలి కదా – కాని మీరు అటువంటి ప్రయత్నమే చేయలేదే! ఆ విధంగా నా బాల్యమంతా వ్యర్థపరిచారు. భౌగోళిక విషయాలు ఏమయినా చెప్పారా? పోర్చుగల్లు, హాలండు, ఇంగ్లండు మొదలయిన దేశాల తీరుతెన్నులు – అసలు అటువంటి దేశాలున్నాయని తెలియజేశారా? అవి దీవులో, ద్వీపకల్పాలో, ఎత్తు ప్రదేశాలో, విశదపర్చారా? చీనా, పార్సీ, పెరు మొదలయిన దేశాలు ఎక్కడున్నాయో, వాటికి విపత్తులు సంభవిస్తే ఏ విధంగా అధిగమిస్తారో తెలియచెప్పకుండా – మా పేరు విన్నంతనే గజగజ వణుకుతారని ముఖస్తుతి చేయలేదా? ఆ విధంగా పొగడ్తలవలన దేశ చరిత్రలు మాకు ఎలా తెలుస్తాయి? ఈ ప్రపంచంలో ఉన్న రాజ్యాలేవి? అందలి రాజవ్యవహారాలేవి? మతాలేవి? వారి సంపత్తులు ఎలాంటివి? ఆ యా ప్రజల గుణగణాలు ఎలాంటివి? ఏ యే కారణాల వలన ఆ రాజ్యాలు కూలిపోయాయి? ఇటువంటి చరిత్ర అధ్యయనం లేక మాకు ఎట్లా అవగాహన కల్గుతుంది? రాజపుత్రులకు భవిష్యత్తులో అవసరమైన చరిత్ర అధ్యయనం లేక రాజ్యపాలన ఏవిధంగా చేయగలుగుతారు? ఇవేమీ మాకు మీరు నేర్పలేదు గదా. రాజ్యవారసులకు అత్యంత అవశ్యకమైన విషయజ్ఞానముతో బుద్ధి వికసింపచేయ వలయును గదా. అది బాల్య దశ నుండే ప్రారంభం కావాలి. అప్పటి ప్రతిక్షణము విలువైనదే. ఈ కనీస విషయాలు మీకు తెలియవా? నా విద్యార్థి దశను తీర్చి దిద్దారా? సమయము, కాలము ఎంతగా వృధా చేశారు. పైగా అవసరము లేనట్టిది, బుద్ధిని భ్రమింప చేసేటటువంటిది, లౌకిక విషయ వ్యవహారాలకు ఉపయోగపడనట్టి పరభాషను నేర్పటంలో అత్యుత్సాహం చూపారు. ఈ పరాయి భాష ఒకటి నేర్పి – దాని మూలంగా శాస్త్ర, ధర్మ వివేచనకు, న్యాయ, నీతి మొదలైన రాజ్యపాలనకు అవరసరమైన విద్యలు నేర్పటం తేలిక అని భావించారా? ఇటువంటి ముఖ్యమైన వ్యవహార జ్ఞానాన్ని మాతృభాషలోనే నేర్పవచ్చునే. నా తండ్రి, షాజహానుకు "నేను ఔరంగజేబుకు తత్త్వజ్ఞానం, శాస్త్రజ్ఞానం నేర్పుతాను" అని కదా చెప్పారు? మరి మీరు అనేక సంవత్సరాలు బ్రహ్మ, ఆకాశం, ఖటపట మొదలైన నీరస శబ్దాలను కదా చెప్పారు? ఈ చదువు వలన నాకు ఏమి ఒరిగింది? ఇవన్ని తెలుసుకోవటానికి నేను ఎంత వృధాప్రయత్నం, కాలయాపన చేయవలసి వచ్చినది? ఒకవేళ తెలుసుకున్నా – వాటివలన నా తెలివికి, రాజ్యపాలనకు ఏమయినా ఉపయోగం వుంటుందా? మీరు పదే పదే వల్లెవేయటం వలన ఆ శబ్దాలు కొన్ని జ్ఞాపక మున్నాయి. కాని మీరు చేసిన విషయ చర్చలు నీరసంగా ఉండటంతో ఎప్పటిదప్పుడు మరిచిపోయాను. ఈ విషయం మీకు తెలుసు కదా? ఒక వేళ ఈ నిస్సారమైన విషయాలు గుర్తుంచుకున్నా నాకు ఒరిగేదేమిటి?

ఈ విధంగా ఎంతో సుకుమారమైన నా బుద్ధిని, చురుకుదనాన్ని మొద్దుబార చేశారే. నిజంగా అనవసరమైన విషయాలను, మీరు అవసరమని తలచి మాకు నేర్పే ప్రయత్నంలో ఒకే ఒక ప్రయోజనం – అది – మా అజ్ఞానంతో మీరు సర్వజ్ఞులని, శాస్త్ర పారంగతులని, అత్యంత పూజ్యనీయులని, గురువులని– ఈ విధంగా ఒక నిరర్థక గౌరవ భావం కొంతకాలం వరకు నిలుపుకో గలిగారు. అందుకే మిమ్మల్ని – మీ మాటలను చాలాకాలం మన్నించాము.

రాజులను వూరికే పొగడటం, సత్యాన్ని తలక్రిందులు చేయటం, నక్క వినయాలు ప్రదర్శించటం– ఇలాంటి గుణాలు మీ యందు బహు చక్కగా వున్నాయి. మిమ్మల్ని రాజ్యసభయందు ఒక సర్దారుగ నియమించాలని కోరుతూ అర్జీ పంపారు కదా– మీలో ఏ సద్గుణం చూసి మీకీ పదవి కట్ట బెట్టాలి? మీరు నాకు రాజకీయ, సైనిక, వ్యావహారిక విద్యలలో ఏ విద్య నేర్పారని మిమ్మల్ని గౌరవించాలి? నిజానికి నా రాజ్యపాలనకు అవసరమైన ఏ కొద్ది విద్యను మీరు నాకు నేర్పినా, అలగ్జాండరు పాదుషాకు పరమపూజ్య గురువైన మహావిద్వాంసుడు అరిస్టాటిల్ మాదిగానే మిమ్మల్ని గౌరవించి వుండేవాడిని! ఆ విధమైన ఉపయోగకంమైన శిక్షణ, లాభకరమైన విద్య మీరు నాకు నేర్పలేదు. కనీసం మాతృభాష కూడా సరిగా బోధించలేదు. అలాంటి మిమ్మల్ని గురువుగా నేను గౌరవించలేను. మీరంటే నాకు ఎలాంటి పూజ్యభావం లేదు. మీరు వచ్చిన త్రోవనే వెళ్లవచ్చు. మీ పల్లెటూరిలో అల్లా స్మరణ చేసుకుంటూ కాలం గడపవచ్చు – మీరు నా రాజ సభలో ప్రవేశింప వద్దని – మీ రెవరో ఇచ్చటి వారికి తెలియ కూడదని నా అభిప్రాయం.

*– ఔరంగ జేబు*

---

1910 ఆంధ్రపత్రికలో కె.వి. లక్ష్మణరావు రచన ఆధారంగా... (ఔరంగజేబు : 1618 - 1707)



# నీటి బుడగలో సూర్యుడు

**- కృష్ణాబాయి**

చిరునవ్వులొలికిస్తూ- చిరుకోపం ప్రదర్శిస్తూ - అందర్నీ నవ్విస్తూ, కేరింతలు వేస్తూ, వేయిస్తూండే రామకృష్ణ మరింక నవ్వులు చిందించడంటే నమ్మలేకపోతున్నాం. ఎవరికి వాళ్లు 'మా రామకృష్ణ' అనుకునేవారు. ఎందరికో తలలో నాలుక. ఆవేశపరుడు. "ఈ పని నీవల్లనే కావాలి బాబూ, లేకపోతే నా కొంప మునుగుతుంది" అంటే చాలు, ఎలాగైనా అది సాధించి పెట్టేవాడు. అచ్చమ్మా, సావిత్రీ, రాజప్పుడూ, వాళ్ల వాళ్ల బంధువులు అందరూ రామకృష్ణా పద్మల్ని భక్తితో కొల్చేవారు. వీళ్ళూ, వాళ్లని ఇంటిమనుషుల్లా చూసుకునేవారు.

పద్మ మెడిసిన్ పూర్తి చెయ్యడం, రామకృష్ణ ఎం.ఏ ముగించడం విశాఖలోనే కావడంతో మా అనుబంధం మరీ చిక్కబడింది. రచయిత గొర్రెపాటి వెంకటసుబ్బయ్య గారి గురించి "womb లో వున్న వారి దగ్గరనుంచీ, Tomb లో వున్న వారిదాకా అందరితో స్నేహం చేస్తారని" అనే వారు. ఆయన రామకృష్ణని వెంటబెట్టుకొచ్చి 'మా మనవడు' అని పరిచయం చేశారు. అనప్పుడు విజయవాడ లయోలాలో డిగ్రీ స్టూడెంట్. ఆ రామకృష్ణ క్రమంగా ఐ.వి. సాంబశివరావునీ, స్మైల్‌నీ, సి.వి. సుబ్బారావునీ, మరెందరో మణిపూసల్నీ మాకు అంటు కట్టాడు. 'ఓ పేద పంతులు, బహుకుటుంబీకుడు, నిఖార్సయిన నిజాయితీపరుడు - క్షణం వృధా చేయకుండా సైకిల్ మీదే తిరుగుతూ ట్యూషన్లు చెప్పేవాడు, అన్నింటినీ మించి సాహిత్య వ్యవసాయకుడు' అంటూ మితభాషి, మృదుస్వభావి అయిన కాళీపట్నం రామారావు గారిని పట్టుకొచ్చి మా ఇంటిల్లపాదికీ ఆత్మీయుడిని చేసింది రామకృష్ణే.

సాహిత్య పిపాసి. డిగ్రీ చదువుతున్నప్పుడే కొందరు మిత్రుల కథల్నీ తన కథల్నీ కలిపి 'గులాబితోట' కథా సంకలనం తీసుకొచ్చాడు. ఒక ఆప్తుడికి (వేణుగారు) అంకితం ఇచ్చేందుకు 'మనలో మనం' అనే వ్యాస సంపుటి ప్రచురించాడు. కారా మాష్టారి రచనల్ని ఆర్.కె. పబ్లిషర్స్ పేరుతో అచ్చు వేశాడు. రాయడం కన్న రాయించడం; ఎక్కడెక్కడి గొప్ప పుస్తకాల్నీ సేకరించి చదవడం అలవాటు. అతని గ్రంథాలయం అపూర్వ గ్రంథాల గని. పిల్లల ఆటోగ్రాఫ్ పుస్తకాల్లో కూడా అలవోకగా పద్యాలు, కవిత్వం గుమ్మరించేవాడు. ఉత్తరాలు సరేసరి. అలాంటివాడు రచనా వ్యాసంగాన్ని ఒక వ్యాపకంగా పెట్టుకోనందుకు మాకు చాలా అసంతృప్తిగా వుండేది. రీసెర్చి చేయమనీ, కనీసం ఒక మంచి స్కూలు నడపమనీ వేణుగోపాల రావు ఎంత చెప్పినా వినని మొండిఘటం. సమర్థత, నైపుణ్యం వుండీ వుపయోగించని ఒక తరహా బద్ధకానికి మా చేత ఎన్ని చీవాట్లు విన్నాడో! ఎమర్జన్సీ (1975-77) 18 నెలలూ జైలు జీవితం అనుభవించి వచ్చిన చలసాని ప్రసాదుని విజయతో పాటు వారం రోజులు శ్రీకాకుళంలో తమ యింట్లో వుంచుకుని ఆప్యాయత నింపి పంపాడు. ఎన్నెస్, వెంకటప్పయ్యల యాక్సిడెంట్ సందర్భంలో డాక్టరుగా పద్మ, ప్రాణమిత్రుడుగా రామకృష్ణలు అందించిన అండదండలు మరుపు రావు.

శ్రీశ్రీ చనిపోయిన మర్నాడు (16-6-1983) మద్రాసులోనే వున్న రామకృష్ణ విషాదాన్ని పంచుకోవడానికి ప్రసాదుని తన దగ్గరకి రమ్మన్నాడు. కె.వి.ఆర్, కాశీపతి ప్రసాద్‌కి తోడుగా వెళ్లారు. అప్పటిదాకా పళ్లబిగువున దుఃఖాన్ని అదిమి పట్టుకున్న ప్రసాద్ రామకృష్ణని కౌగలించుకుని బావురుమన్నాడు. రామకృష్ణలోని ఆర్ద్రతకి ప్రసాద్ స్పందన అది. ఎన్నో ఉన్నతమైన విలువలున్న రామకృష్ణలో పిసరంత 'తిక్క' చోటు చేసుకోవడం వల్లనే యిలా మిగిలిపోయాడనే బాధ ఎప్పుడూ కలక వేస్తూనే వుంటుంది. "కలియుగ భీముడు కోడి రామ్మూర్తికి వరసకి మనుమరాలు మా పద్మ అని మాకెంతో పొంగుగా వుంటుంది". రోగనిర్ధారణ, రోగికి చక్కటి సేవ అందించగల సత్తావున్న పద్మ మర్రిచెట్టు కింద మొక్కలా వుండిపోవడం మాత్రం మాకు మింగుడు పడని సంగతి" అని ఎక్కడో రాస్తే "నేను మర్రి చెట్టునా?" అని గునిసిన మాబిడ్డ రామకృష్ణ మా విమర్శల్నీ స్వీకరించే వాడు.

సాహిత్యంతో పాట సంగీతాన్నీ ప్రేమించాడు. బాలమురళీ కృష్ణ, జేసుదాసు మొదలైన వారందరితో పాటు మరెందరికో అవార్డుల ప్రదానం చేశాడు. "అవార్డులు కాదు, వాళ్లరచనలు అందుబాటులో వుంచడం ముఖ్యం" అని మందలించేవాళ్లం- "ఎంత సంస్కారవంతులండీ ఆ దంపతులు! కల్యాణ సుందరీ జగన్నాథ్ పేరు సూచిస్తే ఆమెకి స్వాగతసత్కారాలందించాడు. "ఆలస్యంగా పరిచయం అయారు" అని వాపోయారు కల్యాణి. చిన్నతనంలోనే తల్లిని కోల్పోయిన రామకృష్ణ 'అత్తా!' అనిపిలిస్తే 'అమ్మా!' అన్నట్టుండేది. వాళ్ల సంతానం కూడా సంస్కారాన్ని పుణికి పుచ్చుకుంది. ఆవగింజలో ఆరోవంతయినా ఆవిష్కరించలేకపోయా మా 'ముద్దుకృష్ణుడి'ని అతని గురించి భూతకాలంలో 'చేసేవాడు', 'అనేవాడు' అని రాయడం బాధాకరం. అతినేవళం, అతిసుకుమారం - గాజుగిన్నె లాంటివాడు రామకృష్ణ.

మి

కృష్ణాబాయి, ఫోన్ : 0891-2754191 *(యగళ్ల రామకృష్ణ (27.12.1944 - 24.10.2012) జ్ఞాపకంగా..)*

# చదవండి...

- ఎన్నార్కె




✦ **చేరా పీఠికలు - ఒక పరిశీలన :** రచయిత సిద్ధాని చంద్రకుమార్ చే.రా మాష్టారు వ్రాసిన పీఠికలన్నీ ఒక్కచోట చేర్చి తాను ఎమ్.ఫిల్ చేయటమే కాక అచ్చువేసి మన ముందుంచారు. మొదటి అధ్యాయంలో చే.రాగారి జీవితవిశేషాలను, రెండవదానిలో పీఠిక స్వరూప స్వభావాలను, మూడవదానిలో చే.రా పీఠిక విశేషాలను వివరంగా పట్టిక రూపంలో చూపించాడు... ఇలా తొమ్మిది అధ్యాయాలను చక్కగా విందు భోజనంలా వడ్డించారు. ఇక మనం స్వీకరించటమే తరువాయి. చే.రాగారి అభిమానులే కాదు, తెలుగు భాషపై ఏ మాత్రము అభిమానం ఉన్నా తప్పక చదవ వలసిన రచన ఇది.

*పేజీలు 100, వెల : ₹30/-, ప్రతులు కావలసినవారు చినుకు ప్రచురణలు విజయవాడ, ఫోన్: 9848132208లో సంప్రదించండి.*




✦ **ఛ నోర్ముయ్ :** డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి రచయిత. ఎదిగే దశలో పిల్లలు ఔత్సాహకతతో, అడిగే ప్రశ్నలకు జవాబు చెప్పలేని పెద్దలు, ఛ నోర్ముయ్ అంటూ పిల్లలను శాసించి, తమ అజ్ఞానాన్ని బయటకు పెట్టుకునే ప్రవర్తనలో మార్పురావాలని రచయిత ఆశయం. మొత్తం 16 స్కేట్స్. జయంతి పబ్లికేషన్స్, కారల్‌మార్క్స్ రోడ్డు, విజయవాడ ప్రచురణ.

*పేజీలు 56, వెల : ₹ 30/-, ప్రతులు కావలసినవారు ఫోన్: 8978261496 లో సంప్రదించండి.*




✦ **చార్లీ చాప్లిన్ :** Wit and Wisdom, సమపాళ్ళలో రంగరించ బడిన కళాస్రష్ట చాప్లిన్. 'కనుకొనల్లో కన్నీరు చిందించటం హాస్య రసానికి పరాకాష్ట' అంటూ, హాస్యానికి కొత్త నిర్వచన మిచ్చిన పండితుడు. అర్థాకలితో బాల్యం సాగినా, ఆ తరువాత ఆగర్భ శ్రీమంతుడయినా, జీవితంలో ఒడిదుడుకులు తప్పవని చెప్పక చెప్పిన ఆర్థిక శాస్త్రవేత్త. నిజాయితీగా, నిర్మొహమాటంగా వ్రాసిన ఆత్మకథకు అశ్వినీకుమార్ కమనీయ శైలి ఈ పుస్తకం మీరు మొదలు పెడితే ఆకలుండదు, దాహ ముండదు, చివరి వరకూ చదివిస్తుంది.

*పేజీలు 480, వెల : ₹ 299/-, ప్రతులు కావలసినవారు ఫోన్: 9949516567/040-27645536 లో సంప్రదించండి.*




✦ **కానుక :** దేవినేని సీతారావమ్మ ఫౌండేషన్ తెన్నేరు వారు కె.ఐ.వరప్రసాదరెడ్డి, వసంత దంపతులకు కానుకగా ఇచ్చిన కథలపూల హారమిది. ముళ్ళపూడి వారి కానుక మొదలుగా మరో ఐదు ప్రఖ్యాత కథకుల నుంచి ఎంపిక చేసిన కథలివి, తప్పక చదవదగినవి.

*పేజీలు 53, ప్రతులు కావలసినవారు ఫోన్: 9490634849 లో సంప్రదించండి.*

✦ **దేవునిరాజ్యం :** నోముల సాహిత్య సమితి. నల్గొండ వారు ప్రచురించిన ఈ నవలా రచయిత ఎలికట్టె శంకరరావు. నాలుగెకరాలు కలిగిన ఒక చిన్న రైతు కథను పునాదిగా తీసుకుని, కన్నీటి పదునుతో కలిపి అనంత విషాద గాథను అద్భుతంగా అక్షరీకరించిన నవల ఇది.

*పేజీలు 115, వెల : ₹ 70/-, ప్రతులు కావలసినవారు ఫోన్: 9346359268 లో సంప్రదించండి.*

✦ **మరో ఆలాపన :** రచయిత వి.ఎ.కె. రంగారావు. ఎవరికి పుట్టిన బిడ్డరా? అన్న చందాన ఉంది భారతీయ చలన చిత్ర చరిత్ర. చిత్రసీమ నుండి పైకి వచ్చి, ఆగర్భ శ్రీమంతులైనవారు, అందలమెక్కిన వారు ఎందరో ఉన్నారు. కానీ తాము గీసుకున్న లక్ష్మణరేఖ పరిధిని దాటి చిత్రసీమ చరిత్రను, అందులోని బాగోగులను సమీక్షించాలని, నిర్దుష్టంగా చరిత్రని పరిశీలింప చేయాలన్న తలంపు ఉన్నవారెవరూ లేరు. ఇందుకు ఏ భాషా పరిశ్రమ మినహాయింపు కాదు. చిత్ర పరిశ్రమ గ్లామర్ చుట్టూ తిరిగే ఒక రంగుల రంగం. ఇక్కడ గోరంత విషయాలు, కొండంతగా చెప్పబడతాయి. జరిగిన దానికంటే జరగని దానికి, ఊహాజనితమైన విషయాలకు పబ్లిసిటీ ఎక్కువ. రూమర్లకు పుట్టిల్లు కావటంతో చలన చిత్ర పరమై వ్రాసిన విషయాల పూర్వాపరాల వాస్తవ విషయసేకరణ చేయకుండా వ్రాయబడే వ్యాసాలు ఎక్కువ. ఇందులో తెలుగులోనే కాక, ఇంగ్లీషులో వ్రాసిన వాటిలో కూడా ఎక్కువ తప్పులు దొర్లుతుంటాయి.




వీటన్నిటినీ కాచి, వడబోసి నిజనిర్ధారణే ధ్యేయంగా కుండ బద్దలు కొట్టినట్లు అసలు విషయాలను బయటకు తీసుకు రావటంలో బహుశ వి.ఎ.కె. రంగారావును మించినవారెవరూ మొత్తం భారత దేశంలోనే లేరు అని అనటం అతిశయోక్తి కాకపోవచ్చు. అది *సరాగమాల* కావచ్చు, *ఆలాపన* కావచ్చు. కొన్ని విషయాలను అలానే మనకెందుకులే అని వదిలేస్తే చరిత్రకు ద్రోహం చేసిన వారమవుతామని ఆయన తలంపు. *ఆలాపన*లో వెలువడే అభిప్రాయాలలో ఎక్కువ భాగం ఆయన వ్యక్తి గతమైనవే అయినా, వాటిని పాఠకులు ఆదరించారు. ఆయన వ్యాసాల వెనుకనున్న మనసును గ్రహించే ప్రయత్నం చేశారు. ఇంతటి సహృదయులైన పాఠకులు లభించటం ఆయన అదృష్టం. ఈ మరో *ఆలాపన*లో వి.ఎ.కె. రంగారావు తన సంగీత, సాహిత్య అభిలాష గురించి, నృత్యాభినయాల గురించి, కొండలు, కోనలు వాగులు, వంకలు, కోటలు, పేటలు, మనుషులు, జంతువులు, తాను మునిగిన గంగలు, తనలోని అందాలను చూడగలిగిన రంభలు, నలకూబరులు, యింకెన్నిటి గురించో వుంది.




ఈ వ్యాసాలన్నీ ఇంతకు ముందు 'వార్త' దినపత్రికలో వారం వారం ప్రచురింప బడినవే. ఈ వ్యాస పరంపర సీరియల్‌గా కొనసాగటం వలన ఉత్కంఠత కోసం పాఠకులకు కొన్ని క్విజ్‌లు, ప్రశ్నలు సంధించ బడ్డాయి. పుస్తక రూపంలో వచ్చినపుడు క్విజ్‌కి సమాధానాలు ఎక్కడివక్కడే ఇచ్చి వుంటే బాగుండేది. సమాధానాలకోసం మరొక వ్యాసంలో వెదుకులాడ జేసిన శ్రమ తగ్గేది. ప్రగతి ఆఫ్‌సెట్ వారి ప్రచురణ.

*పేజీలు 500, వెల : ₹ 400, ప్రతులు కావలసినవారు ఫోన్: 040-23380000 లో సంప్రదించండి.*




✦ **మెత్తని ఉత్తరాలు :** 1986 నుంచి 1998 వ సంవత్సరాల మధ్య సంజీవదేవ్, దర్భశయనం శ్రీనివాసరావుకు వ్రాసిన ఉత్తరాల సంపుటి. ఎస్ ఎమ్ ఎస్‌ల రాకతో లేఖాసాహిత్యం క్రమేపీ కనుమరుగవుతున్న ఈ కాలంలో రాజాచంద్రా ఫౌండేషన్ వారు ఇటువంటి పుస్తకాన్ని ప్రచురించి, తిరిగి లేఖా సాహిత్యానికి జవసత్వాలందించే ప్రయత్నం చేయడం ముదావహం.

*పేజీలు 75, వెల : ₹ 50/-, నవోదయ బుక్ హౌస్ వారి ప్రచురణ. ఫోన్: 24241141 లో సంప్రదించండి.*




✦ **రాంగ్ వే :** రచయిత ఎస్.ఎమ్. ప్రాణ్‌రావ్. వీర విప్లవ తెలంగాణ పోరాట గాథని, యిప్పుడు నడుస్తున్న చరిత్రకి చెందిన రాంగ్ వే ఎమిటో తెలియజేస్తూ వ్రాసిన విశ్లేషణాత్మక నవల యిది. రచయిత రాంగ్ వే అంటే - రైట్ వే గురించి ఆలోచించమని చెప్పకనే చెప్పారు.

*పేజీలు 150, వెల : ₹ 50/-, విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవోదయలలో లభ్యం.*

# లింకన్ లేఖ



అబ్రహాం లింకన్

మా అబ్బాయి ఈ రోజే బడికి వస్తున్నాడు. అక్కడంతా అతనికి వింతగా కొత్తగా వుంటుంది. మీరు జాగ్రత్తగా చూసుకుంటారని ఆశిస్తాను. ఈ ప్రారంభం వాడికి ఒక సాహసమే. అది అతనిని ఖండాంతరాలను దాటించ వచ్చు – ఈ సాహస యాత్రలలో, సంఘర్షణ, దుఃఖం తప్పనిసరిగా ఉంటుంది. జీవితాన్ని సాగించాలంటే, విశ్వాసం, ప్రేమ, ధైర్యం, విషాదం వుండాలి. అందుకని, దయచేసి అతనికి అవసరమైన విషయజ్ఞానాన్ని నేర్పండి, సౌమ్యంగానే. ప్రతి శత్రువుకి ఒక స్నేహితుడు ఉంటాడని, అందరు వ్యక్తులు నిజాయితీపరులు కారని, ధర్మవర్తనులూ కారనీ చెప్పండి. ప్రతి దుర్మార్గునికీ – ఒక ధీరోదాత్తుడుంటాడని, ప్రతి నక్కజిత్తుల రాజకీయునికీ – ఒక అంకిత భావంగల నాయకుడుంటాడని తెలియజేయండి – కష్టపడి పది సెంట్లు సంపాదించడం మేలని, ఊరికే దొరికిన డాలరు కంటే అని కూడా చెప్పండి.

బడిలో తప్పినా ఫర్వాలేదని, మోసపూరితంగా ప్రవర్తించ కూడదని చెప్పండి, ఓడిపోవడంలోని హుందాతనాన్ని – గెలుపులోని గొప్పదనాన్ని ఆస్వాదించడం నేర్పండి.

తోటివారితో సౌమ్యంగా మెలగ మనండి. అసూయ నుంచి దూరంగా వుండటం అలవాటు చేయండి – చిరునవ్వు రుచికూడా నేర్పండి–

విచారంలో కూడా నవ్వగలగటం అలవాటు చేయండి. కన్నీళ్ళకు అవమాన పడకూడదని చెప్పండి. ఓటమిలో గొప్పదనం, గెలుపులో అలుపు వుంటాయి నేర్పండి – నిరాశపరిచే వాళ్లను నిరసించ మనండి –

పుస్తక ప్రపంచాన్ని పరిచయం చేయండి. అందులోని అద్భుతాలను తెలుసుకో మనండి – కొండ, కోనల్లోని పూలు, పచ్చదనం, ఎండపొడ లేని అగాధాలు, ఆకాశంలో ఎగిరే పక్షుల వింతలను పరిచయం చేయండి.

తన మీద తనకు నమ్మకం పెంచుకోమని అలవాటు చేయండి, అందరూ తన ఆలోచనలు సరికాదు అని చెప్పినా సరే– గుంపులో గోవింద లాగా వుండవద్దని చెప్పండి. శ్రద్ధగా ఆలకించటం నేర్పండి. విన్న విషయాలను జల్లిడి పట్టి నిజాన్ని నిగ్గు తేల్చుకోమని – వాటినే స్వీకరించమనండి.

తన నైపుణ్యాన్ని – తెలివి తేటలను అర్హులైన వారికే అందజేయమనండి. కాని వాటికి ఖరీదు కట్ట వద్దని చెప్పండి. ఓర్పుగా ఉండటం ధైర్యవంతుని లక్షణమనండి. అలాగే నిరాశలో ధైర్యంగా వుండటం తెలియజేయండి. తనలో తనకి నమ్మకంలోని ఉదాత్తత తెలుసు కోమనండి–అప్పుడే మానవాళిని ప్రేమించ గలడని

చెప్పండి–దైవాన్ని కూడా !

ఇదీ వరస ఉపాధ్యాయా ! మీరు ఎంతవరకూ సహాయం

చేయగలరో చూడండి.

వాడు చాలా మంచి బాలుడు – నా కుమారుడు!



*ఈ క్రింది పుస్తకాలు మీకు అవసరమయితే మాకు తెలియచేయండి. వాటి విలువకు తపాలా ద్వారా పంపిస్తాం.*

**I. మిసిమి ప్రచురణలు**

| | | ₹ |
|---|---|---|
| 1. | బాపు బొమ్మలు | 200.00 |
| 2. | మహాబౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు | 500.00 |
| 3. | బుద్ధుని దీర్ఘ సంభాషణలు – *ఎ.వి.రెడ్డి* | 200.00 |
| 4. | బుద్ధుని మధ్యమ సంభాషణలు–1 ” | 200.00 |
| 5. | బుద్ధుని మధ్యమ సంభాషణలు–2 ” | 200.00 |
| 6. | బుద్ధుని మధ్యమ సంభాషణలు–3 ” | 200.00 |
| 7 | ఆచార్య నాగార్జునుడు | 150.00 |
| 8. | దూర తీరాలలో... – *వి. అశ్వినీకుమార్* | 60.00 |
| 9. | అమాహ ” | 60.00 |
| 10. | అంతర్వీక్షణం ” | 50.00 |
| 11. | సిద్ధార్థ ” | 50.00 |
| 12. | నాలో నేను ” | 30.00 |
| 13. | అగాధం ” | 75.00 |
| 14. | కథాంజలి–1 – *ఎస్సారె* | 80.00 |
| 15. | కథాంజలి–2 ” | 110.00 |
| 16. | THE THUNDERCLOUD ” | 120.00 |
| 17. | మిసిమి వ్యాసాలు – *నరిసెట్టి ఇన్నయ్య* | 125.00 |
| | **ఇతరములు** | |
| 18. | భట్టిప్రోలు కథలు | 150.00 |
| 19. | రెండు దశాబ్దాలు – కథ 1990–2009 | 150.00 |

**II. వేమన ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | లోకకవి వేమన – *ఎమ్. కోదండ రామిరెడ్డి* | 100.00 |
| 2. | మన వేమన – *ఆరుద్ర* | 80.00 |
| 3. | వేమన – *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 4. | VEMANA - *V.R. Narla* | 50.00 |
| 5. | VEMANA - Through Western Eyes. - *V.R. Narla* | 50.00 |
| 6. | విశ్వకవి వేమన – *గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి* | 100.00 |
| 7. | పురాణ ప్రలాపం *(ప్రొ. హరిమోహన్ ఝా, అనువాదం: జె.లక్ష్మిరెడ్డి)* | 100.00 |
| 8. | THE FIRST POETICAL READER *(Walter Joyes and N.C. Sashacharloo)* | 50.00 |
| 9. | వేమన – *రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ* | 100.00 |
| 10. | వేమన ఉపదేశామృతం –*ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |

**III. ధర్మదీపం ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | మహాపరిత్తం – *బోధ చైతన్య* | 100.00 |
| 2. | జాతక కథలు – *శివశంకర స్వామి* | 60.00 |
| 3. | బౌద్ధ దర్శనమ్ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : బి. గోవర్ధన్)* | 70.00 |
| 4. | మహామానవ బుద్ధ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి)* | 75.00 |
| 5. | మిళిందపన్హ: ఉపమలు – *బోధ చైతన్య* | 75.00 |
| 6. | బ్రాహ్మణ, బౌద్ధ, హిందూ మతాలు – *అన్నపరెడ్డి బుద్ధఘోషుడు* | 40.00 |
| 7. | వర్ణవ్యవస్థా లేక మరణ వ్యవస్థా *(భదంత ఆనంద కౌసల్యాయన్; అనువాదం:జె.లక్ష్మి రెడ్డి)* | 50.00 |
| 8. | జయమంగళం – బొర్రా గోవర్ధన్ | 40.00 |
| 9. | బుద్ధుని చివరి రోజులు – *డాక్టరు ఈమని శివనాగిరెడ్డి* | 30.00 |
| 10. | భగవాన్ బుద్ధ *(ధర్మానంద కోశాంబి; అనువాదం: బొర్రా గోవర్ధన్)* | 150.00 |
| 11. | విపశ్యనా ధ్యానమార్గదర్శిని *(తియ్యగూర సీతారామిరెడ్డి & నందం శ్రీనివాసరావు)* | 50.00 |
| 12. | మిళింద ప్రశ్నలు – *బోధచైతన్య* | 150.00 |
| 13. | బౌద్ధ ధర్మదర్శిని *(భదంత ఆనంద కౌసల్యాయన్ - అనువాదం జె. లక్ష్మిరెడ్డి)* | 100.00 |
| 14. | ప్రజ్ఞాదీపిక *(తియ్యగూర సీతారామిరెడ్డి & నందం శ్రీనివాసరావు)* | 60.00 |
| 15. | శీలం–ధ్యానం – *బోధ చైతన్య* | 150.00 |
| 16. | లోకక్షేమగాథలు – *బోధ చైతన్య* | 75.00 |

**IV. ఆర్ట్స్ & లెటర్స్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | తెలుగా, ఆంధ్రమా? – వాగరి | 40.00 |
| 2. | యతిగీతం– స్వామి వివేకానంద (అనువాదం ; గజ్జెల మల్లారెడ్డి) | 50.00 |
| 3. | చార్లీ చాప్లిన్ (నా కథ) – *వి. అశ్వినీకుమార్* | 299.00 |

మిసిమి మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020. Ph. 040-27645536

E-mail : misimi_monthly@yahoo.in ; e-magazine : www.kinige.com/misimi

**మిసిమి** *విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

**మిసిమి** పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా **₹**240/- **తో** పాటు పంపండి. బయటి **చెక్కులకు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు** అదనంగా **₹**30/- కలపండి.

**1. పేరు:** ....................................................

**2. చిరునామా:**

ఇం.నెం. ....................................................

వీధి ....................................................

పేట ....................................................

ఊరు ....................................................

పిన్ ....................................................

సెల్ ....................................................

**3. సంతకం:** ....................................................

---

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |

చందాలు **మిసిమి** పేర ఈ క్రింది చిరునామాకు పంపించగలరు.

**మిసిమి** లో నూతన చందా దారులుగా చేరండి : **'సిద్ధార్థ' పుస్తకాన్ని బహుమతిగా పొందండి.**

అలాగే ఐదు సంవత్సరాలకు ₹1200 పంపండి అందమైన 2010 **మిసిమి** పుస్తకాల బైండు అందుకోండి.

మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536, E-mail : misimi_monthly@yahoo.in
e-magazine : www.kinige.com/misimi



సెయింట్ థెరిస్సా

MISIMI / **మిసిమి** / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2012-14



సెయింట్ పీటర్



వనదేవత – చీకటి దేవుడు



సెయింట్ థెరిస్సా